# చరిత్ర రచనా పద్ధతి

## ఎం.ఏ. - చరిత్ర :: ద్వితీయ సంవత్సరం

## సెమిస్టర్ - III :: పేపరు- IV


**రచయితలు**

**డా॥ జి. రాజమోహన్ రావు**
ప్రొఫెసర్, చరిత్ర శాఖ,
ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం,
ఒంగోలు ప్రాంగణం, ప్రకాశం జిల్లా, ఆం.ప్ర.

**ఐ.యల్.యన్. చంద్రశేఖరరావు**
అసిస్టెంట్ ప్రొఫెసర్
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజంపేట,
Y.S.R. కడప జిల్లా, ఆ.ప్ర.

**డా॥ జె. కృష్ణప్రసాద్ బాబు**
అసోసియేట్ ప్రొఫెసర్, చరిత్ర శాఖ,
J.B. డిగ్రీ కళాశాల, కావలి,
S.P.S. నెల్లూరు జిల్లా, ఆ.ప్ర.

**డా॥ జి. సురేంద్ర**
అసిస్టెంట్ ప్రొఫెసర్, చరిత్ర శాఖ,
S.K.R. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గూడూరు,
తిరుపతి జిల్లా, ఆం.ప్ర.

**సంపాదకులు**

**డా॥ జి. రాజమోహన్ రావు,** ఎం.ఏ., పి.హెచ్.డి.
ప్రొఫెసర్, చరిత్ర శాఖ,
ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం,
ఒంగోలు ప్రాంగణం, ప్రకాశం జిల్లా, ఆం.ప్ర.

Director

**డా॥ నాగరాజు బట్టు**

**ఎం.హెచ్.ఆర్.ఎం., ఎం.బి.ఏ., ఎల్.ఎల్.ఎం., ఎం.ఏ.(సై.)., ఎం.ఏ.(సో.)., ఎం.ఇ.డి., ఎం.ఫిల్., పి.హెచ్.డి.**



## దూర విద్యా కేంద్రము

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్ - 522 510.

Ph: 0863-2346208, 0863-2646222, 0863-2346259 (స్టడీ మెటీరియల్)

వెబ్‌సైట్ : www.anucde.info ఇ-మెయిల్ : anucdedirector@gmail.com

ఎం.ఏ. - చరిత్ర :: చరిత్ర రచనా పద్ధతి

First Edition : 2023

No. of copies:

© **Acharya Nagarjuna University**

This book is exclusively prepared for the use of students of M.A. (Political Science), Centre for Distance Education Acharya Nagarjuna Univeristy and this book is meant for limited circulation only.

Published by:
**Dr. NAGARAJU BATTU**
Director
Centre for Distance Education
Acharya Nagarjuna University

**Printed at:**

## ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించినది మొదలు నేటి వరకు ప్రగతిపథంలో పయనిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ 2016 నాటికి NAAC చే 'A' గ్రేడును సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయటానికి సంతోషిస్తున్నాను. ప్రస్తుతం గుంటూరు, ప్రకాశం జిల్లాలలోని 447 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిప్లమో, డిగ్రీ, పి.జి. స్థాయి విద్యాబోధనను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అందిస్తోంది.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉన్నత విద్యను అందరికి అందించాలన్న లక్ష్యంతో 2003-04లో దూరవిద్యా కేంద్రాన్ని స్థాపించింది. పూర్తి స్థాయిలో కళాశాలకు వెళ్ళి విద్యనభ్యసించలేని వారికి, వ్యయభరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరిక ఉన్న గృహిణులకు ఈ దూర విద్యా కేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పటికే డిగ్రీ స్థాయిలో బి.ఏ., బి.కాం., బి.ఎస్.సి., మరియు పి.జి. స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్.సి., ఎం.బి.ఏ., ఎల్.ఎల్.యమ్., కోర్సులను ప్రారంభించిన విశ్వవిద్యాలయం గత సంవత్సరం కొత్తగా 'జీవన నైపుణ్యాలు' అనే సర్టిఫికేట్ కోర్సును కూడా ప్రారంభించింది.

ఈ దూర విద్యా విధానం ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు, సులభంగాను, సరళంగాను, విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసుకొనేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి, రచనా వ్యాసంగంలో అనుభవం గల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించడం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో, నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారు చేశారు. ఈ పాఠ్యాంశాల పై విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు నిష్ణాతులైన వారు ఇచ్చే సలహాలు, సూచనలు సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలను గ్రహించి ముమ్ముందు మరింత నిర్దిష్టంగా, అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, సంశయాల నివృత్తి కోసం వారాంతపు తరగతులు, కాంటాక్టు క్లాసులు ఏర్పాటు చేయటం జరిగింది.

దూరవిద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేస్తున్న విద్యార్థులు, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమే గాక, చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని, తద్వారా దేశ పురోగతికి దోహదపడాలని కోరుకుంటున్నాను. రాబోయే సంవత్సరాలలో దూర విద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దినదినాభివృద్ధి చెంది, ప్రజలందరికి అందుబాటులో ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ ఆశయ సాధనకు సహకరిస్తున్న, సహకరించిన దూరవిద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు, అకడమిక్ కో-ఆర్డినేటర్లకు మరియు అధ్యాపకేతర సిబ్బందికి నా అభినందనలు.

**ప్రొఫెసర్ పి. రాజశేఖర్**
ఉప కులపతి
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

CENTRE FOR DISTANCE EDUCATION

SEMESTER-III

**ACHARYA NAGARJUNA UNNIVERSITY**

DEPARTMENT OF HISTORY ARCHAEOLOGY

**M.A. Paper IV** A/H 3.4 (COMMON FOR HISTORY AND ARCHAEOLOGY)

304HI21 - **Historical Method**

**Unit I. Meaning and Scope of History** – Definition – Nature and Scope of History – Value of History.

**Unit II. Historical Process** – Facts and Historian – Evidence and its Transmission – Society and Individual - History as Science and Art – Conclusion.

**Unit III. Methodology** – Collection and Selection of Data – Synthesis and Exposition – Foot Notes – Errors of History – Objectivity in History.

**Unit IV. History and Other Disciplines** – Archaeology – Geography – Anthropology – Sociology – Politics – Philosophy and Literature.

**Unit V. Major Theories of History** – Cyclical Theory – Historical Materialism.

**Suggested Readings.**


Sheik Ali, B. History : Its Theory and Method.

Carr, E.H., What is History?

Colling wood, R.G., The Idea of History

Nilakanta Sastri, K.A., Historical Method with Special Reference to India.

<u>విషయ సూచిక</u>

# చరిత్ర రచనా పద్ధతి


| సంఖ్య | పాఠం | పుట. |
|---|---|---|
| 1 | చరిత్ర అర్థము మరియు నిర్వచనం | 1.1 - 1.5 |
| 2 | చరిత్ర లక్షణాలు మరియు విషయపరిధి | 2.1 - 2.8 |
| 3 | చరిత్ర అధ్యయనం మరియు ప్రయోజనాలు | 3.1 - 3.9 |
| 4 | చారిత్రక ప్రక్రియ | 4.1 - 4.6 |
| 5 | సమాజము - వ్యక్తి | 5.1 - 5.8 |
| 6 | చరిత్ర శాస్త్రమా? కళా? | 6.1 - 6.8 |
| 7 | డేటా సేకరణ మరియు ఎంపిక | 7.1 - 7.4 |
| 8 | సంశ్లేషణ విధానాలు మరియు పరిశోధన ఫలితాలు బహిర్గతం చేయటం | 8.1 - 8.7 |
| 9 | ఫుట్‌నోట్స్ | 9.1 - 9.4 |
| 10 | చరిత్ర రచనలో లోపాలు | 10.1 - 10.4 |
| 11 | చరిత్రలో నిష్పాక్షికత | 11.1 - 11.10 |
| 12 | పురావస్తు శాస్త్రం - భూగోళ శాస్త్రం | 12.1 - 12.4 |
| 13 | పురాజీవ శాస్త్రం - సమాజ శాస్త్రం | 13.1 - 13.4 |
| 14 | రాజనీతి శాస్త్రం - తత్వ శాస్త్రం | 14.1 - 14.4 |
| 15 | సాహిత్యము | 15.1 - 15.3 |
| 16 | చరిత్ర రచనా శాస్త్ర సిద్ధాంతములు | 16.1 - 16.8 |
| 17 | చక్రీయ సిద్ధాంతము | 17.1 - 17.6 |
| 18 | చారిత్రక భౌతిక వాదము | 18.1 - 18.7 |


--------------

**యూనిట్ - 1**

**పాఠం - 1**

# చరిత్ర అర్థము మరియు నిర్వచనం

**లక్ష్యము:**

చరిత్ర మూలం గురించి, దాని అర్థం మరియు విభిన్న నిర్వచనాలను, లక్షణాలను వివరించడం ఈ పాఠం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

**పాఠ్యనిర్మాణ క్రమం:**


1.1 పరిచయం

1.2 మూలపథం మరియు అర్థం

1.3 చరిత్ర - నిర్వచనాలు

1.4 సంక్షిప్తంగా

1.5 మాదిరి ప్రశ్నలు

1.6 ఉపయుక్త గ్రంథాలు


## 1.1 పరిచయం:

చరిత్ర అంటే నడత, నడవడి, కథ, ఉపాఖ్యానం, పురాణం, వర్ణన అని నిఘంటువులు చెబుతున్నాయి. మనిషి మనుగడకు సంబంధించి మంచి, చెడుల కలయికగా మానవాభ్యున్నతి కోసం ముందుకు సాగుతున్న ప్రయాణాన్ని మనం ఈ చరిత్రగా పేర్కొనవచ్చును. చరిత్ర అనే పదాన్ని దాని అర్థాన్ని, దాని విస్తృత పరిధిని అవగాహన చేసుకోవడం చాలా కష్టముతో కూడిన పని. ఎంతో కుతూహలంతో, మరెంతో క్షుణ్ణంగా అధ్యయనం చేసినా వీటి గురించి సమజంసమైన నిర్ధారణకు రావడం కష్టం. అయితే ఇందులో ఒక ప్రయత్నంగా ఈ పాఠంలో మనం చరిత్ర మౌలిక పథం గురించి, చివిభిన్న నిర్వచనాలను, లక్షణాలను గురించి తెలుసుకుందాం.

## 1.2 మూలపథం మరియు అర్థం:

ఆంగ్లభాషలోని 'హిస్టరీ' అనే పదం గ్రీకు భాషలోని 'ఇస్తోరియా' అనే పదం నుండి ఆవిర్భవించింది. గ్రీకు భాషలోని 'ఇస్తోరియా' అంటే 'వెదకటం', 'అన్వేషణ', 'విచారణ', 'పరిశీలన', 'వార్త', 'విషయం' అని అర్థం. మొదట్లో విచారణ లేదా వెదకటం అనే అర్థంలోనే ఈ పదం ఉపయోగించినా ఆ తర్వాత కాలంలో అన్వేషణ ఫలితంగా లిఖిత రూపం దాల్చిన వర్ణన

అంటే రికార్డు అనే అర్థంలోను వాడుకలోకి వచ్చింది. అంటే మొదటిది భావన (Idea) పరంగాను, రెండవది ఆ భావనకు రూపమైన వాస్తవికత (reality) పరంగాను వ్యవహారంలోకి వచ్చిందన్నమాట.

గ్రీకు పదం 'ఇస్తోరియా'యే లాటిన్ పదం 'హిస్టోరియా'గా ఇండో-యూరోపియన్ భాషల్లోకి ప్రవేశించింది. ఈ గ్రీకో-లాటిన్ పదానికి భిన్నంగా జర్మన్లు 'గెశ్చిచె' అనే పదాన్ని ఉపయోగించారు. ఈ పదానికి 'సంఘటన' అని అర్థం. కాని 'గెశ్చిచె' అనే మాట 'చారిత్రక వివరాల సేకరణ'గా ఎక్కువ ప్రచారంలోకి వచ్చింది. ఇదే భావన పదిహేనవ శతాబ్దంలో ఈ మాటనే 'హిస్టరీ'కి పర్యాయపదంగా జర్మన్ చరిత్రకారులు, తత్త్వవేత్తలు మానవ సంబంధమైన అంశాల సేకరణను, వాటి పరిణామాన్ని సూచించడానికి వాడారు. అయితే ప్రస్తుతం 'హిస్టరీ' అనే పదం ప్రచారంలో స్థిరపడింది.

అరబ్బీ భాషలో చరిత్ర అంటే సంఘటనలను తెలియజేసే కాలం అనే అర్థంలో 'తారిఖ్'గా వ్యవహరించబడుతుంది. ప్రాచీన భారతదేశంలో చరిత్రకు ప్రత్యామ్నాయంగా 'పురాణం', 'ఇతిహాసం' అని వాడారు. అంటే ధర్మార్థ, కామ, మోక్షోపదేశ సమన్వితమై జరిగిన సంగతి కథలాగా చెప్పటం అనే భావంలో వాడుకలో ఉండేది.

## 1.3 చరిత్ర - నిర్వచనాలు:

చరిత్రపట్ల ఆసక్తి ఉన్నా, లేకున్నా అన్ని రకాల వ్యక్తులు అంటే చరిత్రకారులే కాకుండా పండితులు, శాస్త్రవేత్తలు, సామ్రాజ్యాల అధినేతలు, జాతీయ నాయకులు, సామాన్య ప్రజలతో సహా చరిత్రను నిర్వచించడానికి ప్రయత్నించారు. బహుశా దీనికి కారణం సాంకేతికం కాని జనరంజకమైన చరిత్రను ఎవరైనా నిర్వచింపవచ్చుననే ఒక గుడ్డి నమ్మకం అయివుండవచ్చు.

గ్రీకులు మొట్టమొదట చరిత్రను నిర్వచించే ప్రయత్నం చేశారు. హెలీ కార్నసస్ నివాసి డయోనిషియస్ క్రీ.పూ. మొదటి శతాబ్దంలో చరిత్రలోని ప్రధాన ధర్మం గురించి పేర్కొంటూ దాన్ని దుష్టాంతాల నుంచి గ్రహించిన తత్త్వశాస్త్రం అని వర్ణించాడు. 'దుష్టాంతాలు' అంటే కేవలం ఊహలని కాక మానవ జీవితంలోని నిజ ఘట్టాలని, తత్త్వశాస్త్రమంటే దృష్టాంతాల నుండి పాఠం నేర్చుకొనే పద్ధతి అని, మానవులందరి అనుభవాన్ని చరిత్ర మనకు అందిస్తుందని డయోనిషియస్ అభిప్రాయం. నిజ జీవితం నుండి పాఠాలను గ్రహించినప్పుడు వాటిని మొత్తం పొందికగా ఒక క్రమంలో పెట్టినప్పుడు చరిత్ర రూపొందుతుంది. ప్రత్యేక జీవితాంశాలను శాస్త్రబద్ధంగా సేకరించి, వర్గీకరించి, వివరించడంలో మానవుని తెలివితేటలు అభివృద్ధి చెందటాన్ని ఇది సూచిస్తుంది.

క్రీ.పూ. 4వ శతాబ్దపు గ్రీకు తత్త్వవేత్త అరిస్టాటిల్ "మార్పు చెందని గతానికి సంబంధించిన వర్ణన"గా చరిత్రను వర్ణించాడు. ఇందులో గమనించదగిన రెండు విషయాలున్నాయి. ఒకటి చరిత్ర వర్ణన అని, రెండు గతం అనేది సహజంగా మార్పు లేనిదనీ, మానవ స్వభావం మారదని, ఉద్దేశాలు ఒకటే అయినప్పుడు వాటి నుంచి ఉద్భవించే చేతల్లో తేడా ఉంటుందే తప్ప మూల స్వభావంలో మార్పు ఉండదనీ, దానికి నిదర్శనంగా లక్ష్యసాధనలో ప్రతి యుగానికి, ప్రతి దేశానికి తనదైన విధానం ఉన్నప్పటికి చరిత్రలో యుద్ధాలు, సైనిక విజయాలు మార్పులేని విషయాలనీ అతడు పేర్కొన్నాడు. అరిస్టాటిల్ తన గ్రంథం 'నికోమేషియన్ ఎథిక్స్'లో గతాన్ని భగవంతుడు కూడా మార్చలేడని పేర్కొనడం గమనార్హం.

క్రీ.పూ. 5వ శతాబ్దానికి చెందిన ప్రసిద్ధ గ్రీకు చరిత్రకారుడు థూసిడైడిస్ (Thucydides), క్రీ.పూ. 2వ శతాబ్దానికి చెందిన మరో గ్రీకు చరిత్రకారుడు పలీబియస్‌లు చరిత్రను జ్ఞాపకం ఉంచుకోదగిన విషయాల గాథగా భావించారు. అంటే గడచిన సంఘటలన్నీ చరిత్రలో చేర్చారని, కేవలం అసదృశ్యమైన, ప్రధానమైన, విశేషించి చెప్పదగిన సంఘటనలే చరిత్రలో స్థానముంటుందని, అంతే కాని సూచిందల్లా లేదా విన్నదంతా చరిత్ర కాబోదని సూచించినట్లున్నమాట.

16వ శతాబ్దానికి చెందిన ఆంగ్ల తత్త్వవేత్త ఫ్రాన్సిస్ బేకన్ "చరిత్ర మానవులను వివేకవంతుల్ని చేసే విద్యా విభాగం" అన్నాడు. మంచి చెడు విచక్షణను తెలిపేది వివేకం. ఆ వివేకాన్ని కలిగించే ఒక సాధనం చరిత్ర అని అతని అభిప్రాయం.

ఈ కారణంగానే చరిత్రను "ఏవో సూత్రాలను తెలిపే సాధనంగా కాక, యుక్తాయుక్త విచక్షణ కల్గించే అధ్యాపకునిగా 18వ శతాబ్దానికి చెందిన రాజనీతిజ్ఞుడు ఎడ్మండ్ బర్క్ భావించాడు. చరిత్ర మార్పుకు సంబంధించింది. మార్పు చెందే ప్రతి దానిని సూత్రీకరించలేం. నెపోలియన్ ఐరోపా ఆధిపత్యం, పోలెండ్ మీద హిట్లర్ దాడి, భారతదేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటించడం వంటి సంఘటనలను ఏవో సూత్రాలకు కట్టుబడిన అవసరాలుగా కాక యుక్తాయుక్త పరిజ్ఞానం కింద్రికి వచ్చే అవసరాలుగా వివరించవచ్చు.

ఆంగ్ల న్యాయశాస్త్ర చరిత్రకారుడు మైట్‌లాండ్ "చరిత్ర అంటే మానవులు చేసింది, చెప్పింది, అన్నింటిని మించి వాళ్ళు ఆలోచించింది'' అన్నాడు. ఈ తుది విశ్లేషణలో గతంలో జరిగిన దానికంతటికీ సంబంధించిన ఆలోచనా సరళి, ప్రతిఫలన క్రియలకు రూపకల్పన చేయటం చరిత్రకు ప్రధాన కర్తవ్యం అవుతుంది. చరిత్రను సంఘ జీవులైన మానవుల గాథగా పేర్కొని రేనియర్ చరిత్ర పరిధిని విస్తరించాడు.

ప్రముఖ బ్రిటీషు సాహితీవేత్త కార్లైల్ (1795 - 1881) "మహాపురుషుల జీవిత చరిత్రలే మానవ జాతి చరిత్ర'' అని పేర్కొన్నాడు. చరిత్ర గొప్ప వారి ఘన కార్యాల రికార్డు అని దానికి కావలసింది అసాధారణ ప్రతిభాశాలురే కాని సామాన్య ప్రజానీకం కాదని అతని అభిప్రాయం. 19వ శతాబ్దపు అమెరికన్ తత్త్వవేత్త ఎమర్సన్ (Emerson) చరిత్ర వేరే లేదని, జీవిత కథే చరిత్ర అని పేర్కొన్నాడు. ఇదే శతాబ్దానికి చెందిన ఫ్రెంచి కవి, నవలాకారుడు, రాజనీతిజ్ఞుడు లామార్టిన్ (Lamartine) దృష్టిలో విస్తృతిలో జీవిత కథ కంటే చరిత్ర ఎక్కువ కాదు, తక్కువ కాదు.

19వ శతాబ్దానికి ఆంగ్ల చరిత్రకారుడు సీలీ (Seely), చరిత్రను రాజకీయాలకు ప్రతిరూపమని భావించాడు. నిజానికి 19వ శతాబ్దపు బ్రిటీష్ వారిలో చాలా మందికి చరిత్ర సమస్తం రాజకీయాలమయం. అందువల్లనే ఫ్రీమన్ (Freeman) "గత రాజకీయాలే నేటి చరిత్ర'' అన్నాడు. అలాగే మరో ఆంగ్ల చరిత్రకారుడు అక్టన్ చరిత్రను రాజనీతితో ముడివేశాడు. అయితే చరిత్ర పరిధి ఇటీవలి కాలంలో విస్తృతం కావటంలో రాజకీయాలు చరిత్రలో ఒక భాగం మాత్రమే అయ్యాయి.

కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో ఆధునిక చరిత్రాచార్యుడుగా ప్రసిద్ధుడైన లార్డు అక్టన్ (1834 - 1902), 19వ శతాబ్దపు విలక్షణతను ప్రతిబింబిస్తూ చరిత్రను మానవ స్వాతంత్ర్యం వివరించే గాథగా'' నిర్వచించాడు. సామ్రాజ్యాలు నిర్మితమైన క్షణాలు చరిత్రలో గొప్ప క్షణాలు కావనీ మానసిక వికాసానికి తోడ్పడే సంఘటనలు జరిగిన క్షణాలు, సంకల్ప స్వేచ్ఛ పొందిన క్షణాలు గొప్పవని అతని అభిప్రాయం. స్వేచ్ఛా సంకల్పం ఆత్మ వివేకానికి నిదర్శనం. ఈ స్వేచ్ఛా సంకల్పం సృజనాత్మకను ప్రేరేపిస్తుంది, నిర్భంధం ప్రేరణను చంపేస్తుంది. కాని స్వయం నిర్ణయశక్తి ఉన్నంతలో ప్రతిభను మిక్కిలి ఉపయుక్తం కావించుకునే అవకాశం కల్గిస్తుంది.

చరిత్ర ప్రధానంగా సమాజాలలోని భౌగోళిక, నైసర్గిక పరిసరాల్లో మానవుల జీవితానికి సంబంధించిన రికార్డు. వారి సాంఘీక, సాంస్కృతిక పరిసరాలు, సమాజం, దాని భౌగోళిక పరిస్థితులు ఒకదానితో మరొకటి పెనవేసుకుని ఆవిర్భవిస్తాయి. ప్రతి దేశ చరిత్ర ఆ దేశానికి సంబంధించిన నాగరికత చరిత్రే అని రౌజ్ (Rowse) పేర్కొన్నాడు. ఫ్రెంచి చరిత్రకారుడు సైన్‌బోస్ (1854 - 1942) 'మొత్తం చారిత్రక విజ్ఞానం పరోక్షం కనుక చరిత్ర ప్రధానంగా ఒక వివేచనా శాస్త్రం' అన్న దృక్పథంలో ఏకీభవించాడు. హేతుబద్ధంగా శాస్త్రీయంగా చారిత్రక యదార్థాలను ఎన్నుకొని విశ్లేషించటం చరిత్రకారుని విధి. ఈ కార్యక్రమంలో చరిత్ర రచనకు తర్కం బాగా తోడ్పడుతుంది. సైన్‌బోస్ తార్కిక ప్రత్యక్ష జ్ఞాననాథం, చారిత్రక పరికల్పనకు అన్వయించినప్పుడు దానితో ఏకీభవించాడు. ఎందుకంటే చారిత్రక పరిజ్ఞానం మొత్తం పరోక్షమే కనుక. ఫ్రెంచి ఆర్థిక శాస్త్రవేత్త, రాజనీతిజ్ఞుడు టర్గాట్ (1727 - 1781), అతని సమకాలీన తత్త్వవేత్త, గణిత శాస్త్రజ్ఞుడు, విప్లవవాది అయిన కోడార్సే (1743 - 1794)లు చరిత్రను "ప్రగతి భావన''తో సంఘటితపరచి చరిత్రకు ఏకత్వాన్ని, సంశ్లేషణను తీసుకువచ్చారు. ఈ ప్రగతి భావన గతాన్ని వర్తమానంలో సంధించడానికి బాగా దోహదం చేసింది. మానవాళి ప్రగతిని కొలిచే సాధనంగా చరిత్ర

రూపొందింది. ఈ కొలబద్దతో మానవుడు ప్రాచీన అనాగరిక స్థాయి నుంచి గ్రహాంతర యానం చేసే నేటి స్థాయికి ఏ విధంగా ప్రగతిని సాధించినదీ మనం తెలుసుకోగలుగుతున్నాం.

విజ్ఞానశాస్త్రం ప్రకృతిని పరిశీలించడానికి ఉపయోగించిన పద్ధతినే అనుసరిస్తూ మానవుని కార్యకలాపాలను పరిశీలించడానికి సామాజిక అధ్యయనాలు, ప్రయత్నం ఆరంభించటం చారిత్రక చింతనలో మరో మలుపు. పర్యవసానంగానే ఐరిష్ చరిత్రకారుడు బ్యూరీ **(1861 - 1927)** చరిత్ర "ఒక శాస్త్రం, అంతకంటే తక్కువ కాదు, ఎక్కువ కాదు'' అని ప్రకటించి ఒక పెద్ద దుమారాన్ని లేవనెత్తాడు. విచారణ, పరిశీలన, వివరణ, సత్యాన్వేషణ విజ్ఞాన శాస్త్ర ప్రవృత్తులు. అదే చరిత్రకు వర్తిస్తుందని బ్యూరీ వాదన.

పాశ్చాత్య పండితులలో చరిత్రకు అత్యంత ప్రధాన నిర్వచనం ఇచ్చినవాడు జర్మను చరిత్రకారుడైన "ఎర్న్‌స్ట్ బెర్న్‌హీ''. మానసిక - భౌతిక కార్యాకారణ సంబంధ నేపథ్యంలో సామాజిక జీవులుగా మానవుల వ్యక్తిగతమైన విలక్షణమైన, సామూహికమైన చైతన్యాన్ని దేశ కాలపరిస్థితులు ఆధారంగా మానవ పరిణామాన్ని నిర్ణయించే యదార్థాలను పరిశోధించి, అందించే విజ్ఞాన శాస్త్రం చరిత్ర అని బెర్న్‌హీం పేర్కొన్నాడు. ఈ నిర్వచనం చారిత్రక అనుగమనానికి సంబంధించిన అన్ని ప్రాథమిక కార్యరంగాలను స్పృశిస్తుంది. కేవలం కట్టుకథల పైనో, ఊహాల మీదనో ఆధారపడింది కాక జీవిత వాస్తవికతల పైన ఆధారపడి, నిజంగా జరిగిన, సంఘటనలను గురించిన క్రమబద్ధమైన విజ్ఞానాన్ని విశదీకరిస్తుంది. కనుక చరిత్ర శాస్త్రమే అని, బెర్న్‌హీ అభిప్రాయం. చరిత్రకారుని ప్రధాన కర్తవ్యం ఈ జీవిత యదార్థాలను, వాటి సరైన సందర్భంలో వివరించే ఉద్దేశంతో అన్వేషించటం, పరిశీలించటం, తెలుసుకోవటం, ఇంతకంటే ముఖ్యమైన పని సంఘటన కార్యాకారణ సంబంధాలను వివరించటం. సమస్య మూలం కనుక్కోవటం, విషయాన్ని లోతుగా పరిశీలించటం, దానిని ఆది నుంచి తుది వరకు వ్యాఖ్యానించటం. "మానవ జాతిలోని వైవిధ్యాన్ని అధ్యయనం చేసేది చరిత్ర''. సుప్రసిద్ధ బ్రిటీషు చరిత్రకారుడు కార్ చరిత్ర అంటే "చరిత్రకారునికి, చారిత్రక యదార్థాలకూ మధ్య అవిచ్ఛిన్నంగా సాగే కార్య విధానం, వర్తమానానికి, గతానికి మధ్య జరిగే అనంతమైన సంభాషణ'' అని నిర్వచించాడు. చరిత్రకారుడు చరిత్రను రచించ తలపెట్టినప్పుడు ప్రాథమికంగా యదార్థాలను ఎన్నుకొని వాటి ఆధారలతో ఒక ప్రాథమిక వ్యాఖ్యానం ప్రారంభిస్తాడు. ఈ యదార్థాలు, వ్యాఖ్యాణం మొదలు అతని వైనా కావచ్చును, ఇతరులవైనా కావచ్చును. అతడు ముందుకు కొనసాగే కొద్ది అతని వ్యాఖ్యానం యదార్థాల ఎన్నిక ఒక దానికి మరొకటి ప్రభావితం చేసుకుంటూ అతనికి తెలియకుండానే క్రమంగా మార్పుకు లోనవుతాయి. చరిత్రకారుడు వర్తమానికి, అతని యదార్థాలు గతానికి చెందినవి కనుక, ఈ వర్తమానానికి, గతానికి పరస్పర సంబంధం ఉంటుంది. యదార్థాలు లేకపోతే చరిత్రకారునికి పునాది లేదు. అతనితో అవసరము లేదు. అలాగే చరిత్రకారుడు లేకుంటే యదార్థాలకు ప్రాణం లేదు, అర్థం లేదు. ఇదే విధంగా గతం లేకపోతే వర్తమానం లేదు, వర్తమానం లేకపోతే గతానికి అర్థం లేదు. కార్ ఈ విషయాలను తన నిర్వచనంలో సూక్ష్మీకరించాడు.

పండిత జవహర్‌లాల్ నెహ్రూ "ప్రకృతికి, వాతావరణ శక్తులకు వ్యతిరేకంగా, ఆటవిక జంతువులకు, అరణ్యానికి వ్యతిరేకంగా చివరికి అన్నిటి కంటే క్లిష్టమైనది తనను ఆదోగతిలో ఉంచడానికి, తన స్వలాభం కోసం, తనను దోచుకోవడానికి ప్రయత్నించే తోటి మానవులకు వ్యతిరేకంగా మానవుడు శతాబ్దాలుగా సాగిస్తున్న కథన కథనం చరిత్ర అని చరిత్రకు మరో నిర్వచనం ఇచ్చాడు.

అసమగ్రమైన, అవిశ్వసనీయమైన, ఊహాగానాలతో పాక్షిక దృక్పథాలతో నిండి, ఎదిగి ఎదగని స్థాయిలో ఉన్న చరిత్రను నిరాశా వాదంతో విరూపంగా చిత్రించిన నిర్వచనాలు ఉన్నాయి. ఈ నిరాశా వాదానికి విజ్ఞానశాస్త్ర, సాంకేతిక అభివృద్ధి వ్యామోహం తోడయింది. ముఖ్యంగా ప్రష్యాపాలకుడు రెండవ పెడరిక్ చరిత్రను "అసత్యవాదిగా'' భావిస్తే ఆంగ్ల రాజనీతిజ్ఞుడు రాబర్ట్ వాల్‌పోల్ ఫ్రెంచి తత్త్వవేత్త వాల్టేర్, చక్రవర్తి నెపోలియన్‌లు చరిత్రను "కట్టుకథ''గా వర్ణించారు. ప్రముఖ అమెరికన్ వ్యాపారవేత్త హెన్రీఫోర్ట్ చరిత్రను 'వట్టి మాయగా' వర్ణిస్తే, "ulysses" గ్రంథకర్తి జేమ్స్ జాయిస్ చరిత్రను ఒక 'పీడ కల'

(nightmane) గా పేర్కొన్నాడు. అయితే ముందే చెప్పినట్లు ఈ నిష్టూర నిర్వచనాలు చరిత్ర పట్ల స్పష్టమైన సమగ్రమైన అవగాహన పెంపొందించడానికి సహాయపడవు. ఇవన్నీ వారి పాక్షిక దృక్పథాలను ప్రతిబింబించేవే.

## 1.4 సంక్షిప్తంగా:

నేడు చరిత్ర స్పష్టమైన, సమగ్రమైన, విశ్వసనీయమైన, ప్రగతిశీల శాస్త్రంగా ఎదిగింది. మానవ నాగరికతా పరిణామాన్ని విశదీకరించే శాస్త్రంగా రూపుదాల్చింది. మానవుడు తన అభ్యున్నతికై సాగించే పోరాటంలోని సంఘటనల అధ్యయనంగా మారింది. మానవతా వికాసమే లక్ష్యంగా పెరిగింది. అభివృద్ధి చెందింది.

ప్రతి ఒక్కరు చరిత్రకు తమ సొంత నిర్వచనాలు ఇవ్వటానికి ప్రయత్నించారు. ఈ నిర్వచనాలన్నీ ఆలోచనపరంగానో లేదా ప్రమాణపరంగానో, సంఘటనలపరంగానో ఇవ్వడం జరిగింది. కొందరికి చరిత్ర మానవ మేధస్సుకు సంబంధించిన కార్యశీలత, వీరి దృష్టిలో చరిత్ర గతానికి సంబంధించిన అధ్యయనం, అవగాహన, జ్ఞాపకం. E.H. కార్ చరిత్రకు ఇచ్చిన నిర్వచనం ఈ మొదటి తరగతికి చక్కని ఉదాహరణ. మరి కొందరు చరిత్రకారులు చరిత్రను ప్రాథమికంగా గతంలో ఏం జరిగిందో వివరించే రికార్డుగా వీక్షించారు. ఈ విధమైన భావంతోనే "An Advanced History of India", "History of the Freedom Movement in India", "The Cambridge History of India" మొదలైన గ్రంథాలకు పేర్లు పెట్టబడ్డాయి. ఇంకా చరిత్రను సంఘటనలపరంగా వీక్షించిన దానికి ఉదాహరనగా సర్దార్ ఫణిక్కర్ వ్రాసిన "A Survey of Indian History" గ్రంథ శీర్షికను పేర్కొనవచ్చు. అయితే చరిత్ర అనే పదం ఉపయోగించటంలో ఈ భావనలు తరచూ తారుమారయి గందరగోళం ఏర్పడే అవకాశం ఉంది. చరిత్రకు అనేకులు అనేక రకాలుగా నిర్వచనాలు ఇచ్చారు. ఇందులో కొన్ని సామాన్యం, మరికొన్ని సంకీర్ణాలు. అరిస్టాటిల్, రేనియర్‌లు చరిత్రను నిర్వచించటంలో గతానికి ప్రాధాన్యతను ఇస్తే, E.H. కార్ చరిత్రను వర్తమానానికి, గతానికి మధ్య ఒక సంభాషణగా భావించాడు. గతాన్ని అధ్యయనం చెయ్యటంలో వర్తమానం పాత్రనీ, వర్తమాన, భవిష్యత్తులను రూపొందించటంలో గతం పాత్రని వెలికి తేవటం, కార్ చరిత్రకు చేసిన గొప్ప సేవ. ఈ పరస్పర విరుద్ధ అభిప్రాయాలు చరిత్ర అర్థం, స్వభావం, పరిధుల సంశ్లిష్టత వైపు మన దృష్టిని మళ్ళిస్తున్నాయి. ఏదిఏమైనను చరిత్రను నిర్వచించటం అంత సులభం కాదు. అందరికీ ఆమోదయోగ్యమైన, ఖచ్చితమైన నిర్వచనం ఇంతవరకు ఎవ్వరు ఇవ్వలేకపోయినారు. దానికి కారణం చరిత్ర అనేది మనిషి గురించి మనిషి అధ్యయనం చేయుటయే ఇందులో ఉన్న విషయం.

## 1.5 మాదిరి ప్రశ్నలు:

1. చరిత్ర యొక్క మూలపదం గురించి వివరించి, చరిత్రను నిర్వచించుము.
2. వివిధ కాలాలలో చరిత్రను ఏ విధంగా నిర్వచించినారో వివరించుము.
3. నాటి గ్రీకు చరిత్రకారుల నుండి నేటి కార్ వరకు చరిత్రకు ఇచ్చిన భిన్న నిర్వచనాలను గురించి వ్రాయుము.

## 1.6 ఉపయుక్త గ్రంథాలు:


1. Carr E.H. : What is History (Macmillan 1961)
2. Clark, Kitson : The Critical Historian (Heinman London, 1970)
3. Colling Wood, R.G. : The Idea of History (O.U.P. 1966)
4. Daniels, R.V. : Studing History, How and Why? (Prentice Hall, New Jersey, 1960.)
5. Durga Prasad, J. : Charitra Rachana Sastram (Tel) (Telugu Academy, Hyderabad, 1987.)
6. Sastri K.A.N. & Kammanna, H.S. : Historical Method in Relation to Indian History (S. Viswanathan, Madras, 1956.)
7. Sheikh Ali, B. : History Its Theory and Method (Macrmillan, 1978.)


**Prof: G. Raja Mohan Rao**

**పాఠం - 2**

# చరిత్ర లక్షణాలు మరియు విషయ పరిధి

## లక్ష్యము:

చరిత్రకు కల విభిన్న లక్షణాలను మరియు దాని యొక్క పరిధిని తెలియజేయుటయే ఈ పాఠం యొక్క ముఖ్య ఉద్దేశ్యము.

## పాఠ్య నిర్మాణ క్రమం:


**2.1 పరిచయం**

**2.2 చరిత్ర మానవ జగత్తుకు సంబంధించినది**

**2.3 వ్యక్తులను దేశం, కాల పరిస్థితుల నేపథ్యంలో అర్థం చేసుకోవాలి**

**2.4 చరిత్ర శాస్త్రీయం**

**2.5 చరిత్రకున్న చరిత్ర**

**2.6 చరిత్ర స్వభావం**

**2.6.1 ధృవీకృత యదార్థాల కూడలియే చరిత్ర**

**2.6.2 చరిత్ర పునరావృతమౌతుందా?**

**2.6.3 చరిర్త మొత్తం సమకాలీనమే**

**2.6.4 వర్తమానానికి, గతానికి మధ్య జరిగే నిరంతరమైన సంభాషణే చరిత్ర**

**2.6.5 చరిత్ర సరియైన తీర్పునిస్తుందా?**

**2.6.6 చరిత్రలో ప్రగతి భావన**

**2.7 చరిత్ర విషయపరిధి**

**2.8 ముగింపు**

**2.9 మాదిరి ప్రశ్నలు**

**2.10 ఉపయుక్త గ్రంథాలు**


## 2.1 పరిచయం:

చరిత్రను అనేకులు అనేక రకాలుగా నిర్వచించడం పైన వివరించడం మనం ముందుపాఠంలో తెలుసుకున్నాం. చరిత్రను నిర్వచించడంలో అరిస్టాటిల్, రేనియర్‌లు గతానికి ప్రాముఖ్యతను ఇస్తే E.H. కార్ చరిత్రను వర్తమానానికి, గతానికి వారధిగా భావించాడు. కార్లైల్, ఎమర్సన్, లామార్టీన్లు మహాపురుషుల కోణం నుండి చూస్తే, ఫ్రీమన్, సీలీలు రాజకీయాలకు

ప్రతిరూపంగా భావించారు. చరిత్రను జటిలంగా కొందరు నిర్వచిస్తే, నిష్టురంగా మరికొందరు నిర్వచించారు. అందరికీ ఆమోదయోగ్యమైన నిర్వచనం ఒక్కటే లేకపోవటం చూస్తుంటే చరిత్రను నిర్వచించడం చాలా క్లిష్టమనిపిస్తుంది. నిర్దిష్టంగా విషయాన్ని నిర్వచింపలేనప్పుడు చరిత్ర అంటే ఏమిటో చెప్పటం కూడా చాలా కష్టమనిపిస్తుంది. ఆయా నిర్వచనాలను, అవి ప్రతిబింబించే దృక్పథాలను విశ్లేషిస్తే చరిత్రలో భిన్న లక్షణాలు కన్పిస్తున్నాయి.

## 2.2 చరిత్ర మానవ జగత్తుకు సంబంధించినది:

"చరిత్ర జడజగత్తును గురించి కాని జీవజగత్తును గురించి కానీ పరిశీలించదు, మానవ జగత్తుకే అది పరిమితం." అంటే చరిత్ర కేవలం మానవునితోముడిపడి ఉందన్నమాట. ఈ సృష్టికే పై వరసలో ఉన్న మానవుడు ఒక జటిలమైన అద్భుతాన్ని, విశ్వాన్ని అర్థం చేసుకోవడానికి సాధనం. వ్యక్తిగా, సంఘజీవిగా అతణ్ణి అర్థం చేసుకోవాలి. అందువల్లనే కార్లైల్ మహా పురుషుల జీవిత గాథల వైపు మన దృష్టిని మళ్ళించాడు. చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకున్న మహా పురుషుల జీవితాలను, వారు జీవించిన సమాజ పరిస్థితుల్లో అధ్యయనం చేయటం వల్ల సంఘటనల పరంపరకు సరిగ్గా అవగాహన చేసుకోగలం. ఏ ఆశలు, ఆశయాలు శతాబ్దాలుగా వారిని ప్రేరేపించి, మార్గదర్శకమై, చైతన్యవంతులను చేశాయో అవే చరిత్రకు ప్రధాన అంశాలు అయ్యాయి.

సామాన్య మానవుడు ప్రాముఖ్యం వహించిన శతాబ్దంలో మనం జీవిస్తున్నాం. జన సమూహాలు అత్యంత ప్రబలమైన ఒక సాంఘీక శక్తిగా రూపొంది చరిత్రగతినే మలుపు తిప్పుతున్నాయి. ఫలితంగా చరిత్రకారుడు మానవాళి చరిత్రను కొత్త పంథాలో వీక్షిస్తున్నాడు. విశ్వజనీనమైన సర్వమానవ చరిత్ర అతని ఆదర్శం అయింది. రాజుల, రాజనీతిజ్ఞుల, రాజకీయవాదుల శీలం, ప్రవర్తన, భావాలు మాత్రమే చరిత్రలో చెల్లుబాటు అవుతాయి అన్న అభిప్రాయం మారింది. సాంఘీక ప్రక్రియగా చరిత్రనూ, సామాన్య ప్రజల పాత్రనూ అధ్యయనం చెయ్యటం ఈ రెంటి ఆవశ్యకతను కార్ నొక్కి చెప్పాడు.

## 2.3 వ్యక్తులను దేశం, కాల పరిస్థితుల నేపథ్యంలో అర్థం చేసుకోవాలి:

వ్యక్తులను, వారి వ్యక్తిత్వాలనూ, వారి భౌగోళిక, నైసర్గిక పరిసరాల దృష్ట్యా అవగాహన చేసుకోవాలి. మానవుడు పరిసర వాతావరణం వల్ల ప్రభావితం అవుతాడు. అలాగే పరిసరాలు అతని చేతుల్లో ఆకారాన్ని పొందుతాయి. ఈ పరస్పర ప్రభావం చైతన్యవంతమైనది. రాజకీయ, సాంఘీక, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో మానవుడు చురుకుగా సాధించే విజయాల తీరుతెన్నులు, ఆ చైతన్యం నుంచి ఆవిర్భవించేవే.

మానవుడు నైసర్గిక, భౌగోళిక పరిసరాల వల్లనే కాకుండా తాను జీవించే కాలం వల్ల కూడా ప్రభావితం అవుతాడు. చరిత్ర సారం లేదా తత్త్వం ఈ కాలం అనే విషయం పైనే ఆధారపడి ఉంది. ముందు చెప్పినట్లు చరిత్రకు, జడజగత్తుకు ఏ మాత్రం సంబంధం లేదు. అదిగతం, వర్తమానం, భవిష్యత్తులలో నిరంతరం సాగే వాహిని. కాలం పరిణామశీలమైనది, ప్రకృతి, మానవుడు నిరంతరం ఈ మార్పుకు లోనవుతూనే ఉంటారు. మార్పులేని, శాశ్వతమైన ప్రాముఖ్యాన్ని సంతరించుకునే సిద్ధాంతం కాని, ఆశయం కాని, సంస్థ కాని ఉండవని చరిత్ర చెబుతున్నది. కాలానికి ఎంత శక్తి ఉందో కనుమరుగైన మహామహులు, మహా సామ్రాజ్యాలు, కట్టడాలు చెబుతూనే ఉన్నాయి. కాలం కలిసిరానప్పుడు, కర్రే పామై కరుస్తుందని మనకు సామెత ఉండనే ఉంది కదా! ఈ కాలమే చరిత్రకు అవిచ్ఛిన్నతను కలిగిస్తున్నది. చరిత్ర నిరాటంకంగా సాగే ప్రవాహం, దానికి వేరే గండ్లులేవు. కేవలం చరిత్రకారుడు మాత్రమే చరిత్రలో వచ్చిన మార్పులను వివరించటానికి తన సౌకర్యం కోసం చరిత్రను యుగాలనీ, శకాలని విభజన చేస్తున్నాడు. చరిత్ర అన్నది కాలగతిలో మానవుల అభివృద్ధిక్రమమే. దేశ కాల పరిస్థితుల చట్రంలో మాత్రమే గత కాలపు సంఘటనలను చరిత్రకారుడు అర్థవంతమైన సమిష్టి రచన రూపొందించ గలుగుతున్నాడు. చరిత్ర చక్రాలు వెనక్కి మళ్ళించలేం, గడియారపు ముళ్ళ ముందుకి గెంటలేం, మారుతున్న కాలపు విలువలతో బాటు మారే దృక్పథాన్ని అనుసరించి చరిత్రను ప్రతి తరానికి తిరిగి వ్రాయాలి.

## 2.4 చరిత్ర శాస్త్రీయం:

మనం పరిగణనలోకి తీసుకోవలసిన మరో అంశం చరిత్రను శాస్త్రీయంగా రూపొందించటం. చరిత్ర రచన చారిత్రక ఆధారాల అన్వేషణపైనే కాక లభించిన సమాచారాన్ని వివేచనాత్మకంగా విశ్లేషించటం మీద కూడా ఆధారపడింది. కార్యాకారణ సంబంధం అన్ని శాస్త్రాలకూ మూలం. ఈ నియమాన్ని లేదంటే జీవితం అర్థరహితం, శాస్త్రాలు నిరర్థకం, చరిత్రకార్యాకరణ సంబంధాన్ని అంగీకరించి, జరిగిన, జరుగుతున్న సంఘర్షణలకు కారణాలను అన్వేషిస్తుంది. తమకు లభిస్తున్న జ్ఞానాన్ని క్రమబద్ధంగా అమర్చటమే కాక కొన్ని సామాన్య సూత్రాలను ప్రతిపాదించటం శాస్త్రజ్ఞుల విధి. ఈ విధిని చరిత్రకారుడు నెరవేరుస్తున్నాడు. చరిత్రకారుడు చెప్పే సామాన్య సూత్రాలు సత్యాన్ని శోధించటానికి తోడ్పడే ఆలోచనా సాధనాలు.

## 2.5 చరిత్రకున్న చరిత్ర:

చరిత్ర స్వతంత్ర అధ్యయన విభాగంగా రూపొందింది. మానవుని గత అనుభవాలను ప్రతిబింబిస్తూ వర్తమానాన్ని అవగాహన చేసుకునే సాధనంగా స్థానం సంపాదించుకుని అది శాస్త్రీయ వివరణాత్మకమయింది. ఒకప్పుడు పదాలకు, కథా గేయాలకు, జానపద వీరగాథలకు పరిమితమైన చరిత్ర ఇప్పుడు విశ్వజనీనమైన సర్వమానవ చరిత్ర స్థాయికి ఎదిగింది. "చరిత్ర పిత'' గ్రీకు చరిత్రకారుడు హెరొడోడస్ క్రీ.పూ. 5వ శతాబ్దిలోనే చరిత్రకు స్వతంత్ర అధ్యయనపరంగా విషయ ప్రతిపత్తిని తీసుకువచ్చాడు. అతని అనంతరం థూషి డైడిస్ చారిత్రకు విశ్వసనీయతా ప్రమాణాలను నెలకొల్పాడు.

మధ్య యుగంలో చరిత్ర మతం చేతిలో కీలు బొమ్మగా మారింది. కాని 17వ శతాబ్దంలో సాహిత్యేతరమైన శాసనాలు, నాణేలు ఉపయోగంలోకి రావటం, చారిత్రక ప్రమాన గ్రంథాల పరిశీలన పెరగడంతో విమర్శనాత్మక చరిత్రకు గట్టి పునాది ఏర్పడింది. 19వ శతాబ్దంలో శాస్త్రీయ సూత్రాలు, పద్ధతులు అవలంభించడంతో చరిత్ర విజ్ఞాన శాస్త్ర స్థాయికి పెరిగింది. జర్మనీ శాస్త్రీయ చరిత్రకు పుట్టినిల్లయింది. విషయాత్మక పరిణామం కూడా చరిత్రలో కన్పిస్తుంది. ఒకప్పుడు రాజకీయ అంశాలకే పరిమితమైన చరిత్ర కార్ల్‌మార్క్స్, ఆగస్ట్‌కాంట్‌ల పుణ్యమా అని ఆర్థిక, సామాజిక విషయాల వైపు దృష్టి మళ్ళించింది. అనంతరంమానవ జాతి విజయపరంపరలో సాంస్కృతిక చరిత్రకు ప్రాధాన్యత హెచ్చింది. సమాజశాస్త్రం మనో విజ్ఞాన శాస్త్రాల అభివృద్ధితో చరిత్రకారుడు మరిన్ని కొత్త విషయాల వైపు దృష్టి సారించాడు.

## 2.6 చరిత్ర స్వభావం:

చరిత్ర స్వభావరీత్యానూ, విషయపరిధిపరంగాను ఇటీవలి కాలంలో సంపూర్ణమైన, విప్లవాత్మకమైన మార్పులకు గురయింది. గతంలో చరిత్ర కేవలం వర్ణన విధానంలో వరసగా పేర్చిన గతకాలం సంఘటనల జాబితాగా ఉండేది. అటువంటిది ఇప్పుడు చరిత్రకారుడు ప్రాచీన గ్రంథాలలోని గాథలను పునశ్చరించడానికే కాక విమర్శనాత్మకంగాను, శాస్త్రీయంగాను చరిత్రను అధ్యయనం చేస్తున్నాడు. గతాన్ని అభిమానించటమో, నిరసించటమే లేదా దాని నుంచి విడవడటమే కాక చరిత్రను ఒక సాంఘీక స్రవంతిగా భావించి, ఈ స్రవంతిలో గతాన్ని వర్తమానం సహాయంతోను, వర్తమానాన్ని గతం తోడ్పాటును పూర్తిగా అవగాహన చేసుకోవటం చరిత్రకారుని కర్తవ్యంగా మారింది. నిదర్శన పూర్వకంగా గతంలో జరిగిందేమిటో తెలుసుకోవడం ద్వారా సత్యానికి చేరువ కావటం, చారిత్రక సత్యాలను వ్యాఖ్యానించటం, మదింపు చేయటం, విలువ కట్టడం, వాటి ప్రాధాన్యతను వివరించటం; తేటతెల్లంగా ఆకర్షణీయమైన రీతిలో భావాలను వ్యక్తీకరించటం అనునవి చరిత్రకారుని కర్తవ్యాలుగా మారాయి. చారిత్రక యదార్థాలను సేకరించటంలో ఒక శాస్త్రవేత్తగా, వాటిని వ్యాఖ్యానించటంలో ఒక సాహితీవేత్తగా చరిత్రకారుని అవి రూపొందిస్తున్నాయి.

చరిత్ర స్వభావం చాలా సంకీర్ణమయినది. అది చిన్న దృక్పథాలకు, వివరణలకు ఆలవాలం. చరిత్ర గతకాలం సంఘటనల విశ్లేషణ, వివరణ, వర్ణనలతో కూడినది కనుక చరిత్రకారుడు చారిత్రక యదార్థాల స్వభావాన్ని గుర్తుంచుకోవలసిన

అవసరం ఉంది. అను సాంఘీక శాస్త్రంల సహాయంతో లభించే ప్రాథమిక యదార్థాల విషయం చరిత్రకారులందరికీ సమానమే గాని, గతానికి సంబంధించి యదార్థాలు చారిత్రక యదార్థాలు కావటం చరిత్రకారుని వ్యాఖ్యానం మీద ఆధారపడి ఉంటుందని మనం గమనించాలి. అయితే గతానికి సంబంధించిన యదార్థాలు చారిత్రక యదార్థాలు కావటం వలన చరిత్రకారుని వ్యాఖ్యానం మీద ఆధారపడి ఉంటుంది. అయితే గతానికి సంబంధించిన గ్రంథ రూపమైన చారిత్రక యదార్థాలు అన్నీ వాటిని గ్రంథ రూపంలో మార్చిన వ్యక్తులు చరిత్రకారులు. ఇదే అభిప్రాయాన్ని కార్ నిష్కర్షగా తేల్చి చెప్పాడు. సానుభూతి గాని, ద్వేషం గాని వ్యవహరించినట్లయితే చరిత్రకారునిలో తొంగిచూసే హేతువులు, ఉద్దేశాలు, కరుణ, వివేకం మొదలైనవి గత కాలపు సంఘటనలను అతడు పరిశీలించేటప్పుడు వాటి మీద ఎంతో కొంత ప్రభావం చూపిస్తాయి, విషయాత్మకంగా చరిత్రకారుడు ఎంతగా ప్రయత్నించినా అతడు నిష్పక్షపాతి కాలేడు. ఎంతకాదనుకున్నా అతడు గతాన్ని గురించి అధ్యయనం చేసేటప్పుడు సమకాలీన పరిస్థితుల ప్రభావంలో తన కాలపు విలువలను, ఆశలను, నిరాశలను ప్రతిబింబిస్తాడు.

కాలంతోపాటు సంభవిస్తున్న కొత్త పరిణామాలు, మారుతున్న భావాల విలువల దృష్ట్యా గతకాలం సంఘటనలను తిరిగి మందిపు చేయవలసిన అవసరం ఉంది. అందుకే చరిత్రను ఎప్పటికప్పుడు తిరిగి వ్రాయాలనేది అంతేకాదు, జ్ఞాన సముపార్జనలో మిగతా శాఖల్లో జరుగుతున్న పురోభివృద్ధి చరిత్రకారునికి గతానికి సంబంధించిన యదార్థాలను కనుక్కోవటంలో కొత్త మార్గాలను, చరిత్ర ఆధారాలను వినియోగించుకోవటంలో కొత్త పద్ధతులను సూచించి, సహాయపడుతున్నది. ఉదాహరణకు పురావస్తు శాస్త్రం, సమాజ శాస్త్రం, మనో విజ్ఞాన శాస్త్రం మొదలైనవి గతం గురించి కొత్త యదార్థాలను వెలుగులోకి తెచ్చాయి.

**2.6.1 ధృవీకృత యదార్థాల కూడలియే చరిత్ర:** చారిత్రక యదార్థాలనేవి చారిత్రక ఆధారాల వల్ల లభిస్తున్న బహుళ సమాచారం నుంచి నిర్ణయించవలసింది. చరిత్రకారుడు వాటి సహాయంతో నాగరికతా ప్రవంతిని హేతుబద్ధంగా విశదీకరించవలసింది చరిత్రకారుడే. అవసరం అయినప్పుడు జీవ, భౌతిక శాస్త్రాల పరిశోధనలు మొదలైనవి అతనికి తోడ్పడతాయి. కనుక ధృవీకృత యదార్థాలను దండగా కూరిస్తే చరిత్ర అవుతుందనుకోవటం సబబు కాదు. యదార్థాలను విశదీకరించటం చరిత్రకారుని మౌలిక కృషి.

**2.6.2 చరిత్ర పునరావృతమౌతుందా?** ఎటువంటి దృక్పథమూ లేకుండా చరిత్రకారుడు చారిత్రక యదార్థాలను విశదీకరించలేడనేది, నిర్వివాదాంశమే. అయితే ఏ దృక్పథాన్ని అనుసరించటం యుక్తమో నిర్ణయించవలసిన విషయం. చరిత్ర స్వభావం సంశ్లిష్టం అని, అనేక దృక్పథాలకు, వివరణలకు ఆలవాలం అని ముందే తెలుసుకున్నాం. కొందరు పండితులు చరిత్ర పునరావృతమౌతుంది అన్నారు. మరి కొందరు లేదని నిర్ద్వంద్వందంగా ఖండించారు. ఈ రెండు అభిప్రాయాలు కొంతవరకు నిజమే. ప్రపంచ విషయాలు అన్ని వేళలా ఒకేలా ఉంటాయి కాని ప్రతిసారీ మార్గాలే వేరవుతాయి అన్న భావంలో చరిత్ర పునరావృతమౌతుంది. చారిత్రక ఘట్టాల నమూనా చరిత్ర పునారావృతమౌతుందన్న భావాన్ని కలిగిస్తుంది. ప్రతి సంవత్సరం ఋతువులు పునరావృతమయినట్లు చరిత్రలో సంభవించే మార్పులను రూపాల, ప్రక్రియలను తిరుగులేని పునరావృతంగా ప్రాచీనులు వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో కూడా నిరంకుశపాలన, ప్రజాస్వామ్యం ఒక దాని తర్వాత ఒకటి పునరావృతమవుతాయని వారి నమ్మిక. గ్రీకు, రోమన్, హిందూ సాంప్రదాయాలు చారిత్రక ఆ వృత్తులను తెలియజేశాయి. ఎందుకంటే మానవ అభ్యుదయ మార్గం ఒక సరళరేఖ కాదని, ఒక వృత్తం అని, అదృష్ట దురదృష్టాలు ఒకదాని వెంట మరొకటి అనుసరించే ఉంటాయని వారు భావించారు.

ప్రాచీన కాలపు థూసిడైడిస్ నుండి ఆధునిక యుగపు స్పెన్లర్, టాయన్‌బీ వరకు చరిత్రకు తిరిగి పునరావృతమయ్యే స్వభావం ఉందనే నమ్మకాన్ని వెలిబుచ్చారు. కాకపోతే మధ్య యుగంలో క్రైస్తవ మత ప్రభావం వల్ల ఈ సిద్ధాంతం కొంతవరకు మరుగునపడింది. సెయింట్ అగస్టీన్ ఏసుక్రీస్తుగా మానవ రూపంలో భగవంతుడుగా అవతరించటం తుది ఘట్టం అన్న గాఢ నమ్మకంతో ఈ సిద్ధాంతాన్ని నిరాకరించాడు. టాయన్‌బీ భావనలలో జీవిత చక్రంలో పుట్టడం, పెరగడం, చనిపోవటం సహజమైనట్లే మానవ సంస్కృతీ నాగరికతల్లో కూడా పునరావృతం సహజమని ఇతని

భావన. కాని కారల్‌మార్క్స్ చెప్పినట్లు సంఘటనల మధ్య ఎన్నో పోలికలున్నా ఏ రెండు ఒక్కటి కావు. ఆయా స్థితిగతుల తులనాత్మక అధ్యయనం వల్ల పరిణామాలకు కీలకమేమిటో కొంత మేరకు అర్థం చేసుకోవచ్చు. కాలింగ్ వుడ్ అభిప్రాయంలో చరిత్రలో మనకు కన్పించేది చక్రీయ గమనం కాదు. సర్పిల గమనం (Spiral Enrolement), కార్ దృష్టిలో చరిత్ర పునారావృతమయ్యే ప్రసక్తే లేదు. గత సంఘటన పూర్వాపరాలు మనకు తెలిసినప్పుడు మన ప్రవర్తన ఆ పరిజ్ఞానం వల్ల ప్రభావితమౌతుంది కదా! పైగా భవిష్యత్తు గతంలాగే ఉంటుందనుకుంటే మానవాళి సృజనాత్మక క్రియాశక్తులకు పాత్రేముందీ, కాని మానవ జీవితం పురోగమిస్తూనే ఉంది కదా!

**2.6.3 చరిత్ర మొత్తం సమకాలీనమే:** చరిత్ర పునరావృతమౌతుందనే భావనలలో భాగంగా చరిత్ర మొత్తం సమకాలీనమే అనే దృక్పథాన్ని గత శతాబ్ద ఆరంభంలో ఇటాలియన్ పండితుడు క్రోచే వెలిబుచ్చాడు. చారిత్రక యదార్థాలే సర్వసం, యదార్థాలే చరిత్ర అనే 19వ శతాబ్దపు భావనకు ఇది పూర్తి విరుద్ధం. కాలింగ్ వుడ్ కూడా నొక్కి చెప్పినట్లు గతానికి సంబంధించిన యదార్థాలను, తమ సమకాలీన సామాజిక సమస్యల, విలువల కోణం నుండే చరిత్రకారుడు వీక్షిస్తాడు. కనుక సర్వత్రా క్రోచే అభిప్రాయాన్ని గౌరవిస్తున్నారు. చరిత్రను గ్రంథస్థం చేస్తున్న వ్యక్తి మనస్సులో చారిత్రక యదార్థాలు పరావర్తనం చెందుతూనే ఉంటాయి. కనుక ఆ చరిత్రను వ్రాసిన చరిత్రకారుని గురించి ముందుగా తెలుసుకోవాలి అంటే సమాజం సృష్టించిన చరిత్రకారుడు తనకు తెలిసో, తెలియకో తన సమాజానికి ప్రతినిధి కనుక తన కాలపు ప్రతినిధిగానే గత కాలపు చారిత్రక యదార్థాలను పరిశీలిస్తాడు. అతని దృక్పథానికి అతని సామాజిక, చారిత్రక నేపథ్యంతో దగ్గర సంబంధం ఉంటుంది.

**2.6.4 వర్తమానానికి, గతానికి మధ్య జరిగే నిరంతరమైన సంభాషణే చరిత్ర:** చరిత్రకారుడు వర్తమాన కాలానికి సంబంధించినవాడు కనుక, వర్తమాన నిర్బంధాల నుండి అతనికి స్వేచ్ఛ లేదు కనుక, వర్తమాన కాలపు అవసరాలు, ఆరాటలే గతం గురించిన అధ్యయనంలో ప్రతి ఫలిస్తాయి. ఈ విధంగా గతం, వర్తమానం రెండూ సజాతీయ సమూహంగా దగ్గర అవుతున్నాయి. చరిత్రకారుడు గతాన్ని వర్తమాన కాలపు దృష్టితోను, వర్తమాన కాల సమస్యల వెలుగులోను తప్పనిసరిగా వీక్షిస్తాడని ఇ.హెచ్. కార్ పేర్కొన్నాడు. అలాగే వర్తమానానికి గతం పునాది. గత నాగరికత నుండే వర్తమాన నాగరికత ఆవిర్భవించింది. కాగా 'చరిత్ర' గతానికి వర్తమానానికి మధ్య జరిగే నిరంతర సంభాషణ. చరిత్ర ఒక సామాజిక ప్రక్రియ. ఈ ప్రక్రియలో గతాన్ని వర్తమానం సహాయంతోను, వర్తమానాన్ని గతం తోడ్పాటుతోను అర్థంచేసుకోవడం జరుగుతుంది. ఇ.హెచ్. కార్ మాటల్లో గతకాలం సమాజాన్ని అర్థం చేసుకోవడానికి, సమకాలీన సమాజం పై తన ఆధిపత్యాన్ని పెంచుకోవడానికి చేయూనివ్వటం చరిత్ర నిర్వహించవలసిన ద్వంద్వ విధి.

**భవిష్యత్తును ఊహించే ఉద్దేశ్యంతో గతం గురించి చేసే వ్యాఖ్యానమే చరిత్ర -** భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోవటం ద్వారా మాత్రమే గతం గురించి క్రమబద్ధంగా పరిశీలించి వ్యాఖ్యానించగలం. మనం ముందుకు సాగే కొలది గతం గుర్తించిన మన వ్యాఖ్యానం, మన లక్ష్య శుద్ధి మారుతూ ఉంటాయి. మార్క్స్ తన వర్గ రహిత సమాజం అన్న నిరాపేక్ష, సర్వ సమగ్రమైన భవిష్యత్తును జ్ఞాపకం ఉంచుకుంటారు అన్నాడు. అందువల్లనే భవిష్యత్తు మాత్రమే గతాన్ని వ్యాఖ్యానించటంలో కీలకమైనది. ఈ దృష్టిలో మనం చరిత్రలో విషయాత్మకతనో, వస్తుపరతనో గురించి మాట్లాడగలం. గతం భవిష్యత్తును, భవిష్యత్తు గతాన్ని స్పష్టం చేస్తాయన్న చరిత్రకు సంబంధించిన వివరణ న్యాయమైనది కూడా.

కార్యాకరణ సంబంధంలో జరగబోయేది ఏమిటో ఊహించటానికి, చరిత్ర గర్భంలో ఏమి దాగి ఉందో సూచించడానికి అవకాశం ఉంది. జర్మనీలో హిట్లర్ ప్రాబల్యానికి రావటంతో, హిట్లర్‌ని అణచకుంటే జరగబోయే పరిణామం ఏంటో చర్చిల్ బ్రిటీషు ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూనే ఉన్నాడు. చివరకు అదే జరిగింది. ఇలాంటి విషయాలు ముందుగానే అనేకం చరిత్రలో ఊహించటం జరిగింది. చరిత్రకారుడు అనుభవాన్ని హేతుబద్ధంగా విశ్లేషించి,

సాధారణీకరణ ద్వారా భవిష్యత్తుకు సంబంధించిన సామాన్య విషయాలను గురించి చెబుతాడు. అలాగని చరిత్రలో యాదృచ్ఛికతకు చోటు లేదని కాదు. అయితే హేతుబద్ధమైన వివరణకు, వ్యాఖ్యానానికి లొంగని యాదృచ్ఛికత వల్ల గతానికి, వర్తమానానికి కాని ప్రయోజనం లేదు. యాదృచ్ఛిక సంఘటనల నుంచి సామాన్య సూత్రాలను రూపొందించటం, వాటి నుంచి పాఠాలు నేర్చుకోవటం సాధ్యం కాదు. స్వల్ప విషయాలకు ప్రాధాన్యత హెచ్చి, ప్రధానమైన అంశాలు మరుగున పడిపోతాయి. లెనిన్ అకాలంగా మరణించకుండా ఉంటే రష్యా చరిత్ర మరో తీరులో ఉండేదేమో అనే ప్రశ్నకు యాదృచ్ఛిక వాదంలో సంతృప్తికరమైన సమాధానాలు లభించవు.

**2.6.5 చరిత్ర సరియైన తీర్పునిస్తుందా?** చరిత్ర సరియైన తీర్పునిస్తుందా? అనేది వివాదాంశం. చరిత్రను విజ్ఞాన శాస్త్రం స్థాయికి చేర్చాలన్న 19వ శతాబ్దపు చరిత్రకారుల ప్రయత్నం ఈ విలువకు సంబంధించిన నిర్ణయాలకు ఆటంకం అయింది. రాంకీ, బ్యూరీలు కేవలం యదార్థాల విశ్వసనీయమైన ప్రతినిధి స్థాయికి చరిత్రను దింపారు. అయితే వీరి అభిప్రాయాన్ని ఏకీభవించటం కష్టం. అక్టన్ ఈ నిర్ణయాలు యుక్తమే కాకుండా చరిత్ర రచనలో అవి అత్యావశ్యకమైన భాగం అని కూడా అన్నాడు. చరిత్ర రచనకు చరిత్రకు అతీతమైన శక్తిగా భావించి చారిత్రక వ్యక్తుల వ్యక్తిగత ప్రవర్తనను గురించి నిర్ణయించే అధికారాన్ని అవసరాన్ని అతడు నొక్కి వ్యాఖ్యానించాడు. 1935లో నాటి ముసోలినీ అబిసినియా దండయాత్రను టాయన్బీ 'బుద్ధిపూరకమైన వ్యక్తిగతమైన పాపంగా' వర్ణించాడు. ఈ అభిప్రాయాన్ని నౌల్స్, క్రోచేలు ఖండించారు. చరిత్రకారుడు మరణ శిక్ష చెప్పే న్యాయాధిపతినన్న అభిప్రాయాన్ని వదిలిపెట్టి వ్యక్తుల నీతిని గురించి లేక సంఘటనల, వ్యవస్థల విధానాలలోని నీతిని గురించి నిర్ణయించటం సబబు. చారిత్రక యదార్థాల విషయంలో వ్యాఖ్యానం తప్పదు. చారిత్రక వ్యాఖ్యానం విలువకు సంబంధించిన తీర్పులతో ముడిపడి ఉంటుంది. కార్యాకరణ సంబంధం కోసం జరిగే అన్వేషణ వెనుక ప్రత్యక్షంగానో, పరోక్షంగానో విలువ కోసం అన్వేషణ తప్పక ఉంటుంది.

**2.6.6 చరిత్రలో ప్రగతి భావన:** లార్డు అక్టన్ దృష్టిలో చరిత్ర సంఘటనల క్రమంలో స్వాతంత్ర్యం వైపు సాగే ప్రస్థానం అయితే, చరిత్రలో ప్రగతి యుగాలు ఉన్నట్లే. ప్రగతి నిరోధక యుగాలు కూడా ఉంటాయి. అలాగే ఒకసారి వెనక్కు మళ్ళిన చరిత్ర మళ్ళీ తిరిగి వచ్చి తన దారిలో ముందుకు సాగుతుందని చెప్పలేం. డార్విన్ పరిణామ సిద్ధాంతానికి ఆధారమైన జీవశాస్త్ర వారసత్వం, చారిత్రక ప్రగతికి ఆధారమైన సామాజిక సంపాదన ఒక్కటేనన్న భ్రమ క్రొత్త ప్రమాదాలకు, దురభిప్రాయాలకు దారితీసింది. హెగల్ (Hegel), మార్క్సులు చెప్పిన మూడు నాలుగు నాగరికతల సిద్ధాంతం, నాగరికతలు పునరావృతమౌతాయన్న నమ్మకం. ఇవన్నీ అర్థ రహితంగా కన్పిస్తాయి. నాగరికతను ముందుకు తీసుకు వెళ్ళే శక్తి ఒక్కొక్కసారి లోపిస్తుందని, మళ్ళీ ఎక్కడో మరొక చోట పునరాంభం అవుతుందని, అంతేకాని ఏ దేశంలోను, ఏ కాలంలోను అది అవిచ్ఛిన్నంగా సాగదని మాత్రమే దృక్పథాలు సూచిస్తాయి.

ఈ వివరనలు అన్నీ చరిత్ర స్వభావం ఎంత సంక్లిష్టమైనదో తెలియ జేస్తున్నాయి. అయితే ఎవరు ఎప్పుడు ఏ దృక్కోణంతో చరిత్రను అవలోకించినప్పటికి అందరూ అంగీకరించే అంశం చరిత్రకు గమనశీలత ఉందనేది ఒక అర్థం, ఒక పరమార్థం కలిగి, నిత్యం మార్పుకు లోనయ్యే జీవిత నాటకం చిత్రణ కన్న చరిత్రకు ప్రగతిశీలత తప్పని సరే. చరిత్రకారుడు ప్రతి సమస్యను ఏమిటి? ఎలా? ఎందుకు? అన్న ప్రశ్నలతోనే ఎదుర్కొంటాడు. ఎదురయ్యే ప్రతి అంశాన్ని దేశం, కాలం, స్వభావం, విస్తృతి పరిధుల్లో పరిశీలించి చరిత్రను, సమగ్రంగాను, అర్థవంతంగాను రూపొందిస్తాడు. స్థూల, సూక్ష్మ అధ్యయనాలలో చరిత్రను సుసంపన్నంగా తీర్చి దిద్దుతాడు.

## 2.7 చరిత్ర విషయపరిధి:

చరిత్ర విషయపరిధిలో మరియే ఇతర విద్యా విభాగం కన్నా కూడా విస్తృతమైనది, చరిత్రకు మూలమైన గ్రీకు పదం ఇస్తోరియాకు అర్థం అన్వేషణ అని చెప్పుకున్నాం. ఈ అన్వేషణ అనేది భవిష్యత్తు గురించి సాధ్యం కాదు గదా! అన్వేషణ కేవలం గత కాలంతో ముడిపడి ఉంది. వర్తమానం అత్యంత స్వల్ప వ్యవధితో కూడినది. ఇది మరుక్షణంలో గతమౌతుంది. అందుచేత చరిత్రకారుని అన్వేషణ అంతా గతం గురించే ఈ అన్వేషణ అనేది మానవ జగత్తు గతం గురించి, చరిత్రపరమైన ఆసక్తి మానవుడు విచక్షణా జ్ఞానంతో సంఘజీవిగా మారినప్పటి నుండి ప్రారంభమయింది. అయితే మొదట్లో వీరగాధా గేయాలతో, జానపద కథారీతిలో పుక్కిటి పురాణంగా కల్పనతో చరిత్ర ఉండేది. క్రమేణఆ విషయపరిధిలో మార్పు వచ్చింది. రాజ్యాలు, రాజ వంశాల వృద్ధి క్షయాలకు పరిమితమైన చరిత్ర కాలక్రమంలో సమాజం, సామాజిక వ్యవస్థల పరిణామం, పరిపాలన, యుద్ధాలు, ఒడంబడికలు, అంతర్జాతీయ సంస్థలు, విదేశీ వ్యవహారాలు, మత, సాంస్కృతిక, ఆర్థిక అంశాలు, పరిణామాలు వివరించేదిగా రూపొందింది. ఒక్క మాటలో చెప్పాలంటే మానవాళి, సంస్కృతి నాగరికతలను ప్రతిబింబించే చరిత్ర విషయ పరిధి మరింత విస్తృమయింది. వంశ చరిత్ర స్థాయి నుండి మానవ నాగరికతా పరినామం విశదీకరించే సాంఘీక శాస్త్రం స్థాయికి చరిత్ర ఎదిగింది.

## 2.8 ముగింపు:

వివిధ కాలాల్లో వివిధ చరిత్రకారులు చరిత్రను కార్యాకారణ సంబంధం రీత్యానో, ఆర్థిక విషయాల దృష్ట్యానో, మహాపురుషుల పరంగానో, విజ్ఞాన శాస్త్ర పరంగానో వీక్షించి, వ్యాక్యానించారు. ముఖ్యంగా 19వ శతాబ్దంలో చరిత్ర గతిని వివరించడంలో శాస్త్రీయ ధోరణులు చోటు చేసుకోవడంతో విజ్ఞాన శాస్త్ర స్థాయికీ ఎదిగిన చరిత్ర అధ్యయనం. ఏం జరిగింది? ఎలా జరిగింది? ఎందుకు జరిగింది? అని వివరించడం దాని లక్షణంగా, లక్ష్యంగా మారింది. రాజకీయాల ప్రాధాన్యం తగ్గి, ఆర్థిక, సామాజిక అంశాల ప్రభావం వైపు దృష్టి మళ్ళింది. ఉత్పత్తి సంబంధాలు, ఆర్థిక స్థితిగతులు చరిత్ర గమనాన్ని నిర్ధేశిస్తాయని పేర్కొని కార్ల్‌మార్క్స్ విప్లవాత్మక చరిత్ర ఈనాడు చరిత్రకారులకి ఆదర్శం. ఒకప్పుడు సాహిత్యంలోనో తత్త్వశాస్త్రంలోనో భాగంగా పరిగణింపబడ్డ చరిత్రకు నేడు స్వతంత్ర ప్రతిపత్తి కలిగింది. అమెరికాలో ఐన్‌స్టీన్ వంటి వారు సాపేక్షక వాదం కిందకు చరిత్రను చూపించుటలో చరిత్ర విషయపరిధి మరింత పెరిగింది. ప్రజా సమూహాలను, ఏ ఆశలు, ఆశయాలు ప్రేరేపించి మార్గదర్శకమై చైతన్యవంతుల్ని చేసాయో ఆ విషయాలు చరిత్ర అధ్యయనంలో ప్రధానమైనాయి. దీనితో విశ్వజనీన సర్వ మానవ చరిత్రలో సామాన్య ప్రజల పాత్రను విశ్లేషించి, వ్యాఖ్యానించడం నేడు చరిత్రకారుని ఆదర్శము మరియు ధ్యేయయింది.

## 2.9 మాదిరి ప్రశ్నలు:

1. చరిత్ర స్వభావాన్ని మరియు విషయపరిధిని వివరించండి.
2. చరిత్ర లక్షణాలను మరియు విషయపరిధిని విపులంగా చర్చించండి.
3. చరిత్ర లక్షణాలను మరియు స్వభావాన్ని వివరించుము.

## 2.10 ఉపయుక్త గ్రంథాలు:


1. Carr E.H. : What is History (Macmillan 1961)
2. Clark, Kitson. : The Critical Historian (Heinman London, 1970)
3. Colling Wood, R.G. : The Idea of History (G.U.P. 1966)
4. Daniels, R.V. : Studying History, How and Why? (Prentice Hall, New Jersey, 1960.)
5. Durga Prasad, J. : Charitra Rachana Sastram (Tel) (Telugu Academy, Hyderabad, 1987.)
6. Elton, G.R. : The Practice of History (Fontana 1969).
7. Shaik Ali, B. : History Its Theory and Method (Macmillan, 1978.)
8. Sastri, K.A.N. & Ramanna, H.S. : Historical Method in Relation to Indian History. (S. Viswanathan, Madras, 1956.)
9. Webster John, C.B. : An Introductionb to History (Macmillian, 1977.)


**Prof. G. Raja Mohan Rao**

పాఠం - 3

# చరిత్ర అధ్యయనం - ప్రయోజనాలు

**లక్ష్యము:**

చరిత్ర అధ్యయనంకు సంబంధించిన భిన్న అభిప్రాయాలతోపాటు చరిత్ర అధ్యయనం వలన కలిగే ప్రయోజనమును విద్యార్థి తెలుసుకోవడం ఈ పాఠం యొక్క ముఖ్య లక్ష్యం.

**పాఠ్య నిర్మాణ క్రమం:**

**3.1** పరిచయం

**3.2** చరిత్ర రచనా దృక్పథంలో మార్పులు

**3.3** ఉద్యోగ అవకాశాలు

**3.4** జ్ఞాపకం

**3.5** భావ విలువలు

**3.6** అవలోకనం

**3.7** తాదాత్మ్యకత

**3.8** వారసత్వ విలువలు

**3.9** చరిత్ర - నైతిక విలువలు

**3.10** చరిత్ర నేర్పే పాఠాలు

**3.11** చరిత్ర - భవిష్య వాణి

**3.12** జాతీయ - అంతర్జాతీయ అవగాహన

**3.13** సమస్థాధ్యయనాలకు నిలయం

**3.14** మానసిక ఉల్లాసం

**3.15** ముగింపు

**3.16** మాదిరి ప్రశ్నలు

**3.17** ఉపయుక్త గ్రంథాలు

## 3.1 పరిచయం:

మానవజాతి చరిత్రను ఏ విధంగా చూచినా అసమగ్రంగానే కనిపిస్తుంది. అందులో పెక్కు అంశాలు ఉపేక్షితా వ్యవస్థ (oblinion)లోనే ఉన్నాయి. చరిత్ర రచన మొత్తం వాస్తవానికి విశ్వసనీయమైనది కాదు. వివిధ కాలాలలో, వివిధ చరిత్రకారులు రచించిన చరిత్ర కొంత ఊహాగానాలతో, పక్షపాత దృక్పథాలతో నిండి ఉంది. దీనితోపాటు చరిత్ర అధ్యయనంలో నిజమైన ఆసక్తి ఉన్న వారి సంఖ్య కూడా చాలా తక్కువే. పూర్తిగా ప్రయోజనమూ లేదు. వర్తమానాన్ని విస్మరించి, గతానికి సంబంధించిన సాక్ష్య పత్రాల సేకరణలోనే తన కాలాన్నంతా వెచ్చించే చరిత్రకారుడు, వర్తమానం పట్ల తన పనిని నిర్లక్ష్యం చేస్తున్నాడు. ఆ ఆలోచనకు బయట ఉండే ప్రపంచం ఏమీ లేదు. కనుక చరిత్రకారుడు తన పరిశోధన ద్వారా కనిపెట్టే దృశ్య ప్రపంచం ఏదీ లేదు. కనుక శాశ్వత సత్యాలకు బదులు ఐహిక విషయాల పై మన దృష్టిని కేంద్రీకరింప చేసే చరిత్ర అధ్యయనం నిరూపయోగం.

ఇవన్నీ నిరాశావాదుల్లో పాతుకుపోయిన భావాలు. ఈ నిరాశావాదానికి అగ్నికి ఆజ్యం పోసినట్లు కొంతమంది తత్త్వవేత్తలు, పండితులు, పాలకులు, రాజకీయవాదులు మొదలగువారు తమ నిష్ఠుర నిర్వచనాల ద్వారా చరిత్రను విరూప చిత్రంగా రూపొందించి, మరిన్ని సమిధలు వేశారు. జర్మన్ తత్త్వవేత్త హెగెల్ చరిత్రను అనుభవమూ, చరిత్ర మనకు నేర్పేదేమంటే ప్రజలు, ప్రభుత్వాలూ చరిత్ర నుంచి ఎప్పుడూ ఏమీ నేర్చుకోలేదు అని పేర్కొన్నాడు.

ఫ్రెంచి తత్త్వవేత్త రూసో "అనేక అసత్యాల నుంచి సత్యానికి అతి సమీప సారుప్యం ఉన్న దాన్ని ఎన్నుకొనే కళ చరిత్ర" అని నిర్వచించడం జరిగింది. అంటే అతని భావనలో చరిత్రను ఒక అబద్ధాల పుట్టగానే పరిగణించడం జరిగింది. ప్రముఖ ఆంగ్ల చరిత్రకారుడు ఎడ్వర్డ్ గిబ్బన్ "చరిత్ర నిజానికి మానవుల నేరాల, తెలివి తక్కువ పనులు, దురదృష్టాల జాబితా కంటే ఎక్కువ కాదు" అని పేర్కొన్నాడు. ఆంగ్ల తత్త్వవేత్త హెర్బర్ట్ స్పెన్సర్ చరిత్రను వినోద కాలక్షేపంగా పరిగణించవచ్చు, కాని జ్ఞాన బోధనం అని స్తుతించకూడదని పేర్కొన్నాడు.

ప్రష్యా పాలకుడు రెండవ ఫెడరిక్ చరిత్ర చదవాలన్పించినప్పుడల్లా ఒక 'అసత్యవాది'ని తీసుకురమ్మని అనుచరులను ఆజ్ఞాపించేవాడట. ఫ్రెంచి తత్త్వవేత్త వాల్టేర్ చరిత్రను "అంగీకరించబడిన కట్టుకథ" అన్నాడు.

ఇక 19వ శతాబ్దం ద్వితీయార్థంలో ఫ్రాన్స్‌లోని అధ్యాపకులు చరిత్ర అధ్యయనం నిరూపయోగమూ మరియు అపాయకరమూ అని భావించారు. ప్రముఖ అమెరికా వ్యాపారవేత్త హెన్రీఫోర్ట్ చరిత్రను ఒక "వట్టిమాయగా" అభివర్ణించడం జరిగింది. యులీసెస్ గ్రంథకర్త జేమ్స్‌జాయిన్ చరిత్రను ఒక "పీడకలగా" వ్యవహరించడం జరిగింది.

సరియైన విజ్ఞానంగా, ప్రత్యేక పాఠ్యాంశంగా చరిత్ర రచన పరిణతి చెందకు ముందు పలువురు చరిత్రను నిరూపంగా పేర్కొనుటలో తప్పు లేదనపిస్తుంది. చరిత్ర వల్ల లాభనష్టాల మాట ఎలా ఉన్నా, ఇటువంటి విస్తృతమైన విపరీతమైన వ్యాఖ్యానాలు చూస్తేనే చరిత్రకు ఎటువంటి ప్రాముఖ్యత ఉందో స్పష్టమవుతుంది. అయితే ఇంకా ఆసక్తికరమైన విషయం ఏమిటంటే నిరాశవాదం, చారిత్రక చింతన నిమ్నోన్నతాలను చిత్రించ పూనుకోవడంతో హెగెల్‌కి ఎటువంటి ఆటంకం కల్గించలేదు. అలాగే నెపోలియన్ మరింత చరిత్రను సృష్టించడంలో చరిత్ర అంటే అతను వెలిబుచ్చిన అభిప్రాయం ఆటంకం కాలేదు. ఇదే విధంగా కార్లైల్ గాని, గిబ్బన్ కాని గతం గురించి వ్రాయకుండా ఉండిపోలేదు. అన్నిటికంటే చిత్రం హెన్రీఫోర్డు "వట్టిమాయావాదం" మోటారు వాహనాల చరిత్రకు అన్వయించబడలేదు. ఎందుకంటే ఆధునిక రవాణా సాధనాల పరిణామం ప్రతిబింబించే అనేక మోటారు వాహనాల అద్భుత సేకరణతో నింపిన హెన్రీఫోర్డ్ మ్యూజియం దీనికి ప్రత్యక్ష తార్కాణం.

## 3.2 చరిత్ర రచనా దృక్పథంలో మార్పులు:

19వ శతాబ్దం నుండి చరిత్ర రచనకు సంబంధించిన విషయ స్వభావంలో, పరిధిలో, వాస్తవాల సేకరణలో, వ్యాఖ్యానంలో, సంశ్లేషణలో మరియు ప్రతి ఒక్క అంశంలో అనూహ్యమైన మార్పులు కనిపించాయి. చరిత్ర అధ్యయనంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చి, అది ఒక విజ్ఞాన శాస్త్రంగా రూపుదిద్దుకొంది. సాంఘీక శాస్త్రాలకే తలమానికమైనది. అయినప్పటికిని మిడిమిడి జ్ఞానంతో ఈనాడూ చరిత్ర అధ్యయన ప్రయోజనాన్ని, అసహసించే పండిత వర్గం, సామాన్య ప్రజానికం, యువతరం ఉన్నారు. ముఖ్యంగా నిరాశావాదం పాతుకుపోయిన విద్యార్థి లోకం తరచూ అడిగే ప్రశ్న చరిత్రపఠనం వల్ల ప్రయోజనం ఏమిటి? అని, ఈ ప్రశ్న వేస్తున్నప్పుడు బహుశా వారి మనస్సులో రెండు విషయాలు మెదులుతూ ఉండి ఉంటాయి. అందులో మొదటిది చరిత్రను ప్రత్యేక విద్యా విషయంగా అధ్యయనం చేసే వారికి ఎటువంటి ఉద్యోగవకాశాలు ఉన్నాయి? అని, ఇక రెండవదీ గతించిన వారి పేర్లు, తేదీలు వల్లి వేయటం వలన ప్రయోజనం ఏమిటి అని?

## 3.3 ఉద్యోగ అవకాశాలు:

ముఖ్యంగా గమనించినట్లయితే శాస్త్ర సాంకేతిక విద్య ఒరవడి ఎక్కువటంలో చరిత్రతో కూడిన విద్యపట్ల విద్యార్థులు మొగ్గు చూపుట లేదు. చరిత్ర చదివితే ఏమి వస్తుంది? అనే భావన ఎక్కువైంది. దీనికి కారణం వీరిలో నెలకొన్న నిరాశ, నిస్పృహలను విశ్లేషిస్తే దాని వెనుక నిరుద్యోగ సమస్యే. చరిత్రను ప్రత్యేక అంశంగా అధ్యయనం చేసేవారు అధిక సంఖ్యలో కళాశాల, విశ్వవిద్యాలయ స్థాయిలలో చరిత్ర అధ్యాపకులుగా నియమించవచ్చు. అక్కడ తమ బోధనతోపాటు కొంత చారిత్రక పరిశోధన, రచన, వెలుపల ఉపన్యాసాలివ్వటం వంటి విద్యాపరంగా తీసుకుని నిమగ్నం కావచ్చు. అదే పాఠశాల స్థాయిలో అయితే వీరు చరిత్రతోపాటు, ఇతర శాస్త్రాలను కూడా బోధించవలసి వస్తుంది.

ప్రభుత్వ ప్రాచీన దస్తావేజుల లేక ప్రభుత్వ అభిలేఖ నిలయాలలోను, పురావస్తు ప్రదర్శన శాలలలోనూ, గ్రంథాలయలలోనూ చెప్పుకోదగ్గ స్థాయిలో ప్రాచీన పత్రాల సేకరణ ఉన్న ఇతర సంస్థలలోనూ, ప్రాచీన పత్ర నిలయ పాలకులుగా నియమింపబడే చరిత్రకారుల సంఖ్య క్రమంగా పెరుగుతూంది. ప్రాచీన పత్రాలను గుర్తించటం, వాటిని భద్రంగా కాపాడి పరిశోధకులకు అందుబాటులో ఉంచటం ఈ ఆర్కివిస్టుల కర్తవ్యం. ప్రభుత్వం చరిత్రకారులకు కేవలం ఆర్కివిస్టులుగానే కాక ఇతర హోదాలలోకూడా నియమించవచ్చు. ఉదాహరణకు అమెరికా దేశంలో చారిత్రక ప్రదేశాల కట్టడాల బాధ్యత వహించే సంస్థ 'నేషనల్ పార్క్ సర్వీస్'కి చారిత్రక కట్టడాలను పూర్వ స్థితికి తీసుకురావటంలో పర్యవేక్షణ కోసం శాశ్వత ప్రాతిపదికలోనే చరిత్రకారుల అవసరం ఉంది. చరిత్రకారులు ప్రభుత్వ పరిశోధక పథకాలతో కూడా పని చేయవచ్చు. ఇటువంటి పనికి కొన్ని సందర్భాలలో అంతర్జాతీయ సంస్థలతోపాటు, కొన్ని ప్రవేటు రంగ సంస్థలు కూడా ప్రోత్సాహక పథకాలను అందించటం జరుగుతుంది. చారిత్రక సంఘాలు తరచూ వాటి కార్యక్రమాల అజమాయిషికి, సంచికల, ఇతర ప్రచురణలకు సంపాదకత్వానికి చరిత్రకారులను నియమించవచ్చు. పుస్తక ప్రచురణ కర్తలకు సలహాదారులుగా, ఆకాశవాణి, దూరదర్శిని, చలన చిత్రాలకు, చారిత్రక సమాచారం అందించటంలో సహాయకులుగా కూడా చరిత్రకారులు పని చేయవచ్చు.

ఈ పై అవకాశాలే కాక సివిల్ సర్వీసు మొదలైన ఉద్యోగాలకై జరిగే పోటీ పరీక్షల్లో చరిత్రను ఒక ఐచ్ఛిక అంశంగా ఎన్నుకోవచ్చు. అటువంటి పరీక్షలకుకు పోటీపడే అభ్యర్థులకు చరిత్రను ఎంచుకోమని ఎవరైనా సలహా ఇస్తారు. చరిత్రలో ప్రత్యేక ప్రావీణ్య పరిజ్ఞానం అర్హతగా గల ప్రభుత్వ, ప్రభుత్వేతర విభాగాలలో ఉన్న ఈ అనేక రకాల ఉద్యోగాలను పరిశీలిస్తే ఇతర విద్యా విషయాలకు ఎన్ని అవకాశాలున్నాయో చరిత్రకూ అన్ని అవకాశాలున్నాయనేది స్పష్టమవుతుంది. దీనిని బట్టి మనం చరిత్రను తగురీతిలో అధ్యయనం చేసి దానిపై పట్టు సాధించినట్లయితే దీనికి కూడా అనేక రకాల ఉద్యోగాలు

దొరుకుతాయి అనే విషయంలో సందేహం లేదు.

నిజానికి చరిత్ర పట్ల సంకుచితమైన, అసమంజసమైన అభిప్రాయాలు ప్రజలలో, ముఖ్యంగా యువతరంలో ఏర్పడుతున్నటువంటి పరిస్థితికి ముఖ్యంగా చరిత్ర అధ్యాపకులను, రచయితలను నిందించాలి. పొంతన లేని, విసుగు పుట్టించే రాజ వంశాలు, రాజులు, యుద్ధాలు, ఒడంబడికలు, తేదీలు మొదలైన వివరాలతో చరిత్ర గ్రంథాన్ని ఒక టెలిఫోన్ డైరెక్టరీలా తయారు చేసే చరిత్రకారుడు, వాటినే చరిత్రగా అభ్యసింపజేసే అధ్యాపకుడు చరిత్రకు, చరిత్ర అధ్యయనానికి చేస్తున్న ద్రోహం అంతాఇంతా అని అనలేం.

చరిత్రను మనం అధ్యయనం చేసే విధానాన్ని బట్టి అది ఉపయోగమో, నిష్ప్రయోజనమో అనేది మనకు తెలుస్తుంది. నేటి శాస్త్ర, సాంకేతిక శాస్త్రాల పురోగతికి చరిత్ర అధ్యయనం భిన్నమైందని తలచడం సరికాదు. ప్రతి శాస్త్రంలోను అన్వయించుకునే పద్ధతిని బట్టి మంచి చెడులు ఉంటాయి. ఉదాహరణకు విజ్ఞానశాస్త్రం మానవ వినాశనానికి కూడా ఉపయోగించుకోవచ్చు అన్నది సత్యం. అంతమాత్రాన అది ఆ శాస్త్ర లోపమంటామా. అలాగే మతం పేరిట మారణహోమం జరిగింది, జరుగుతున్నది, అయితే ఏ మతం ఒకరిని ఒకరు నరుక్కోమని పేర్కొనదు. నిజానికి మంచి చెడులనేవి వేరే లేవు. మన ఆలోచనా విధానమే వాటిని అలాగని నిర్ణయిస్తుంది. అలాగే తారీఖులు, రాజవంశాలు, యుద్ధాలు సరిగా అన్వయించుకొన్నట్లయితే అవి చారిత్రక అవగాహనకు ఉపయోగపడతాయి.

నిజానికి భౌతికంగా ఒక మోటారు వాహనంలాగా, ఒక దూరదర్శినిలాగా, ఒక కంప్యూటరులాగా చరిత్ర తక్షణ ఉపయోగం అర్థం కాదు. అయితే చరిత్ర మానవుని జీవితం ఏమిటి? ఎందుకు? ఎలా? అనే విషయాలను స్పష్టంగా చిత్రీకరిస్తుంది. అది మానవుని గత అనుభవాలతో కూడిన రికార్డు లాంటింది. మానవుని ఆశలను, ఆశయాలను, సంఘాన్ని, సాంఘీక సంస్థలను, ప్రభుత్వాలను, వాటి ఆవిర్భాలను, పతనాలను, వాటి వెనుకఉన్న ఉద్దేశాలను తెలియజేసే అర్థవంతమైన జీవిత చిత్రణం చరిత్ర. ఈ అనుభవమంతా చరిత్రకు వస్తువు. చరిత్ర మాత్రం ప్రయోజనంలేదని ఎవరైనా ఎలా అనగలరు? ఈ మానవాళి అనుభవాలను విస్మరిస్తే మానవతే లేదు మరియు మనుగడకు అర్థం లేదు.

## 3.4 జ్ఞాపకం మరియు ఎరుక:

చరిత్ర వలన ప్రయోజనం ఏమిటి? అని ప్రశ్నించే వారికి చాలా సులువుగా మరియు వివేకంగా కూడా సమాధానం చెప్పవచ్చు. అదెలాగంటే ఎవ్వరికి ఏ మాత్రం చారిత్రక పరిజ్ఞానం లేని సమాజంలో నిత్య జీవితంలో ఏ విధంగా ఉంటుందో ఒక్కసారి ఊహించి ప్రయత్నించమని సలహా ఇవ్వటమే. ఊహకు కూడా అందని విషయం ఇది. ఎందుకంటే తన చారిత్రక పరిజ్ఞానం ద్వారా మాత్రమే ఏ సమాజమైనా తన గురించి తాను తెలుసుకోగలుగుతుంది. జ్ఞాపకం, ఆత్మ జ్ఞానం లేని మానవుడు దిక్కులేని వాడి కింద జమే. అలాగే క్రీ.పూ. మొదటి శతాబ్దపు రోమన్ వక్త, రాజకీయవాది, తత్త్వవేత్త అయిన సిసిరో (Cicero) నీవు పుట్టక ముందు ఏం జరిగిందో తెలుసుకోకపోవడం అంటే ఎల్లకాలం ఒక పసివాడిగానే ఉండిపోవడం అని అన్నమాటల్లో ఎంతో సత్యం ఉంది.

లెవి - స్ట్రాస్ పేర్కొన్నట్లు చరిత్రను విస్మరించే వారు తమను తామే నిందించుకుంటారు. ఎందుకంటే వర్తమాన అంశాలను వాటి వాటి సంబంధాలలో వివరించే విలువ నిర్ణయించటం చరిత్ర మాత్రమే సాధ్యమయ్యేలా చేస్తుంది. అభివృద్ధి చెందిన లేదా అభివృద్ధి చెందుతున్న సమాజంలో మానవుడు తన సమాజానికి, ఇతర సమాజానికి మధ్య ఉన్న సంబందం. అలాగే విస్తృతమైన నాగరికతకూ ఇతర నాగరికతలకు ఉన్న సంబంధంలో తన సంస్కృతి స్థానం అర్థం చేసుకోవటం అవసరం. పైగా పుట్టుకతోనే ప్రతి వ్యక్తిలో అద్భుతమైన గతం గురించి తెలుసుకోవాలన్న ఇచ్ఛ ఒకటి సహజంగానే ఉంటుంది. దీనినే ఆంగ్ల చరిత్రాకుడు ట్రివెల్యన్ "నేడు మనమెంత వాస్తవమో, ఆ విధంగానే ఒకప్పుడు మనలాగే యోచిస్తూ, ఉద్రేకాలకు

లోనవుతూ భూమి పై స్త్రీ, పురుషులు సంచరించేవారని, ఒక తరం ఇంకో తరం తర్వాత అదృశ్యమైనట్లు మనం కూడా కొద్ది కాలంలోనే తెల్లవారగానే భూతాలు పారిపోయినట్లు అదృశ్యమౌతామనే సగం అద్భుత వాస్తవానికి సంబంధించిన ఎరుక అని అన్నాడు.

చరిత్రను అధ్యయనం చేయటం అంటే కొత్త ప్రపంచంలోకి అడుగు పెట్టినట్లే. బావిలో కప్పలాగ తానున్నదే లోకం అనుకునే సంకుచితత్వం అనే చీకటిని పారద్రోలి మానవుల అనుభవాలసారంతో విశాల దృక్పథంతో కూడిన వెలుగు వెదజల్లే దివ్య సాధనం చరిత్ర. మనిషిలోని భావనలకు, అనుభూతికి, స్పందనకు, స్ఫూర్తికి, మానసిక చైతన్యానికి, వికాసానికి ప్రతీక చరిత్ర. మనిషిలోని భావనలకు, అనుభూతికి, స్పందనకు, స్ఫూర్తికి, మానసిక చైతన్యానికి, వికాసానికి ప్రతీక చరిత్ర. ఇది బజారులో అన్ని వస్తువులు లభించే సూపర్ మార్కెట్ వంటిది. మన అవసరాలకు అనుగుణంగా స్థోమతను బట్టి వస్తువులు కొనుక్కున్నట్లే చరిత్ర అనే విజ్ఞాన సంపద నుంచి మన మానసిక శక్తి కొద్ది అవసరమైన దానిని రాబట్టుకుంటాం. మానవులు అనుభవాల ఈ గిడ్డంగిలో మనకు లభించినటువంటిదేది ఉండదు. అయితే అర్హతను బట్టి, అవకాశాన్ని బట్టి ఏదైనా లభిస్తుంది.

మానవుడు సమస్యలను ఉద్వేగంతోను, మిడిమిడి జ్ఞానంతోను కాక నిధానంగా యుక్తాయుక్తంగా ఎదుర్కొనే విజ్ఞానాన్ని చరిత్ర ప్రసాదిస్తుంది. అది అతని అవగాహన శక్తిని పెంపొందించి, వివేకవంతుణ్ణి చేసి, మంచి గుణ సంపన్నునిగా చేస్తుంది. మనలో ఆసక్తిని రేకెత్తించడంలో విమర్శనాత్మక దృష్టిని పెంపొందించటంలో జ్ఞాపకశక్తికి పదునుపెట్టడంలో ఊహాశక్తిని అభివృద్ధి చేయటంలో నైతిక విలువలను, ఇనుమడింప చేయడంలో చరిత్ర అధ్యయనం ప్రముఖ పాత్ర వహిస్తుంది. చరిత్ర అంటే గతాన్ని గురించి ప్రధాన అంశాలను అసంపూర్ణ సాక్ష్యంల ఆధారంగా కనుక్కొనే ప్రయత్నం అని బారక్లో పేర్కొన్నాడు. ఈ ఆలోచనా విధానాన్ని సామాజిక అవసరంగా, ఒక పరిశ్రమగా కొని యెర్పెండ్ పేర్కొన్నాడు. మనం చరిత్రను గురించి చెప్పుకొన్నప్పుడు దాదాపుగా ఈ భావంలోనే చెప్తాం. ఈ భావమే చరిత్ర అంటే ప్రాచీన గ్రీకులు తమ భాషలో అన్వేషణగా అర్థం చెప్పుకొన్నప్పుడు దానికి చేరువగా వచ్చేది.

## 3.5 భావ విలువలు:

చరిత్రను సరైన పద్ధతిలో అధ్యయనం చేయటం వలన బుద్ధి కుశలతకు సంబంధించిన విషయాల్లో అమూల్యమైన మానసిక శిక్షణ పొందవచ్చు. చరిత్ర మనకు అనేక మేథా సంబంధంమైన విలువలను ప్రస్తావిస్తుంది. జ్ఞాపకశక్తిని పెంచడం, హేతుబద్ధంగా ఆలోచించ గలగడం, ఊహాశక్తికి శిక్షణ, చదవటం, విశ్లేషించడం, విమర్శించడం, నిర్ధారణకు రావటం ఇవన్నీ చరిత్ర అధ్యయనం వల్ల పెంపొందే విషయాలు. వివిధ గ్రంథాలను, వ్యాసాలను చదవటం, విశ్లేషించటం, చదివేటప్పుడు వివరణలు తీసుకోవటం, విమర్శనాత్మక పరీక్షకు నిలబడేలా విషయాలను వ్యవస్థీకరించడం, ఆ తర్వాత వ్యాసాలను, నివేదికలను వ్రాయడం మొదలైన అంశాల్లో సామర్థ్యం నిజానికి ఏ విద్యా విషయాన్ని సరైన రీతిలో అధ్యయనం చేసినా పొందవచ్చు. అయితే చరిత్ర అధ్యయనానికి ఉన్న ప్రత్యేకత వేరు. చరిత్ర కాల్పనికం లేక అనుభవాత్మకం కనుక ప్రయాణికతకు అంటే సాక్ష్యానికి ప్రాధాన్యత ఇస్తుంది. చారిత్రక ఆధారాలను విమర్శనాత్మకంగా పరిశోధించడం చరిత్రకారుని కర్తవ్య నిర్వహణలో ప్రధాన అంశం. కాబట్టి విస్తారంగా ఉన్న అనేక రకాల ఆధారాలను అవగాహన చేసుకోవటంలో అంటే తులనాత్మకంగా వాటిని పరిశీలించడంలో అవి ఎక్కడ విబేధిస్తున్నాయో కనుక్కోవటంలో, ఉపయోగించే ప్రతి ఆధారం యొక్క యదార్థతను విశ్వసనీయతను పరీక్షించడంలో చరిత్రకారులకు ప్రత్యేక శిక్షణ లభిస్తుంది.

సామాన్య మానవునికి సైతం తమ జీవిత సమస్యలను పరిష్కరిష్కరించుకోవడంలో చరిత్ర అధ్యయనం వల్ల లభించే తెలివి తేటలు అవగాహన శక్తి ఉపకరిస్తాయి. పరీక్షల్లో ఎదురు చూసే ప్రశ్నలకు ముందుగా తయారు చేసి పెట్టుకున్న జవాబులను కంఠస్థం చేయడం వల్లనో, ఒక చరిత్ర పాఠ్య గ్రంథాన్నో లేక గైడును బట్టి పట్టడం ద్వారానో ఈ తెలివి తేటలు,

అవగాహన శక్తి అబ్బేవి కావు. చరిత్రను ఔపోసన పట్టడం ద్వారా, గతానికి వర్తమానానికి మధ్య జరిగే అనంతమైన సంభాషణలో పాల్గొనాలనుకునే వారి మీద అది చూపించే ప్రభావం మీద అవి ఆధారపడి ఉన్నాయి.

## 3.6 అవలోకనం మరియు అధిగమనత్వం:

విషయాలను వాటి వాస్తవిక సంబంధాల్లో లేదా ప్రాధాన్యతా క్రమంలో చూడగలిగే సామర్థ్యాన్ని అవలోకనం అంటారు. వర్తమానానికి ముందు ఏమిటో తెలియ చేయడం ద్వారా చరిత్ర ఈ అవలోకనాన్ని మనకి ప్రసాదిస్తుంది. శరవేగంగా మారుతున్న ప్రపంచంలో మనం నివసిస్తున్నాం. ప్రస్తుతం మారుతున్న సమాజంలో విజ్ఞాన శాస్త్రాభివృద్ధి, సాంకేతిక విద్య ప్రాముఖ్యాన్ని మరింత హెచ్చిస్తున్నది. అలాగని ఆరోగ్యవంతమైన, ఆనందదాయకమైన సమాజానికి సంబంధించిన సాంస్కృతిక తదితర మానవతా విషయాల ప్రాధాన్యతను విస్మరింపలేము. శాస్త్రీయ, సాంకేతిక అభివృద్ధిని సరియైన అవగాహనతో చూడకున్నట్లయితే అవి మానవ వినాశనానికి దోహదం చేస్తాయి. ఈ సరియైన అవలోకనం చరిత్ర అధ్యయనం ద్వారా మనకు కల్గిస్తుంది.

గతాన్ని అధ్యయనం చేయడం ద్వారా పొందే అవలోకనం అధిగమనత్వానికి దారి తీస్తుంది. అధిగమనత్వమంటే సాధారణ అనుభవ పరిమితులను దాటి విషయాలను అంతర్లీనంగా మరింత విస్తృత పరిధిలో చూడగలిగే సామర్థ్యం. దీన్నే మరింత సూక్ష్మీకరించాలంటే విశాల దృక్పథం అనవచ్చు. అంటే మార్పును ఆమోదించడమే కాదు, ఆ మార్పులో ప్రయోగానికి సన్నద్ధం కావటం.

## 3.7 తాదాత్మ్యత:

చరిత్ర అధ్యయనం తాదాత్మ్యత భావాన్ని కూడా పెంపొందిస్తుంది. చరిత్ర దేని కోసం అన్న ప్రశ్నకు కాలింగ్ వుడ్ "ఇది మావుని ఆత్మ జ్ఞానం కోసం" అని జవాబు చెప్పడం జరిగింది. ఆత్మ జ్ఞానం అంటే మానవుడు తన గురించి తాను తెలుసుకోవడం అంటే మనం ఎవరమో? ఇలా ఎలా ఉన్నామో? ఇలాగే ఎందుకు ఉన్నామో? మనకు ఒక అవగాహన చరిత్ర కల్పిస్తున్నది. మనలో సామూహిక అహాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించటంలో అది జ్ఞాపకాలను, భావాలను, ఇస్తున్నది. అనేక అనుక్రమ సంవత్సరాల సత్య గుణాలను, ఉద్దేశాన్ని అర్థం చేసుకోవడం నేర్చినవాడు తన గురించి తాను అంచనా వేసుకోవడంలో తప్పు చేయడానికి అవకాశం లేదని లేకీ పండితుని అభిప్రాయం.

## 3.8 వారసత్వ విలువలు:

అనాధిగా వస్తున్న వారసత్వ విలువలను తెలియజేయాలనేది చరిత్ర అధ్యయనంలోనిగుడీకృతమై ఉంటుంది. అనేక శతాబ్దాలుగా రూపుదిద్దుకొన్న మానవుని జీవితం వారసత్వంగా నెలకొన్న ప్రముఖ ఘట్టాలను వెలికి తీయడం ద్వారా వర్తమానానికి ప్రేరణను, భవిష్యత్తుకు మార్గదర్శకతను చరిత్ర ద్వారా పొందగలుగుతున్నాం. చారిత్రక అధ్యయనం గత విషయాలను వివరించడంతోపాటు వర్తమానంలో ఎలా నడుచుకోవాలో అలాగే భవిష్యత్తు పథకాలను ఏ విధంగా రూపొందించుకోవాలో వివరిస్తుంది.

అయితే సమస్యలను, సవాళ్ళను ధైర్యంతో వివేకంతో ఎలా ఎదుర్కొనాలో గల శక్తి నేటి మానవునికి కలదు. ఐదు వేల సంవత్సరాల కాలం నాటి నాగరికతా వారసత్వం వల్ల మనకు సంక్రమించిన అనుభవం, చింతన, దర్శనాలు, సాహిత్యం, కళలు, విజ్ఞాన శాస్త్రాలు, సాంకేతిక విజయాలు వారికున్నాయి. ఈ అద్భుతమైన నాగరికతా వారసత్వం విద్య ద్వారా, అనుభవం ద్వారా నేటి తరం స్వీకరిస్తుంది. ఈ భావన మనం చరిత్ర ద్వారా పొందుతాం.

## 3.9 చరిత్ర - నైతిక విలువలు:

చరిత్ర బోధనకు ఉన్న విలువలో ప్రధానమైనది నైతిక విలువలను వివరించడం, పద్దెనిమిదవ శతాబ్ద రాజనీతివేత్త అయిన బోలింగ్ బ్రోక్ (Boling Broke) చరిత్రను నిదర్శనాల ద్వారా అభ్యసించే తత్త్వ శాస్త్రంగా పేర్కొన్నాడు. చరిత్ర మంచి చెడులకు సంబంధించిన నైతిక సూత్రాలను శతాబ్దాలుగా నిరంతరం వివరించే స్వరం. ప్రస్తుత శతాబ్దంలో మహాపురుషుల గొప్పతనం గురించి సంశయ వాదం ఆవిర్భవించి, చరిత్ర నైతిక విలువలలో కొంత మార్పు వచ్చింది. అయినా చరిత్ర మానవ ప్రపంచంతో ముడిపడి ఉంది. కనుక మహా పురుషుల గురించి తెలుసుకోక తప్పదు. ముఖ్యంగా వారు మానవాళికి చేసిన సేవా విధానం గురించి తెలుసుకోవాల్సి ఉంది.

## 3.10 చరిత్ర నేర్పే పాఠాలు:

చరిత్ర అధ్యయనం వలన లభించే ప్రయోజనాల్లో చరిత్ర వలన పాఠాలు నేర్చుకోవటం అనేది మరియొక ముఖ్య అంశం. గుణపాఠాలు అనగా గతంలో సంభవించిన విషయాలను ఒక మార్గదర్శకంగా తీసుకొని వర్తమానంలోనూ, భవిష్యత్తులలో జాగ్రత్తపడటం ముఖ్యంగా బ్రిటీష్ చరిత్రకారుడు సర్ లూయిస్ నేమియర్ చరిత్ర పాఠాలు నేర్పుతుందా? అన్న ప్రశ్నకు చరిత్ర విషయాలు ఎలా సంభవించవో తెలుసుకునే అంతీంద్రియ అవగాహనను ఇస్తుంది అని చక్కగా జవాబిస్తాడు. ముఖ్యంగా ఒక చారిత్రక సంఘటన నుంచి నేర్చుకున్న పాఠాన్ని మరొక చారిత్రక సంఘటనకు అనువర్తింప చేయాలనుకోవటం సర్వ సాధారణం. ఇలా వర్తింప చేయాలన్న కోరిక సాధారణీకరణంలో ప్రధాన లక్షణం. రేనియర్ అన్నట్లు చరిత్ర ద్వారానే మానవుడు తోటివారు కూడబెట్టిన అనుభవాన్ని ఉపయోగించుకుంటాడు.

విప్లవాలు పెడతోవను పడితే సైనిక నియంతృత్వం వస్తుంది. ఆంతరంగిక దౌర్భల్యాల వల్ల నాగరికతలు క్షీణిస్తున్నాయి వంటి సాధారణీకరణాలు చరిత్ర యొక్క సర్వసాధారణ విషయం. సాదారణీకరణం తిరస్కరించే వారు చరిత్ర నుంచి నేర్చుకోవలసింది ఏమీ లేదని నమ్ముతారు, కాని ఈ నమ్మకానికి, వాదానికి వ్యతిరేకంగా లెక్కకు మించిన దర్శనాలు ఉన్నాయని ఇ.హెచ్. కార్ పేర్కొన్నాడు. ప్రాచీన గ్రీసు నుంచి రోమ్ ఉత్తేజాన్ని పొందింది. పాత నిబంధన నాటి చరిత్ర నుంచి పశ్చిమ ఐరోపా, 17, 18, 19వ శతాబ్దాల్లో పాఠాలు నేర్చుకొంది. అవివర్ క్రాంవెల్ నాలకత్వాన వచ్చిన ప్యూరిటన్ విప్లవం ఒక న టదర్శనం. రష్యా విప్లవం నాయకులు, ఫ్రెంచ్ విప్లవం, 1830, 1848 విప్లవాలు నుండి 1871 పారీస్ కమ్యూన్ల నుంచి అనేక పాఠాలు నేర్చుకొన్నారు.

ఇట్లు అనేక ఉదాహరణలు మనం గ్రహించవచ్చును. మరీ ముఖ్యంగా జాతీయ భద్రత పేరుతోనో, సాంఘీక, ఆర్థిక, సమానత పేరుతోనో దేశాధి నేతల చేతుల్లో అధికార కేంద్రీకరణ వల్ల ప్రజలు స్వేచ్ఛను పాక్షికంగానైనా కోల్పోతారు. స్వేచ్ఛను కోల్పోయిన ప్రజలు ఎటువంటి ఉపయోగకరమైన రాజకీయ పాత్రను నిర్వహించటానికి కాని, ఆర్థికాభివృద్ధిని సాధించడానికి కాని అశక్తులు అవుతారు. సామాన్య మానవునికి ఇది చరిత్ర నేర్పే పాఠం. అలాగే జాతిని నడిపించే నాయకులను మరీ తలకెత్తుకుంటే ప్రమాదం ఉందని చరిత్ర చెప్తున్నది. ఆ నాయకులకు అవతార పురుషులనుకోవడం వల్ల వ్యక్తి ఆరాధనతత్వం పెరిగి ప్రజల్లో క్రియాశీలత నశిస్తుంది. వ్యక్తి ఆరాధనతత్త్వం భావ స్వేచ్ఛను అరికట్టి నియంతృత్వానికి దారి తీస్తుందని చరిత్ర హెచ్చరిస్తుంది.

ప్రజల్లో ఐకమత్యం ఉంటే దేశం బలంగా ఉంటుంది. దేశ నిర్మాణ విషయంలో ప్రజలందరికీ సమాన అవకాశలుంటాయి అని పేర్కొన్నప్పుడే ఐక్యత సిద్ధిస్తుంది. ఎక్కడయితే ప్రజల యొక్క ప్రాథమిక హక్కులను గౌరవిస్తారో అక్కడ ప్రజలు ప్రగతిని సాధించగల్గుతారు. దేశం శక్తివంతంగా ఉంటుంది. మానవ సంక్షేమానికి, అభివృద్ధికి ఈ అంశాలు ఆవశ్యకం అని

చరిత్ర స్పష్టంగా వివరిస్తుంది. స్వేచ్ఛను కోల్పోయిన ప్రజల్లో ఆత్మవిశ్వాసం, ఉత్సాహం కొరవడతాయి.

## 3.11 చరిత్ర - భవిష్య వాణి:

చరిత్ర భవిష్యత్తును ఊహించడానికి దోహదం చేస్తుంది. కనుక చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోవటం సాధ్యమవుతుంది. ఈనాడు విజ్ఞాన శాస్త్రంలోని నిగమ పద్ధతిలో చేసే నిర్ణయాలు సంభావ్యతను మాత్రమే సూచిస్తుంది. అదే పద్ధతిలో చరిత్రకారుడు సాధారణీకరణం చేస్తాడు. కాబట్టి అలా చేయడంలో అతడు భవిష్యత్తుకు సంబంధించిన సామాన్య విషయాలను గురించి చెబుతాడు. కార్యాకారణ సంబంధంలో జరగబోయేది ఏమిటో చక్కగానే ఊహించడానికి అవకాశం ఉంది. ఈ విశ్లేషణతోనే ఆంగ్ల చరిత్ర కారుడు టాయన్బీ రెండు ప్రపంచ యుద్ధాల ఆగమనాన్ని ముందుగానే పేర్కొన్నాడు. పరిణితి చెందిన అనుభవంతో చరిత్ర చెబుతున్నదేమిటో అనేక సందర్భాల్లో ఊహించి, హెచ్చరించిన నిదర్శనాలు అనేకం ఉన్నాయి.

## 3.12 జాతీయ - అంతర్జాతీయ అవగాహన:

చరిత్ర అధ్యయనం దేశభక్తి ప్రేరకం అని, దేశ సమగ్రతకు దోహదం చేస్తుందని అనేకులు భావిస్తారు. దేశభక్తి అంటే గతాన్ని గుడ్డిగా స్తుతించటం కాదు. మంచైనా, చెడైనా నా దేశం అన్న భావన అభిలషణీయం కాదు. జాతీయ చరిత్రను పక్షపాతరహితంగా విశ్వజనీనమైన సర్వమానవ చరిత్ర దృష్ట్యా పరిశీలిస్తే సరైన దేశభక్తి పెంపొందుతుంది. విశ్వజనీనమైన సర్వ మానవ చరిత్ర వసుధైక కుటుంబ నిర్మాణానికి అవసరమైన సాధన సంపత్తిని సమకూరుస్తుంది. నిజానికి ఈనాటికి అనేక సమస్యలకు అంతర్జాతీయతా వాదం పరిష్కార మార్గం. గుణశీలాల్లో శక్తియుక్తుల్లో ఒక జాతి మరొక జాతి కంటే సహజంగామిన్న అనే భావన అశాస్త్రీయం, చారిత్రక విరుద్ధం. ఆర్యజాతి ఆధిక్యతా సిద్ధాంతం హిట్లర్ వంటి యుద్ధోన్మాదులనూ, మానవ హక్కుల వినాశకులనూ సృష్టించింది. నాగరికతా వికాసానికి అన్ని జాతుల వారు దోహదం చేసినట్లు చరిత్ర చెబుతున్నది.

గత చరిత్ర అనుభవాలను ప్రాతిపదికగా చేసుకునే ఐక్యరాజ్య సమితి, యునెస్కో వంటి సంస్థల ద్వారా అంతర్జాతీయంగా శాంతి భద్రతలను కాపాడటానికి, పరస్పర మైత్రి ద్వారా దేశాల మధ్య సౌభ్రాతృత్వానికి, సహకారాన్ని పెంపొందించడానికి, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, మానవతాపరమైన అంతర్జాతీయ సమస్యలను, పరిష్కరించడానికి, మానవ హక్కులపట్ల ప్రాథమిక స్వాతంత్ర్యాల పట్ల గౌరవం పెంపొందించడానికి కృషి చేస్తున్నది. ఈ విధంగా దేశాల మధ్య, జాతుల మధ్య పక్షపాతాలను నశింపచేసి, అంతరాలను తగ్గించి అంతర్జాతీయ అవగాహనను పెంపొందింప చేయడంలో చరిత్ర ప్రధాన సహకారిగా వ్యవహరిస్తుంది.

## 3.13 సమస్తాధ్యయనాలకు నిలయం:

చరిత్ర మానవునితో ముడిపడింది. మానవుడు నిర్మించిన సాంఘీక జగత్తు చరిత్ర పరిశోధనా మందిరం. సాంఘీక జగత్తు బహుముఖమైనది. చరిత్ర యొక్క బహుముఖతను దృష్టిలో ఉంచుకుని ట్రెవెల్యాన్ దానిని సమస్త అధ్యయన విషయాల నిలయంగా అభివర్ణించడం జరిగింది. చరిత్ర బహుళ విస్తార అధ్యయన విషయం కాబట్టి అందులో రాజకీయ, రాజ్యాంగ, రాజనీతి, సైనిక, ఆర్థిక, సాంఘీక, మేథా సంబంధం అయిన సాంస్కృతిక, వైజ్ఞానిక, సాంకేతికపరమైన అంశాలు అనేకం అంతర్భాగం.

## 3.14 మానసిక ఉల్లాసం:

చరిత్ర అధ్యయనం వల్ల ఇతర ప్రయోజనాలు ఎలా ఉన్నా ఇది ఇచ్చే మానసిక ఉల్లాసం కోసమైనా అధ్యయనం చేయాలని కొందరు చరిత్రకారులు పేర్కొన్నారు. చారిత్రక పరిజ్ఞానం మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకోవటానికి, అభినందించటానికే కాక, ఆనందించటానికి కూడా తోడ్పడుతుంది.

కథా రూపంగా విషయాన్ని వివరించటం చరిత్ర యొక్క లక్షణం. పర్యవసానంగా చరిత్ర అనేక సాహితీ ప్రక్రియల ఆలంబనం అయింది. కథలు, జీవిత గాథలు, సామ్రాజ్యాలు, ఆవిర్భవించటం, అంతరించటం గురించిన వర్ణనలు మనస్సుకు ఆహ్లాదాన్ని కల్గిస్తాయి. అదే సమయంలో అనుభవాన్ని సుసంపన్నం చేస్తాయి. రౌజ్ (Rowse) పేర్కొన్నట్లు మానసికంగా నీవు ఎదుగుతుంటే నీతోపాటే ఎదిగేది నీ జీవిత స్వీయానుభవంతో పాటే పరిపక్వం చెందేది నీవు పరిణతి సాధించినప్పుడు వృద్ధి చెంది నీకు మరింత అర్థవంతంగా కన్పించేది చరిత్ర యొక్క విన్నపమే.

ఆయా రంగాల్లో సమాజం సాధించిన విజయాలను మరియు చరిత్ర ప్రసిద్ధికెక్కిన మహానుభావుల జీవితచరిత్రలు పఠిస్తుంటే కలిగే మానసిక ఆనందం, భావావేశం, స్పందన, చారిత్రక పరిజ్ఞాన పర్యవసానమే చరిత్ర సృష్టించిన గొప్ప వారిని సందర్భవశాత్తు కలిస్తే మనలో కలిగే భావ సంచలనం కూడా దీని వల్లనే.

### 3.15 ముగింపు:

ఆధునిక మానవునికి ఆవశ్యక విశేషణం చారిత్రక మనస్తత్వం ఆ చారిత్రక మనస్తత్వం లేని మానవుణ్ని గుడ్డివాడనో, చెవిటివాడనో చెప్పవచ్చు. 19వ శతాబ్దానికి చెందిన లాంగ్ లాయిస్, సీనోబోస్‌లు మాటల్లో "గుడ్డిగా నమ్మే స్వభావాన్ని నయం చేసే చారిత్రక పద్ధతి యొక్క ఆచరణ మేధస్సుకు ఆరోగ్యకరమైనది''.

మనం పీల్చే గాలిలాగా చరిత్ర కూడా సర్వ వ్యాప్తం. దాని స్పృహ మనకు తరచూ లేకపోయినా దాని నుంచి మనం తప్పించుకోలేం. కాకపోతే వ్యక్తులు దానిని ప్రాథమిక భావనలో ఉపయోగిస్తున్నారా? లేక మానవులుగా, పౌరులుగా తమకు ఉపయోగపడే ఒక సాధనంగా దానిని అభివృద్ధి చేస్తున్నారా? అన్నదే ప్రశ్న. ఏది ఏమైనప్పటికీ దానిని విరూపంగా భావించిన వారు ఉన్నారు. దానిని ఒక గొప్ప విజ్ఞాన గనిగా భావించిన వారున్నారు. వ్యక్తి యొక్క మనస్తత్వంను బట్టి దాని ఉపయోగము కనిపిస్తుంది. ముఖ్యంగా ఇది ప్రతి మనిషి తనను తాను చూచుకునే ఒక అద్దం లాంటిది. అందులో ఎలాంటి సందేహం లేదు.

### 3.16 మాదిరి ప్రశ్నలు:

1. చరిత్ర అధ్యయనం యొక్క ప్రాధాన్యతను వివరింపుము.
2. చరిత్ర అధ్యయనం వలన ఉపయోగాలను పేర్కొనుము.
3. చరిత్ర యొక్క బహుముఖ ప్రయోజనాలు వివరింపుము.

### 3.17 ఉపయుక్త గ్రంథాలు:


1. A.L. Rowse : The Use of History (London 1963)
2. Sheikh Ali, B. : History Its Theory and Method (Macmillan 1978)
3. Clark, kitson : The Critical Historian (Heinman, London, 1970.)
4. Carr, E.H. : What is History (Macmillan, 1961.)
5. Collingwood, R.G. : The Ideas of History (O.U.P. 1966.)
6. Durga Prasad : Charitra Rachana Sastram (Tel.) (Telugu Academy Hyderabad, 1992.)
7. Elton G.R. : The Practice of History (Fontana 1969)
8. Sastni K.A.N. & Ramana H.S. : Historical Method in Relation to Indian History (S. Viswanathan, Madras, 1956.)
9. Websster john C.B. : An Introduction to History (Macmillan, 1977.)


**Prof. G. Raja Mohana Rao**

## యూనిట్ - 2

# చారిత్రక ప్రక్రియ

## పాఠం - 4

# చరిత్రకారుడు - యదార్థాలు

**లక్ష్యము:**

ఈ పాఠ్య భాగాన్ని అధ్యయనం చేయడం ద్వారా సమాజం, వ్యక్తి అనే భావనను, చారిత్రిక ప్రక్రియలో వ్యక్తికీ సమాజానికి వున్న సంబంధాలను గురించి తెలుసుకో గలుగుతారు.

**పాఠ్య నిర్మాణ క్రమం:**


4.1 పరిచయం
4.2 యదార్థాల సముదాయం
4.3 చారిత్రక యదార్థాలు ఏవి
4.4 యదార్థాల ఎంపిక
4.5 చరిత్రకారుడు - అనుభవం
4.6 సమీక్ష
4.7 వ్యాసరూప ప్రశ్నలు
4.8 ఉపయుక్త గ్రంథాలు


## 4.1 పరిచయం:

కాలక్రమంలో జరిగిన మానవ నాగరికత, సంస్కృతుల పరిణామాన్ని వివరించేందుకు గతంలో జరిగిన సంఘటనలపై చరిత్రకారుడు ఆధారపడతాడు. ఈ సంఘటనలను అతడు యథార్థాల నుండి గ్రహిస్తాడు. ఏ చారిత్రక అన్వేషణకైనా యథార్థాలు ముడిసరుకు. యాథార్థాలు లేకుంటే చరిత్ర లేదని చెప్పాలి. అయితే యథార్థాలే చరిత్ర కాదు. చరిత్రలో ఏం చెప్పినా యథార్థాలపై ఆధారపడకుంటే అది సత్యం కాబోదు. యదార్థాలపై కళ్ళెదుట కన్పించే శిలలు. వీటిపైనే సత్యాన్ని నిర్మించటం జరుగుతుంది. యథార్థాలే లేకుంటే చరిత్రలో హేతువుకు సార్థకత లేదు. చరిత్రకారుని కథనం యథార్థాల ప్రామాణికతపై ఆధారపడి వుంటుంది.

## 4.2 యదార్థాల సముదాయం:

19వ శతాబ్దం "యథార్థాల'' యుగం. ఛార్లెస్ డికెన్స్ రాసిన "హార్డ్ టైమ్స్ అనే నవలలోని గ్రాడ్ గ్రౌండ్ అన్న పాత్ర "నాకు వాస్తవాలు... వాస్తవాలు కావాలి. వాస్తవాలు మాత్రమే జీవితంలో అవసరం'' అంటాడు. 19వ శతాబ్దపు చరిత్రకారులు అతని అభిప్రాయాన్ని దాదాపు అంగీకరించారు. 1930 ప్రాంతంలో రాంకెనీతులు చెప్పే చారిత్రక పద్ధతి మీద తిరుగుబాటు చేస్తూ, "గతం

ఎలా ఉండేదో చెప్పటం మాత్రమే చరిత్రకారుని కర్తవ్యం'' అని పేర్కొన్నాడు. మరీ అంత గొప్ప దేమీ కాని ఈ సూత్రం ఆశ్చర్యకరమైన విజయాన్ని పొందింది. మూడు తరాల జర్మన్, బ్రిటిష్, ఫ్రెంచి చరిత్ర కారులు రాంకె సూత్రాన్ని అనుసరించారు.

పాజిటివిస్టులు చరిత్ర రచనను శాస్త్రం అని నిరూపించాలనే తపనతో ఈ యథార్థాల ఉద్యమాన్ని బలపరిచారు. యథార్థాలు ఇంద్రియానుభూతులలాగే పరిశీలకుణ్ని బయటనుంచి మాత్రమే తాకుతాయి. వాటికి, పరిశీలకుని చైతన్యానికి ఎలాంటి సంబంధమూ లేదు. ఈ యథార్థాలను అందుకోవటంలో కూడా చరిత్రకారుడికి ఎలాంటి సంబంధం లేదు. యథార్థాలను అందుకున్న తరువాత మాత్రమే అతడు పని ప్రారంభిస్తాడు.

చరిత్ర - అంటే రూఢి చేసుకున్న కొన్ని యథార్థాల సముదాయం. గతంలో జరిగిన ప్రతిదీ చరిత్రలో యథార్థమే. వాల్ష్ పేర్కొన్నట్లు ఈ యదార్థాలు 'సూక్ష్మ యథార్థాల అసంబద్ధరాశి'. వేటికవే విడివిడిగా వివిధ ఆధారాల్లో చెల్లాచెదురై ఉన్న పరమాణువుల వంటివి. ఈ యథార్థాలు చరిత్రకారునికి పత్రాలు, శాసనాలు మొదలైన వాటిల్లో దొరకుతాయి. ఆధారాల విశ్వసనీయతను నిర్ధారించటం, వాటిని విశ్లేషించటం, చరిత్ర కథనాన్ని అల్లడానికి కావలసిన యథార్థాలను వాటి నుండి రాబట్టే ప్రయత్నం చేయటం చరిత్రకారుని విధి. సాధారణ యథార్థాల నుండి యథార్థాలను వేరుచేయాలి. యథార్థాల ప్రామాణికతను నిర్ధారించుకోవాలి. ఆ యథార్థాలే నమ్మదగ్గ సాక్ష్యాలని ధృవీకరించుకోవాలి. సాక్ష్యాధారాలతో నిజాన్ని రాబట్టడం, అదనపు సాక్ష్యం ఆధారంగా దానిని రూఢి పరచుకోవటం, ఇతర సామ్యాలతో సరిచూడటం చరిత్ర పరిశోధకుడు నిర్వహించే కార్యకలాపాలే.

''మొదట యథార్థాలను సజావుగా కూర్చుకో, తరువాత అందీ అందక జారిపోయే వ్యాఖ్యానం గురించి ఆలోచించు'' అనేది అనుభవవాద, లోకజ్ఞాన చారిత్రక పద్ధతిలోని చిట్టచివరి విజ్ఞాన సూత్రం.

## 4.3 చారిత్రక యదార్థాలు:

గతకాలపు యథార్థాలలో చారిత్రక యథార్థాలు ఏవి? ఇతర యథార్థాలు ఏవి? వీటి మధ్య ఉన్న తేడాను నిర్ణయించే సూత్రాలేవి? ఏది చారిత్రక యథార్థం? ఇది మనం లోతుగా తరచి చూడవలసిన ముఖ్యమైన ప్రశ్న. లోకజ్ఞానం దృష్టితో చూచినప్పుడు అందరు చరిత్రకారులకూ కొన్ని ప్రాథమిక వాస్తవాలుంటాయి. ఉదాహరణకు విలియమ్‌కు శాగ్జన్‌లకు మధ్య జరిగిన ''హేస్టింగ్స్ యుద్ధం 1066 లో జరిగిందన్నది అలాంటి యథార్థాలలో ఒకటి. ఇందులో రెండు అంశాలున్నాయి. మొదటిది ఇలాంటి యథార్థాలతో చరిత్రకారునికి మౌలికంగా సంబంధం లేదు. కాని హేస్టింగ్స్ యుద్ధం 1066లోనే జరిగిందని, 1065 లేదా 1067లో కాదని తెలుసుకోవటం అవసరమే. ఈ యుద్ధం హిస్టింగ్స్ అన్న చోటనే జరిగిందని, మరొక చోట కాదని తెలుసుకోవటం కూడా అవసరము.

ఇలాంటి విషయాలు చర్చకు వచ్చినప్పుడు ఆంగ్ల కవి హౌస్ మన్ అన్న మాట మనసులో మెదులుతుంది. ''తప్పులు చేయకుండా ఉండటం మన బాధ్యత. కాని అది సుగుణం మాత్రం కాదు''. ఈ గుణం ఉందని చరిత్రకారుణ్ణి మెచ్చుకోవటం సరైనది కాదు. సరిగ్గా ఇలాంటి సందర్భాలలోనే చరిత్రకారుడు 'సహాయక శాస్త్రాలైన పురావస్తు శాస్త్రం, శాసనాలు, నాణాలు, కాలక్రమణిక మొదలైన వాటి సహాయాన్ని పొందవచ్చు. కుండపెంకుల ఉత్పత్తి, కాలంబీ శాసనాలలో అర్థం కాని లిపిని చదవటం, కాల నిర్ణయం చేయటం కోసం ఆశ్చర్యకరమైన ఖగోళ శాస్త్రపు లెక్కలు కట్టటం మొదలైన వాటిని గురించి చరిత్రకారునికి ప్రత్యేక జ్ఞానం ఉండనవసరం లేదు. ప్రాథమికాధారాలని పిలవబడే ఇవి అందరు చరిత్రకారులకూ సమానమే. ఇవి మౌలికంగా చరిత్రకు ముడిసరుకే కాని చరిత్రకారునికి కాదు.

వీటిని వాస్తవాలని నిరూపించే అవసరం వాటి గుణ గణాలమీద మాత్రమే ఆధారపడదు. వీటి కార్యకారణ సంబంధాన్ని నిరూపించగల చరిత్రకారుని శక్తి మీద ఆధారపడుతుంది. ఈనాడు సరైన యథార్థాలను ఎన్నుకోవటం, వాటిని సరైన క్రమంలో అందించటం ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసే శక్తివంతమైన మార్గమని ప్రతి పత్రికా రచయితకూ తెలుసు. అయితే యదార్థాలను

ఎవరూ వ్యాఖ్యానించనవసరం లేదని యింతకు ముందు భావించే వారు. అది పొరపాటు. చరిత్రకారుడు మాట్లాడమన్నప్పుడు మాత్రమే యథార్థాలు మాట్లాడుతాయి. ఏ యథార్థాలను ఎప్పుడు, ఎక్కడ, ఏ సందర్భంలో, ఏ వరుసలో ఉపయోగించాలన్నది చరిత్రకారునికి మాత్రమే తెలుసు.

## 4.4 యదార్థాల ఎంపిక:

ప్రొఫెసర్ టాల్ కాట్ పార్ సెన్స్ ఒకసారి సైన్సును సత్యాన్ని అందుకోటానికి మనకు కనిపించే విషయాలను ఎన్నిక చేసే పద్ధతి అని పేర్కొన్నాడు. చరిత్రకున్న అనేక లక్షణాలలో ఇది కూడా ఒకటి. చరిత్రకారుని విధుల్లో "ఎన్నిక" ముఖ్యమైంది. చరిత్రకారునితో, అతని వ్యాఖ్యానంతో సంబంధం లేకుండా "యథార్థాలు" విషయగతంగా ఉంటాయన్న విశ్వాసం అసంగతమైన భ్రమ. కాని ఈ భ్రమను తొలగించటం మాత్రం చాలా కష్టం. ఒక యదార్థం చారిత్రక యథార్థం కావటం చరిత్రకారుని వ్యాఖ్యానం మీద ఆధారపడి ఉంటుందన్నమాట. ఈ వ్యాఖ్యానం ప్రతి చారిత్రక యథార్థంలోకి ప్రవేశిస్తుంది.

చరిత్ర వాస్తవాల మీద ఆధారపడ్డా, నిజం చెప్పాలంటే 'వాస్తవం' కాదు. అది అంగీకరించబడ్డ నిర్ణాయాల సముదాయం మాత్రమే."

ప్రాచీన చరిత్రకారుని కంటే భిన్నమైన, అంతే కష్ట సాధ్యమైన ఆధునిక చరిత్రకారుని పరిస్థితిని గురించి మనం ఇప్పుడు ఆలోచించాలి. అనేక సంవత్సరాలు తూర్పార పట్టటం వల్ల ఈనాడు ప్రాచీన మధ్య యుగాల చరిత్ర రాస్తున్న చరిత్రకారులకు కొన్ని యథార్థాలు మాత్రమే మిగిలాయి. అందుకు వారు సంతోషించాలి. చరిత్రకారునికుండవలసిన మొట్ట మొదటి గుణం అజ్ఞానం. అది మామూలు అజ్ఞానం కాదు. కుదించటం, వివరించటం తెలిసిన అజ్ఞానం. దేనిని ఎన్నుకోవాలో, దేనిని వదిలివేయాలో తెలుసుకో గలిగిన అజ్ఞానం." ప్రాచీన, మధ్య యుగాల చరిత్ర రాస్తున్న వారి సమర్థతకు కారణం వారి అజ్ఞానమే. కానీ ఆధునిక చరిత్రకారునికి ఈ సహజమైన అజ్ఞాన కవచం ఉండే అదృష్టం లేదు. అతడు తన అజ్ఞానాన్ని తానే సమకూర్చుకోవాలి. సమకాలానికి దగ్గరైన కొద్దీ దాన్ని అభివృద్ధి చేసుకోవాలి. ముఖ్యమైన యథార్థాలను గుర్తించి, వాటిని చారిత్రక యథార్థాలుగా మార్చటం, అప్రధానమైన వాటిని తిరస్కరించటం పై రెండూ ఆధునిక చరిత్ర కారుని కర్తవ్యాలే. వీలైనన్ని ఎక్కువ యథార్థాలను విషయగతంగా సేకరించటమే చరిత్ర రచన అన్న పందొమ్మిదవ శతాబ్దపు వితండ వాదానికి ఈ దృక్పథం పూర్తిగా వ్యతిరేకమైంది. ఈ వితండ వాదాన్ని పూర్తిగా అంగీకరించిన ఎవరైనా సరే చరిత్రను పనికిమాలిన పనిగా భావించి వదిలివేయడం జరగవచ్చు. ఈ వితండ వాదం ప్రభావం వల్లనే గత వంద సంవత్సరాలుగా జర్మనీ, బ్రిటన్, అమెరికాలలో చరిత్రకారులు కావాలనుకున్న వారంతా నిర్జీవంగా ఉన్న అనేక గ్రంథాలు రాశారు. అవి చాలా పనికి మాలిన విషయాలను గురించి, చాలా లోతుగా పరిశీలించి, యదార్థాల సముద్రంలో గుర్తు తెలియకుండా మునిగి పోయాయి.

19వ శతాబ్దంలో యథార్థాలంటే ఉన్న వ్యామోహానికి, సాక్ష్య పత్రాల వ్యామోహం జత కలిసింది. అవి "యథార్థాల దేవాలయంలో దేవుడు"గా భావించబడ్డాయి. వాటిని శిరసావహించే చరిత్రకారుడు వాటికి తలవంచి, సమీపించి, భక్తి శ్రద్ధలతో పలకరించాడు. సాక్ష్య పత్రాలలో కనిపించిందే సత్యంగా భావించబడింది. ఈ పత్రాలు, ఒడంబడికలు, దిన చర్య గ్రంథాలు, ఉత్తరాలు మొదలైనవి నిజంగా ఏమి చెబుతాయి? ఏ పత్రమైనా సరే దాన్ని రాసిన వ్యక్తి చెప్పదలుచుకున్న విషయాన్ని మాత్రమే చెబుతుంది. అతడు ఏమి జరిగిందని, ఏమి జరగాలని, జరుగుతుందని భావించాడో దాన్ని లేదా తాను ఏమని భావించినట్లు ఇతరులు భావించాలని ఆశించాడో, లేదా తాను ఏమని భావిస్తున్నానని తాను భావిస్తున్నాడో మాత్రమే అతడు రాసిన పత్రం తెలియచేస్తుంది. చరిత్రకారుడు విప్పి చెప్పేవరకూ పత్రానికి అర్థంలేదు. పత్రాలలో కనిపించినా బయట కనిపించినా యథార్థాలను ఉపయోగించే ముందు వాటిని వడపోయాలి. అంటే వాటిని అవసరం మేరకే ఉపయోగించుకోవాలి.

ఏదైనా ఒక విషయం రాస్తున్నప్పుడు ఏమి జరిగి ఉండవచ్చు అనేది మాత్రం చరిత్రకారుడు ఊహించుకోవలసిందే. వాస్తవాలు, లిఖిత పత్రాలు చరిత్రకారునికి తప్పకుండా అవసరమే. కాని వాటిపట్ల వ్యామోహం మాత్రం అవసరం లేదు. అవి మాత్రమే చరిత్ర కావు.

చరిత్రకారుని ప్రధాన కర్తవ్యం. యథార్థాలను విలువ కట్టటమే కానీ వాటిని విచక్షణ లేకుండా రికార్డు చేయటం కాదు. విలువకట్టే ప్రయత్నం చేయకపోతే రికార్డు చేయ తగిన అర్హత దేనికుందో ఎలా తెలుస్తుంది?

"చరిత్రకారుడు పరిశీలించేది నిర్జీవమైన గతాన్ని కాదు. సమకాలంతో ఏదో ఒక విధంగా సజీవ సంబంధం ఉన్న గతాన్ని" గతకాలపు సంఘటనల వెనుక ఉన్న భావాన్ని అర్థం చేసుకోలేకపోతే ఆ సంఘటనలు చరిత్రకారునికి మృత ప్రాయమే. అందుచేత చరిత్ర చరిత. "అంతే కాక" అతడు పరిశీలిస్తున్న భావాలు చరిత్రకారుని మనస్సులో పునర్విలసిల్లటమే చరిత్ర ఈ పునర్విలసనం అనుభవాల మీద ఆధారపడి ఉంటుంది. కానీ యీ ప్రక్రియకు అనుభవాలే సర్వస్వం కావు. ఇది కేవలం యథార్థాలను వల్లించటమూ కాదు. యథార్థాలను ఎన్నుకోవటం మీదా, వాటిని వ్యాఖ్యానించటం మీద ఈ పునర్నిర్మాణం ఆధారపడి ఉంటుంది. ఇదే యథార్థాలను చారిత్రక యథార్థాలుగా మార్చుతుంది.

## 4.5 చరిత్రకారుడు - అనుభవం:

ప్రొఫెసర్ ఒక్ షాట్ "చరిత్రకారుని అనుభవమే చరిత్ర,. చరిత్ర చరిత్రకారుని చేతనే సృష్టించ బడుతుంది. చరిత్రను సృష్టించటానికి దాన్ని రాయటమొక్కటే మార్గం." అని అన్నాడు. తీవ్రమైన అభిప్రాయ భేదాలకు అవకాశం ఉన్నా యీ లోతైన విమర్శ యింత కాలమూ మరుగున పడి ఉన్న కొన్ని సత్యాలను వెలుగు లోనికి తెస్తున్నది.

1. చరిత్రకు సంబంధించిన యథార్థాలు మనకు పరిశుద్ధంగా కల్తీ లేకుండా అందవు. అందుకు కారణం అవి అలా ఉండటానికి వీలు లేదు. చరిత్రను రికార్డు చేస్తున్న వ్యక్తి మనస్సులో అవి పరావర్తనాన్ని చెందుతూనే ఉంటాయి. కాబట్టి మన మొదటి బాధ్యత చరిత్రలోని యథార్థాలేమిటో తెలుసుకోవటం కాదు. ఆ చరిత్రను రాసిన చరిత్ర కారుణ్ని గురించి తెలుసుకోవటం.

2. ఇది మొదటి అంశం కంటే ఎక్కువ పరిచితమైంది. తాను పరిశీలిస్తున్న ప్రజల మనస్సులను ఆలోచనాత్మకంగా చరిత్రకారుడు అర్థం చేసుకోవాలి. అంటే వారు చేసిన పనుల వెనుక ఉన్న ఆలోచనను, భావాలను అన్నమాట. నేను "ఆలోచనాత్మకంగా" అర్థం చేసుకోవాలంటున్నానే "సానుభూతి"తో అర్థం చేసుకోమనటం లేదు. "సానుభూతిలో" "అంగీకారం" మిళితమై ఉండకూడదు.

3. గతకాలాన్ని వర్తమాన కాలపు దృష్టితో మాత్రమే చూచి. అర్థం చేసుకోవటం, చరిత్రకారుడు తాను జీవిస్తున్న కాలానికి మాత్రమే చెందుతాడు. తన కాలానికి చెందిన మానవ జీవిత సూత్రాలచేత బద్ధుడై ఉంటాడు. అతడు ఉపయోగించే 'ప్రజాస్వామ్యం', 'యుద్ధం', 'విప్లవం' మొదలైన పదాలు కూడా సమకాలం నుంచి విడదీయలేని అర్థాన్ని కలిగి ఉంటాయి. ప్రాచీన చరిత్రను రాస్తున్న కొందరు ఈ గోతిలో తాము పడలేదని నిరూపించటం కోసం కొన్ని పదాలను ప్రాచీన భాషల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. కానీ దానివల్ల ప్రయోజనం లేదు. ఎంతకాదన్నా వారు వర్తమాన కాలంలోనే జీవిస్తున్నారు. వాడుకలో లేని కొన్ని పాత మాటలు వాడటం వల్ల ప్రాచీన కాలంలోకి వెళ్ళి పోగలమని వారు తమ్ముతాము మోసగించుకోలేరు.

ఈనాడు యదార్థాల పట్ల చరిత్రకారునికున్న బాధ్యతను ఎలా నిర్వహించటం? యథార్థాల పట్ల అహంకారంతో ప్రవర్తిస్తున్నాన్న అపవాదాన్ని తప్పించుకోవటానికి తన వాస్తవాలు నిర్దుష్టంగా ఉండేలా చూచుకున్నంత మాత్రాన చరిత్రకారుని బాధ్యత తీరిపోదు. తన విషయానికీ, వ్యాఖ్యానానికి అవసరమైన యథార్థాలలో తెలిసినవి. తెలుసుకోవటానికి వీలున్నవాటన్నింటిని చరిత్ర కారుడు సేకరించటానికి ప్రయత్నించాలి.

చరిత్రకారులందరికీ సమానమైన యీ యదార్థాలు చరిత్రకు ముడిసరుకే కాని యివే చరిత్రకాదు.

చరిత్రకారుడే యథార్థాలను నిర్దేశిస్తున్నాడు. వేటిని ప్రస్తావించాలో, వేటికెంత ప్రాధాన్యతను యివ్వాలో, ఏ క్రమంలో ఏ సందర్భంలో చెప్పాలో అతడే నిర్ణయిస్తున్నాడు. గతానికి సంబంధించిన అసంఖ్యాకమైన యథార్థాలలో కొన్నింటికే అతడు చారిత్రకతను ఆపాదిస్తున్నాడు. ఒకప్పుడు మామూలు యథార్థంగా ఎటువంటి ప్రాధాన్యతా లేనిది. ఆ తర్వాత చారిత్రక యథార్థాలుగా చరిత్రకారుని చేతుల్లో ప్రాధాన్యతని పొందవచ్చు. భారక్లో చెప్పినట్లు మనం చదివే చరిత్ర యథార్థాలపై ఆధారపడినదే అయినప్పటికీ నిజానికి అది వాస్తవం కాదు, అంగీకరింపబడిన తీర్పుల పరంపర మాత్రమే. యథార్థాలను రాబడతారు. యథార్థాల స్వరూప స్వభావాలను దృష్టిలో వుంచుకొని వాటిలో వేటిని ప్రస్తావించాలో, వేటికెంత ప్రాముఖ్యం యివ్వాలో, ఏ క్రమంలో ఏ సందర్భంలో చెప్పాలో అతడు తన వ్యాఖ్యానాన్ని జోడించటంలో నిర్ణయిస్తున్నాడు. అయితే చరిత్రకు ఆటు ముడిసరుకైన యథార్థాలు, యిటు చరిత్రకారుడు పరస్పరం అవసరం అనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

## 4.6 సమీక్ష:

19వ శతాబ్దంలో 'నిర్ధారిత యథార్థాల సముదాయమే చరిత్ర' అనే భావన చాలా ఎక్కువగా వుండేది. చరిత్ర ఆధారాల నుండి లభిస్తున్న బహుళ సమాచారం ద్వారా యథార్థాలు నిర్దేశింపబడటం, యితర సాక్ష్యాలు వీటిని ధృవీకరించటం జరుగుతుంది. అయితే యీవిధంగా ధృవీకరించిన యథార్థాలన్నింటినీ సంకలనం చేసి ఒక మాలగా కూరిస్తే అది కాలింగ్వుడ్ చెప్పినట్లు 'అతుకుల బొంత చరిత్ర' అవుతుంది. నాగరికతా పరిణామాన్ని విశదం చేయలేని ఇటువంటి సంకలనం చరిత్ర ఎలా అవుతుంది? 19వ శతాబ్దం చరిత్రకారులు, తత్వవేత్తలు 'యథార్థాలే సర్వస్వం, యథార్థాలే చరిత్ర' అంటూ యథార్థాలకు, అవి లభించే సాక్ష్య పత్రాలకు పూర్తి ప్రాధాన్యతనిచ్చి ఆరాధించారు. కాని ఏ సాక్ష్యపకమైనా ఆ పత్ర రచయిత ఏమనుకుంటున్నాడో, పాఠకుడేవిధంగా అనుకోవాలని భావిస్తున్నాదో అదే తెలియజేస్తుంది. తప్ప అంతకుమించి తెలుపదనే విషయాన్ని వాళ్ళు మరచారు. చరిత్రకు యథార్థాలెంత ముఖ్యమో ఆ యథార్థాలను నిర్దేశించే వాటిని వ్యాఖ్యానించే చరిత్రకారుడూ అంతే ముఖ్యం. యథార్థాలను నిర్ణయించేవాడు, వాటితో మాట్లాడించేవాడు. ఏ యథార్థాలకు ఎంత ప్రాధాన్యత నివ్వాలి, ఏసందర్భంలో ప్రవేశపెట్టాలి, ఏక్రమంలో ప్రవేశపెట్టాలి అనేది కూడా చరిత్రకారుడు అతని దృక్పథం, రచనా ధోరణి చారిత్రక యథార్థాల ఎన్నికపై ఆధారపడి వుంటుంది. పైగా ముందే చెప్పినట్లు చరిత్రకారుడే నిర్ణయిస్తాడు గనుక అతడు ఆలోచించినదే చరిత్ర. అతని అనుభవమే చరిత్ర అవుతుంది. చరిత్రకారుడు కూడిన చరిత్రలేదని చెప్పవలసి ఉంటుంది. అలాగే చరిత్రకారుడు తాను పరిశీలిస్తున్న కాలాన్ని సమకాలీన దృక్కోణం నుండి పరిశీలించినప్పుడు చరిత్రకు సరైన వ్యాఖ్యాన లక్షణం సమకాలీన ప్రయోజనాలను తీర్చడమే అవుతుంది. ఆస్థితిలో చరిత్రలో యథార్థాలకు విలువ ఉండదు, వ్యాఖ్యానమే ప్రధానం అవుతుంది. యిది సరికాదు. చరిత్రకు యథార్థాలెంత ముఖ్యమో ఆ యథార్థాలను, వాటి ప్రాధాన్యతను నిర్దేశించే చరిత్రకారుని వ్యాఖ్యానమూ అంతే ముఖ్యం. ముందుకు సాగేకొద్దీ వ్యాఖ్యానం యథార్థాల ఎంపిక, వాటి వరుస ఒకదాన్ని మరొకటి ప్రభావితం చేసుకుంటూ అతని ప్రమేయం లేకుండానే క్రమేణా మార్పుకు లోనవుతాయి. ఇది పరస్పర కార్యవిధానం, చరిత్రకారునికి, అతని యథార్థాలకు మధ్య జరిగే యీ కార్య విధానం వర్తమానానికి, గతానికి మధ్య కూడా వుంటుంది. ఎందుకంటే చరిత్రకారుడు వర్తమానానికి, అతని యథార్థాలు గతానికి చెందినవి కాబట్టి, కనుకు చరిత్రకారునికి చారిత్రక యథార్థాలు అవసరం, చారిత్రక యథార్థాలకు చరిత్రకారుడు అవసరం. యథార్థాలు లేని చరిత్రకారుడు మూలరహితుడు, నిష్ఫలుడు అవుతాడు. చరిత్రకారుడు లేని యథార్థాలు మృతప్రాయం, అర్థరహితం అవుతాయి. కాబట్టి చరిత్ర అంటే ఏమిటి? అనే ప్రశ్నకు సమాధానం - చరిత్ర చరిత్రకారునికి, అతని యథార్థాలకు మధ్య అవిచ్ఛిన్నంగా సాగే పరస్పర కార్యవిధానం, వర్తమానానికి గతానికి మధ్య జరిగే అనంతమైన సంభాషణ అన్ని పేర్కొంటారు.

## 4.7 వ్యాసరూప ప్రశ్నలు:

1. చారిత్రిక యదార్థాలను గురించి వివరించండి .

## 4.8 ఉపయుక్త గ్రంథాలు:


1. What is History? - Carr, E.H.
2. The Idea of History - Collingwood, R.G.
3. History: Its Theory and Method - Sheik Ali, B.
4. Historiography - History in Theory and Method - Rajayyan, K.
5. చరిత్ర రచనా శాస్త్రం (తెలుగు అకాడమి ప్రచురణ) - జె. దుర్గా ప్రసాద్


డాక్టర్ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర రావు

**పాఠం - 5**

# సమాజము - వ్యక్తి

## లక్ష్యము:

ఈ పాఠ్య భాగాన్ని అధ్యయనం చేయడం ద్వారా సమాజం, వ్యక్తి అనే భావనను, చారిత్రిక ప్రక్రియలో వ్యక్తికీ సమాజానికి వున్న సంబంధాలను గురించి తెలుసుకో గలుగుతారు.

## విషయక్రమము:


**5.1 పరిచయం**

**5.2 చారిత్రక దృక్పథం**

**5.3 సమాజానికి ప్రతినిధి చరిత్రకారుడు**

**5.4 చరిత్రకారుడు - గతకాల పరిశీలన**

**5.5 చరిత్రకారుడి నేపథ్య అధ్యయనం**

**5.6 చరిత్రకారుడు - సమాజం**

**5.7 చరిత్రకారుడు - వ్యక్తి - సమాజం**

**5.8 చరిత్ర - ప్రత్యక్ష పరిశీలన**

**5.9 సమీక్ష**

**5.10 వ్యాసరూప ప్రశ్నలు**

**5.11 ఉపయుక్త గ్రంథాలు**


## 5.1 పరిచయం:

సమాజము, వ్యక్తి ఈ రెండింటిని విడదీయలేము. ఒకరి అవసరం మరొకరికి ఉంది. సమాజమూ, వ్యక్తి పరస్పరం ఒకరిపై ఒకరు ఆధారపడ్డారే కానీ, పరస్పర విరుద్ధాలు కావు. చారిత్రక పూర్వదశ నుంచి కూడా వ్యక్తి సమాజంలోనే జన్మించడంతో పాటు ఆ సమాజం చేతనే రూపుదిద్దబడుతున్నాడు. వ్యక్తి భాష, నడవడిక, ఆలోచనలు వంటివన్నీ సమాజం నుంచే వస్తాయి. సమాజం నుంచి వేరుచేయబడ్డ వ్యక్తిని ఊహించడం సాధ్యం కాదు.

నాగరిక మానవుని కంటే ఆదిమ మానవుడు తక్కువ వ్యక్తిత్వాన్ని కలిగి ఉంటాడనీ, సమాజం చేత అధికంగా ప్రభావితుడై ఉంటాడని మానవ శాస్త్రవేత్తలు పేర్కొన్నమాట సత్యదూరం కాదు. ఆధునిక సమాజాలలో కంటే వాటిలో వ్యక్తిగత నైపుణ్యానికి,

వృత్తులకు అవకాశం తక్కువ అనే చెప్పవచ్చు. అయితే ప్రస్తుతం ఆధునిక సమాజాలు వ్యక్తి భావనను అధికం చేశాయి. ఈ విషయం మనకు అన్నింటా కనిపిస్తుంది. అయినా వ్యక్తికీ, సమాజానికి వైరుధ్యం వుందని భావించ లేము. వ్యక్తి, సమాజము ఒకరితో ఒకరు అభివృద్ధి చెందుతారు. ఒకరిని మరొకరు హద్దులు దాటకుండా చూస్తారు.

## 5.2 చారిత్రక దృక్పథం:

చారిత్రక దృక్పథం చరిత్రను వ్యక్తులచేత వ్యక్తుల కోసం రాయబడ్డదిగా పరిగణిస్తుంది. దీనిని 19వ శతాబ్దపు ఉదారవాద చరిత్రకారులు అంగీకరించడమే కాకుండా ప్రోత్సహించారు. ఈ దృక్పథం సరిపోదు. చరిత్రకారుని విజ్ఞానం అతని వ్యక్తిగత ఆస్తి కాదు. అనేక దేశాలలో, అనేక కాలాలలో వివిధ వ్యక్తులు దానిని సేకరించి భద్రపరిచి ఉంచారు. చరిత్రకారుడు పరిశీలించే చారిత్రక వ్యక్తులు కూడా ఇతరులతో, సమాజంతో సంబంధం లేనివారు కాదు. వారు సమాజం లోనే జీవనం సాగించారు. చరిత్రకారుడు ఎంతవరకూ "వ్యక్తి"గా వ్యవహరిస్తారు? చరిత్రకారుడి మీద సమాజ ప్రభావం ఎంతవరకూ వుంటుంది? వాస్తవాలు ఎంత వరకు వ్యక్తులకు సంబంధించి వుంటాయి? ఎంతవరకూ సమాజంతో ముడిపడి ఉంటాయి? అనే విషయాలను అధ్యయనం చేయాల్సిన ప్రధాన అంశాలు.

## 5.3 సమాజానికి ప్రతినిధి చరిత్రకారుడు:

చరిత్రకారుడు వ్యక్తే. ఇతర వ్యక్తులలాగే చరిత్రకారుడు కూడా సమాజంలో సమాజం వల్ల రూపుదిద్దుకున్న వ్యక్తే. దీనికితోడూ చరిత్రకారుడు సమకాలీన సమాజానికి ప్రతినిధి. చరిత్రకారుడు తన కాలపు ప్రతినిధిగానే గత కాలపు చారిత్రక వాస్తవాలను పరిశీలిస్తాడు. చారిత్రిక గమనాన్ని గమనిస్తూ అందులో భాగంగా నడుస్తున్న వ్యక్తి చరిత్రకారుడు అని చెప్పవచ్చు. ఈ విధంగా నడుస్తూ ముందుకు సాగే కొద్దీ కొత్త దృష్టి కలుగుతుంది. దీనిని బట్టి చరిత్రకారుడు కూడా చరిత్రలో భాగం. చరిత్రకారుడు పరిశీలిస్తున్న కాలం అతని కాలానికి దూరమైనంత మాత్రాన ఈ సూత్రానికి విలువ తగ్గిపోదు.

## 5.4 చరిత్రకారుడు - గతకాల పరిశీలన:

సమకాలీన సమస్యల మూలతత్వానికి సంబంధించిన వెలుగు గత కాలం మీదికి ప్రసరించినప్పుడు మాత్రమే చరిత్రకారుడు గొప్ప చరిత్రను రాయగలుగుతాడు. దీనికి ఉదాహరణగా ఎందరో ఆధునిక చరిత్రకారుల్ని చూపించవచ్చు.

మొదటి ప్రపంచ యుద్ధం తరువాత బ్రిటిష్ విద్యా రంగంలో ఉద్భవించిన గొప్ప చరిత్రకారుడుగా కీర్తించబడుతున్న సర్ లూయీస్ నేమియర్‌ను పరిశీలిద్దాం. నేమియర్ సంప్రదాయవాది. నేమియర్ వంటి సంప్రదాయవాది గత వంద సంవత్సరాలుగా బ్రిటీష్ చరిత్రకారులలో మరొకడు లేడు. గత శతాబ్దం మధ్యభాగం నుంచి, మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభందాకా మార్పు ఎల్లప్పుడూ మంచి కోసమే వస్తుందని బ్రిటీష్ చరిత్రకారులు భావించారు. 1920 ప్రాంతంలో మార్పు భవిష్యత్తును గురించిన భయంగా, ఉన్న స్థితి నుంచి దిగజారుడుగా పరిణమించింది. ఇలాంటి సమయంలోనే సంప్రదాయ ఆలోచనాపద్ధతి పునర్జన్మ పొందింది. ఆక్టన్ ఉదారవాదం మాదిరిగానే నేమియర్ సంప్రదాయవాదం కూడా ఐరోపా నుంచే ఉత్తేజాన్ని పొందింది. ఫిషర్, టాయన్‌బీ మాదిరిగా పందొమ్మిదవ శతాబ్దపు ఉదారవాదం నేమియర్ భావాలకు పునాది కాలేదు. అది గతించి పోయిందన్న భయమూ, బెంగా అతనికి లేవు. మొదటి ప్రపంచ యుద్ధం, ఫలించని శాంతి ప్రయత్నాలు వంటివి ఉదారవాద దివాలా కోరుతనాన్ని బహిరంగపరిచాయి. ఇలాంటి స్థితిలో సంప్రదాయవాదం, సామ్యవాదం మాత్రమే ఎదుట నిలిచాయి. నేమియర్ సంప్రదాయవాద చరిత్రకారుడుగా ముందుకొచ్చాడు.

నేమియర్ రెండు రంగాలలో కృషి చేశాడు నేమియర్ బ్రిటిష్ చరిత్రలో ఎంతో వెనక్కు వెళ్ళి, పాలకవర్గం తెలివిగా అధికారాన్ని, పరిపాలనను సాగించిన చిట్టచివరి దశను తన పరిశోధనకు ఎన్నుకున్నాడు. ఆ దశలో సమాజం కూడా ప్రశాంతంగా, మార్పులు

లేకుండా ఉంది. కాగా, "నేమియర్ చరిత్రలో నుంచి మనస్సును తీసివేశాడు" అని ఒకరు "టైమ్స్" పత్రికలో ఆరోపణ చేశారు. ఈ ఆరోపణ సరి అయింది అయినా, కాకపోయినా విమర్శకుడు చెప్పదలుచుకున్న విషయం స్పష్టంగానే వెల్లడించాడు. 1760 వ సంవత్సరంలో మూడవ జార్ చక్రవర్తి సింహాసనాన్ని అధిష్టించే నాటికి రాజకీయాలు సిద్ధాంతాల ప్రాబల్యానికి దూరంగానే ఉన్నాయి. ఫ్రెంచి విప్లవం వల్ల ప్రారంభం అయిన ప్రగతి మీద నమ్మకం, అనంతరం వచ్చిన శాతాబ్దకాలపు ఉదారవాదం అప్పటికి ఇంకా ప్రారంభం కాలేదు. కాబట్టి సిద్ధాంతాలు లేవు. ఉదారవాదం లేదు. దీనిని బట్టి నేమియర్ సుస్థిరంగా, ప్రమాదాలు లేకుండా ఉన్న సమాజాన్ని చూపించాలని భావించాడు.

నేమియర్ తీసుకున్న రెండవ విషయం కూడా అతని ఆలోచనా పద్ధతికి సరిగ్గానే ఉంది. నేమియర్ ప్రధానమైన ఇంగ్లాండ్, ఫ్రెంచ్, రష్యా విప్లవాలను పట్టించుకోలేదు. విప్లవాలను గురించి అతడు రచించ లేదు. వీటిని కాదని విఫలమైన 1848 యూరోపియన్ విప్లవాన్ని గురించి పరిశోధన చేశాడు. ఈ విప్లవ వైఫల్యాన్ని ఉదాహరణగా స్వీకరించి గంభీరమైన రాజకీయాలలోకి సిద్ధాంతాలు దూరటం వల్ల ప్రయోజనం లేదు అనే నీతిని నేమియర్ దీనిపై రుద్దాడు. నేపియర్ "మానవుడు తన బుద్ధికి అడ్డుకట్టలు వేసి రాజకీయ సిద్ధాంతాలకు, పిడివాదాలకు ఎంతదూరంగా ఉంటే అంతమంచిది" అని చెప్పాడు.

"కొందరు రాజకీయ తత్వవేత్తలు ఈనాడు మన దేశంలోని రాజకీయ వాతావరణంలో అలసట, స్తబ్ధత తాండవిస్తున్నాయని, చర్చలు జరగటంలేదని అసంతృప్తిని ప్రకటిస్తున్నారు. వాస్తవమైన సమస్యలకు ఆచరణ యోగ్యమైన సమాధానాలు కావాలంటారు. కాని ప్రణాళికలనూ, ఆదర్శాలను ఇద్దరూ మరచిపోతారు. నా వరకూ నాకు ఈనాటి స్తబ్ధమైన వాతావరణం మన జాతి రాజకీయ పరిపక్వతకు చిహ్నంగా కనిపిస్తోంది. ఇది ఇలాగే రాజకీయ తత్వశాస్త్రాల జోక్యం లేకుండా కొనసాగాలని మాత్రమే కోరుకుంటాను." అని నేమియర్ చరిత్ర నుంచి తాను మనస్సును తీసివేశాడన్న అభియోగానికి సమాధానం ఇచ్చాడు.

## 5.5 చరిత్రకారుడి నేపథ్య అధ్యయనం:

చరిత్రకారుడిని, అతని నేపథ్యాన్ని ముందుగా అర్థం చేసుకున్నప్పుడే అతను రాసిన దానిని గురించి అవగాహన చేసుకోవడం సులభమవుతుంది. ప్రధానంగా ఇక్కడ రెండు విషయాలను గమనించాలి.

1. చరిత్రకారుడు ఏ దృష్టి తో చరిత్రను చూస్తున్నాడో తెలుసుకోలేకపోతే అతని గ్రంథాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేం.

2. అతని దృష్టి అతని సామాజిక, చారిత్రక నేపథ్యంతో దగ్గరి సంబంధాన్ని కలిగి ఉంటుంది. ఈ విషయాన్ని మరచిపోకూడదు.

దీనిని బట్టి మార్క్స్ అన్నట్లు చదువు చెప్పే వాడికి ముందుగా చదువు చెప్పాలి. ఆధునిక పరిభాషలో చెప్పాలంటే - బుద్ధులు మార్చేవాడి బుద్ధి ముందుగానే మార్చివేయబడింది.

చరిత్ర రచన ప్రారంభించటానికి ముందే చరిత్ర చరిత్రకారుణ్ణి తయారుచేసింది. చరిత్రకారులు అనేకమంది ఉదాహరణకు నేమియర్ లాంటి వారు ఒక్కొక్కరూ ఒక్కొక్క రాజకీయ, సామజిక పరిస్తితుల అచ్చులో పోతపోయబడ్డారు. వారి మొదటి గ్రంథాలకు, చివరి గ్రంధాలకు మధ్య చెప్పుకోతగ్గ మార్పు కనిపించదు.

అయితే త్వరగా మార్పు చెందుతున్న సమాజంలో జీవించిన మరి కొందరు చరిత్రకారులు ఒక సామాజిక వ్యవస్థకు కాక, అనేక వ్యవస్థలకు అద్దంపట్టారు.

ఉదాహరణ జర్మన్ చరిత్రకారుడు మైనెక్. అతడు చాలాకాలం జీవించి తన దేశ చరిత్రలో అనేక విప్లవాలను, దుర్ఘటనలను మార్పులను చూచి రచన చేశాడు. అందుచేతనే అతడి మూడు ప్రధాన గ్రంథాలలో మూడు రూపాలతో ఆ చరిత్రకారుడు మనకు కనిపిస్తాడు.

1907 లో ప్రచురించబడ్డ అతని మొదటి గ్రంథంలో బిస్మార్క్ పరిపాలనలో (1871-90) జర్మన్ జాతి కలలు నిజం కావడాన్ని ఆత్మ విశ్వాసంతో వివరించాడు. ఇటాలియన్ జాతిపితగా పెర్కొన బడిన మాజినీలాగా జాతీయత అంతర్జాతీయతకు రాచబాటగా భావించాడు. ఈ భావాలను రెండవ విలియమ్ (1981-1918) పరిపాలనా కాలం ఎంతో ప్రభావితం చేసింది.

1925 లో ప్రచురితమైన "రాజ్యాంగ తార్కిక పద్ధతి" అన్న గ్రంథంలో మైనెక్ భావాలు వైమర్ రిపబ్లిక్ లాగే అస్పష్టంగా, తికమకగా ఉన్నాయి. ఆనాటికి రాజకీయ రంగం రణరంగంగా మారిపోయింది. నీతి, దేశభద్రత ఒకదానితో మరొకటి సమరం చేయసాగాయి.

నాజీ ప్రభుత్వం సృష్టించిన వరదలో తనకు విద్యారంగంలో ఉన్న గౌరవమంతా తుడిచిపెట్టుకు పోయాక మైనాక్ 1936 లో "చరిత్ర ప్రారంభం" అనే గ్రంథం ప్రచురించాడు. ఈ గ్రంథం మైనాక్ లో వచ్చిన నిరాశావాదానికి అద్దం పట్టింది.

జర్మనీ పరాజయాన్ని పొందిన తరువాత అతని చివరి గ్రంథం "జర్మనీ పతనం" 1964లో ప్రచురించబడింది. అందులో అతని నిరాశావాదం పరాకాష్టకు చేరింది. అందులో మైనెక్ చరిత్రను దయలేని, కళ్ళులేని విధిచేతిలో ఆటబొమ్మగా భావించాడు. వ్యక్తిగా మైనాక్ లో వచ్చిన పరిణామాలు ఆసక్తికరంగా ఉండవచ్చు. కానీ చరిత్రకారుని దృష్టివేరు.

## 5.6 చరిత్రకారుడు - సమాజం:

వ్యక్తిగా చరిత్రకారుణ్ని వదిలిపెట్టి, చరిత్ర రచనలోని ప్రధాన సరళులను పరిశీలిస్తే చరిత్రకారుడు ఎంతవరకూ సమాజం చేత తయారు చేయబడుతారో మరింత స్పష్టంగా అర్థమౌతుంది. 19వ శతాబ్దపు బ్రిటిష్ చరిత్రకారులందరూ చరిత్ర గమనాన్ని ప్రగతికి సంకేతంగా భావించారు. వారు అతి త్వరితంగా అభివృద్ధి చెందుతున్న సమాజం యొక్క ఆలోచనా విధానానికి రూపం ఇచ్చారు.

తమకు అనుకూలంగా చరిత్ర సాగుతున్నంతకాలమూ బ్రిటిష్ కారు అందులో ఎంతో అర్థం ఉందన్నారు. చరిత్ర మనకు అనుకూలంగా లేదు. కాబట్టి చరిత్రకు అర్థంలేదన్న కుతర్కం బయలుదేరింది.. మొదటి ప్రపంచయుద్ధం తరువాత బ్రిటీష్ చరిత్రకారుడు ఆర్నాల్డ్ టాయన్బీ చరిత్ర సరళ రేఖలో కాకుండా, వర్తులాకారంలో ముందుకు సాగుతుందన్న కొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదించే ప్రయత్నం చేశాడు. శిధిలమైపోతున్న సమాజంలో సరిగ్గా ఇలాంటి భావాలే పుడతాయి. దాదాపు బ్రిటిష్ చరిత్రకారులందరూ చరిత్ర గమనానికి అర్థం, ప్రణాళిక లేవని చెప్పి సంతృప్తి పొందుతున్నారు.

"వ్యక్తిగత ఆలోచనను సామాజిక లక్షణంగా మాత్రమే భావించాలి. 1914లో సామాజిక లక్షణం ప్రారంభమైందని చెప్పవచ్చు. సామాజిక చరిత్రలో ఒక దశను అర్థంచేసుకోవటానికి ఆ దశలో వచ్చిన, లేదా రాలేకపోయిన చరిత్రను మించిన సూచిక మరొకటి లేదు. ఇతరుల భావాలలాగే చరిత్రకారుని భావాలు కూడా దేశకాల పరిస్థితులచేత రూపు దిద్దబడుతాయి.

"చరిత్ర ఇతర కాలాల ప్రభావంనుంచి మాత్రమేకాక, మనకాలం చెడు ప్రభావంనుంచీ కూడా మనల్ని రక్షించాలి. అది మనం పీలుస్తున్న గాలి ఒత్తిడినుంచీ, పరిస్థితుల నిరంకుశత్వం నుంచీ కూడా మనల్ని రక్షించాలి."

వీటిని చూస్తే చరిత్ర నిర్వహించే పాత్ర చాలా గొప్పదనే ఆశ కలుగుతుంది. అయితే ఎలాంటి సామాజిక పరిస్థితుల్లో ఉన్నాడో తెలుసుకున్న చరిత్రకారుడు మాత్రమే వాటిని దాటగలడు. అతనికి మాత్రమే తన సమాజానికి, సామాజిక భావాలకూ ఇతర సమాజాలకు, దేశాలకు వారి సామాజిక భావాలకు ఉన్న వ్యత్యాసం అర్థమౌతుంది. ఇలాంటి చరిత్ర కారుడు తాను వ్యక్తిని మాత్రమేననీ, సమాజంతో తనకెలాంటి సంబంధమూ లేదని నమ్మే చరిత్రకారునికంటే ఎన్నోవిధాల సమర్థుడు. సమాజంతో ఎంతగా ముడిపడి ఉన్నాడో తెలుసుకున్నవాడు మాత్రమే దానిని దాటగలదు.

చరిత్రను చదవటానికి ముందు చరిత్రకారుడితో పాటు అతని చారిత్రక, సామాజిక పరిస్థితుల్ని చదవాలి. చరిత్రకారుడు వ్యక్తే అయినా అతణ్ణి చరిత్ర, సమాజం తయారుచేస్తాయి. చరిత్రను చదివే విద్యార్థి చరిత్రకారుణ్ణి యీ రెండు కోణాలనుంచి చూడటం నేర్చుకోవాలి.

## 5.7 చరిత్రకారుడు - వ్యక్తి - సమాజం:

చరిత్రకారుడు పరిశీలించవలసింది. వ్యక్తుల చర్యలనా? సమాజచర్యలనా?

వ్యక్తులు - వారి ప్రవర్తన, శీలం మాత్రమే చరిత్రలో ముఖ్యమన్న వాదానికి చాలా చరిత్ర ఉంది. అసాధారణ వ్యక్తిని చరిత్ర నిర్మాతగా ఊహించాలన్న కోరిక చారిత్రక చైతన్యంలో చాలా ప్రాథమిక దశ. గ్రీకులకు ఈ కోరిక చాలా బలంగా ఉండేది. వారి చారిత్రక విజయాలను, న్యాయవ్యవస్థను, కావ్యాలను మానవాతీత శక్తులకు అంటగట్టారు. సాంస్కృతిక పునర్జీవన కాలంలో (క్రీ.శ 14-16 శతాబ్దాలు) ఈ కోరిక మళ్ళీ ప్రారంభం అయింది. ఆ కాలంలో జీవిత చరిత్రకారుడు, నీతి శాస్త్రవేత్త అయిన ప్లూటార్క్ ప్రాచీన చరిత్ర కారులకంటే ఎక్కువ పలుకుబడినీ, ప్రాబల్యాన్నీ పొందాడు.

అయితే సమాజం చాలా సరళంగా ఉన్నప్పుడు, సామాజిక కార్యకలాపాలన్నీ కొందరు ప్రసిద్ధ వ్యక్తుల చేతుల్లో ఉన్నప్పుడు ఈ సిద్ధాంతం కొంచెం నమ్మశక్యంగా ఉండేది. సమాజం ఎంతో సంక్లిష్టంగా మారిపోయిన ప్రస్తుత తరుణం లో ఇలాంటి సిద్ధాంతం అసలు పనికిరాదు.

వీటన్నింటి వల్లనే 19 శతాబ్దంలో సామాజిక శాస్త్రం పుట్టింది. అంతమాత్రాన ప్రాచీన సంప్రదాయాలు పోలేదు. "చరిత్ర గొప్పవారి జీవిత చరిత్ర మాత్రమే'' అన్న భావం ఈ శతాబ్దం ప్రారంభంలో కూడా బలంగానే ఉండింది. పదేళ్ళ క్రితం ఒక ప్రసిద్ధ అమెరికన్ చరిత్రకారుడు "సామాజిక, ఆర్థిక శక్తుల చేతుల్లో కీలుబొమ్మలుగా చిత్రిస్తూ చారిత్రక పురుషులను సామూహిక హత్య చేస్తున్న వారిని మందలించాడు. ఈ లోగా ఈ సిద్ధాంతాన్ని నమ్మేవారు కాస్త సిగ్గుపడుతున్నారు.

సమూహంగా వున్న వ్యక్తుల ప్రవర్తనకు, వ్యక్తులుగా వారి ప్రవర్తనకు సంబంధంలేదు. అందుచేత చరిత్రకారుడు వాటిలో ఒకదాన్ని మాత్రమే తీసుకోవచ్చు. వ్యక్తులుగా మానవుల ప్రవర్తనను పరిశీలించటమంటే వారి బుద్ధిపూర్వకమైన ఉద్దేశాలను పరిశీలించటం. మానవుణ్ణి వ్యక్తిగా, సమాజంలో సభ్యుడుగా చూడటంలో ఏది సరి అన్నది ప్రధాన సమస్యకాదు. వ్యక్తికి, సమాజానికి మధ్య సరిహద్దు గీత గీయాలని ప్రయత్నించటం మాత్రం తప్పుదారి పట్టించే ఆలోచన అని చెప్పవచ్చు. వ్యక్తి సూత్రప్రాయంగా ఏదో ఒక సమాజంలో సభ్యుడుగా ఉండక తప్పదు. ఒక్కొక్కసారి అనేక సమాజాలలో కూడా ఉండవచ్చు.

వ్యక్తిని సమాజంలో భాగంగా పరిగణించే జీవిత చరిత్రకూ, చరిత్రకూ తేడా ఉందనీ, మంచి జీవిత చరిత్ర కూడా చరిత్రగా తక్కువ రకందే అని అనిపించవచ్చు. "చారిత్రక పురుషులను చూచి ఉత్సాహం పొంది ఏర్పరచుకునే చారిత్రక దృక్పథం తప్పు. అది తప్పులకు కూడా దారితీస్తుంది'' అని ఆక్టన్ పేర్కొన్నాడు. వాస్తవంగా పరిశీలిస్తే కొన్ని జీవిత చరిత్రలు చరిత్రకు నిజమైన సేవచేశాయి. ఉదాహరణకు ఐశాక్ దాయిశ్చర్ రాసిన స్టాలిన్, ట్రాట్స్కీ జీవిత చరిత్రలు. చరిత్రను రాయాలని కానీ, చదవాలని కానీ నిర్బంధంలేదు. అయితే గత కాలానికి సంబంధించి చారిత్రక స్పర్శలేని ఆసక్తికరమైన విషయాలతో పుస్తకాలు రాయటానికి వీలుంది. కాబట్టి గతకాలపు సమాజంలో ఒక భాగమైన మానవుణ్ణి గురించిన ఆలోచనకు "చరిత్ర'' అన్న మాటను వాడవచ్చు.

ఈనాడు వ్యక్తులు తమ ఉద్దేశాలను తాము పూర్తిగా తెలిసి ప్రవర్తించరని అందరికి తెలుసు. ఈ తెలిసి తెలియని కారణాలను తెలుసుకునే ప్రయత్నం చేయకుండా చరిత్ర రాయాలని ప్రారంభించట ఒక కన్ను మూసుకొని నడవటం లాంటిది. చరిత్రకారుడు సరిగ్గా ఇలాగే ప్రవర్తించాలని కొందరు భావిస్తారు. కానీ ఈ అభిప్రాయం సరైనది కాదు.

వ్యక్తులు ఎలా ప్రవర్తించారో, అలా ఎందుకు ప్రవర్తించారో వారి దృష్టి నుంచి పరిశీలించటం చరిత్ర కర్తవ్యంగా భావించటం సబబుకాదు. ఫలానా రాజులోని చెడులక్షణం అతని దురాశలో, తెలివిలేనితనంలో, క్రూర ప్రవర్తనలో వుందని పేర్కొనడం అతని

వ్యక్తిగత గుణాలను చెప్పడం మాత్రమే అవుతుంది. అలాకాకుండా, ఆ రాజు స్వార్థపరుల చేతుల్లో తనకు తెలియకుండా బానిసగా మారిపోయాడని చెబితే అతని చెడ్డతనానికి లోతైన కారణం చెప్పినట్లు అవుతుంది.

అంతేకాకుండా చారిత్రక సంఘటనలు ఎక్కువ కాలం వ్యక్తి ప్రవర్తనమీదకాక, మనకు తెలియని బలమైన ఇతర వ్యక్తుల చైతన్యాన్ని ప్రభావితం చేయటం మీద ఆధారపడి వుంటాయని సూచిస్తున్నాయి. అయితే ఇది పూర్తిగా అర్థం లేని వాదన. దివ్యశక్తులు, విధి చరిత్ర గతిని నిర్దేశిస్తాయన్న నమ్మకం లేదు.

మార్క్స్ చెప్పినట్లుగా - "చరిత్ర ఏమీ చేయదు. సంపదను కలిగి ఉండదు. యుద్ధాలు చేయదు. వీటినన్నిటినీ చేసేవాడు నిజమైన, సజీవుడైన వ్యక్తి మాత్రమే. సంపదను కలిగి ఉండేవాడు, యుద్ధాలు చేసేవాడు అతడే."

## 5.8 చరిత్ర - ప్రత్యక్ష పరిశీలన:

చరిత్రను గురించి ఈ సందర్భంలో రెండు విషయాలు గమనించాలి. అవి ఊహాగానం మీద కాకుండా ప్రత్యక్ష పరిశీలన మీద ఆధారపడి ఉన్నాయి.

చరిత్ర చాలా వరకూ జనసంఖ్య మీద ఆధారపడి ఉంటుందన్నది వాటిలో మొదటిది. "చరిత్ర కొందరు గొప్పవారి జీవితచరిత్ర మాత్రమే'' అన్న అభిప్రాయం చాలా దురదృష్టకరమైన విషయం. ఉదాహరణకు - "దెబ్బతిన్న అహంకారాలు, పరస్పరం సంఘర్షించుకునే తత్వవేత్తలు, పెద్ద వ్యాపారులు, భూస్వాములు ఫ్రెంచి విప్లవాన్ని నడిపించలేదు. రెండున్నర కోట్ల మానవుల ఆకలి, నగ్నత్వం, వారి హృదయాలను నలిపి వేసిన పీడన దాన్ని నడిపాయి.'' ఇలాంటి ప్రజలే అన్ని దేశాలలో, అన్ని విప్లవాలలో వుంటారు. లేదా లెనిన్ అన్నట్టు, "జనం వున్నచోట రాజకీయాలు ప్రారంభమౌతాయి. వేల జనం వున్న చోటకాదు, కోట్ల జనం వున్నచోట, అక్కడే తీవ్రమైన రాజకీయాలు ప్రారంభమౌతాయి.

లెనిన్ పేర్కొంటున్న జనం వ్యక్తులే. వారిలో వ్యక్తిత్వ హీనతలేదు. ఇలాంటి విషయాలను చర్చించేప్పుడు అనామకత్వం, వ్యక్తిహీనత ఒకటేనని పొరబడతాం. మనకు పేర్లు తెలియనంతమాత్రాన ప్రజలు ప్రజలు కాకచారు. వ్యక్తులు వ్యక్తులు కాకపోరు.

ఈ పేరులేని లక్షలాది వ్యక్తులే తమకేతెలియకుండా ఒక చోట చేరి సామాజిక శక్తిగా రూపొందుతారు. సామాన్యంగా చరిత్రకారుడు అసంతృప్తితో వున్న ఒక రైతును గానీ, ఒక పల్లెనుగానీ పట్టించుకోడు. కానీ అసంతృప్తితో నలిగిపోతున్న వేలాది పల్లెల్లోని లక్షలాది రైతులను ఏ చరిత్రకారుడూ విస్మరించలేదు. ఒక యువకుడు పెళ్ళి చేసుకోలేకపోత ఆ కారణాలను చరిత్ర కారుడు పట్టించుకోడు. కానీ అదే తరానికి చెందిన వేలాది యువకులు అదే కారణంవల్ల పెళ్ళి చేసుకోలేకపోతే ఆ విషయానికి చారిత్రక ప్రాధాన్యత వస్తుంది. అప్పుడు చరిత్రకారుడు ఆ విషయాన్ని పరిశీలిస్తాడు. ఆ ఉద్యమాలను అల్పసంఖ్యాక వర్గాల ప్రజలు మాత్రమే ప్రారంభిస్తారని కొందరు గంభీరంగా చెబుతున్న అభిప్రాయంతో సంబంధంలేదు. ఏ బలమైన ఉద్యమానికైనా చాలా తక్కువ సంఖ్యలో నాయకులు, చాలా ఎక్కువ సంఖ్యలో ప్రజలు వుంటారు. ఉద్యమం విజయం సాధించ డానికి పెద్ద సంఖ్యలో ప్రజలు అవసరమనే దీని భావం. అందుచేతనే చరిత్రలో "సంఖ్యకు " ఎంతో ప్రాముఖ్యత వుంది.

రెండవ విషయం - మానవులు తాము చేసే పనులకు తాము, ఇతరులు - ఎవరూ ఆశించని ఫలితాలను ఒక్కొక్కసారి పొందుతారని అనేకమంది రచయితలు పేర్కొన్నారు. సామాజికంగా ఉత్పత్తి సాధనాలను రూపొందించుకొనే దశలో మానవులు తమకు తెలియకుండానే నిశ్చితమైన, అవసరమైన సంబంధాలను ఏర్పరచుకుంటారు''. అని మార్క్స్ పేర్కొన్నారు.

రష్యన్ రచయిత టాల్‌స్టాయ్ తన "సమరము శాంతి'' అనే నవలలో పేర్కొన్నట్లు - "మానవుడు తనకోసం తాను తెలిసి జీవిస్తాడు. మానవజాతి కంతటికీ సంబంధించిన చారిత్రక లక్ష్యాలను సాధించటంలో తనకు తెలియకుండానే ఒక సాధనంగా వుపయోగపడతాడు. "

దాదాపు వంద సంవత్సరాల కాలం అనేక చిన్న చిన్న యుద్ధాలు జరిగిన తర్వాతాక్ క రెండు ప్రపంచ యుద్ధాలొచ్చాయి. దాని ఆధారంగా చేసుకొని 19వ శతాబ్దంకంటే 20 వ శతాబ్దంలో ఎక్కువమంది యుద్ధాన్ని, తక్కువ మంది శాంతిని కోరారని చెప్పటానికి వీలులేదు. 1930 ప్రాంతంలో వచ్చిన ఆర్థిక మాంద్యాన్ని ఎవరూ కోరుకోలేదు. కొంతమంది యివి రాకూడదని ఎంత ప్రయత్నించినా అవి రానే వచ్చాయి. పరస్పర విరుద్ధమైన ఆశయాలను సాధించటంకోసం ప్రయత్నిస్తున్న వ్యక్తులు వీటిని తెచ్చి పెట్టారు. ఈ ఆశయాలలోని పొరపాట్లను, అవి తీసుకు వచ్చిన ఫలితాలను పరిశీలించటానికి భావి చరిత్రకారుల కోసం వేచివుండ నవసరంలేదు.

వ్యక్తుల ఉద్దేశాలకు వివరణగా, చారిత్రక వ్యక్తుల అభిప్రాయాలకు అనుకూలంగా, అంటే వారెందుకలా ప్రవర్తించారో వారే చెప్పిన సంజాయిషీకి ప్రాధాన్యత నిస్తూ చరిత్ర రాయటం వాస్తవాలను చూచిన తరువాత వీలు కాదనిపిస్తోంది. చరిత్రలోని వాస్తవాలు తప్పకుండా వ్యక్తులకు సంబంధించినదే. కానీ అవి ఆ వ్యక్తులు ఏకాంతంగా, ఇతరులతో సంబంధం లేకుండా ప్రవర్తించిన సంఘటనలకు సంబంధించిన వాస్తవాలుకావు. వారి ఉద్దేశాలను వారిదృష్టితో చూచినవీ కావు. సమాజంలోని మానవుల పరస్పర సంబంధాలను తెలిపే వాస్తవాలు. వ్యక్తిగత ప్రవర్తన సృష్టించిన ఆ సామాజిక శక్తులకు సంబంధించిన వాస్తవాలవి. సామాజిక శక్తులు సాధించే ఫలితాలు వ్యక్తుల అభిప్రాయాలకు భిన్నంగా, ఒక్కొక్కసారి పూర్తిగా వ్యతిరేకంగా కూడా వుంటాయి.

చరిత్ర కారుడు పరిశోధించవలసింది. సంఘటన వెనుకవున్న ఆలోచననే కానీ అందుకు కారకుడైన వ్యక్తి వుద్దేశాన్ని కాదు. ఎందుచేతనంటే సంఘటనకు ఆ వ్యక్తి ఆలోచనకు ఎలాంటి పొంతనా ఒక్కొక్కసారి వుండక పోవచ్చు.

సమాజంమీద తిరుగుబాటు చేస్తున్న 'వ్యక్తి' గా ఒక విప్లవకారుడిని చిత్రిస్తే సమాజానికి, వ్యక్తికీ వైరుధ్యం వుందన్న తప్పుడు సిద్ధాంతాన్ని ప్రతిపాదించినట్లవుతుంది. ఏ సమాజంకానీ అభిప్రాయభేదం లేకుండా సంపూర్ణమైన ఏక వాక్యతను కలిగి వుండదు. ప్రతిసమాజమూ సంఘర్షణకు కేంద్రమే. ఆ సామాజిక వ్యవస్థను సమర్థించే వాళ్ళలాగే దానిమీద తిరుగుబాటు చేసేవాళ్ళు కూడా అందులో ఒక భాగమే. వారిని సమాజంమీద తిరుగుబాటు చేసిన "వ్యక్తులు" గా చిత్రించటం తప్పు. వారు వ్యక్తులు మాత్రమే అయితే వారిపేర్లు చరిత్రకారునికి తెలియవు. అయితే వారిని అనుసరించిన ప్రజలు చరిత్రలో వారికొక స్థానాన్ని సంపాదించి పెట్టారు. వారు సామాజిక శక్తులేకాని కేవలం వ్యక్తులుకారు.

చరిత్ర గతాన్ని గురించిన పరిశీలన, గతానికి సంబంధించిన వాస్తవాలు'' అన్న రెండు అర్థాలలో ఒక సామాజిక ప్రక్రియ. అందులోని వ్యక్తులు సమాజంలోని వారు. సమాజానికీ , వ్యక్తికి వైరుధ్యం ఉందని భావించడం భ్రమ.

## 5.8 సమీక్ష:

సమాజమూ, వ్యక్తి పరస్పరం ఒకరిపై ఒకరు ఆధారపడ్డారే కానీ, పరస్పర విరుద్ధాలు కావు. చరిత్రకారుడు సమాజంలో ఒక భాగమే. చరిత్ర రచనలో ఆయా కాలం నాటి వ్యక్తులను, సంఘటనలు పరిశీలించి సమకాలీన విషయాలను అవగాహన చేసుకుని చరిత్ర రచన చేయాలి. చరిత్ర ఒక సామాజిక ప్రక్రియ. అందులోని వ్యక్తులు సమాజంలోని వారు. సమాజానికీ , వ్యక్తికి వైరుధ్యం ఉందని భావించడం భ్రమ.

## 5.9 వ్యాసరూప ప్రశ్నలు:

1. సమాజం వ్యక్తి భావనలను గురించి వివరించండి .

## 5.10 ఉపయుక్త గ్రంథాలు:


1. %What is History? - Carr, E.H.
2. The Idea of History - Collingwood, R.G.
3. History: Its Theory and Method - Sheik Ali, B.
4. Historiography - History in Theory and Method - Rajayyan, K.
5. చరిత్ర రచనాశాస్త్రం (తెలుగు అకాడమి ప్రచురణ) - జె. దుర్గా ప్రసాద్


డాక్టర్ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర రావు

పాఠం - 6

# చరిత్ర శాస్త్రమా? కళా?

**లక్ష్యము:**

ఈ పాఠ్య భాగాన్ని అధ్యయనం చేయడం ద్వారా చరిత్ర ఒక శాస్త్రం అనే వాదం గురించి, చరిత్ర శాస్త్రం అని చెప్పడానికి గల కారణాలను, మరియు చరిత్ర ఒక కళా అనే వాదం గురించి తెలుసుకో గలుగుతారు.

**పాఠ్య నిర్మాణ క్రమం:**


**6.1 పరిచయం**

**6.2 చరిత్ర - విజ్ఞాన శాస్త్రాల ప్రభావం**

**6.3 చరిత్ర శాస్త్రమా?**

**6.4 చరిత్రలో సాధారణీకరణ**

**6.5 చరిత్రలో గుణపాఠాలు**

**6.6 చరిత్ర భవిష్యత్తును ఊహించుట**

**6.7 చరిత్రలో ఆత్మాశ్రయం, విషయ నిష్ఠత**

**6.8 చరిత్ర - మతం మరియు నీతి**

**6.8.1 చరిత్ర - మతం**

**6.8.2 చరిత్ర - నీతి**

**6.9 ప్రాక్కల్పన**

**6.10 చరిత్ర కళా?**

**6.11 సమీక్ష**

**6.12 వ్యాసరూప ప్రశ్నలు**

**6.13 ఉపయుక్త గ్రంథాలు**

## 6.1 పరిచయం:

మనం నిత్యం చూస్తున్న చదువుతూ వున్న వివిధ అంశాలు, విషయాలను శాస్త్రాలు, కళలు అని రెండు రకాలుగా విభజించవచ్చు. శాస్త్రానికి, కళకు వున్న ప్రత్యేక లక్షణాలను బట్టి ఆయా అంశాలు, విషయాలను అవి ఏ కోవకు చేదినవో నిర్ణయించడం జరుగుతుంది. అలాగే చరిత్రకు వున్న లక్షణాలను పరిశీలించిన కొందరు చరిత్ర శాస్త్రమని పేర్కొనగా, మరికొందరు శాస్రం కాదనీ వాదనలు చేశారు. ఈ వాదోపవాదాల కారణంగా చరిత్ర లక్షణాలేమిటి? చరిత్ర లక్ష్యమేమిటి? అనే సందేహాలు చరిత్రకారునిలో తలెత్తాయి. ఇలాంటి స్థితిలో అనేకమంది చరిత్రకారులు శాస్త్రానికున్న లక్షణాలు చరిత్రకు వుండడం వల్లనూ, చరిత్రకు ఒక ప్రత్యేక లక్ష్యం ఉండడం వల్లనూ చరిత్రను శాస్త్రమని పేర్కొన్నారు. అంతేకాకుండా చరిత్రకు కళకు వుండే లక్షణాలు కూడా కొన్ని ఉండడంవల్ల కొంతమంది చరిత్రకారులు చరిత్ర ఒక కళ అని కూడా పేర్కొన్నారు.

## 6.2 చరిత్ర - విజ్ఞాన శాస్త్రాల ప్రభావం:

థూసిడైడ్స్ అనే గ్రీక్ చరిత్రకారుడు చరిత్రలో మానవ ప్రవర్తనకు శాస్త్రీయ క్రమాన్ని తెలుసుకోడానికి ప్రయత్నించడాన్ని బట్టి చరిత్ర రచనలో శాస్త్రీయత ప్రాచీన కాలంలోనే ప్రారంభమైందని చెప్పవచ్చు. అయితే ఆధునిక కాలంలో చాలాకాలం వరకు చరిత్ర సాహిత్యంలో భాగంగా, ఒక కళగా మాత్రమే భావించడం జరిగింది. ఈ పరిస్థితి ఆధునిక శాస్త్ర పరిశోధనలు జరిగేంత వరకు కొనసాగింది.

క్రీ.శ. 16 వ శతాబ్దం నుంచి విజ్ఞాన శాస్త్రంలో జరిగిన నూతన అన్వేషణల వల్ల సాంఘిక శాస్త్రాలపై ముఖ్యంగా చరిత్రపై ఎక్కువ ప్రభావాన్ని చూపించాయి. వీటితోబాటు ఈ కాలంలో పరిశోధనల్లో శాస్త్రీయ పద్ధతులు, విశ్లేషణ కూడా చరిత్రపై ఎంతో ప్రభావాన్ని చూపించాయి. డార్విన్ పరిణామ సిద్ధాంతం చరిత్రపై ప్రధానంగా తీవ్ర ప్రభావాన్ని చూపిందని చెప్పవచ్చు. డార్విన్ సిద్ధాంతం లోని ఉన్న ప్రకృతి వరణ సూత్రం, యోగ్యతను సార్థక జీవన భావనలు పూర్తిగా చారిత్రక ప్రక్రియలే. భూమ్యాకర్షణ సిద్ధాంతం, చలన సిద్ధాంతం వంటి న్యూటన్ సిద్ధాంతాలు చరిత్రను యదార్థాల ఆధారంగా రూపొందించాలనే భావనను కలిగించాయి. శాస్త్రీయ పరిశోధనల ఫలితంగా మానవ విజ్ఞానంలో వచ్చిన మార్పుల కారణంగా సాంఘిక శాస్త్ర పరిశోధకులకు ఇది ఒక్క శాస్త్రీయ పరిశోధనలకే పరిమితమా లేక సామాజిక మార్పులకు, సాంఘిక శాస్త్రాలకు వర్తింపజేయువచ్చునా అనే మీమాంస ఏర్పడింది. దాని ఫలితంగా చరిత్ర శాస్త్రమా అనే ప్రశ్న మొదలై అనేక ఆలోచనలు, అభిప్రాయాలకు దారితీసింది. వీటన్నింటి వల్ల చరిత్రన ఒక శాస్త్రం అనే భావనతో రచనలు చేయడం ప్రారంభమైంది.

## 6.3 చరిత్ర శాస్త్రమా?

ఆధునిక జర్మన్ చరిత్రకారుడు లియోపాల్డ్ వాన్ రాంకె 19వ శతాబ్దంలో చరిత్రను శాస్త్రంగా పరిగణించి ఖచ్చితంగా జరిగిన విషయాలను స్పష్టంగా చెప్పడమే చరిత్రకారుని ప్రధాన కర్తవ్యం అని పేర్కొన్నాడు. అంతేకాకుండా చరిత్ర ఖచ్చితత్వాన్ని, ప్రామాణికతను కలిగి ఉండాలని పేర్కొన్నాడు. వర్తమానాన్ని గురించి భోధనలు చేయడం, భవిష్యత్తును అంచనా వేయడం. ఊహించడం చరిత్రకారుని కర్తవ్యం కాదని కూడా లియోపాల్డ్ వాన్ రాంకె వెల్లడించాడు. ఈ అభిప్రాయాన్ని ఆగస్ట్ కామ్టే సమర్థించాడు. అంతేకాకుండా బకుల్, సీలే. యార్క్ పావెల్ వంటి వారు కూడా ఇలాంటి అభిప్రాయాలనే వెలిబుచ్చి చరిత్ర శాస్త్రం తప్ప మరొకటి కాదు అని పేర్కొన్నారు.

కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో ఆక్టన్ తర్వాత చరిత్ర పీఠాన్నలంకరించిన బ్యూరి 1903వ సంవత్సరంలో 'చరిత్ర ఖచ్చితంగా శాస్త్రమే' అని పేర్కొన్నాడు. ఈ అభిప్రాయం వివాదంగా మారి చివరకు చరిత్ర శాస్త్రమా? కాదా? అనే చర్చ తీవ్ర

స్థాయిలో ప్రారంభమైంది. బ్యూరి నిగమన పద్ధతి ని శాస్త్రం వాడుతుందనీ, అదే విధంగా చరిత్రకారుడు "మొదట యదార్థాలను సేకరించి. తర్వాత వ్యాఖ్యానించాలనీ'' "చరిత్ర ఒక శాస్త్రం. అంతకంటే తక్కువా కాదు ఎక్కువా కాదు'' అని పేర్కొన్నాడు.

1930వ సంవత్సర ప్రాంతంలో కాలింగ్ ఉడ్ బ్యూరి చెప్పిన అభిప్రాయాలను సమర్థించాడు. ఆయన వాదాన్ని సమర్థిస్తూ శాస్త్రజ్ఞుల అన్వేషణకు ప్రధానమైన ప్రకృతి ప్రపంచానికీ, చారిత్రక ప్రపంచానికీ మధ్య భేదాన్ని స్పష్టంగా వివరించడానికి కృషి చేశాడు. యదార్థాలను కనుక్కోడానికి ఆధునిక కాలంలో కృషి జరుగుతుందనీ అందువల్లనే చరిత్రకారుడు శాస్త్రీయ దృక్పథ ప్రపంచానికి దగ్గరయ్యాడని ఇ.హెచ్. కార్ పేర్కొన్నాడు.

ఇలాంటి వాదప్రతివాదాల సమయంలో శాస్త్రాలకు అవసరమైన క్రమబద్ధమైన పద్ధతులు, క్రమపద్ధతిలో జ్ఞాన సముపార్జన వంటివి చరిత్రలో కూడా ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. చరిత్ర శాస్త్రమని, మొదట యదార్థాలు ఏవో నిర్ధారించుకొని, నిర్ణయాలు చెయ్యాలనీ అనుకూలవాదులు చెప్పారు. వాస్తవానికి క్రమపద్ధతిలో బోధించే విషయ పరిజ్ఞానాన్ని శాస్త్రం అని అంటారు. అలాగే చరిత్రలో విషయ నిష్టత, వస్తుపరమైన పరిశోధనలను ఆధునిక కాలంలో గుర్తించడం వల్ల చరిత్ర శాస్త్రమని అంగీకరించక తప్పదు.

## 6.4 చరిత్రలో సాధారణీకరణ:

చరిత్ర శాస్త్రమా? కాదా? అనే వాదప్రతివాదాల సమయంలో శాస్త్రానికున్న ప్రత్యేక లక్షణాలతో చరిత్ర లక్షణాలను పోల్చడం జరిగింది. ఈ సమయంలో శాస్త్రానికి వున్న కొన్ని ప్రత్యేక లక్షణాలు, చరిత్రకు లేవనే వాదం ప్రారంభమైంది. అందులో శాస్త్రం సాధారణమైన సార్వజనీన విషయాల గురించి వివరిస్తే చరిత్ర కేవలం ప్రత్యేక అసమాన విషయాల గురించి వివరిస్తుంది అనేది ప్రధాన వాదం. ఈ వాదం గ్రీక్ తత్వవేత్త అరిస్టాటిల్ తోనే ప్రారంభమై 20వ శతాబ్ది ప్రారంభకాలం వరకు కొనసాగింది. ఈ వాదం ప్రకారం చరిత్ర విడివిడి సంఘటనల గురించి, వ్యక్తుల గురించి చర్చిస్తుంది. ఏ రెండు సంఘటనలు కానీ, ఏ ఇద్దరు వ్యక్తులు కానీ ఒకే విధంగా ఉండరు. కానీ నిజానికి చరిత్రకారుడు సాధారణీకరణ చేయకుండా ఉండలేడు. సంఘటనలు వేరైనా, వ్యక్తులు వేరైనా చరిత్రకారుడు సాధారణీకరణ చేస్తాడు. అందుకే "చరిత్రకారునికి ప్రత్యేకతల్లో కాక, ప్రత్యేకతల్లోని సాధారణ లక్షణాలంటే ఆసక్తి ఉంటుంది'' అని ఇ. హెచ్. కార్ అభిప్రాయ పడ్డాడు.

ఆనందం, సంతోషం, దుఃఖం, బాధ, కోపం, ఆవేశం వంటివి మానవులందరికీ సమానమే అయినా జరుగుతున్న సంఘటనలు ఏ మేరకు వారి మీద ప్రభావం చూపిస్తాయో అ మేరకు వారిస్పందన ఉంటుంది. అణచబడ్డ వ్యక్తులు ఎప్పుడో ఒకప్పుడు తిరుగబడి తీరుగారనేది చారిత్రక సత్యమే. కాబట్టి చరిత్రకారుడు కూడా సాధారణీకరణ చేస్తాడు. సామాన్యంగా చరిత్రకారుడు సాధారణీకరణాన్ని తన ఆధారాలను సరిచూచుకోడానికి ఉపయోగిస్తాడు.

ఉదాహరణకు ఔరంగజేబ్ మొగల్ సుల్తాన్ కావడానికి తన సోదరులను అంతం చేసాడా లేదా అనే అనుమానం కలిగిన సమయంలో సాధారణంగా మొగల్ సామ్రాజ్య పాలనా కాలంలో సింహాసనం కోసం వారసులను అంతం చేసిన సంఘటనలు, అలవాటు ఉందా అనే సాధారణీకరణ గురించి చరిత్రకారుడు పరిశీలిస్తాడు. అలాగే చరిత్రను అధయనం చేసే పాఠకుడు కూడా సాధారణీకరణ గురించే ఆలోచిస్తాడు. అంతేకాకుండా చరిత్ర పాఠకుడు చరిత్రకారుని పరిశీలనను తనకు తెలిసిన సందర్భాలకు లేదా తన కాలానికి వర్తింపజేస్తూ సాధారణీకరణ చేస్తాడు. వలస పాలనలో బెంగాల్ జమిందారీ రైతుల బాధల గురించి చరిత్ర పాఠకుడు అధ్యయనం చేస్తున్నప్పుడు అవి ఆంధ్రలో జమీందారీ రైతుల పట్ల ఎంతవరకు వర్తించాయన్న సాధారణీకరణ చేస్తాడు. కనుక ఇ.హెచ్. కార్ అన్నట్లు "చరిత్ర సాధారణీకరణాల మీద మాత్రమే బ్రతుకుతుంది''.

అయితే సాధారణీకరణ అన్ని ప్రత్యేక సంఘటనలకు అన్వయించడం తప్పు. సామాజిక మార్పును ఉత్పత్తి సంబంధాలతో ముడిపెట్టే సాధారణీకరణ చేసిన మార్క్స్ కూడా ఈ పద్ధతిని సమర్థించలేదు. ఈ సందర్భంలో "ఎంతో పోలిక ఉన్న సంఘటనలు

వేరు వేరు చారిత్రక పరిస్థితుల్లో జరిగిన ఎడల అవి వేరు వేరు ఫలితాలను కలుగజేస్తాయి వీటిని వేరు వేరుగా అధ్యయనం చేసి, ఆ తర్వాత ఒక దానితో మరొకటి పోల్చినట్లైతే చాలా సులభంగా పరిణామాల సరళిని అర్థం చేసుకునే వీలు కలుగుతుంది. కానీ ఏదో చారిత్రక - తాత్విక సిద్ధాంతాన్ని ఉపయోగించుట ద్వారా ఈ విధమైన అవగాహనకు రావడం జరుగదు'' అని మార్క్స్ అభిప్రాయ పడ్డాడు. కనుక ప్రత్యేకతకు, సాధారణీకరణకు గల సంబంధం గురించి చరిత్ర తెలుపుతుంది. కాబట్టి చరిత్రకారునికి ఈ రెండింటినీ వేరు చేయడం సాధ్యపడదు.

## 6.5 చరిత్రలో గుణపాఠాలు:

శాస్త్రం మానవునికి గుణ పాఠాలనందిస్తుంది. అదే విధంగా చరిత్ర కూడా గుణ పాఠాలను చెప్తుంది. చరిత్రలో సాధారణీకరణకు, గుణ పాఠాలకు చాలా దగ్గర సంబంధముంది. చరిత్రకారుడు. ఒక సంఘటన నుండి నేర్చుకున్న గుణ పాఠాన్ని, ఇంకో సంఘటనకు కూడా వర్తింపజేసి సాధారణీకరణ చేయటం జరుగుతుంది.

ఉదాహరణకు మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత 1919వ సంవత్సరంలో జరిగిన పారిస్ శాంతి సమావేశంలో విషయాలను చర్చించేటప్పుడు ఆయా రాజ్యాల ప్రతినిధులు నెపోలియన్ పతనం తర్వాత 1815వ సంవత్సరంలో జరిగిన వియన్నా కాంగ్రెస్ లో నిర్ణయాలను ఒక గుణ పాఠంగా తీసుకున్నారు.

అంతేకాకుండా ఈనాడు వున్న ప్రభుత్వాలు వాటి విధానాల అమలు ఫలితాన్ని గుణపాఠంగా తీసుకొని తమ తర్వాతి విధానాలను రూపొందించుకోవటం జరుగుతుంది. ఈ విధంగా గుణపాఠాలను నేర్చుకొన్న వ్యక్తుల సముదాయమే చరిత్రలో ప్రగతి పథంలో అడుగిడడం జరుగుతుంది.

## 6.6 చరిత్ర భవిష్యత్తును ఊహించుట:

సాధారణీకరణ చేయడం, గుణపాఠం నేర్చుకోడం అనేవి భవిష్యత్తును ఊహించటంతో ముడిపడి ఉంటాయి. అయితే ఈ ఊహించడం భౌతిక శాస్త్రమంత ఖచ్చితంగా ఉండకపోవచ్చు. ఎందుకంటే చరిత్రకారుడు కొన్ని సంఘటనలను సాధారణీకరణ చేసి అటువంటి పరిస్థితులే ఉన్నట్లైతే చరిత్రలో అటువంటి సంఘటనలు జరుగుతాయని చెప్పవచ్చు. అయితే అటువంటి సంఘటనలు జరగకుండా పాలకవర్గం గట్టి ప్రయత్నం చేస్తే అవి జరగకపోవచ్చు. ప్రధానంగా భవిష్యత్తును ఊహించిన సమయంలో జరుగబోయే సంఘటనలు ఏ వర్గానికైతే నష్టం కలుగాజేస్తాయో ఆ వర్గం జాగ్రత్తపడి ఆ సంఘటనలు జరగకుండా ఉండటానికి ప్రయత్నం చేస్తుంది. జరిగిన విషయాలను గమనించి వాటిని గుణపాఠంగా తీసుకుని భవిష్యత్తును తమకు అనుకూలంగా మార్చుకునేందుకు ఆ వర్గం కృషిచేయడం వల్ల జరగాల్సిన సంఘటనలు జరగకుండా తప్పి పోవచ్చు. కేవలం అంతమాత్రం చేత చరిత్రలో భవిష్యత్తును ఊహించటం జరగదని చెప్పడానికి వీలులేదు. భౌతిక శాస్త్రంలో భూమ్యాకర్షణ శక్తి వల్ల ఆపిల్ పండు చెట్టునుండి కిందపడ్తుందని చెప్పినా మధ్యలో ఎవరైనా పట్టుకున్నట్లైతే కిందపడదు. అంతమాత్రం చేత భౌతిక శాస్త్రంలోని భూమ్యాకర్షణ సిద్ధాంతానికి విలువలేదని చెప్పలేం. అదే విధంగా చరిత్రలో కూడా ఒకే రకమైన పరిస్థితులున్నప్పటికీ ఒక్కోసారి ఒకే రకమైన సంఘటనలు జరగకపోవచ్చు. ప్రత్యేక సంఘటనలెప్పుడూ ఒకదానితో మరొకటి పోలి ఉండవు. అవి ఒక్కోసారి ఆకస్మికంగా కూడా జరుగుతాయి.

ఉదాహరణకు ఒక గ్రామంలో కలరా వ్యాధి ప్రబలిన సమయంలో ఆ గ్రామమంతా కలరా వ్యాధి ప్రబల వచ్చు అని గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని సాధారనీకరణ చేసి చెప్పవచ్చు. అయితే ఫలానా వ్యక్తికి ఖచ్చితంగా కలరా వ్యాధి వస్తుందని చెప్పలేం. చరిత్రకారుడు కూడా ఇదే విధంగా ఆలోచిస్తాడు. ఈ విధంగా విజ్ఞాన శాస్త్రంలోనూ, చరిత్రలోనూ భవిష్యత్తు గురించి ఆలోచించటం దాదాపు ఒకే రకంగా ఉంటుందని చెప్పవచ్చు.

## 6.7 చరిత్రలో ఆత్మాశ్రయం, విషయ నిష్టత:

విజ్ఞాన శాస్త్రాలకు, చరిత్రకు ఒక్క విషయంలో తేడా ఉంది. విజ్ఞాన శాస్త్రాలలో ప్రకృతిని గురించి మానవుడు పరిశీలించడం జరుగుతుంది. అయితే చరిత్ర, సాంఘిక శాస్త్రాల్లో మానవుడి చర్యల గురించి మానవుడే పరిశీలించడం జరుగుతుంది. అందువల్ల చరిత్రకారుడు చేస్తున్న పరిశీలనలో చరిత్రకారుడి అభిప్రాయాలు కూడా చోటుచేసుకునే అవకాశం వుంది. ఫలితంగా చాలా సందర్భాల్లో చరిత్రకారుడు చరిత్ర రచనలో పక్షపాతం చూపించే అవకాశం ఉంది. ఒక్కోసారి చరిత్రకారుని పరిశోధనా ఫలితాలను ఊహించి మానవులు తమ ప్రవర్తనను మార్చుకునే అవకాశం ఉండడంతో పాటు అటువంటి సంఘటనలు జరుగకుండా ప్రయత్నాలు చేసే అవకాసం కూడా వుంది. ఉదాహరణకు ఒక కాలంలోని ఆర్థిక పరిస్థితులు అదే విధంగా కొనసాగితే ఆర్థిక పతనం తప్పదని ఆర్థిక శాస్త్రవేత్త ఎవరైనా చెబుతే ఆర్థిక పతనం జగరకుండా ఆ కాలపు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

ఉదాహరణకు ఫ్రెంచ్ విప్లవ ఫలితాలు నెపోలియన్ వల్ల అంతమయ్యాయని తెలుసుకున్న రష్యన్లు తమ విప్లవానికి అటువంటి ముగింపు ఉండకూడదని నెపోలియన్ లక్షణాలున్న ట్రాట్స్కీని కాదని స్టాలిన్ ను తమ నాయకుడుగా అంగీకరించారు. అయితే ఒక్కోసారి చరిత్రకారుడు మార్పు త్వరగా రావాలనో లేక ఏదో ఒక ఫలితం ఆశించో తనకు తెలియకుండానే ఆత్మాశ్రయానికి లోను అయ్యే అవకాశం ఉంది. రాజనీతి శాస్త్రజ్ఞుడు తాను అభిమానించే రాజకీయ పార్టీ రాబోయే ఎన్నికల్లో గెలవాలనే ఉద్దేశంతో ఆపార్టీయే గెలుస్తుందనీ, ప్రజా ధోరణి అదేవిధంగా ఉందని చెప్పవచ్చు. ఈ విధమైన పద్ధతి విషయ నిష్ఠతను సాధించలేదు.

సత్యాన్వేషణ చరిత్ర పరిశోధనా లక్ష్యం కనుక విషయ నిష్ఠతలేని సత్యాన్వేషణ లోపాలతో కూడుకున్నది. కనుక శాస్త్రవేత్తల మాదిరే చరిత్రకారుడు కూడా విషయ నిష్టత కోసం, నిష్పక్షపాతంతో పరిశోధన చేయాలి.

## 6.8 చరిత్ర - మతం మరియు నీతి:

చరిత్ర రచనలో మతం, నీతికి ప్రముఖ స్థానం కల్పించడం వల్ల చరిత్ర శాస్త్రం కాదు అనే వాదన కూడా ప్రారంభం అయింది. అయితే ఇక్కడ గమనించాల్సిన అంశం ఏమంటే - చరిత్రకు మతం, నీతితో సంబంధాలున్నప్పటికీ చరిత్ర మతం, నీతికి లోబడి మాత్రం లేదనే విషయాన్ని గ్రహించాలి. చరిత్రకు మతం, నీతితో సంబంధం చరిత్ర శాస్త్రం అని చెప్పడానికి ఏమాత్రం అవరోధం కాదు.

**6.8.1 చరిత్ర - మతం:** చరిత్రకారుడు లభ్యమయ్యే అన్ని యదార్థాల సహాయంతో పరిశోధించినా అంతు తెలియని విషయాలకు మతాన్ని ఉపయోగించాలని డి ఆర్సీ లాంటి చరిత్రకారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. అనేకమంది చరిత్రకారులు యదార్థాలతో నిరూపించలేని విషయాలను మతంతో నిరూపించేందుకు ప్రయత్నం చేస్తారు.

అందువల్ల చాలామంది చరిత్రను శాస్త్రం కాదు అని అన్నారు. అయితే కార్ల్ బార్త్ అనే మతాధికారి మత చరిత్రకు, లౌకిక చరిత్రకు సంబంధం లేదని చరిత్రకారుడు లౌకిక చరిత్ర మాత్రమే రాయాలని పేర్కొన్నాడు. అలాగే 'సాంకేతిక చరిత్ర' అంటే మత చరిత్ర కాని చరిత్రను మాత్రమే చరిత్రకారుడు రాస్తాడని బట్టర్ ఫీల్డ్ అభిప్రాయం వ్యక్తం చేశాడు. దీనిని బట్టి బట్టర్ ఫీల్డ్ దైవిక చరిత్ర కూడా ఉందని నమ్ముతున్నట్లు అర్థమవుతుంది. చరిత్రకు, చరిత్రకతీతమైన విషయానికి పొత్తుకుదరదు. కనుక చరిత్ర మతానికి సంబంధం లేకుండా రాయాలి అని ఇ.హెచ్. కార్ పేర్కొన్నాడు.

**6.8.2 చరిత్ర - నీతి:** చరిత్రకు, నీతికి ఉన్న సంబంధం చాలా కఠినతరమైంది. చరిత్రకారుడి దృష్టి కంటే నీతి శాస్త్ర వేత్త దృష్టి పూర్తిగా భిన్నంగా వుంటుంది. చరిత్రకారునికి వ్యక్తుల మంచీ చెడ్డలకంటే కూడా వారు చేసిన పనులు, వాటి వల్ల కలిగిన ఫలితాలే ప్రధానమైనవి. అయితే నీతి శాస్త్రవేత్త కు చేసిన పని విధానం ప్రధానమైనది.

ఉదాహరణకు సోదరుని చంపి రాజ్యానికి వచ్చిన చంద్రగుప్త విక్రమాదిత్యుడు మంచివాడా కాదా అనే ఆలోచన చరిత్రకారునికి అవసరం లేదు. చంద్రగుప్తుడి పరిపాలనా విధానం ఆయన పోషించిన సాహిత్య కళా రంగాల అభివృద్ధి, ఆయన పాలనలోని ప్రజల స్థితిగతులు వంటివి తెలుసుకోవడం మాత్రమే చరిత్రకారుని ముఖ్య విధి. అంటే అతని నీతిబాహ్యమైన చర్యపట్ల శ్రద్ధ వహించడం కన్నా అతని పాలను గురించి శ్రద్ధ వహించడమే చరిత్రకారుని ముఖ్య కర్తవ్యం.

అయితే "చరిత్రకారుడు వివాదాలలో ఒక మధ్యవర్తి లాంటివాడు. చారిత్రక వ్యక్తుల వ్యక్తిగత ప్రవర్తనను గురించి తీర్పులు చెప్పే అధికారం, అవసరం చరిత్రకారునికి ఉంది'' అని ఆక్టన్ అభిప్రాయం వ్యక్తం చేశాడు. ఇసయా బెర్లిన్ కూడా ఈ అభిప్రాయాన్నే వ్యక్త పరిచాడు. కానీ నౌల్స్ ఈ పద్ధతిని వ్యతిరేకించి "చరిత్రకారుడు న్యాయాధిపతి కాదు, వ్యక్తుల మంచి చెడ్డలను గురించి చర్చించాల్సిన అవసరం లేదనీ అంటాడు. క్రోస్ కూడా ఈ వాదాన్ని సమర్థించాడు.

కాగా, ఇ.హెచ్. కార్ "వ్యక్తుల నీతిని గురించి కాక సంఘటనల, వ్యవస్థల విధానాల్లోని నీతిని గురించి తీర్పులు చెప్పడం చరిత్రకారుని ప్రధాన కర్తవ్యం'' అని పేర్కొన్నాడు. కాబట్టి చరిత్రకారుడు వ్యక్తుల మంచి చెడ్డల కన్నా వ్యక్తుల చర్యల పట్లనే ఎక్కువ శ్రద్ధ చూపించాలి.

## 6.9 ప్రాక్కల్పన:

పరిశోధనాంశానికి ప్రాక్కల్పన తయారుచేసుకుని, దాన్ని రుజువు చేయడం కోసం అనేక ప్రయోగాలు చేయడం శాస్త్రానికి వున్న ప్రధాన లక్షణం. అయితే ఈ విధంగా ప్రాక్కల్పనలు తయారుచేసుకుని వాటిని రుజువు చేయడానికి ప్రయోగాలు చేయడం చరిత్ర రచనలో సాధ్యం కాదు. కనుక చరిత్ర శాస్త్రం కాదని కూడా వాదం ఉంది.

అయితే ఆధునిక కాలంలో చరిత్ర రచనలో కూడా ప్రాక్కల్పనకు ప్రాధాన్యం ఏర్పడింది. శాస్త్రంలో మాదిరే చరిత్ర రచనలో కూడ నిగమన తర్కం ఉపయోగించి ప్రాక్కల్పనలు తయారుచేసుకోవడం జరుగుతుంది. ఈ ప్రాక్కల్పనలను రుజువు చేయడానికి అనేక చారిత్రక సంఘటనలను పరిగణనలోకి తీసుకొని వాటికి తగ్గ యదార్థాలను సేకరించుకోవడం జరుగుతుంది.

విజ్ఞాన శాస్త్రంలో ప్రాక్కల్పన నిరూపణ ఎక్కువగా పరిశీలనపైనా, ప్రయోగాలపైనా ఆధారపడి ఉంటుంది. చరిత్ర రచనలో యదార్థాల ను జాగ్రత్తగా పరిశీలించి తన ప్రక్కల్పనను నిరూపించడానికి చరిత్రకారుడు ప్రయత్నిస్తాడు. కాని గతాన్ని తనంత తానుగా ప్రత్యక్షంగా పరిశీలించలేదు. శాస్త్రజ్ఞుడు యదార్థాలను ప్రత్యక్షంగా పరిశీలించి కావాలనుకుంటే మళ్ళీ మళ్ళీ ప్రయోగాలు చేసి ప్రాక్కల్పనను నిరూపించడానికి ప్రయత్నం చేస్తాడు. అయితే చరిత్రకారుడు తాను సేకరించిన యదార్థాల విశ్వసనీయతను అంతః విమర్శ, బాహ్య విమర్శల ద్వారా పరీక్షించి, సమన్వయ ప్రక్రియ ద్వారా యదార్థాల సామూహికీకరణ చేసి తన ప్రాక్కల్పనను నిరూపించడానికి ప్రయత్నం చేస్తాడు. ఈ సమయంలో తాను విషయ నిష్టతను సాధించడానికి ప్రయత్నం చేస్తాడు. ఈవిధమైన పద్ధతిలో చారిత్రక రచన జరుగుతుంది. కనుక చరిత్రను శాస్త్రం

ప్రాక్కల్పన విషయంలో చరిత్రకారునికి, శాస్త్రజ్ఞునికి మధ్య సామ్యం ఉంది. ఇద్దరూ అవసరమైన యధార్థాలను సేకరిస్తే అన్ని సమస్యలు సులభంగా పరిష్కారమౌతాయని అభిప్రాయపడతారు. అలాగే ఇద్దరూ శాస్త్రీయ సత్యం లేదా యదార్థం అనేవి పూర్తి సత్యం కావనీ, నిపుణుల ఒప్పుకున్న అభిప్రాయం మాత్రమే అని భావిస్తారు.

హెన్రీ పాయిన్ కేర్ అనే ఫ్రెంచ్ గణిత శాస్త్రజ్ఞుడు చెప్పినట్లు శాస్త్రజ్ఞుడు సాధారణ ఏకీకృత వాక్యాలను ప్రాక్కల్పనలుగా మార్చి వాటిని పరిశీలించడానికి ఉపయోగపడేట్లు తయారు చేసుకుంటాడు. అదేవిధంగా చరిత్రకారుడు కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తాడు. చరిత్రకారుని ప్రాక్కల్పన, శాస్త్రవేత్త ప్రాక్కల్పనలు రెండూ కూడా విషయం పట్ల అవగాహనను పెంపొందించటమే కాక భవిష్యత్తు ఆలోచనలకు అవకాశాన్ని కలిగిస్తాయి.

చరిత్రలో ప్రాక్కల్పనలు యుగ విభజన, భౌగోళిక విభజనల ఆధారంగా చేసుకుని జరుగుతాయి. ఇది అంత సహజమైనవి కావు. యుగ విభజన విషయంలో ఏ యుగం ఎప్పుడు అంతమైంది, ఏ యుగం ఎప్పుడు ప్రారంభమైంది అనే విషయాలను ఖచ్చితంగా చెప్పటం కష్టం. అదేవిధంగా భౌగోళిక సరిహద్దులను గుర్తించటం కూడా చాలా కష్టం. అయినా ఈవిధమైన ప్రాక్కల్పనలు చరిత్రలో తప్పనిసరి. ఇటువంటి ప్రాక్కల్పనల విషయంలో జార్జి సోరెల్ అనే భౌతిక శాస్త్రవేత్త పేర్కొన్న పాక్షికమైన, నమ్మదగ్గ ప్రాకల్పనలతో ప్రయత్నించి, తాత్కాలికమైన నిర్ణయాలు వచ్చినా సంతృప్తి చెందాలి అనే అభిప్రాయం చక్కగా సరిపోతుంది.

చరిత్ర రచన ఆధారాలు, యదార్థాలు ప్రామాణిక శాస్త్రాల్లాగే శాస్త్రీయ పరిశీలనకు భిన్నంగా ప్రయోగాల్లో నిరూపించేవి కావు. అయితే చరిత్రను శాస్త్రవేత్తలా విమర్శనాత్మక తార్కిక కోణంతో పరిశీలించి సాధారణీకరణను చేయడం ద్వారా చరిత్ర శాస్త్రానికి దగ్గర అవుతుందని చెప్పవచ్చు.

## 6.10 చరిత్ర కళా?

చరిత్రకు వున్న కొన్ని ప్రత్యేక లక్షణాలను బట్టి చరిత్రను కళ అని కూడా భావించటం జరిగింది. చరిత్ర సాహిత్యం లేదా సంగీతం వంటి కళలకు భిన్నమైంది కాదని కొందరి అభిప్రాయం. గతాన్ని పునర్నిర్మించడమే చరిత్రకారుని ప్రధాన కర్తవ్యం. వక్రీకరించి చెప్పిన అంశాలు, అసంపూర్ణమైన వర్ణనలు, అసంపూర్ణగా మరిచిపోయిన విషయాలు వంటివి అనేకం చరిత్రలో యదార్థాలుగా వస్తాయి. ఆ సందర్భంలో చరిత్రకారుని ఊహాశక్తి, కళాకారునిగా ఒక విషయానికి న్యాయం చేయాలనే కృషి చరిత్రను కళగా పరిగణించడానికి దోహదపడుతుంది.

చరిత్రకారుడు గొప్ప పండితుడు, ఆలోచనా సరళిని వివిధ కోణాల్లో భావవ్యక్తీకరణ చేయగల నైపుణ్యంవున్న కళాకారుడు. చరిత్రలోని వాఙ్మయ స్వభావానికి కార్లైల్, మెకాలేలు ఎక్కువ ప్రాధాన్యత నిస్తారు. విక్టోరియా యుగంలోని చరిత్ర రచనా శైలిలోని వాఙ్మయ పోకడలు ప్రస్ఫుటంగా కనిపిస్తుంటే, వాటిని గొప్ప వాఙ్మయ కళాఖండాలుగా పేర్కొన్నారు.

అంతేకాకుండా చరిత్రకారుని ప్రధాన కర్తవ్యం గతాన్ని నిర్మించటం. ఇందులో భాగంగా సేకరించిన యదార్థాలను తన భావనా శక్తితో, విలువలకు సంబంధించిన అవగాహనతో భావవ్యక్తీకరణతో గతాన్ని నిర్మించడానికి ప్రయత్నిస్తాడు. తన భావనా పటిమతో కళాత్మకమైన శైలిలో గతాన్ని చక్కగా వర్ణిస్తాడు. కాబట్టి దీన్ని కళ అని అనేకమంది వాదిస్తారు.

చరిత్ర సంస్కృతి, కళలను గురించి చెప్పే సమయంలో మానవ నైజం, రాజులు, వారి పాలనా కాలం, ఆర్థిక సాంఘిక పరిస్థితులను తెల్పడంలో కళాభావం ఎక్కువ కన్పిస్తుంది. విషయ వ్యక్తీకరణలో, రాసే విధానంలో, మేధాసంపత్తిలో చరిత్ర రచనను ఒక కళగా భావించినా ఆధునిక కాలంలో దాని పరిశోధనా విధానం, చెప్పే రీతి, చరిత్ర కళకంటే శాస్త్రానికే దగ్గరగా ఉంటుంది. అందువల్లనే ట్రెవిలియన్ అనే చరిత్రకారుడు చరిత్రలో కళ, శాస్త్ర లక్షణాలు రెండూ ఉంటాయని పేర్కొన్నాడు.

అయితే చరిత్ర రచనలో చేసే శాస్త్రీయ పద్ధతిలో అన్వేషణ, సత్య నిరూపణకు జరిగే కృషి, రచనలో కన్పించే విషయ నిష్ఠత వంటివి చరిత్రను శాస్త్రంగా చెప్పడానికి దోహదం చేస్తాయి. అనేక వాదనల పరిశీలనానంతరం చరిత్రను ఒక శాస్త్రంగానే మనం చెప్పవచ్చు.

## 6.11 సమీక్ష:

చరిత్ర శాస్త్రమా? లేదా కళా? అనే అంశం పై వివాదాలు తలెత్తి అనేక వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. ఇలాంటి స్థితిలో చరిత్ర శాస్త్రం అని చెప్పేందుకు చరిత్ర రచనలో అనుసరించే విధానాలు, ప్రధానంగా ఇందులో సాధారణీకరణ, గుణ పాఠాలను నేర్చుకోడం, భవిష్యత్తును ఊహించడం, విషయ నిష్టతను సాధించడానికి ప్రయత్నించడం, మతం, నీతులతో సంబంధం లేకపోవడం వంటి కారణాలను పరిశీలించి చివరకు చరిత్ర శాస్త్రం అని చెప్పడం జరిగింది. అలాగే కళకు వున్న లక్షణాలు కూడా చరిత్రకు వుండడం వల్ల చరిత్రను కళ అని అనవచ్చా అని కూడా పరిశీలించి చివరకు చరిత్రను శాస్త్రం గానే చెప్పడం సబబు అని నిర్ణయించడం జరిగింది.

## 6.12 వ్యాసరూప ప్రశ్నలు:

1. చరిత్ర శాస్త్రమా? లేదా కళా? వివరించండి.
2. చరిత్రను శాస్త్రం అని ఏ విధంగా చెప్పవచ్చో వివరించండి.

## 6.13 ఉపయుక్త గ్రంథాలు:


1. %What is History? - Carr, E.H.
2. The Idea of History - Collingwood, R.G.
3. History: Its Theory and Method - Sheik Ali, B.
4. Historiography - History in Theory and Method - Rajayyan, K.
5. చరిత్ర రచనాశాస్త్రం (తెలుగు అకాడమి ప్రచురణ) - జె. దుర్గా ప్రసాద్


**డాక్టర్ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర రావు**

**యూనిట్ - 3**

## పరిశోధన పద్ధతి

**పాఠం 7**

## డేటా సేకరణ మరియు ఎంపిక

**లక్ష్యాలు:**

విద్యార్థులు ఈ అధ్యాయాన్ని చదవడం ద్వారా వాస్తవాలు మరియు సాక్ష్యాల సేకరణ మరియు ఎంపిక విధానాలు, చారిత్రక పరిశోధనలో వాస్తవాల భావన మరియు స్వభావాన్ని వివరించడం. చారిత్రక వాస్తవాలను శోధించడం, సమూహం చేయడం మరియు వర్గీకరణ ప్రక్రియ గురించి చర్చించడం వంటి విషయాలను అర్థం చేసుకుంటారు.

**విషయ క్రమము:**


**7.1 పరిచయం**

**7.2 డేటా సేకరణ మరియు ఎంపిక**

**7.3 పరిశోధన అంశము మరియు సమాచారం ఎంపిక**

**7.4 సమాచార సేకరణ**

**7.5 గుణాత్మక సమాచార సేకరణ పద్ధతులు**

**7.6 ప్రమాణాత్మక సమాచార సేకరణ పద్ధతులు**

**7.7 సమీక్ష**

**7.8 వ్యాసరూప ప్రశ్నలు**

**7.9 ఉపయుక్త గ్రంథాలు**


### 7.1 పరిచయం:

చరిత్రకారుడు చేసే పరిశోధన కొరకు అనేక డాక్యుమెంట్లను పరిశీలించవలసి వస్తుంది. ఈ ఆధారాలను విశ్లేషించిన తర్వాత పరిశోధనాంశంపై ఒక అవగాహన వస్తుంది. ఈ అవగాహన పరిశోధకుడికి సహాయపడుతుంది. సమాచారాన్ని ఎంపిక చేసుకోవడంలో మరియు సేకరించటంలో ఎంతో జాగరూకత అవసరం. చారిత్రక సిద్ధాంతాలు, సంఘటనలు, విభిన్న సంఘటనల్లో సామాన్యత (commonness) మరియు ఆ సంఘటనల నుండి వాస్తవాలను నిష్పక్షపాతంగా విశ్లేషించటం పరిశోధకుడి దృక్కోణంపై ఆధారపడి ఉంటుంది. చరిత్ర పరిశోధనలో సంఘటనలతోపాటు నాటి రాజకీయ, ఆర్థిక, సాంఘిక ప్రభావాలను కూడా అధ్యయనం చేయవలసి వస్తుంది. కాబట్టి చరిత్ర పరిశోధకుడు భావన, వాస్తవం, కారణం మరియు ప్రభావం అనే నాలుగు అంశాలను సునిశితంగా పరిశీలించి

విశ్లేషిస్తే పరిశోధన ప్రయోజనకరమైనదిగా ఉంటుంది. సాధారణంగా పరిశోధనల్లో వాస్తవాలు వేర్వేరు స్థాయిలకు, వేర్వేరు ప్రదేశాలకు మరియు నిర్దిష్ట సమయానికి చెంది ఉంటాయి. వాస్తవాల మధ్య తేడాలను గుర్తించి, వాటిని ఉపభాగాలుగా విభజించి, ఒక్కో వాస్తవాన్ని క్షుణ్ణంగా పాఠకులకు అందించాలి. దీనికి శోధన ఎంతో అవసరం.

## 7.2 డేటా సేకరణ మరియు ఎంపిక:

సమాచారాన్ని ఎంపిక చేసుకోవటం, సేకరించటం, వాటిని ఆధారంగా చేసుకొని గత సమాజపు జాడలను, కొత్తగా ప్రస్తుత సమాజానికి అర్థమయ్యేలా అందించాలి. అలానే ఈ సంఘటనల యొక్క ముఖ్య ఉద్దేశ్యం మరియు వాటి విశిష్టతను (Significance) వివరణాత్మకంగా వెలుగులోకి తేవాలి. సమాచార సేకరణలో పరిశోధకుడు ఈ క్రింది అంశాలను గుర్తుంచుకోవాలి.

**7.2.3 పరిశోధన అంశము మరియు సమాచారం ఎంపిక:** పరిశోధనకు ఎంచుకున్న అంశాన్ని పూర్తిగా అర్థం చేసుకోవాలి. దానిపై అప్పటికే ప్రచురితమైన లేదా అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలించాలి. పరిశోధనాంశానికి సంబంధించిన ఆధారాలను ఎంపిక చేసే క్రమంలో వందల కొద్ది ఆధారాలను చూడాల్సిన అవసరం ఉంది. వాటి ప్రాదేశికత, కాల నిర్ణయం, పరిధి లాంటి అంశాలకు ప్రాముఖ్యత ఇవ్వాలి.

## 7.4 సమాచార సేకరణ:

సమాచార సేకరణ అనేది పరిశోధనలకు సమాధానం ఇవ్వటానికి, పరికల్పనలను పరిష్కరించటానికి మరియు ఫలితాలను మూల్యాంకనం చేయటానికి వీలు కల్పిస్తుంది. పరిశోధనకు సంబంధించిన సమాచారాన్ని సేకరించటం అనే ప్రక్రియ సాంఘిక, భౌతిక, మానవీయ శాస్త్రాలకు సంబంధించిన అధ్యయన రంగాలలో సాధారణంగా ఒకేలా ఉంటుంది.

ఎంచుకున్న విషయాన్ని బట్టి సేకరణ పద్ధతులు మారుతూ ఉంటాయి, కాని ఖచ్చితమైన నిజాయితి గల ఆధారాలను నిర్ధారించటం కోసం ఇచ్చే ప్రాధాన్యత, డేటా సేకరణ యొక్క లక్ష్యం, నాణ్యత, విషయ సంగ్రహణ మొదలైన అంశాల సహాయంతోనే సమాచార విశ్లేషణ సులభతరమవుతుంది మరియు పరిశోధనలకు విశ్వసనీమైన సమాధానం దొరుకుతుంది. సమాచార సేకరణ సాధనాల ద్వారా ఉన్న, సవరించిన లేదా కొత్తగా అభివృద్ధి చేయబడిన విషయాలు మరియు వాటిని ఉపయోగించటానికి స్పష్టంగా ప్రతిపాదించబడ్డ సూచనలు రెండూ తెలుసుకోవచ్చు. సమాచార సేకరణ పరిశోధనలను నిర్వహించటంలో కీలక పాత్ర పోషిస్తుంది. పరిశోధకుడి దగ్గర ప్రపంచంలోనే అత్యుత్తమమైన పరిశోధనాంశం మరియు రూపకల్పన ఉన్నా కూడా సరైన డేటా సేకరించలేకపోతే పరిశోధన పూర్తి కాదు. డేటాను సేకరించటానికి ఓర్పు, ప్రణాళికా, కృషి మరియు పట్టుదల ఎంతో అవసరం. ఆధారాల సముద్రం నుండి సమాచారాన్ని ఎంపిక చేసుకున్న తర్వాత ఎంత మేరకు డేటా అవసరమో నిర్ణయించగలిగినప్పుడే డేటా సేకరణ ప్రారంభమవుతుంది. డేటా సేకరణ రెండు రకాలు 1) గుణాత్మక సేకరణ 2) ప్రమాణాత్మక సేకరణ.

## 7.5 గుణాత్మక సమాచారసేకరణ పద్ధతులు:

గుణాత్మక సేకరణ ఎక్కువగా సంఖ్యా పరమైనది. ఈ సేకరణ సాధారణంగా వివరణాత్మకంగా లేదా నామమాత్రంగా ఉంటుంది. అంటే సేకరించబడిన సమాచారం పదాలు, వాక్యాల రూపంలో ఉంటుంది మరియు భావాలను, భావోద్వేగాల అవగాహనలను సంగ్రహించడానికి తోడ్పడుతుంది. పరిశోధనను "ఎలా" మరియు "ఎందుకు" చేయాలి అనే అంశాల పరిష్కరణకు, వాటి అన్వేషణకు నిర్మాణాత్మక పద్ధతులు ఉపయోగపడతాయి. గుణాత్మక సమాచార పద్ధతిలో ఫోకస్ గ్రూప్‌లు, గ్రూప్ డిస్కషన్స్ మరియు ఇంటర్వ్యూలు ఉంటాయి. పరిశోధనాంశం యొక్క ప్రభావాలు మరియు అనాలోచిత పరిణామాలను లోతుగా పరిశీలించటానికి గుణాత్మక సేకరణ పద్ధతులు మంచివి. పరిశోధన యొక్క ఫలితాలను అర్థం చేసుకోవటానికి, అవగాహనలను అంచనా వేయటానికి, గుణాత్మక సేకరణ పద్ధతులు ముఖ్య పాత్ర పోషిస్తాయి. మూల్యాంకన పరికల్పనను రూపొందించటం కొరకు, సర్వే ఆధారిత ప్రమాణాత్మక మూల్యాంకనాల నాణ్యతను మెరుగుపరచటానికి ఈ సేకరణ పద్ధతిని ఉపయోగించవచ్చు.

ఫీల్డ్ నోట్స్, స్కెచ్ లు, ఛాయాచిత్రాలు, ఆడియోటేప్‌లు మొదలైన మార్గాలను ఉపయోగించి సమర్ధవంతమైన సమాచారాన్ని పూర్తిగా, ఖచ్చితంగా రికార్డ్ చేయాలి. డేటా సేకరణ పద్ధతులు పరిశోధన యొక్క నైతిక సూత్రాలను పాటించాలి. మూల్యాంకనంలో సాధారణంగా ఇంటర్వ్యూ, పత్ర సమీక్ష మరియు పరిశీలన పద్ధతులు అనే అంశాలుంటాయి.

## 7.6 ప్రమాణాత్మక సమాచార సేకరణ పద్ధతులు:

ఈ పద్ధతి విభిన్న ఆధారాలను సంగ్రహించటానికి, సరిపోల్చటానికి మరియు సాధారణీకరించటానికి సులభమైనది. సాధారణంగా చరిత్ర ప్రత్యక్ష పరిశీలన శాస్త్రాల నుండి భిన్నంగా ఉంటుంది. అయితే ఏ స్థాయికి ఈ వాస్తవాలను కుదించాలి మరియు భిన్నమైన వాటిని ఎలా సేకరించాలి అనే విచారణ పరిశోధకుడిపై ఆధారపడి ఉంటుంది. పరిశోధనలో ప్రమాణాత్మక పద్ధతులు విభిన్న అంశాలకు సంబంధించిన వాస్తవాలను అధ్యయనం చేయడానికి చరిత్రకారుణ్ణి ప్రేరేపిస్తాయి. చరిత్ర అధ్యయనం, పరిశోధనలను అసంబద్ధమైన సూక్ష్మ వాస్తవాలతో నిర్వహించాలి.

చారిత్రక పరిశోధనలకు సమాచారాన్ని సేకరించే ముందు క్రమబద్ధమైన ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. డేటా యొక్క ముఖ్యమైన మూలాల్ని గుర్తించి, దానికోసం ఏ సమాచారం అవసరమో పరిశోధకుడు తెలుసుకోవాలి. సంబంధిత డేటా కోసం శోధన దిశను నిర్ధారించుకొని, తన జ్ఞానం, ఊహ మరియు వనరులను వినియోగించి, డేటాను సేకరించి, విశ్లేషించి, వివరించేందుకు ప్రమాణాత్మక సేకరణ పద్ధతి సహాయపడుతుంది. ఈ పద్ధతిలో పరిశోధనాంశాన్ని మూలాల నుండి తెలుసుకోవడానికి గ్రంథ పట్టికలు, జీవిత చరిత్రలు, అట్లాస్‌లు, ప్రత్యేక కాలక్రమాలు మరియు ఇతర సామాగ్రిని వివిధ లైబ్రరీల నుండి సేకరించాలి. ఈ సేకరణ అధ్యయనాంశంపై విలువైన మూలాలు గుర్తించటానికి వీలు కల్పిస్తుంది. అదే విధంగా సేకరించిన అంశాల ప్రామాణికతను నిర్ధారించటానికి ప్రాథమిక, ద్వితీయ మూలాలను మూల్యాంకనం చేయాలి మరియు వీలైనన్ని ఆధారాలను గుర్తించి ఉపయోగించాలి. పరిశోధనాంశం ఒక కాలక్రమం, భౌగోళిక క్రమం లేదా వివిధ సంఘటనల ఆధారంగా ఉన్నట్లయితే లాజికల్ ఆర్డర్‌ను ప్రత్యేకంగా ఉపయోగించటం అసాధ్యం. అక్కడి భౌగోళిక పరిస్థితులను, సామాజిక కట్టుబాట్లను తెలుసుకోకుండా చరిత్ర పరిశోధనకు పూనుకోరాదు. ఉదాహరణకు ప్రాచీన భారతదేశ చరిత్ర రచించిన విదేశీయుల మనోభావాలు, ఊహలు భారతీయులకు భిన్నంగా ఉండవచ్చు. మిల్ యొక్క 'హిస్టరీ ఆఫ్ ఇండియా' లేదా విల్స్ 'హిస్టరీ ఆఫ్ మైసూర్' చదివే చరిత్ర పరిశోధకులకు పూర్తిగా భిన్నమైన భారతదేశం కనిపిస్తుంది. అలాగే విన్సెంట్ స్మిత్ రాసిన 'ఆక్స్ ఫర్డ్ హిస్టరీ ఆఫ్ ఇండియా' మరియు 'అక్బర్ -ది గ్రేట్ మొఘల్' వంటి రచనలలో కొంత విభిన్నమైన దృక్పధాలు కనిపించినప్పటికీ, వాటినే ప్రామాణికంగా తీసుకోవటంలో కొన్ని ఇబ్బందులు లేకపోలేదు.

అందువల్ల చరిత్ర పరిశోధకులు వాస్తవాలను దేశానికి, జాతికి, రాజవంశానికీ లేదా ఏదైనా ఒక నిర్ణీత కాలానికి కట్టుబడి వ్రాసేటప్పుడు తార్కిక క్రాస్‌చెక్‌లు చేసుకోవాలి. ఇది చాలా సున్నితమైన విషయం. దీన్ని వివరణాత్మక చరిత్ర ద్వారానే సాధించగలం. చరిత్ర పరిశోధనలో సామూహిక, సాధారణ మరియు మన్నికైన ఆధారాలను ఎన్నుకోవాలి. సమాజంలోని వ్యక్తిగత, నిర్దిష్టమైన మరియు ఆసక్తికరమైన అంశాలను కూడా విశ్లేషించి వివరించాలి. అలానే చరిత్ర యొక్క పరిశోధన ఒక కుర్చీకి పరిమితం అని అనుకోకూడదు. ముద్రిత, అముద్రిత ఆధారాల కోసం పేరు పొందిన లైబ్రరీలు, ఆర్కైవ్లను సందర్శించాలి. ప్రైవేటు వ్యక్తులు, రిపాజిటరీల వద్ద ఉన్న ఆధారాలు మరియు బయటి ప్రపంచానికి తెలియని విషయాలను వెలికి తియ్యటం ద్వారా పరిశోధకుడు తనదైన ముద్రను పరిశోధనలో చూపించవచ్చు.

సమాచార సేకరణకు పరిశోధకుడు విస్తృత స్థాయిలో శోధించాలి. ఉదాహరణకు ఆంధ్ర రాష్ట్ర చరిత్ర కొరకు కేవలం ఆ రాష్ట్రంలోని ప్రదేశాలను మాత్రమే కాకుండా రాష్ట్ర సరిహద్దులను పంచుకొనే కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల చరిత్రను కూడా పరిశీలించవలసి రావచ్చు. అలానే అమరావతి స్థూప చరిత్ర గురించి పరిశోధించవలసి వచ్చినప్పుడు బ్రిటిష్ మ్యూజియం (లండన్), నేషనల్ మ్యూజియమ్ (కలకత్తా)లలో ఉన్న అమరావతి గ్యాలరీల సమాచారం తెలుసుకోవటం ఒక ప్రాథమిక అవసరం. పరిశోధకుడు ఏదైనా ఒక

ప్రాంతాన్ని, కాలాన్ని, సంఘటనను గురించి పరిశోధించే సమయంలో మూలాలకు సంబంధించిన అన్ని అంశాలను పరిగణించాల్సిన అవసరం ఉందని పైన పేర్కొన్న ఉదాహరణల ద్వారా తెలుస్తుంది.

పరిశోధనాంశానికి సంబంధించిన సమాచారం సుదూర ప్రాంతాలలో ఉన్నపుడు అక్కడికి నేరుగా వెళ్ళిగాని, ఫొటోస్టాట్‌ల రూపంలో గాని వేరే ఏదైనా మాధ్యమం ద్వారా సేకరించాలి గాని, దూరాభారాలను సాకుగా చూపి పరిశోధనాంశాన్ని కుదించకూడదు. దీనికోసం ఒక నిర్దిష్టమైన మానసిక స్థితి అవసరం. సమాచార సేకరణకు కాలం, ధనం, శారీరక శ్రమ మరియు మానసిక సంతులనం ప్రాథమిక అవసరాలు. కొందరు చరిత్రకారులు సమాచార సేకరణను ఒక సాహసవంతమైన పనిగా పేర్కొంటే, కొందరు దీన్ని మానసికంగా ఆనందాన్ని కల్గించే సాధనంగా పేర్కొన్నారు.

సమాచారాన్ని ఈ క్రింది 4 వర్గాల నుండి సేకరించవచ్చు.

a) ప్రత్యక్ష సాక్షులు

b) పరోక్ష సాక్షులు

c) మౌఖిక కథలు-జానపద గీతాలు

d) వ్రాత ప్రతులు

## 7.7 సమీక్ష:

- చరిత్ర పరిశోధకుడు భావన, వాస్తవం, కారణం మరియు ప్రభావం అనే నాలుగు అంశాలను సునిశితంగా పరిశీలించి విశ్లేషిస్తే పరిశోధన ప్రయోజనకరమైనదిగా ఉంటుంది. సమాచారాన్ని ఎంపిక చేసుకోవటం, సేకరించటం, వాటిని ఆధారంగా చేసుకొని గత సమాజపు జాడలను, కొత్తగా ప్రస్తుత సమాజానికి అర్థమయ్యేలా అందించాలి.
- సమాచార సేకరణ పరిశోధనలను నిర్వహించటంలో కీలక పాత్ర పోషిస్తుంది. పరిశోధకుడి దగ్గర ప్రపంచంలోనే అత్యుత్తమమైన పరిశోధనాంశం మరియు రూపకల్పన ఉన్నా కూడా సరైన డేటా సేకరించలేకపోతే పరిశోధన పూర్తి కాదు.
- ముద్రిత, అముద్రిత ఆధారాల కోసం పేరు పొందిన లైబ్రరీలు, ఆర్కైవ్లను సందర్శించాలి. ప్రైవేటు వ్యక్తులు, రిపాజిటరీల వద్ద ఉన్న ఆధారాలు మరియు బయటి ప్రపంచానికి తెలియని విషయాలను వెలికి తియ్యటం ద్వారా పరిశోధకుడు తనదైన ముద్రను పరిశోధనలో చొప్పించవచ్చు.

## 7.8 వ్యాసరూప ప్రశ్నలు:

1. సమాచారసేకరణ పద్ధతులను వివరించండి.

## 7.9 ఉపయుక్త గ్రంథాలు:


1. Sheik Ali -- History : Its Theory and Method.
2. Carr, E.H., - What is History?
3. H-G. Gadamer, Truth and Method, transl. W. Glen-Doepel (London, 1979), 232.
4. https://www.uregina.ca/arts/history/bibliography.html
5. https://alphahistory.com/problems-of-history

**పాఠం 8**

# సంశ్లేషణ విధానాలు మరియు పరిశోధన ఫలితాలు బహిర్గతం చేయటం

## లక్ష్యాలు:

ఈ అధ్యాయాన్ని చదవడం ద్వారా విద్యార్థులు సింథటిక్ మరియు విశ్లేషణాత్మక కార్యకలాపాల గురించి తెలుసుకుంటారు. పరిశోధన ఫలితాలను ఎలా బహిర్గతం చేయాలో విద్యార్థులకు తెలుస్తుంది.

## విషయ క్రమము:


8.1 సంశ్లేషణ విధానాలు మరియు పరిశోధన ఫలితాలు బహిర్గతం చేయటం - పరిచయం

8.2 వాస్తవాల అమరిక (నిర్దిష్ట వాస్తవాలను నిర్ణయించడం)

8.2.1 కాలక్రమ అమరిక

8.2.2 సమయోచిత అమరిక

8.2.3 ఇతర అమరికలు

8.3 వాస్తవాలను సమూహ పరచటం (Grouping of Facts)

8.4 నిర్మాణాత్మక తార్కికం (Constructive Reasoning)

8.4.1 సానుకూల తార్కికం (Positive Reasoning)

8.4.2 ప్రతికూల తార్కికం (Negative Reasoning)

8.5 పరిశోధన ఫలితాలు బహిర్గతం చేయటం (Exposition)

8.5.1 రచనా ప్రణాళిక (Writing plan)

ఎ) పరిచయభాగం (Introductory Part)

బి) సంబంధిత సాహిత్యం యొక్క సమీక్ష (Review of Literature)

సి) ముఖ్య అధ్యాయాలు (Key Chapters)

డి) ముగింపు (Conclusion)

8.5.2 రచనాశైలి (Writing style)

8.5.3 సాధారణీకరణ (Generalization)

8.6 సమీక్ష

8.7 వ్యాసరూప ప్రశ్నలు

8.8 ఉపయుక్త గ్రంథాలు

## 8.1 సంశ్లేషణ విధానాలు మరియు పరిశోధన ఫలితాలు బహిర్గతం చేయటం - పరిచయం:

పరిశోధనలో మొదట పరిశోధనాంశాన్ని ఎంచుకోవటం నుండి సమాచారం ఎంపిక మరియు సేకరణ (analytical operations) ప్రధాన అంశాలుగా ఉంటే అంతే సమానంగా రెండవ భాగంలో synthetic operations ఉంటాయి. Analytical operations ఒక పరిశోధకుడిని పరిశోధన కొరకు సన్నద్ధం చేస్తాయి. అదేవిధంగా పరిశోధనలో విభిన్న పద్ధతులు అనుసరించడానికి, పరిశోధనను పరిశోధకుడి దృష్టికోణంలో చూపించడానికి, అలానే పరిశోధనాంశంలోని విశిష్టాంశాలను వెలికి తియ్యటానికి synthetic operations ఎంతో అవసరం. పరిశోధనను మరింత ఆసక్తికరంగా మార్చటానికి ఈ పద్ధతులు పాటించాలి.

Analytical operations లో సమాచార సేకరణ scrutiny సమాచారంలోని విభిన్నతను (వైశిష్ట్యాన్ని) పరిశీలించటం, వంటి అంశాలు ఉంటే సంశ్లేషణాత్మక పరిశోధన పద్ధతుల్లో డేటాను చేర్చటం, ఏర్పాటు చేయటం, విశ్లేషించటం మరియు ఆసక్తికరంగా వివరించటం అనే ప్రక్రియలు విస్తృతంగా జరుగుతాయి. పరిశోధనకు అనువైన అన్ని శాస్త్రాల్లోనూ సమాచార సేకరణ, ఎంపిక ప్రక్రియ ఒకేలా ఉన్నప్పటికీ, సింథటిక్ ఆపరేషన్స్ వాటి సాంకేతికత మరియు సాంప్రదాయ శైలిని బట్టి మారుతూ ఉంటాయి.

బెహన్ మెక్ కల్లాఫ్ అనే చరిత్రకారుడు ఉత్తమ వివరణను పొందడం కోసం అనుసరించాల్సిన ఏడు వాదనలను పేర్కొన్నాడు. అవి -

1) ఇప్పటికే నిజమని నిరూపించిన ఇతర స్టేట్మెంట్‌లతో పాటు ప్రస్తుతం పరిశోధకుడు సూచిస్తున్న, పరిశీలించదగిన డేటాను, ఇతర డేటాలను తప్పని సరిగా చూపించాలి.

2) పరికల్పన (hypothesis) తప్పనిసరిగా విస్తృత పరిధిలో ఉండాలి మరియు విభిన్నంగా ఉండాలి.

3) పరిశోధకుడు సూచించే పరికల్పన ఇతర అనుకూల పరికల్పనల కంటే ఎక్కువ వివరణాత్మకంగా ఉండాలి మరియు ఎక్కువ సంభావ్యతను కలిగి ఉండాలి.

4) ముఖ్యంగా ఇతర పరికల్పనల కంటే బలంగా ఉండాలి, ఆమోద యోగ్యమైనదిగా ఉండాలి. దాని సంభావ్య తిరస్కరణ తక్కువ బలంగా ఉండాలి.

5) పరిశోధకుడు సూచించే పరికల్పన ఖచ్చితంగా గతంలో జరిగిన పరిశోధనల కంటే కొత్త ఊహలను కలిగి ఉండాలి. కొత్త ఊహలను చరిత్రాంశంలో చొప్పించే నెపంతో అంశాన్ని తప్పుదోవ పట్టించకూడదు.

6) పరికల్పన ఇప్పటికే ఆమోదించబడి ఉంటే దాన్ని సరైన నమ్మకాలతో ధృవీకరించాలి. అంటే అంగీకరించబడిన సత్యాలతో కలిపినప్పుడు కొత్త స్టేట్‌మెంట్స్ వెలువడతాయి.

7) పైన పేర్కొన్న 6 లక్షణాల్లో ఒకే అంశాన్ని ఇలా వివిధ అననుకూల పరిస్థితుల్లో అధిగమించి, విచారణ చేసి తర్వాత దాని పరిశోధనాఫలితాన్ని వెలువరించాలి.

Mc. Cullagh "ఒక వివరణయొక్క పరిధి మరియు బలం చాలా గొప్పగా ఉంటే, అది పెద్దసంఖ్యలో మరియు విభిన్నమైన వాస్తవాలను వివరిస్తుంది'' సింథటిక్ ఆపరేషన్స్‌లో ఈ క్రింది భాగాలు ఉంటాయి. ఎ) నిర్దిష్ట వాస్తవాలను నిర్ణయించటం, బి) వాస్తవాలను సమూహ పరచటం, సి) నిర్మాణాత్మక తార్కికం. పరిశోధనాంశాన్ని అర్థవంతంగా చేయటానికి డేటాను ఎలా అమర్చుకోవాలో చూద్దాం.

## 8.2 వాస్తవాల అమరిక (నిర్దిష్ట వాస్తవాలను నిర్ణయించడం):

వాస్తవాలను సమూహపరచడం లేదా అమర్చడం అనేది సింథటిక్. ఆపరేషన్స్‌లో ఎంతో కీలకమైనది పరిశోధనకు సంబంధించిన వాస్తవాలను ఖచ్చితమైన ప్రణాళిక ద్వారా వర్గీకరించాలి. ఎంపిక, సమూహం మరియు వాస్తవాల అమరిక సంశ్లేషణ ప్రక్రియలో భాగాలు. చారిత్రక వాస్తవాలను కాలక్రమం, అంశం, భౌగోళికం, వ్యక్తిత్వం, సంస్థ, సమస్య మరియు భావనల ఆధారంగా వర్గీకరించవచ్చు. పైన పేర్కొన్న ప్రతి పద్ధతిలోనూ దాని స్వంత ప్రయోజనాలు మరియు అప్రయోజనాలు ఉన్నాయి. వాస్తవాలను కాలక్రమ మరియు ఇతర అమరికల్లో పొందుపరచి విశ్లేషణాత్మకంగా వివరించాల్సి ఉంటుంది.

**8.2.1 కాలక్రమ అమరిక:** చారిత్రక నిర్మాణానికి కాలక్రమం ఆధారం అని చెప్పవచ్చు. కాలక్రమం చరిత్రకు వెన్నెముక వంటిది. తేదీలు లేకుండా నిజమైన చరిత్రను అందించడం అసంభవం మరియు అసంపూర్ణం. చరిత్రకారులు గతంలోని సంఘటనలను పురాతన, మధ్య యుగ మరియు ఆధునిక ఘట్టాలుగా విభజిస్తారు. కాలక్రమ అమరిక వాస్తవాలను ఒక వరుస క్రమంలో ముందుకు తెస్తుంది. అయితే ఈ అమరిక చారిత్రక అంశాలను, చరిత్రను కేవలం సంఘటనల జాబితాగా (list of events) మార్చే అవకాశం ఉన్నందున పరిశోధకులు జాగరూకతతో ఉండాలి.

**8.2.2 సమయోచిత అమరిక:** చారిత్రక వాస్తవాలను కేవలం కాలక్రమంగా కాకుండా విషయం ఆధారంగా కూడా అమర్చవచ్చు. అంశాలు లేదా ఇతివృత్తాల ఆధారంగా వాస్తవాలను సూచించేటప్పుడు, పరిశోధకుడు ఇంతకుముందు ఉన్న సరిహద్దులు దాటి విషయాన్ని శోధించటానికి ఇది ఉపయోగపడుతుంది మరియు చారిత్రక కథనాలకు మరింత పఠనీయతను అందిస్తుంది. సమయోచిత అమరిక అనేక వాస్తవాలను కలుపుతుంది. అయినప్పటికీ ఈ అమరిక కొంత కాలవ్యవధిలో జరిగిన ముఖ్యమైన మార్పులను విస్మరిస్తుంది.

**8.2.3 ఇతర అమరికలు:** వాస్తవాల యొక్క భౌగోళిక లేదా ప్రాంతీయ అమరికలు వివిధ ప్రాంతాలపై అధ్యయనాల్లో ఉపయోగించబడవచ్చు. జీవిత అధ్యయనాల్లో వ్యక్తిత్వ ఆధారిత అమరిక అవసరం. అలానే సామాజిక, ఆర్థిక సమస్యలను ప్రదర్శించేటప్పుడు సంస్థ ఆధారిత అమరికలు ఉపయోగించాలి. కొన్ని భావనల అభివృద్ధి ఆధారంగా చారిత్రక వాస్తవాలను కూడా వర్గీకరించవచ్చు.

## 8.3 వాస్తవాలను సమూహ పరచటం (Grouping of Facts):

పరిశోధనకు కావల్సిన వాస్తవాలను ముందుగా సేకరించుకోవాలి. వాటిలోని విభిన్న వాస్తవాలను పరిశీలించి బేరీజు వేసుకోవాలి. అందుబాటులో ఉన్న ప్రతి ఆధారం నిజమని నిర్ధారించుకోకూడదు. ఉదాహరణకు అక్బర్ మత విధానం గురించి శోధించే పరిశోధకుడికి అబుల్ ఫజల్, బదౌనీ, మౌన్సరేట్ (monserrate) మరియు నిజాముద్దీన్‌ల డాక్యుమెంట్లు లభించాయనుకోండి. పై నలుగురి అభిప్రాయాలు ఒకరికొకరు భిన్నంగా ఉంటాయి. పరిశోధకుడు అలాంటప్పుడు ఈ వైరుధ్య సమాచారాన్ని ఎలా పరిశీలించి పరిశోధనను అర్థవంతంగా, విశ్వసనీయంగా మారుస్తాడో అన్న అంశం కొరకు సంశ్లేషణ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ ప్రక్రియలో పరిశోధకుడు ఏ ఒక్క ఆధారానికి ఆకర్షితుడు కాకూడదు. అన్ని ఆధారాలను పరిశీలిస్తూ తనదైన పరికల్పనకు సానుకూల వివరణ ఇవ్వాలి. అలాగే కొన్ని ఆధారాలకు, వాస్తవాలకు మాత్రమే పరిశోధనను కుదించకుండా పరిశోధనాంశం తన స్వభావాన్ని కోల్పోకుండా చూసే బాధ్యత పరిశోధకుడిదే. ఎందుకంటే భారతదేశంలో చరిత్ర నిర్మాణం అన్ని వర్గాలు, జాతులు, మతాల వారిచే చేయబడుతోంది. కాబట్టి పరిశోధకులు జాతి, మత, వర్గ, లింగ పక్షపాతం లేకుండా తమ పరిశోధనకు న్యాయం చేయాలి.

తన పరిశోధనాంశానికి చెందిన గరిష్ట డేటా సేకరించాక మాత్రమే వాస్తవాల సమూహాన్ని మొదలుపెట్టాలి. ఎందుకంటే కాలక్రమం, విషయం, సంఘటనల ఆధారంగా చరిత్ర నిర్మాణం చేస్తున్నప్పుడు ఏ ఒక్క వాస్తవం తప్పిపోయినా లేదా ముగింపు

భాగాన్ని నిర్ధారిస్తున్నప్పుడు కొత్తగా ఒక వాస్తవం లేదా ఆధారం దొరికినా దాన్ని పరిశోధనలో చొప్పించటానికి చాలా ఇబ్బందులు ఉంటాయి. ఉదాహరణకు కాలక్రమ అమరికలో ఆధారాలను వరుస క్రమంలో కూర్చి థీసిస్‌ను తయారు చేస్తాం. అలాంటి సమయంలో ఏదైనా ఒక సంఘటనను, విషయాన్ని అక్కడ కలుపవలసి వస్తే, దాన్ని పరిశోధకుడి శోధనాంశంతో మిళితం చేయటానికి, తగిన పఠనీయత కలిగించటానికి చాలా శ్రమ పడవలసివస్తుంది.

చరిత్రలో ముఖ్యపాత్ర పోషించిన వ్యక్తులు, సంఘటనలు మరియు ఫిలాసాఫికల్ విషయాలను గురించి శోధించవలసి వచ్చినపుడు చరిత్రలో జరిగిన సంఘటనలను, నేటి సమాజంలో జరిగే సంఘటనలతో పోల్చి చూడకూడదు. ఎందుకంటే సమాజం తరచుగా పరివర్తనం చెందుతుంది. చరిత్రలోని సంఘటనలను శోధించే సమయంలో అప్పటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు తెలుసుకోవడం పరిశోధకుడి ప్రాథమిక లక్ష్యం. ఉదాహరణకు ఏదైనా సామ్రాజ్యం యొక్క చరిత్రను విశ్లేషించేటప్పుడు పరిశోధకుడు ఆనాటి వాతావరణం, భౌగోళిక స్థితి, రాజ్యం యొక్క రూపురేఖలు, వనరులు, నదులు, కొండలు, వ్యాధులు, సాంప్రదాయాలు, పన్నులు, నీటి పారుదల విధానాలు, వ్యవసాయ విధానాలు మొదలైన అంశాలన్నింటిని తెలుసుకొని ఉండాలి. విజయనగర సామ్రాజ్యం గురించిన అంశాన్ని వివరించేటప్పుడు ఆ రాజ్యం ఎంత విశాలమైనదో (territories) రాజ్యంలోని వాడుకలో ఉన్న ఆచార వ్యవహారాలు, సామాజిక జీవనం గురించి తెలుసుకోవాల్సి ఉంటుంది.

వారి భాష, కళలు, మతం, జీవనవిధానం మొదలైన ఆసక్తికర అంశాలపై పట్టులేకుండా నాటి చరిత్రలోని లోటుపాట్లను పూరించటం కష్టం. చాలామంది విదేశీ చరిత్రకారులు విజయనగర సామ్రాజ్యంలో చక్రవర్తులు అనేక రాణులను కలిగి ఉండటాన్ని విభిన్న ధోరణుల్లో వివరించారు. మధ్య యుగ భారతదేశంలోని వివాహ వ్యవస్థ, రాజకీయ లాభాల కోసం వివాహ సంబంధాలు జరుపుకోవటం వంటి రాజ్యపరిపాలనా సంబంధిత అంశాలపై అవగాహన లేకుండా కేవలం తాము చూసినది, విన్నది లేదా వ్రాయబడిన ఆధారాల ద్వారా చరిత్ర నిర్మాణం చేసినట్లయితే చదువరులను తప్పుదోవ పట్టించినట్లే.

## 8.4 నిర్మాణాత్మక తార్కికం (Constructive Reasoning):

సింథటిక్ ఆపరేషన్స్‌లో నిర్మాణాత్మక తార్కికం ఎంతో ముఖ్యమైనది. సరైన ఆధారాలు లేనప్పుడు, వాస్తవాలు తక్కువగా లభ్యమైనప్పుడు ఖాళీలను పూరించటానికి రీజనింగ్ (తార్కికం) అవసరం. ఇది సానుకూలంగా లేదా ప్రతికూలంగా కూడా ఉండవచ్చు. పరిశోధకుడు తాను పేర్కొన్న ముగింపును రూపొందించడానికి, సమర్ధించడానికి ప్రయత్నించే ప్రక్రియ ఇది. సానుకూల మరియు ప్రతికూల తార్కికాల గురించి తెలుసుకుందాం.

**8.4.1 సానుకూల తార్కికం (Positive Reasing):** చరిత్రకారులు ఇప్పటికే స్థాపించిన వాస్తవాల నుండి కొన్ని అనుమానాలను పొందేందుకు సానుకూల తార్కికం అనుమతిస్తుంది. ఈ ప్రక్రియలో చరిత్రకారులు ఒక డాక్యుమెంట్ యొక్క మద్దతుతో ఒక వాస్తవాన్ని స్థాపిస్తారు మరియు ఆ డాక్యుమెంట్‌లోని మరిన్ని వాస్తవాలను ఊహిస్తారు. ఇచ్చిన వాస్తవాల అధ్యయనం నుండి ఇతర వాస్తవాల ఉనికిని ఊహించి వెలికి తీస్తారు. సానుకూల ఆలోచన కోసం నిర్దిష్ట వాస్తవాలపై పూర్తి జ్ఞానం తప్పనిసరి.

**8.4.2 ప్రతికూల తార్కికం (Negative Reasoning):** ఈ ప్రక్రియలో చరిత్రకారుడు రికార్డులలో ఉన్న, ఖచ్చితమైన ఒక ప్రక్రియకు ఏ సూచనా లేకపోవడాన్ని బట్టి ఒక అంశాన్ని ఊహిస్తాడు. ఒక వాస్తవం యొక్క, ఉనికి యొక్క ఊహనే ప్రతికూల తార్కికం అంటున్నాం (assumption of the existene of a fatt) ఇది రికార్డులలో కనబడదు. కొన్ని వాస్తవాలు నమోదు చేయకపోయి ఉండవచ్చు లేదా తొలగించబడి ఉండవచ్చు. కొన్ని సందర్భాలలో కొంత కాలం ఉనికి కోల్పోవచ్చు. అదే విధంగా అధికార భయం కారణంగా కొందరు రచయితలు వాస్తవాలను నమోదు చేసి ఉండకపోవచ్చు. అందువల్ల ఎటువంటి డాక్యుమెంట్లు లేకుండా చారిత్రక పరిశోధనల్లో వాస్తవాలను రూపొందించడం ప్రతికూల ఫలితాలను ఇవ్వవచ్చు.

చివరగా నిర్మాణాత్మక తార్కికం ఆధారంగా అనుమానాలను (inferences) రూపొందించేటప్పుడు పరిశోధకుడు జాగ్రత్తగా ఉండాలి. అనేక అనుమానాలు ఒకే దిశలో సూచించినప్పుడు, దానిని వాస్తవంగా తీసుకోవచ్చు. అదేవిధంగా దానిలోని కొన్ని ఖాళీలను సానుకూల అంచనాలతో పూరించవచ్చు. నిర్మాణాత్మక తార్కికం, చరిత్ర నిర్మాణానికి అత్యంత సమర్థవంతమైన సాధనం. అప్పటిదాకా సేకరించిన విభిన్న ఆధారాలు, వాస్తవాలతో పరిశోధకుడు తన స్వీయ పరికల్పనను జతపరిచి ఒక నిర్దిష్ట రూపాన్ని తయారు చేస్తాడు. దీన్ని అనేక విడి భాగాలను జతపరిచి ఒక స్థూల యంత్రాన్ని తయారుచేసే ప్రక్రియతో పోల్చవచ్చు మరియు ఒక షాపు యజమాని వేర్వేరు ఏజన్సీల నుండి ముడి సరుకు తెచ్చి ఒకే పెద్ద సూపర్ మార్కెట్‌ను తయారు చేయడం వంటిది.

## 8.5 పరిశోధన ఫలితాలు బహిర్గతం చేయటం (Exposition):

చారిత్రక పరిశోధనలో ఎక్స్‌పోజిషన్ చివరిదశ. ముగింపు భాగాన్ని అత్యంత ఆకర్షణీయంగా మరియు ఆసక్తికరంగా ప్రదర్శించే ప్రక్రియ. ఇది థీసిస్ యొక్క వాస్తవ రచనను సూచిస్తుంది. ఇ ది చారిత్రక వాస్తవాలను విజ్ఞానవంతంగా నేటి సమాజానికి అర్థమయ్యేలా చూపించటానికి తోడ్పడుతుంది. వాస్తవికత, స్పష్టత మరియు నాణ్యత బహిర్గతం (Exposition) యొక్క లక్షణాలు. బహిర్గతం చేయవలసిన ఆలోచనలు తార్కిక క్రమంలో అమర్చబడాలి. కల్పన ప్రక్రియ, మూలాల ప్రదర్శన, విశ్లేషణ మరియు వివరణలను బహిర్గతం చేయటంలో కీలకపాత్ర పోషిస్తుంది.

**8.5.1 రచనా ప్రణాళిక (Writing plan):** థీసిస్‌ను సమర్పించడానికి ఒక చక్కటి ప్రణాళిక అవలంబించటం ఎంతో అవసరం. పరిశోధన నివేదిక ప్రక్రియలో థీసిస్ యొక్క కంటెంట్ అత్యంత ముఖ్యమైనది. నివేదిక నాణ్యతను ప్రధానంగా పరిశీలిస్తారు. ఇది పరిశోధకుడి స్వంత ఉత్పత్తి. పరిశోధకుడి సామర్థ్యం తెలిపే ప్రక్రియ. మొత్తం థీసిస్‌ను అధ్యాయాలు మరియు మరిన్ని ఉప-థీమ్‌లుగా విభజించాలి. థీసిస్‌ను ప్రదర్శించాల్సిన సాధారణ రూపాన్ని పరిశీలిద్దాం.

**ఎ) పరిచయభాగం (Introductory Part):** ఇది తప్పనిసరిగా పరిశోధన విచారణ ప్రకటనను కలిగి ఉంటుంది. ఈ అధ్యాయం యొక్క ముఖ్య ఉద్దేశ్యం అధ్యయనం యొక్క అవసరాన్ని మరియు పరిధిని సూచించడం. ఇది పరిశోధన అంశం యొక్క లక్ష్యాలు, సమస్య, పరికల్పనలు మరియు పరిశోధనా పరిమితులను నివేదిస్తుంది.

**బి) సంబంధిత సాహిత్యం యొక్క సమీక్ష (Review of Literature):** అంశంపై ఇప్పటికే ఉన్న పరిజ్ఞానాన్ని తప్పనిసరిగా పరిశీలించాలి. సమీక్ష అధ్యాయం సమస్య లేదా విచారణ వస్తువు అభివృద్ధికి అంకితం చేయబడింది. ఇది పరిశోధన నివేదికలోని బ్యాలెన్సింగ్ అధ్యాయం.

**సి) ముఖ్య అధ్యాయాలు (Key Chapters):** ముఖ్య అధ్యాయాలను ఇతివృత్తంగా, సమస్యాత్మకంగా లేదా ప్రస్తుత పరిశోధన సమస్యకు సరిపోయే ఏదైనా పద్ధతిలో విభజించవచ్చు. అధ్యాయాలలో అధ్యయనం యొక్క విభిన్న అంశాలను ప్రదర్శించడానికి ఉపశీర్షికలను ఉపయోగించవచ్చు. పరిశోధకుడు తన వాదనలను లేవనెత్తే ప్రదేశం ఇది. ఈ అధ్యాయాలు కొత్త వివరణలను చేరుకోవటానికి అందుబాటులో ఉన్న మూలాలను విశ్లేషించే అవకాశాన్ని అందించగలవు. ప్రస్తుత పరిశోధన సమస్యకు సంబంధించి చారిత్రక సత్యాన్ని స్థాపించడానికి ఇది అవకాశాన్ని కూడా అందిస్తుంది. ఈ అధ్యాయాలలో సాధారణీకరణ, సంభావితీకరణ మరియు సిద్ధాంతీకరణను రూపొందించవచ్చు.

**డి) ముగింపు (Conclusion):** ఈ భాగం అధ్యయనాన్ని ముగిస్తుంది. ఇది అధ్యయనం యొక్క ముఖ్యమైన ఫలితాలు కూడా తెలియజేస్తుంది. పరిశోధకుడి శోధనలో పురోగతిని మరియు అదే అంశంపై తదుపరి పరిశోధన కోసం సూచనలను కూడా తెలియజేస్తుంది.

**8.5.2 రచనాశైలి (Writing Style):** పరిశోధనను వ్రాయటానికి భాష అనే సాధనం ఎంతో అవసరం. చరిత్రకారులు సాధారణంగా ప్రజలు చదివి అర్థం చేసుకోగలిగే భాషలో పరిశోధనను వ్రాస్తారు. ఇది ఖచ్చితంగా థీసిస్‌ను ఆకర్షణీయంగా మారుస్తుంది.

అలానే చరిత్రకారులు సమకాలీన ప్రేక్షకులను ఆకట్టుకునే చారిత్రక కాలం, సంఘటన లేదా పాత్ర యొక్క స్ఫూర్తిని సంగ్రహించే భాషలో వ్రాయడానికి ఆసక్తి చూపుతారు. చరిత్రకారుల భాష సాధారణంగా సూటిగా, సరళంగా అర్థమయ్యేలా ఉండాలి. అయితే సాక్ష్యం లేదా వాదనల సంక్లిష్టత ఉండవచ్చు. చాలామంది ప్రజలు చదవగలిగేలా మరియు అర్థం చేసుకొని ఆనందించేలా రచనాశైలి ఉండాలి కాని, పరిశోధకుని యొక్క భాషా నైపుణ్యం తెలిపేలా ఉండకూడదు. కాబట్టి వాడుక భాషను, సాధారణ భాషను బాగా ఉపయోగించడం అనేది చరిత్రకారుల యొక్క అతి ముఖ్యమైన లక్ష్యంగా ఉండాలి. పరిశోధన రచనను పాఠకుడికి మరియు పరిశోధకుడికి మధ్య గల సంభాషణ అని ఆలోచిస్తే పరిశోధనాంశం మరింత సులభతరమైన భాషలో వెలువరించే అవకాశాలు ఎక్కువవుతాయి. పరిశోధనలో వాడిన భాష ప్రెజెంటేషన్‌లో స్పష్టంగా, చదవడానికి సులభంగా మరియు స్టేట్‌మెంట్‌లలో ఖచ్చితమైనదిగా ఉండాలి. థీసిస్ వ్రాసే సమయంలో ఈ క్రింది అంశాలని గుర్తుంచుకోవాలి.

1) పఠనీయత మరియు ప్రదర్శన యొక్క ఫ్లో

2) వాదనల్లో స్పష్టత

3) భాష పై కమాండ్

4) కష్టతరమైన భాషకు దూరంగా ఉండటం

5) లాజికల్ పేరాగ్రాఫింగ్

6) విరామ చిహ్నాలు మరియు కొటేషన్ల సరైన ఉపయోగం

7) సాంకేతికత నిబంధనలను వివరించాలి

8) వివరణ యొక్క స్పష్టత

9) సంక్లిష్ట వాక్యాలకు దూరంగా ఉండాలి

10) నేను, మేము మీరు, నా, మా మరియు మేము అనే వ్యక్తిగత పదాలను నివారించాలి

11) ముందుగా నిర్దేశించిన లక్ష్యాలకు సమాధానాలను కనుగొనే మార్గం పై రచన దృష్టి కేంద్రీకరించాలి.

**8.5.3 సాధారణీకరణ (Generalization):** సాధారణీకరణ అనేది వాస్తవాల మధ్య సంబంధాన్ని ఏర్పరచడం ద్వారా సూత్రాలు, సిద్ధాంతాలు మరియు భావనలను రూపొందించే ప్రక్రియ. ఇది ఎక్స్‌పోజిషన్‌లో ఒక భాగం. సాధారణీకరణ ప్రక్రియ వాస్తవాల సమూహంతో ప్రారంభమౌతుంది. వాస్తవాలను దాని సారూప్యతలు మరియు అసమానతల ప్రకారం సమూహం చేయాలి. అమర్చాలి మరియు వ్యవస్థీకరించాలి. తదుపరి దశను సీరియలైజేషన్ అంటారు. ఇది పరిశోధన ప్రణాళిక ప్రకారం సంఘటనలను సంధానం చేస్తుంది.

వాస్తవాలను తర్కించడం మరియు మరింత వివరించడం తదుపరి దశ. ఇది పరిశోధకుడికి తన వాస్తవాలను ఒక నిర్దిష్ట పద్ధతిలో నిర్వహించడానికి సహాయపడుతుంది. అవగాహనను ప్రోత్సహిస్తుంది. వాస్తవాల మధ్య సంబంధాన్ని ఏర్పరచడం అనేది సాధారణీకరణ యొక్క తదుపరి దశ. ఈ వాస్తవిక సంబంధం పరిశోధకుడికి సాధారణ పథకాలు లేదా సూత్రాలను వివరించడానికి వీలు కల్పిస్తుంది. ఇది సాధారణ ప్రకటనలు చేయడానికి మరియు భావనలను, సిద్ధాంతాలను రూపొందించడానికి పరిశోధకుడికి సహాయపడుతుంది. సాధారణీకరణ అనేది సమతుల్య విధానంపై ఆధారపడి ఉండాలి. (Balanced approach).

## 8.6 సమీక్ష:

- సంశ్లేషణాత్మక పరిశోధన పద్ధతుల్లో డేటాను చేర్చటం, ఏర్పాటు చేయటం, విశ్లేషించటం మరియు ఆసక్తికరంగా వివరించటం అనే ప్రక్రియలు విస్తృతంగా జరుగుతాయి. సింథటిక్ ఆపరేషన్స్‌లో ఈ క్రింది భాగాలు ఉంటాయి. ఎ) నిర్దిష్ట వాస్తవాలను నిర్ణయించటం, బి) వాస్తవాలను సమూహ పరచటం, సి) నిర్మాణాత్మక తార్కికం.
వివరించే సాధనమే చరిత్ర. చరిత్ర ప్రధాన ఉద్దేశం మానవుని కార్యక్రమాల గురించి కావున ఈ శాస్త్రాన్ని మానవ శాస్త్రాలలో ఒకటిగా పరిగణించబడింది. ఇటీవలి కాలంలో చరిత్ర అధ్యయన ప్రాధాన్యత అన్ని రంగాలలో గణనీయమైన స్థాయిలో అభివృద్ధి చెందుచున్నది. మానవ కార్యకాలాపాలను అధ్యయనం చేయడం వలన చరిత్ర పరిధి చాలా విస్తృతమైనది. అన్ని సామాజిక, విజ్ఞాన శాస్త్రాలతో చరిత్రకు చాలా దగ్గరి సంబంధం వుంటుంది. "చరిత్ర కేవలం ఒక పాఠ్యాంశ అధ్యయనం మాత్రమే కాదు, సమస్త అధ్యయనాల నిలయం వంటిది'' అని డాక్టర్ ట్రెవిలియన్ అభిప్రాయపడ్డారు. వివిధ శాస్త్రాలతో చరిత్ర సన్నిహిత సంబంధాలను కలిగి వుంటుంది. చరిత్ర గతం గురించి తెలియజేస్తూ గత మానవుల జీవిత మరియు పరిసరాలపై ఆధారపడి వుంటుంది. అందువలన చరిత్రకారులు గత మానవుని అవశేషాల గురించి అధ్యయనం చేయగలిగే పురావస్తు శాస్త్రం, పురాజీవశాస్త్రం, నైసర్గిక స్వరూపాన్ని తెలుసుకొనుటకు భౌగోళిక శాస్త్రం, ఇలా చరిత్రకారుడు అనేక మానవ శాస్త్రాల, ఆయా శాస్త్రాల శాస్త్రజ్ఞుల మీద ఆధారపడుట సాధారణం. ఒక్క మాటలో చెప్పాలంటే చరిత్ర అనే శాస్త్రం అన్ని శాస్త్రాలకు ఒక బండి కి వున్న ఇరుసు లాంటిది. చరిత్ర అనే కేంద్రం చుట్టూ ఇతర శాస్త్రాలు తిరుగుతూ వుంటాయి. అన్ని సామాజిక శాస్త్రాలు కలిసే కూడలిగా చరిత్రను పేర్కొనవచ్చును. ఈ భాగంలో చరిత్రకు ఇతర సామాజిక శాస్త్రాలతో గల సంబంధాన్ని తెలుసుకొందాం.

## 12.2 పురావస్తు శాస్త్రం- అర్థం-పరిధి- ప్రాధాన్యత:

పురాతన వస్తువులను గూర్చి విశదీకరించే శాస్త్రాన్ని పురావస్తు శాస్త్రం లేదా పురాతత్వ శాస్త్రం అని అంటారు. పురాతన వస్తువులు అనగా ప్రాచీన రాతి పనిముట్లు, మట్టి పాత్రలు, లోహపరికరాలు, శిథిలమైన కట్టడాలు, శాసనాలు, నాణాలు, శిల్పాలు, చిత్రాలు, ఇతర భౌతికమైన అవశేషాలు మొదలైనవి. ఇవి యాదృచ్ఛికంగా గానీ, త్రవ్వకాలలో గానీ బయటపడవచ్చు. ఈ విధముగా లభించిన వస్తువులను క్షుణ్ణంగా పరిశీలించి అప్పటి ప్రజల జీవన విధానం, వారి సామాజిక, ఆర్థిక, మత, మరియు సాంస్కృతిక అంశాలను వెలుగులోకి తెస్తారు. కనుకనే ఆర్. ఇ. ఎమ్. వీలర్ అనే పండితుడు " పురావస్తు శాస్త్రవేత్త త్వ్వేది వస్తువులను కాదు, ప్రజలను'' అని చక్కగా పేర్కొన్నాడు. పురావస్తు శాస్త్రాన్ని ఆంగ్లంలో 'ఆర్కియాలజీ' (Archaeology) అని అంటారు. ఆర్కియాలజీ అనే పదం 'ఆర్కియాస్' (Arkhaios), 'లాగోస్' (Logos) అనే రెండు గ్రీకు పదాల నుండి ఉద్భవించింది. ఆర్కియాస్ అంటే ప్రాచీన లేదా పురాతన, లాగోస్ అంటే జ్ఞానమని అర్థం. పురావస్తు శాస్త్రాన్ని అధ్యయనం చేయడం వలన చరిత్ర పునర్నిర్మాణంనకు, చరిత్ర రచనకు గణనీయమైన అవకాశాలు గలవు.

పురావస్తు శాస్త్రానికి కొన్ని పరిధులు గలవు. ప్రాచీన మానవుని కార్యకలాపాలు అన్నింటినీ పురావస్తు శాస్త్రం వివరించలేదు. ఉదాహరణకు ప్రాచీన మానవుడు ఉపయోగించిన పనిముట్లు విషయంలో ఖచ్చితంగా ఫలానా పనికి మాత్రమే ఫలానా పనిముట్టు వాడారని చెప్పలేము. అలాగే ప్రాచీనుల విశ్వాసాలు, నమ్మకాలు వారి నీతి నిజాయితీ మొదలగు అంశాల గురించి పురావస్తు శాస్త్రం వివరించలేదు. చరిత్ర రచనలో పురావస్తు శాస్త్రానికి అధిక ప్రాధాన్యత గలదు. ముఖ్యంగా భారతదేశంలో పురావస్తు పరిశోధనల వలన సింధూ నాగరికతను ఆవిష్కరించిన తర్వాత దేశ చరిత్రను కొన్ని శతాబ్దాలను వెనుకకు తీసుకొని వెళ్ళింది. కొన్ని మత గ్రంథాలు నిర్ణయించిన కాలం కంటే భూమి మరియు ఆ భూమి మీద నివసించే జీవరాశులలో మానవులు ఎంతో ప్రాచీనులని పురావస్తు శాస్త్రం నిరూపించగలిగింది. లిఖిత ఆధారాలు లేని పూర్వ యుగ చరిత్రకు పురావస్తు పరిశోధనలే ఆధారం. పురావస్తు ఆధారలైన శాసనాలు, నాణాలు, శిథిల భవనాలు, ఆయుధాలు, శిల్పాలు, చిత్ర లేఖనాలు మొదలగునవి చరిత్ర రచనలో వాస్తవ దృక్పథాన్ని కలిగి వుంటాయి. నేడు దాదాపు ప్రతి చారిత్రక ప్రాముఖ్యత కలిగిన స్థలాలకు, అవశేషాలకు,పురావస్తు శాస్త్రం వివరణ , వ్యాఖ్యానం ఇస్తున్నది.

## 12.3 పురావస్తు శాస్త్రం నకు, చరిత్ర కు గల సంబంధం:

చరిత్రకు, పురావస్తు శాస్త్రానికి దగ్గర సంబంధం కలదు. చరిత్ర ఊహాలతో అల్లే కట్టు కథ కాదు. ఆధారాల సహితంగా సంఘటనలను ఒక వరుసక్రమములో కూర్పు చేయవలెను. సాధారణంగా చరిత్రకారుడు లిఖిత ఆధారాలపై చరిత్ర రచనను

కొనసాగిస్తాడు. కొన్ని సందర్భాలలో కొన్ని సంఘటనలకు, కొందరి వ్యక్తుల పాత్రలకు పొంతన వుండదు. అటువంటి సమయంలో పురావస్తు ఆధారాలతో కూడిన పరిశోధనలు ఉపయోగపడుతాయి. చరిత్రకారుడు మొదటగా లిఖిత ఆధారాల సహాయంతో చరిత్ర రచనను కొనసాగిస్తే, పురావస్తు శాస్త్రజ్ఞుడు మాత్రం మొదటగా అన్వేషణ జరిపి, తదుపరి ఉత్కతనం చే ప్రాచీన వస్తు సముదాయాన్ని సేకరించుకొని ఆధారాలను బట్టి చరిత్రకు ఉపయోగపడే విషయాలను రచన గావిస్తాడు. చరిత్ర పరిశోధనకు కావలసిన సమాచారాన్ని పురావస్తు శాస్త్రజ్ఞుడు అందజేయగలడు. ఉదాహరణకు సింధూనది నది నాగరికత ను చరిత్రలో చేర్చి అధ్యయనం చేయడం పురావస్తు శాస్త్రజ్ఞుల పరిశోధన ప్రకటనలే కారణం గా చెప్పవచ్చును. చరిత్ర రచనకు సహాయపడే లిఖిత ఆధారాలను ఖచ్చితత్వాన్ని ధృడపర్చుకొనేందుకు పురావస్తు శాస్త్రం ఉపయోగపడుతుంది. చరిత్ర పరిశోధకుడు లభించిన సమాచారాన్ని అంతా సేకరించి బహిర్గత, అంతర్గత, విమర్శ ద్వారా, పనికి వచ్చే ఖచ్చితమైన ఆధారాలను నిర్ణయం చేస్తాడు. ఇలాంటి నిర్ణయాలు చేయడానికి, పురావస్తు శాస్త్రజ్ఞుని తోడ్పాటు ఎంతో అవసరము. ఒక కాలానికి చెందిన సమాజ సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులను వెల్లడి చేయడానికి పురావస్తు శాస్త్రం ఎంతగానో ఉపయోగపడుతుంది.

## 12.4 భూగోళ శాస్త్రం -అర్థం-పరిధి-ప్రాధాన్యత:

జియోగ్రఫీ అనే మాట గ్రీక్ కు చెందిన భాషా పదం. గ్రీకులు భూగోళ శాస్త్రాన్ని మొదటిగా ప్రపంచానికి పరిచయం చేశారు. పాట్రిక్ గెడెజ్ అను భూగోళ శాస్త్రవేత్త అన్ని శాస్త్రాలకు భూగోళ శాస్త్రం సంశ్లేషణం అని, మాతృక అని పేర్కొన్నాడు. ఎరాటోస్థినిస్ క్రీ. పూ. 276-194 (Eratosthenes) అను అతను 'జియాగ్రఫీ' అను పదం ను మొదటగా వాడారు. అయితే ఇమ్మాన్యుయల్ కాంట్ అను జర్మన్ తత్వవేత్త భూగోళ శాస్త్రాన్ని చరిత్రకు ఆధారమని చెప్పాడు. భౌగోళిక పరిస్థితుల్ని గురించి అంచనా వేయకుండా చరిత్ర నిర్మాణం కొనసాగించడం సాధ్యం కాదు. చరిత్ర గతిని నిర్దేశించుటలో భౌగోళిక పరిస్తితులు ప్రముఖ పాత్ర వహిస్తాయని, చరిత్రకు భూగోళశాస్త్రానికి అత్యంత సన్నిహితముండుటచే రిచర్డ్ హక్లుయత్ (Richard Hakluyat) అను పండితుడు "ఈ సృష్టికి సూర్య చంద్రులు ఎట్టివారో, మానవులకు నేత్రములు ఎట్టివో, చరిత్రకు భౌగోళిక శాస్త్రము, చరిత్ర అధ్యయనంలు అట్టివి." అని పేర్కొన్నాడు. ప్రాచీన, మధ్యయుగ, ఆధునిక కాలాలలో అభివృద్ధి చెందిన శాస్త్ర సాంకేతిక అంశాలు భూగోళ శాస్త్రంతో ముడిపడి వున్నవి. భూగోళ శాస్త్రం ను చారిత్రకకోణం లో అధ్యయనం చేస్తే అంతర్జాతీయ మానవ సంబంధాలు మెరుగుపడుతాయి. భూగోళ శాస్త్రాన్ని మానవ భూగోళ శాస్త్రం, భౌతిక భూగోళ శాస్త్రం అను రెండు శాఖలుగా విభజించవచ్చును.

## 12.5 భూగోళ శాస్త్రంనకు, చరిత్రకు గల సంబంధం:

చారిత్రక అధ్యయనంలో భూగోళ శాస్త్ర ప్రాధాన్యతను మిచ్లెట్ (Michelet), లూసిన్ ఫెబ్వేర్ (Lucien Fabvare), మార్క్ బ్లోక్ (Marc Bloch) లు వివరించారు. స్థల నిర్దేశం లేకుండా చరిత్ర లేదు. భౌగోళిక పరిస్థితులే దేశ చరిత్రను నిర్దేశిస్తున్నాయి. భూమి ఉపరితల ఆకారం, భౌతిక లక్షణాలు, నైసర్గిక రాజకీయ విభాగాలు, శీతోష్ణస్థితి, ఉత్పత్తులు, జనాభా మొదలైనవి అన్ని మానవుని వ్యక్తిత్వాన్ని మలచి చరిత్రగతిని నిర్ణయిస్తున్నాయి.

చరిత్ర ప్రధానంగా సమాజాలలోని భౌగోళిక నైసర్గిక పరిసరాల్లో మానవుల జీవితానికి సంబంధించిన రికార్డు. వారి సాంఘిక, సాంస్కృతిక పరిసరాలు, సమాజం, దాని భౌగోళిక పరిస్థితులు ఒక దానితో మరొకటి పెనవేసుకొని ఆవిర్భవిస్తాయి. వ్యక్తులను వారి వ్యక్తిత్వాలను వారి భౌగోళిక, నైసర్గిక పరిసరాల దృష్ట్యా అవగాహన చేసుకోవాలి. మానవుడు పరిసర వాతావరణం వలన ప్రభావితమవుతాడు. నదులు, పర్వతాలు, మానవుని గమనంలో ప్రముఖపాత్రను నిర్వహించటం నైల్, టైగ్రీస్ - యూఫ్రైట్స్, సింధు, గంగా, హిమాలయాలు వంటి భూగోళ విషయాల్లో స్పష్టమైనది. ప్రాచీన నాగరికతలు అన్నీ దాదాపు నదీ నాగరికతలే, అలాగే ప్రాచీన నగరాలు, ప్రాచీన నివాస స్థలాలు అన్నీ భూగోళశాస్త్రానికి దగ్గరగా ఉన్నాయి అనడంలో అతిశయోక్తి లేదు. చరిత్రలోని గొప్ప యుద్ధ వీరులు అంతా పర్వత శ్రేణులను ఆసరాగా చేసుకొని యుద్ధాలు వలన చరిత్రను నెలకొల్పారు.

చరిత్ర అధ్యయనంలో భూగోళ శాస్త్రానికి సంబంధించిన మ్యాపులు, చార్ట్‌లు, అట్లాస్, వివిధ భౌగోళిక నమూనాలు ఎంతో ఉపయోగపడుతాయి. ప్రపంచ చరిత్రను, వివిధ చారిత్రక ప్రదేశాలను, రాజకీయ భౌగోళిక సరిహద్దులను, అవగాహన చేసుకొనుటకు భూగోళ శాస్త్రజ్ఞుడు రూపొందించిన ఈ నమూనా లే కీలకమవుతాయి. ప్రాచీన, మధ్యయుగం నాటి చరిత్ర రచనకు ఆయా కాలానికి చెందిన యాత్రికుల రచనలు, వారు వెలువరించిన అభిప్రాయాలే చారిత్రక ప్రామాణికాలుగా చరిత్రకారుడు గ్రహించాల్సి ఉంటుంది. చరిత్రకారుడు ఒక ప్రాంత చరిత్రను రూపొందించాల్సి వచ్చినప్పుడు ఆప్రాంత వాతావరణ పరిస్థితులను, ఆ ప్రాంత అటవీ సంపదను, పర్వతాలను, కొండలను, లోయలను, నదీ జలాల లభ్యతను మరియు ఇతర భూగోళ పరిస్థితులను ముందుగా తెలుసుకొనవలెను. ఆయా ప్రాంత భౌగోళిక లక్షణాల ఆధారంగా విభజన చేసి చరిత్ర రచన గావించవచ్చు.

## 12.6 సమీక్ష:

చరిత్ర రచనలో పురావస్తు శాస్త్రానికి అధిక ప్రాధాన్యత గలదు. చరిత్ర పునర్నిర్మాణానికి సాహిత్య ఆధారాలైన గ్రంధాలతో పాటూ పురావస్తు ఆధారాలైన నాణేలు, శాసనాలు, కట్టడాలు లాంటి ఆధారాలు ఎన్నో కావాలి. పురావస్తు ఆధారాలు ఇతిహాసాల్లో, పురాణాలలో కనిపించే గాథలకంటే ఎంతో ప్రాధాన్యమైనవి. ఏ దేశ చరిత్ర అయినా ఆ దేశ భౌగోళిక పరిస్థితుల ననుసరించి ఉండును. ఒక దేశ చరిత్రను పునర్నిర్మాణము చేయాలన్నా, ఆదేశ చరిత్రను తీర్చి దిద్దుటలో ఆప్రాంత, లేదా ఆ దేశ ప్రజల నడవడిని, జీవన విధానమును, వేష భాషలను ప్రభావితం చేయుటలోనూ, భౌగోళిక పరిస్థితులు ప్రముఖ పాత్ర వహించుచున్నవి. చరిత్ర అధ్యయనం లో భూగోళ శాస్త్రానికి సంబంధించిన మ్యాపులు, చార్ట్ లు, అట్లాస్, వివిధ భౌగోళిక నమూనాలు ఎంతో ఉపయోగపడుతాయి.

## 12.7 వ్యాసరూప ప్రశ్నలు:

1. చరిత్రను పునర్నిర్మాణము చేయడానికి పురావస్తు శాస్త్రము మరియు భూగోళ శాస్త్రం లు ఏ విధంగా దోహదపడుతాయో వివరించండి?

(లేదా)

చరిత్ర అధ్యయనం లో పురావస్తు శాస్త్రము మరియు భూగోళ శాస్త్రము ల ప్రాధాన్యతను అంచనా వేస్తూ ఒక వ్యాసమును వ్రాయండి?

## 12.8 ఉపయుక్త గ్రంధాలు:


1. Agarwal, **Teaching of History**, Delhi, 1983.
2. Barnes, H.E., **A History of Historical Writing**, New York, 1962.
3. Devahuti (Ed.)., **Bias in Indian Historiography**, Delhi, 1980.
4. Finberg, A.P.R., **Approaches to History**, London, 1962.
5. Goel, Dharmendra, **Philosophy of History**, Delhi, 1967.
6. Kochaar, K.S., **Teaching History,** New Delhi, 1979.
7. Rowse A.L., **The use of History** London, Penguin, 1963.
8. దుర్గా ప్రసాద్, జె., చరిత్ర రచనా శాస్త్రం, తెలుగు అకాడమీ, హైదరాబాదు, 1987.

## పాఠం-13

# పురాజీవశాస్త్రం - సమాజ శాస్త్రం

**లక్ష్యాలు:**

- ఈ పాఠ్య భాగాన్ని అధ్యయనం చేయడం వలన మీరు పురాజీవ శాస్త్రం మరియు సమాజశాస్త్రంలు చరిత్రతో ఏవిధమైన సంబంధంను కలిగి ఉన్నాయో అని తెలుసుకోగలుగుతారు. విద్యార్థులు ఈ శాస్త్రాల అధ్యయనం వలన చరిత్రను ఎలా పునర్నిర్మాణం చేయవచ్చో అనే అవగాహనను కలిగి వుంటారు.
- పురా జీవ శాస్త్ర అర్థం, పరిధి, మరియు అధ్యయన ప్రాధాన్యత ను తెలుసుకొంటారు.
- చరిత్రకు పురాజీవ శాస్త్రానికి లేదా మానవ శాస్త్రానికి (అంత్రోపాలజీ) గల దగ్గరి పోలికలను అంచనా వేయగలగాలి.
- సమాజ శాస్త్ర అర్థం, పరిధి, మరియు అధ్యయన ప్రాధాన్యతను అవగాహన చేసుకొంటారు.
- చరిత్రకు సమాజ శాస్త్రానికి గల సంబంధాన్ని తెలుసుకోగలగాలి.

**విషయక్రమము:**


**13.1 పరిచయం**

**13.2 పురాజీవశాస్త్రం- అర్థం-పరిధి- ప్రాధాన్యత**

**13.3 పురాజీవ శాస్త్రం నకు, చరిత్ర కు గల సంబంధం**

**13.4 సమాజ శాస్త్రం -అర్థం-పరిధి-ప్రాధాన్యత**

**13.5 సమాజ శాస్త్రంనకు, చరిత్రకు గల సంబంధం**

**13.6 సమీక్ష**

**13.7 వ్యాసరూప ప్రశ్నలు**

**13.8 ఉపయుక్త గ్రంథాలు**


## 13.1 పరిచయం:

పురాజీవ శాస్త్రం లేదా మానవ శాస్త్రం జీవ సంబంధమైన మరియు సాంస్కృతిక భిన్నత్వం తో కూడిన అధ్యయనం. మానవ తొలి జీవితం లోని వివిధ పరిణామ దశలను గూర్చి ఈ శాస్త్రం పేర్కొంటున్నది. మానవుని సాంస్కృతిక సంబంధమైన ఆహారపు అలవాట్లు, వేషధారణ, రాజకీయ అభ్యున్నతి మొదలగు వాటిని పురాజీవ శాస్త్రం పేర్కొంటున్నది. నేడు చరిత్ర స్పష్టమైన, సమగ్రమైన, విశ్వసనీయమైన, ప్రగతిశీల శాస్త్రంగా ఎదిగింది మరియు మానవ నాగరికతా పరిణామాన్ని విశదీకరించే శాస్త్రంగా కూడా రూపుదాల్చింది.

మానవుడు తన అభ్యున్నతికై సాగించే పోరాటంలోని సంఘటనల అధ్యయన శాస్త్రంగా మారింది. మానవతా వికాసమే లక్ష్యంగా పెరిగింది. చరిత్రకారుడు తాను జీవిస్తున్న సమాజం చేత, కాలం చేత రూపు కట్టి తన కాలానికి అద్దంపడతాడు. తాను జీవించే సమాజాన్ని వీక్షించే దృష్టి అందులో తనస్థానం, అతని రచనని, అతని దృక్పథాన్ని ప్రభావితం చేస్తాయి. సమకాలీన సమాజం పట్ల చరిత్రకారునికి ఉన్న దృక్పథం అతని రచన మీద ప్రభావం చూపిస్తుంది.

## 13.2 పురాజీవశాస్త్రం- అర్థం-పరిధి- ప్రాధాన్యత:

పురాజీవ శాస్త్రం లేదా మానవ శాస్త్రం అను పదమును మొదటగా ఉపయోగించినది గ్రీక్ తత్వవేత్త అయిన అరిస్టాటిల్. 'పురాజీవశాస్త్రం' (Anthropology) అనునది రెండు గ్రీకు పదాల కలయిక. 'ఆంత్రోపోస్' అనగా 'మానవ' 'లోగోస్' అనగా 'శాస్త్రం', 'అధ్యయనం' అని అర్థం. ఏ. ల్. క్రోఎబర్ మాటల్లో 'ఆంత్రోపాలజీ అనగా మానవుని యొక్క విజ్ఞాన శాస్త్రం'. మానవ శాస్త్రం, మానవుని అతడు నిర్మించిన గత సంస్కృతిని వివరిస్తుంది. నిరక్షరాస్యులైన ప్రజల నుంచి గ్రహించిన మానవజాతి, సంస్కృతుల ఆవిర్భావం, పరిణితి, లక్షణాల వివరాలను విశదీకరిస్తుంది. మానవ శాస్త్రం లో భౌతిక మానవశాస్త్రం, సాంస్కృతిక మానవ శాస్త్రం అని రెండు ప్రధాన విభాగాలున్నాయి. భౌతిక మానవశాస్త్రం వివిధ జాతుల వాటి పుట్టు పూర్వోత్తరాలు, వాటి పరిణామం, వాటి స్వరూప స్వభావాన్ని గురించి వివరిస్తుంది . సాంస్కృతిక మానవ శాస్త్రం వివిధ సంస్కృతులను, వాటి పరిణామాన్ని, మానవునికి, సంస్కృతికి గల పరస్పర సంబంధాన్ని తెలియజేస్తుంది. చారిత్రక పరిశోధనలో అందులోనూ మానవ నాగరికతా పరిణామంలో పూర్వ దశలను అధ్యయనం చేయుటలో చరిత్రకారునికి మానవశాస్త్రజ్ఞులు టేలర్, మాన్ల విస్కీ, మోర్గానల పరిశోధనల ఫలితాలు అమెరికా, ఆస్ట్రేలియాలలో అదృశ్యమవుతున్న ఆదిమజాతుల గురించిన చారిత్రక పరిశోధనలో చాలా సహాయ పడ్డాయి. ఒక కాలం నుండి మరొక కాలానికి భౌతిక లక్షణాలలో వచ్చిన మార్పులను గుర్తించుటలోనూ మానవశాస్త్రం ఎనలేని సేవ చేస్తుంది.

పురాజీవ శాస్త్ర పరిధి విశ్వ వ్యాప్తం. మానవ జాతి ఆవిర్భావం నుండి ప్రస్తుత కాలం వరకు మానవుని ఉనికి, పరిణామం, జీవన విధానం లోని పలు దశలు, విభిన్నమైన సంస్కృతి, మొదలగు అంశాలను పురాజీవశాస్త అధ్యయనం లో భాగంగా చూడవచ్చును. మానవుడు ఎలా నాగరికతలను నిర్మించుకొన్నాడు, ఎలా అంతం చేసుకొన్నాడు, వేష బాషలను ఎలా ఏర్పరుచుకొన్నాడు, లింగ బేధాన్ని ఎలా ఏర్పరుచుకొన్నాడు అనే మానవ అంశాలను పురాజీవశాస్త్రం విశదీకరిస్తుంది. స్థూలంగా పరిశీలిస్తే పురాజీవ శాస్త్రంను నాలుగు దశలుగా అధ్యయనం చేస్తుంది. అవి సామాజిక, సాంస్కృతిక, బాషాపరమైన, జీవ సంబంధమైన భాగాలుగా అధ్యయనం చేయవచ్చును. మానవుని భౌతిక లక్షణాలలో కాలక్రమంలో వచ్చిన మార్పులను గుర్తించడంలో భౌతిక మానవ శాస్త్రం చరిత్రకారులకు దోహదపడుతుంది. అలాగే అంతరించిపోయిన సంస్కృతులను గురించి అధ్యయనం చేసే పురావస్తు శాస్త్ర వేత్తలకు సాంస్కృతిక మానవ శాస్త్రం ఉపకరిస్తుంది.

## 13.3 పురాజీవ శాస్త్రం నకు, చరిత్ర కు గల సంబంధం:

మానవ విజ్ఞాన దశలను ఒక క్రమ పద్దతిలో అధ్యయనం చేయగల శాస్త్రంగా ఆంత్రోపాలజీని పరిగణించవచ్చును. ఇందులో చారిత్రక దశలను కూడా అధ్యయనం చేయవచ్చును. క్రీ. శ. 18 వ శతాబ్దం లో ఫ్రెంచ్ మానవతా వాదులు, క్రీ. శ. 19వ శతాబ్దంలో జర్మన్ సిద్ధాంతకర్తలు పురాజీవ శాస్త్రాన్ని మానవుని కి సంబంధించిన అధ్యయన శాస్త్రము కావున ఇది చరిత్ర లో ఒక విభాగం నకు చెందినదిగా పేర్కొన్నారు. వీరి అభిప్రాయం ప్రకారం మానవుడు సమాజాన్ని సృష్టించి ఆ సమాజంలోనే తన జీవనాన్ని కొనసాగిస్తాడు గనుక ఆ మానవుని గత చరిత్ర విశేషాలను అనగా, మానవుని ప్రగతి, మానవుని వికాశం మొదలగునవి చరిత్రతో ముడిపడి ఉంటాయి. మానవునికి సంబంధించిన కాలానుక్రమాన్ని చరిత్ర అధ్యయనం చేస్తే, గత మానవుని వికాశాన్ని పురాజీవ శాస్త్రం అధ్యయనం చేస్తుంది. ఆంత్రోపాలజీ మానవుని ప్రాచీన మైన సాంఘిక, సాంస్కృతిక విషయాలకు ఆధునిక జీవన విధానంతో పోల్చితే ఇది సరళంగా, మరియు మిశ్రమంగా వుంటుంది. క్షేత్ర పరిశోధన పద్దతులలో పురాజీవ శాస్త్రజ్ఞుడు మానవుని సాంఘిక

జీవనం మరియు సంస్కృతి ని అంచనా వేయగలడు. పురాజీవ శాస్త్రం వైజ్ఞానిక క్షేత్ర స్థాయి పరిశోధనలకు అవకాశం గల ఒక శాస్త్రం. ఎంతో విలువైన చారిత్రక ఆధారాలతో ఈ శాస్త్రం చరిత్ర పరిశోధనకు వెన్నెముక వలె ఉపయోగపడుతుంది.

చరిత్ర అనునది గత కాలపు సాంఘిక జీవనం ను అధ్యయనం చేస్తుంది. గత కాలపు సాంఘిక, సాంస్కృతిక రచనలను భద్రపరుస్తుంది, అలాగే ఆంత్రోపాలజీ కూడా మానవుని సాంఘిక జీవనమును అధ్యయనం చేస్తుంది. ఈ విధంగా చరిత్ర - ఆంత్రోపాలజీ ఒకే విధంగా మానవుని గత చరిత్రను అధ్యయనం చేస్తాయి. అయితే ఇవి రెండూ కూడా స్వతంత్ర శాస్త్రాలు. వీటి మధ్య ఎన్నో విషయాలలో భేదాభిప్రాయాలు ఉన్నాయి. ఆంత్రోపాలజీ అనునది జీవ సంబంధమైనది, చరిత్ర సాంఘిక జీవన సంబంధమైనది. చరిత్ర కేవలం గత మానవునికి సంబంధించిన విషయాలను మాత్రమే అధ్యయనం చేస్తే, ఆంత్రోపాలజీ మానవునికి సంబంధించిన అన్ని కాలాలను గూర్చి అధ్యయనం చేస్తుంది. ఆంత్రోపాలజీ ప్రాథమిక ఆధారాలను సేకరిస్తే చరిత్ర ద్వితీయ ఆధారాల సహాయం తో చరిత్ర రచనను కొనసాగిస్తుంది.

## 13.4 సమాజ శాస్త్రం -అర్థం-పరిధి-ప్రాధాన్యత:

సాంఘిక శాస్త్రాలన్నింటిలోనూ అత్యంత ప్రధానమైనదిగా గుర్తింపు పొందినది సమాజ శాస్త్రం. సమాజ శాస్త్రం మానవుని సంఘ జీవన విధానాన్ని వివరిస్తుంది. ఇది సమాజంలోని మానవుని యొక్క ప్రవర్తనను అధ్యయనం చేస్తుంది. 'రాజకీయాలు మినహాయించిన చరిత్ర సామాజిక చరిత్ర' అని ట్రెవెల్యన్ సామాజిక చరిత్రను నిర్వచించాడు. భారత దేశంలో జయస్వాల్ తన 'హిందూ పాలిటీ' అనే గ్రంథంలో ప్రాచీన కాలం నాటి సామాజిక సంస్థలను గురించి విపులీకరించాడు. మెకైవర్ 'సమాజ శాస్త్రం సాంఘిక సంబంధాలను గురించి వివరిస్తుంది' అని అన్నాడు. సంఘాలు, సాంఘిక వ్యవస్థలూ, వాటి స్వరూపాలూ, లక్షణాలు, కర్తవ్యం, అంతర్భాగం, వికాసం వంటి అనేక విషయాలను ఈ శాస్త్రం చర్చిస్తుంది. సామాజిక, నైతిక, ఆర్థిక సాంస్కృతిక వ్యవస్థల ప్రస్తావనతో పాటు, మానవ సంఘ సంబంధాలు, సంఘాలు అవి నిర్వర్తించే విధులు, వాటి రూపాలు, చట్టాలు, ఆచారాలు, జీవనోపాధి, నాగరికత, సంస్కృతి, వాటి ప్రభావం గురించి విశేషంగా సమాజ శాస్త్రం అధ్యయనం చేస్తుంది. దీని వలన సంఘం లో వున్న సంబంధ బాంధవ్యాలు, సంఘ రూపాంతరాలు తెలుసుకోవడానికి, సాంఘిక విలువలను నిర్ణయించడానికి వీలు అవుతుంది.

సమాజ శాస్త్రం ను ఇంగ్లీష్ లో 'సోషియోలజీ' (Sociology) అని అంటారు. ఈ పదం లాటిన్ మరియు గ్రీక్ పదాల కలయిక. లాటిన్ పదం Socius అనగా సమూహము, గ్రీక్ పదం logy అనగా అధ్యయన శాస్త్రం. అగస్టే కంప్టే అను ఫ్రెంచ్ తత్వవేత్త మరియు మానవ శాస్త్రవేత్త క్రీ. శ 1838 లో 'సోషియోలజీ' అను పదమును మొదటిసారిగా ఉపయోగించాడు. దీని పరిధి చాలా విస్తృతమైనది. దీని ప్రధాన లక్ష్యం మానవుల గమనము, సమూహములో వారి జీవన విధానము ను అధ్యయనము చేయడము. సమాజములోని వ్యక్తుల వ్యక్తిగత జీవితమును అలాగే సమూహం యొక్క స్థితి గతులను గురించి అధ్యయనం చేయడమే ఈ శాస్త్రం యొక్క ప్రధాన లక్ష్యం. మానవుని ప్రవర్తన, అతని కుటుంబ, సమాజ నేపథ్యం, మానవుని మనోవికాస అభివృద్ధిని గురించి చర్చించే ముఖ్యమైన శాస్త్రంగా సామాజిక శాస్త్రాలలో సోషియాలజీ గా పలువురు పండితులు పేర్కొన్నారు.

## 13.5 సమాజ శాస్త్రంనకు, చరిత్రకు గల సంబంధం:

చరిత్ర, సమాజ శాస్త్రం రెండూ సన్నిహిత సంబంధం కలిగి వున్నాయి. ఈ సన్నితత్వం రెండింటి చరిత్ర నుంచి, వాటి విషయ వస్తువు నుంచి ఏర్పడింది. చరిత్ర సమాజశాస్త్రం రెండింటికీ అధ్యయన విషయం సంఘ జీవి అయిన మానవుడే. ధ్యేయం ఒకటే అయినా మార్గాలు వేరు. సమాజ శాస్త్రం సాంఘీక వ్యవస్థల పుట్టుక, వాటి పరిణామం తదితర విషయాలను పరిశీలించేటప్పుడు చరిత్రపైన ఆధారపడక తప్పదు. అలాగే గడిచిన కాలంలోని సాంఘీక జీవనాన్ని పరిశీలించటంలో చారిత్రకారునికి సమాజ శాస్త్ర పరిజ్ఞానం అవసరం. చరిత్ర ఒక విషయాన్ని సర్వతోముఖంగా పరిశీలిస్తే, సమాజ శాస్త్రం ఆ విషయ సాంఘీక ప్రభావాన్ని తెలియజేస్తుంది. సమాజ పరిజ్ఞానం వల్ల చారిత్రకారుని ఖచ్చితత్వం, నిశితదృష్టి ముడిసరుకు రీత్యా ఇనుమడిస్తుంది. ఈ రెండు శాస్త్రాలు ఒకదాని

కొకటి పరస్పరం సహకరించుకోవటం తప్పనిసరి. చరిత్ర నుండి సమాజశాస్త్రాన్ని వేరు చేయటం అంటే వేరు నుంచి మొక్కను వేరు చేయటమే అవుతుంది.

ఒక జాతి, సమాజ చరిత్రను చరిత్రకారుడు రచించాలన్నా, బాహ్య ప్రపంచానికి తెలియజేయాలన్నా చరిత్రకారుడు సమాజ శాస్త్రజ్ఞుడు మీద ఆధారపడక తప్పదు. సమాజము గురించి అతిపెద్ద సమాచారాన్ని చరిత్రకారునికి అందించేది సమాజ శాస్త్రజ్ఞుడు మాత్రమే. ఇదే సమయములో చరిత్రకారుడు కూడా సమాజ శాస్త్రజ్ఞునికి ఎంతో విలువైన చారిత్రక విశేషాలను కూలంకుషంగా పరిశోధించి అందిస్తాడు. కావున ఈ రెండు శాస్త్రాలు పరస్పర పోషకాలుగా పేర్కొనవచ్చును. అందువలనే ఒక ఇంగ్లీష్ సామాజిక పురాజీవ శాస్త్రజ్ఞుడైన ఆల్ఫ్రెడ్ రాడ్ క్లిఫ్ " సమాజ శాస్త్రం అస్థిర సార్వత్రిక సూత్రాలకోసం వెతికితే, చరిత్ర చేర్చడానికి వెతికే శాస్త్రం'' అని అభివర్ణించాడు. అనగా చరిత్రకారుడు ఒక ప్రత్యేక విషయము గూర్చి చర్చిస్తే, సమాజ శాస్త్రజ్ఞుడు సాధారణమైన విషయాలను గూర్చి ప్రస్తావిస్తాడు.

## 13.6 సమీక్ష:

ఆంత్రోపాలజీ ఒక శాస్త్రంగా ఇటీవలి కాలంలో బాగా అభివృద్ధి చెందుతున్న ప్రముఖమైన విజ్ఞాన శాస్త్రం. ఇది గడచిన కాలంలోని మానవులకు సంబంధించిన క్షేత్ర స్థాయి పరిశోధనలలో ముందంజలో వుంటూ గతానికి, ఆధునికానికి అనుసంధానమై వుంటుంది. పూర్వ చరిత్ర లోని మానవ సమాజ స్థితి గతులను చరిత్రకారుడు అధ్యయనం చేయాలంటే పురాజీవ శాస్త్రం పై ఆధార పడక తప్పదు. ప్రపంచం లోని మానవులు అందరూ విభిన్న రకాల మతానికి చెందిన, వివిధ రకాలైన భాషలు మాట్లాడుచూ, వివిధ రకాల రంగులు కలిగి, వున్నను వీరందరికి ఒక సంస్కృతి, ఒక సాంప్రదాయం కలిగి వుంటుంది. గతించిన వీరి ఆనవాళ్లను, వీరి జీవన వైవిధ్యమను చరిత్ర, పురాజీవ శాస్త్రం తో అలాగే సమాజ శాస్త్రంతో కలిపి అధ్యయనం చేస్తుంది. సామాజిక చరిత్ర రచనలోనూ, ఆర్థిక, రాజకీయ, మత, ఆవరణ, వైద్య పరిస్థితులలోనూ ఈ శాస్త్రాలు పరస్పరం సహ సంబంధంను కలిగి వుంటాయి.

## 13.7 వ్యాసరూప ప్రశ్నలు:

**ఈ క్రింది వ్యాసరూప ప్రశ్నలకు సమాధానము వ్రాయుము.**

1) పురాజీవ శాస్త్రం, అర్థం, పరిధి, మరియు ప్రాధాన్యతను వివరిస్తూ చరిత్రతో గల సంబంధాన్ని గూర్చి ఒక వ్యాసము వ్రాయుము?

2) సమాజశాస్త్రం యొక్క అర్థం, పరిధి, మరియు ప్రాధాన్యతను పేర్కొంటూ చరిత్రకు సమాజ శాస్త్రం (సోషియాలజీ) కు గల అవినాభావ సంబంధం ను వివరించుము?

## 13.8 ఉపయుక్త గ్రంథాలు:


1. Thomas Hylland Eriksen., **A History of Anthropology**, Pluto Press, London.
2. Childe VG., **What Happened History**, Pelican, 1946, New York
3. Doshi, S.L., & Jain P.C., **Social Anthropology**, Rawat Publishers, New Delhi.
4. Darwin Charles., Origin of Species, New American Library Mentor, 1859, New York.
5. Bottmore, T.B., Sociology - A Guide to Problems and Literature, Delhi, 2008.
6. Spencer, H., Study of Sociology, Michigan, USA: University of Michigan Press. 1961.
7. దుర్గా ప్రసాద్, జె., చరిత్ర రచనా శాస్త్రం, తెలుగు అకాడమీ, హైదరాబాదు, 1987.

**పాఠం-14**

# రాజనీతి శాస్త్రం - తత్వ శాస్త్రం

**లక్ష్యాలు:**

- ఈ పాఠ్య భాగాన్ని అధ్యయనం చేయడం వలన మీరు రాజనీతి శాస్త్రం మరియు తత్వ శాస్త్రంలు చరిత్రతో ఏవిధమైన సంభందంను కలిగి వున్నాయో అని తెలుసుకోగలుగుతారు. విధ్యార్థులు ఈ శాస్త్రాల అధ్యయనం వలన చరిత్రను ఎలా పునర్నిర్మాణం చేయవచ్చో అని అవగాహనను కలిగి వుంటారు.
- చరిత్రకు రాజనీతి శాస్త్రానికి (పొలిటికల్ సైన్స్) గల దగ్గరి పోలికలను అంచనా వేయగలగాలి.
- చరిత్రకు తత్వ శాస్త్రానికి (ఫిలాసఫీ) గల సంబంధాన్ని తెలుసుకోగలగాలి.

**విషయక్రమము:**


**14.1 పరిచయం**

**14.2 రాజనీతి శాస్త్రం- అర్థం-పరిధి- ప్రాధాన్యత**

**14.3 రాజనీతి శాస్త్రంనకు, చరిత్ర కు గల సంబంధం**

**14.4 తత్వ శాస్త్రం -అర్థం-పరిధి-ప్రాధాన్యత**

**14.5 తత్వ శాస్త్రంనకు, చరిత్రకు గల సంబంధం**

**14.6 సమీక్ష**

**14.7 వ్యాసరూప ప్రశ్నలు**

**14.8 ఉపయుక్త గ్రంధాలు**


## 14.1 పరిచయం:

"మానవ స్వాతంత్ర్యన్ని గురించి వివరించేదే చరిత్ర'' అని ఆక్టన్ పేర్కొన్నాడు. బలమైన ఆయుధాలు, భుజశక్తితో బలమైన రాజ్యాలను నిర్మించడం కాదని, మేథో శక్తి వల్ల సాధించిన ఘనకార్యాలు, స్వేచ్ఛా స్వాతంత్రాలే చరిత్ర అని అక్టన్ అభిప్రాయపడ్డాడు. గ్రీక్‌లు రాజనీతి శాస్త్రానికి మొదటి స్థానాన్ని ఇచ్చారు. దీనకి గల కారణం అత్యంతోన్నత స్వయం పాలనా వ్యవస్థనే 'పోలీస్' చుట్టూ ఈ రాజనీతి శాస్త్రం పరిభ్రమించడమే. రాజనీతి శాస్త్రం రాజ్యాన్ని, ప్రభుత్వాన్ని గురించి అధ్యయనం చేసే శాస్త్రం. మానవుడు సంఘ జీవి మాత్రమే కాదు రాజకీయ జీవి కూడా. తాత్వికుని తత్వం సంఘం పై ప్రభావం చూపుతుంది. తత్వ శాస్త్రంలో చర్చిస్తున్న అనేక అంశాలు, దృక్పథాలు ప్రాచీన గ్రీకు తత్వవేత్తల ఆలోచనల్లో ఆనాడే లీలగా కనిపిస్తాయి. తత్వవేత్తలు చర్చించే

భావాలు సర్వకాలాలకు మొత్తం సమాజానికి సంబంధించి వుంటాయి. తత్వవేత్తలు చరిత్ర అధ్యయనంలో ఆసక్తి కనబరచడం ప్రాతంభించినప్పటి నుండి చరిత్రతాత్విక భావం ప్రాముఖ్యం సంతరించుకొన్నది.

## 14.2 రాజనీతి శాస్త్రం- అర్థం-పరిధి- ప్రాధాన్యత:

అరిస్టాటిల్‌ను రాజనీతి శాస్త్ర పితామహుడు అని అంటారు. తన Politics అనే గ్రంధం లో "రాజ్యం లేకుండా వ్యక్తి జీవించలేడు, ఒకవేళ జీవిస్తే ఆ వ్యక్తి దేవుడైనా కావచ్చు లేదా జంతువైనా కావచ్చు." అని పేర్కొన్నాడు. మానవుని కార్యకలాపాలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రాజ్యం ప్రభావితం చేస్తుంది. రాజకీయ శాస్త్ర పరిధిని వ్యక్తి-సమాజం-రాజ్యం, రాజకీయ భావాలు, సంస్థలు, సిద్ధాంతాలు, రాజకీయ ప్రవర్తన, మొదలగు విషయాలలో విస్తరించి వుంటుంది. జె. డబ్ల్యూ. గార్నర్ అభిప్రాయంలో "రాజ్యనీతి శాస్త్రానికి ఆది అంతాలు రాజ్యమే". రాజ్యాన్ని గురించి అధ్యయనం చేసే శాస్త్రం అలాగే ప్రభుత్వాన్ని గురించి, సంఘాలను, సంస్థలను, ప్రభుత్వ విధానాలను అధ్యయనం చేయుట రాజనీతి శాస్త్ర పరిధి. రాజనీతి శాస్త్రం రాజకీయ వ్యవస్థలలో చోటు చేసుకొంటున్న మార్పులను అధ్యయనం చేస్తూ ప్రభుత్వ రూపాలను, ప్రభుత్వ అంగాలను, హక్కులను, విధులను వివరిస్తుంది. రాజనీతి శాస్త్రం అవగాహన చేసుకోవడానికి చారిత్రక పద్ధతి, తాత్విక పద్ధతి ద్వారా రాజనీతి శాస్త్ర విశ్లేషణను సంపూర్ణంగా తెలుసుకోవచ్చు.

## 14.3 రాజనీతి శాస్త్రంనకు, చరిత్రకు గల సంబంధం:

రాజనీతి శాస్త్రం చరిత్రకు అనుషంగిక శాస్త్రం అవుతుంది. ఆదిమకాలం నుంచి సమాజంలో మానవుడు ఏర్పరిచిన సంస్థలు, వ్యవస్థలు, వాటి కార్యకలాపాలు, ప్రగతి మున్నగు అనేక రంగములను గూర్చి చరిత్రలో వివరించబడినది. అందువలననే చరిత్రను సాంఘిక శాస్త్రాల అధ్యయనానికి ఒక ప్రయోగశాల అని భావించారు. అన్ని సామాజిక శాస్త్రాల అధ్యయనానికి కావాల్సిన విషయములు, గణాంక వివరములు చరిత్ర నుండే లభిస్తాయి.

రాజనీతి శాస్త్రం, చరిత్రల సన్నిహిత సంబంధాన్ని సీలీ మాటల్లో బాగా గ్రహించవచ్చు. "రాజనీతి శాస్త్రం లేని చరిత్ర ఫలరహితంబీ చరిత్రలేని రాజనీతి శాసం ఆధార రహితం". సీలీ మాటల్లో కొంత అతిశయోక్తి ఉన్నా రెండు సాంఘిక శాస్త్రాలు ఒకదాని పై మరొకటి ఆధారపడి ఉన్నాయనటంలో ఏమాత్రం సందేహం లేదు. చరిత్ర, రాజనీతి శాస్త్రాలు పరస్పరం అత్యంత దగ్గరి సంబంధాలను కలిగి వున్నాయి. పరిపాలనా విధానం గురించి అధ్యయనం చేసేదే రాజనీతి శాస్త్రంకాగా, వివిధ రకాల ప్రభుత్వాలు, ప్రభుత్వం మార్పు, ప్రభుత్వ కార్యకలాపాల గురించి చరిత్ర అధ్యయనం చేస్తుంది. రాజనీతి శాస్త్రం పౌరసత్వానికి సంబంధించిన శాస్త్రం. కాగా పౌర ప్రభుత్వాలను గురించిన అధ్యయనం చరిత్రలో ఒక భాగం.

రాజనీతి శాస్త్రం వివిధ రకాలయిన ప్రభుత్వాలను, రాజ్యాలను, వాటి పరిపాలనా సూత్రాలను గురించి తెలియజేస్తుంది. రాజ్యం, రాజకీయ వ్యవస్థలు ప్రాచీన కాలం నుంచి రూపాంతరం చెందుతూ అభివృద్ధిని సాధిస్తున్నాయి. నాటి నుంచి నేటి దాకా మానవాళి జీవితాన్ని మలుపులు తిప్పిన రాజరిక వ్యవస్థ, అల్ప జన పరిపాలనా వ్యవస్థ, కులీన పాలనం, ప్రజాస్వామ్యం మొదలగునవి అన్ని రాజనీతి సంబంధమైనవే. ఆయా వ్యవస్థల, సంస్థల క్రమ పరిణామాన్ని చరిత్ర మీదకు విశదీకరిస్తున్నది. చారిత్రక రచనలు రాజనీతి శాస్త్రానికి నిధులుగా ఉపయోగపడుచున్నాయి. అనగా రాజనీతి శాస్త్రానికి చరిత్ర పునాది వంటిదన్నమాట. చరిత్ర వలన మనం గ్రహించిన రాజకీయ వ్యవస్థల, సంస్థల లోపాలు, ఇబ్బందులను చారిత్రక పరిజ్ఞానంతో భూత వర్తమాన కాలాలతో పోల్చి భవిష్యత్ కు అనుకూలమైన వ్యవస్థలను, సంస్థలను ఏర్పరుచుకోవడానికి అవకాశం ఉంది. చరిత్ర సహాయం లేకపోతే రాజనీతి శాస్త్రం కల్పిత లేదా ఊహాగాన శాస్త్రం అవుతుంది. అందువలన రాజనీతి శాస్త్రం తన సామాగ్రికి చరిత్ర పై ఆధారపడక తప్పదు. చారిత్రక సంఘటనలలోని రాజకీయ ప్రాధాన్యత ను గుర్తించి చరిత్ర రచన చేయవలసి వుంటుంది. రాజకీయ సంఘటన పరిణామాలను తగిన రీతిలో మూల్యాంకనం చేయకపోతే మన చారిత్రక విజ్ఞానమంతా అర్థం లేనిదవుతుంది. చరిత్ర తన సామాగ్రిలో ఒక అంశాన్ని మాత్రమే రాజనీతి శాస్త్రానికి అందిస్తున్నది. రాజనీతి శాస్త్రజ్ఞుడు చరిత్ర నుండి వాస్తవికమైన ఉదాహరణలు ఎన్నుకొని రాజకీయ

సంస్థల పరిణామాలను రాజ్యం పైనా, ప్రభుత్వం పైనా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రభావం చూపించటాన్ని అధ్యయనం చేస్తాడు. ప్రపంచములోని వివిధ రాజ్యాలలో తలెత్తిన విప్లవాలు, స్వాతంత్ర్య పోరాటాలను గురించి అర్థం చేసుకోవడానికి రాజనీతి విజ్ఞాన శాస్త్ర పాత్ర ఎంతైనా అవసరం.

## 14.4 తత్వ శాస్త్రం -అర్థం-పరిధి-ప్రాధాన్యత:

ఫిలాసఫీ (Philosophy) అనగా 'ప్రజ్ఞా శక్తి' (love of wisdom) ఫిలాసఫీ అనే పదం ఫిలియా, సోఫియా అనే రెండు గ్రీకు పదాల కలయిక వలన ఏర్పడింది. ఫిలియా అనగా love ప్రేమ లేదా ఆసక్తి అని, సోఫియా %ఎఆశీఽశ్రీవఎస్త్రవ% జ్ఞానం లేదా ప్రజ్ఞ అని పేర్కొంటారు. ఫిలాసఫీని తెలుగులో 'తత్వ శాస్త్రం' అని అంటారు. తత్ అనగా 'ఆది' త్వమ్ అనగా 'స్వభావం' అని అర్థం. కావున తత్వ శాస్త్రం అనగా 'దాని స్వభావం' అని కూడా అర్థం. స్వభావం అనగా ఒక విషయం యొక్క గుణ గణాలు లేక పూర్వాపరాలు.

మానవుడు శాస్త్రీయ విజ్ఞానం అభివృద్ధి చెందక ముందు ప్రకృతిలో జరుగుతున్నటువంటి సంఘటనలు, మానవుని జననం, మరణం మొదలైన విషయాల గురించిన (నిజానిజాలను) వాస్తవాలను తెలుసుకొనే కోరిక లేదా జ్ఞాన తృష్ణ కలిగి ఉండి వాటి గురించి తెలుసుకోవడానికి ప్రయత్నించిన క్రమములో 'తత్వ శాస్త్రం' ఉద్భవించింది. ఆ తరువాత కాలక్రమేణా తత్వ శాస్త్రము నుండి అనేక శాస్త్రాలు వేరుపడి ప్రత్యేక శాస్త్రాలుగా ఉద్భవించాయి. అందుకే తత్వ శాస్త్రమును మూల శాస్త్రము లేదా అన్ని శాస్త్రాలకు పితామహుడుగా (father off all social sciences) అని అంటారు. అందుకే కాంప్టే అను మహాశయుడు అన్ని శాస్త్రాలకు శాస్త్రం వంటిది అని తత్వ శాస్త్రంను కీర్తించాడు. తత్వ శాస్త్రం లో మూడు ముఖ్యమైన శాఖలు ఉన్నాయి. అవి 1. ఆది భౌతిక శాస్త్రం 2. జ్ఞాన శాస్త్రం 3. విలువల శాస్త్రం.

పాశ్చాత్య తత్వశాస్త్రానికి గ్రీకు తత్వశాస్త్రం పునాది లాంటిది. ప్రాచీన కాలంలో గ్రీకులు కల్పిత పురాణ గాధలను అధిగమించి శాస్త్రీయ దృక్పథం తో ప్రకృతిలోని వైరుధ్యాలను, ప్రపంచం ఎలా ఉద్భవించింది, దాని స్వభావం ఏమిటి అనే విషయాలు తెలుసుకోవడానికి ప్రయత్నించారు. తత్వ శాస్త్రం మానవ ధర్మాన్ని గురించి విశదీకరించి నైతిక విలువలను నిర్వచించి ధర్మబద్ధమైన చారిత్రక అంశాలను వివరిస్తుంది.

## 14.5 తత్వ శాస్త్రంనకు, చరిత్రకు గల సంబంధం:

సాంఘిక శాస్త్రంలు అన్నింటికీ మూలం తత్వ శాస్త్రం, క్రమంగా విభజితమై అన్ని శాస్త్రాలు ప్రత్యేక అధ్యయన శాస్త్రాలుగా రూపొందాయి. చరిత్రకు తత్వశాస్త్రమునకు చాలా అవినాభావ సంబంధం వున్నది. తత్వ శాస్త్రము నీతి శాస్త్రమును కూడా తెలుపుతుంది, అలాగే వ్యక్తుల ప్రవర్తన, నడవడిక, నైతిక విలువలు మొదలగు ఎన్నో అంశాలకు ప్రాధాన్యత ను ఇస్తుంది. చారిత్రకారునికి ఒక అంశం మీద నిర్ధారణకు రావడానికి, హేతుబద్ధంగా తర్కించడంలో, సాధారణీకరించడంలో తత్వశాస్త్రం తోడ్పడుతుంది. తత్వం చారిత్రక కథనాన్ని కళాత్మక శాస్త్రీయ కథనంగా రూపొందిస్తుంది. మానవ సంస్కృతీ అంశాలను, ఆలోచనలను తాత్విక చింతనతో ఆలోచించి విశదీకరిస్తే మానవ నాగరికతను అర్థవంతం గా రాయగల అవకాశం చారిత్రకారునికి వుంటుంది. తత్వ ప్రబోధకుల సిద్ధాంతాలు, వారి చారిత్రక గమన ఆలోచనలను మనం గ్రహించి చరిత్ర రచన చేయాలి. చరిత్రకారుడు గత సంఘటనల అస్తిత్వం అతని ఆలోచనల మీద ఆధారపడి చరిత్ర రచన గావిస్తాడు. అతడు ఇచ్చే ప్రాధాన్యతను బట్టే యాదార్థాలు చారిత్రక గాధలుగా మారుతాయి. దీనికి తత్వ జ్ఞానం అవసరము అవుతుంది. చరిత్ర ను రచించే పలు సందర్భాలలో తత్వ వేత్తల భావాలు ప్రపంచాన్ని ఏవిధంగా ప్రభావితం చేసాయో తెలుసుకొనగలము. రూసో, వాల్టేర్ భావాలు ఫ్రెంచ్ విప్లవం, కారల్ మార్క్స్ భావాలు రష్యన్ విప్లవము, మావో భావాలు చైనా విప్లవం వంటివి రావడానికి దోహదపడ్డాయో చరిత్ర వలన తెలుసుకొనవచ్చును.

## 14.6 సమీక్ష :

గతించిన కాలంలోని రాజకీయ సంస్థలు, వాటి పుట్టుక, స్వరూప స్వభావాలు, వాటి కార్యకలాపాల గురించి తెలుసుకోవడానికి చరిత్ర అధ్యయనం తోడ్పడుతుంది. చరిత్ర ముందు తెలుసుసకొన్న సమాచారం ఆధారముగా నేడు రాజకీయ సంస్థలకు పటిష్టమైన పునాదులు చేయుటకు వాటిని సమర్థవంతంగా పని చేయించుటకు అవసరమైన చర్యలను చేపట్టవచ్చును. చరిత్ర, రాజనీతి శాస్త్రాలు ఇచ్చి పుచ్చుకొనే ధోరణిలోనూ, పూరకాలుగానూ ఉన్నంతమాత్రాన రెండూ ఒక్కటే అని భావించకూడదు. చరిత్ర తన సామగ్రిలో ఒక అంశాన్ని మాత్రమే రాజనీతి శాస్త్రానికి అందిస్తున్నది. రాజనీతి శాస్త్రజ్ఞుడు చరిత్ర నుంచి వాస్తవికమైన ఉదాహరణలు ఎన్నుకొని రాజకీయ సంస్థల పరిణామాలను రాజ్యం పైనా, ప్రభుత్వం పైనా ప్రత్యక్షం గానో, పరోక్షం గానో ప్రభావం చూపించడాన్ని అధ్యయనం చేస్తాడు. చరిత్రలో కథనానికి ప్రాముఖ్యత ఎక్కువ. అది యదార్థాల కాలక్రమ వివరణను ఇస్తుంది. రాజనీతి శాస్త్రం తులనాత్మకం, రాజ్యం ఎలా వుండేదో చెప్పేది చరిత్ర, ఎలా వుండాలో చెప్పేది రాజనీతి శాస్త్రం. హేతువాది బోల్గిన్ బ్రోక్ చరిత్రను 'నిదర్శనాల ద్వారా అభ్యసించే తత్వ శాస్త్రంగా పేర్కొన్నాడు.

## 14.7 వ్యాసరూప ప్రశ్నలు:

**ఈ క్రింది వ్యాసరూప ప్రశ్నలకు సమాధానము వ్రాయుము.**

1. చరిత్రకు రాజనీతి శాస్త్రం ఏ విధంగా తోడ్పాటు అందిస్తుందో ఒక వ్యాసం వ్రాయుము?

2. తత్వ శాస్త్రము చరిత్ర అధ్యయనంలో ఎటువంటి పాత్ర పోషిస్తుందో వివరించుము?

## 14.8 ఉపయుక్త గ్రంధాలు:


1. John S Dryzek, Political Science in History, Cambridge.
2. Niraj Gopal Jayal, Politics in India, New Delhi.
3.Frank Thilly, History of Philosophy, Surjeet Publications,
4. Jadu Nath Sinha, Introduction to Philosophy, New Delhi.
5. దుర్గా ప్రసాద్, జె., చరిత్ర రచనా శాస్త్రం, తెలుగు అకాడమీ, హైదరాబాదు, 1987.

## పాఠం-15

# సాహిత్యము

**లక్ష్యాలు:**

- ఈ పాఠ్య భాగాన్ని అధ్యయనం చేయడం వలన మీరు సాహిత్యం, చరిత్రతో ఏవిధమైన సంభందంను కలిగి వున్నాయో అని తెలుసుకోగలుగుతారు. విధ్యార్థులు సాహిత్య అధ్యయనం చేయడం వలన చరిత్రను ఎలా పునర్నిర్మాణం చేయవచ్చో అని అవగాహనను కలిగి వుంటారు.
- చరిత్రకు సాహిత్యానికి గల దగ్గరి పోలికలను అంచనా వేయగలగాలి.
- చరిత్రకు సాహిత్యానికి గల సంబంధాన్ని తెలుసుకోగలగాలి.

**విషయక్రమము:**

**15.1 పరిచయం**

**15.2 సాహిత్యము - అర్థం-పరిధి- ప్రాధాన్యత**

**15.3 సాహిత్యము నకు, చరిత్ర కు గల సంబంధం**

**15.4 సమీక్ష**

**15.5 వ్యాసరూప ప్రశ్నలు**

**15.6 ఉపయుక్త గ్రంధాలు**

## 15.1 పరిచయం:

గతాన్ని పునర్నిర్మించడంలో సాహిత్యం ఎంతగానో ఉపయోగపడుతుంది. వైదిక సాహిత్యం మొదలు విజయనగర కాలం వరకు వ్రాయబడ్డ ఎన్నో గ్రంధాలు రాజకీయ, సాంఘీక, సాంస్కృతిక చరిత్రల అధ్యయనానికి, రచనకు చక్కగా ఉపయోగపడుతాయి. ప్రాచీన కాలానికి గ్రీక్, రోమన్ల రచనలు ఉపయోగపడుతాయి. అందులో మొగస్తనీస్ రచన ఇండికా చాలా ముఖ్యమైనది. గుప్తుల కాలానికి పాహియాన్ రచనలు, మధ్యయుగ తొలి దశ చరిత్రకు ఆల్బెరునీ రచనలు ఎంతో విలివైనవి. ఇటలీ, పోర్చుగల్, పర్షియా దేశాలకు చెందిన మార్కోపోలో, నికోలోకాంటి, అబ్దుల్ రజాక్ తదితరుల సాహిత్యం చరిత్ర రచనకు చాలా తోడ్పడుతాయి. కాలానుక్రమణికలు, వంశాల వివరాలు పురాణ సాహిత్యం తోనే అంతమౌతాయి. తదుపరి సాహిత్యంలో ఇలాంటి సమాచారం గోచరించదు, కేవలం పాలకుల జీవిత చరిత్రలు తప్ప.

## 15.2 సాహిత్యము - అర్థం-పరిధి- ప్రాధాన్యత:

లాటిన్ బాషలో 'లిటిరాటురా' అనగా అక్షరము లతో ఒక లయ బద్ధంగా గ్రంధస్థం చేయడం అని అర్థం. కొన్ని నిర్వచనాల ప్రకారం మాటల రూపంలో గానీ, పాటల రూపంలో గాని గ్రంధస్థం చేయడమే. ఈ సాహిత్యం ను మొదటిసారిగా క్రీ. పూ. 4 వ శతాబ్దిలోనే ప్రాచీన ఈజిప్ట్- సుమెరియా నాగరికతా కాలం లోనే పేర్కొనబడినది. సాహిత్యం అనగా హితంతో కూడినది, హితాన్ని కూర్చేది. మొదటగా మాటల ద్వారా ఇది వాడుకలోకి వచ్చింది. పురాణాల్ని వాఙ్మయాలని, కవిత్వం, కథ, నవల, నాటకం, లేఖా సాహిత్యం, జానపద సాహిత్యం ఇవన్నీ సాహిత్యం గానే చెప్పవచ్చును. ప్రముఖ బ్రిటీష్ సాహితీ వేత్త కార్లయిల్ ' మహాపురుషుల జీవిత చారిత్రలే మానవ జాతి చరిత్ర' అని భావించాడు. నిజానికి పందొమ్మిదో సంవత్సరం వరకూ చరిత్ర సాహిత్యంలో అంతర్భాగమే. శాస్త్రీయ దృక్పథం పెంపొందడం తో చరిత్ర సాహిత్యం నుండి వేరయింది. ఇది చాలా విస్తృతమైనది. ఒక భాషను అక్షరబద్ధం చేసే పక్రియను సాహిత్యంగా పేర్కొంటారు. సాహిత్య ఆధారాలను స్వదేశీ, విదేశీ సాహిత్య ఆధారాలుగా విభజించి తిరిగి వీటిని మత, లౌకిక ఆధారాలుగా విభజించవచ్చు. బౌద్ధ, జైన మతస్థుల గ్రంధాలు, వేదాలు, పురాణాలు, రామాయణం, మహాభారతం, ముఖ్యమైన మత ఆధారాలు. అర్థ శాస్త్రం, రాజతరంగిణి, బాణుడు రచించిన హర్షచరిత్ర, మొదలగునవి ముఖ్యమైన లౌకిక సాహిత్య గ్రంధాలు. ప్రాచీన కాలం నాటి చరిత్ర రచనకు గ్రీకు రాయబారుల, రోమన్ వర్తకుల, చైనా యాత్రికుల రచనలను మనం అధ్యయనం చేయవలెను. అలాగే మధ్యయుగ చరిత్ర రచనకు ఇటాలియన్, పోర్చుగీస్ రచనలను గూడ మనం పరిశీలించాల్సి వుంటుంది. భారతదేశ చరిత్ర రచనలో మరీ అంత ప్రాముఖ్యత పొందని పౌరాణిక, గాధా సాహిత్యం చరిత్ర రచనకు పనికిరావు. ఇవి కేవలం కాల్పనిక గాధలు మాత్రమే. విదేశీ సాహిత్యంలో ప్రాంతీయ చరిత్రను రూపొందించుటలో పక్షపాతం చూపటానికి ఆస్కారం వుండదు. విదేశీ సాహిత్యకారులు ఎవరి గురించి రాశారో, ప్రజల భాష, ఆచారవ్యవహారాలు వీరికి తెలియకపోవడం వలన చరిత్ర అధ్యయనం లో, చరిత్ర రచనలో కొన్ని పొరపాట్లు కానవస్తాయి.

## 15.3 సాహిత్యము నకు, చరిత్ర కు గల సంబంధం:

చరిత్రకు సాహిత్యంతో ఉన్న అనుబంధం ప్రగాఢమైనది. ఈ రెండు శాస్త్రాలు ఒకదానికొకటి అనుసరణీయాలు. సాహిత్యంలోని ప్రతి విభాగం ప్రతి ప్రక్రియ, గద్యం, పద్యం, నాటకాలు, కల్పనలు, డైరీలు, యాత్రా వర్ణనలు, మతగ్రంధాలు, మొదలగునవి అన్ని చారిత్రక పరిస్థితిలలో ఆవిర్భవించినవే. సాహిత్యపు అంతం నుంచి చరిత్ర ఉద్భవించిందనేది కాదనలేని యదార్థం. చరిత్రకు సాహిత్యానికి సహసంబంధం కారణంగా చరిత్ర ఒక ఇతిహాసంగా, ఒక రూపకంగా, ఒక పద్యకావ్యంగా ప్రసిద్దికెక్కింది. చరిత్ర మానవుని నడవడికకు సంబంధించిన విషయము. సాహిత్యం మానవుని అనుభూతులు, ఉద్వేగాలు, ఆలోచనలు, ఊహలకు సంబందించిన విషయ పరిజ్ఞానం. ఈ రెండు శాస్త్రాలను తులనాత్మకంగా అధ్యయనం చేయడం వలన సాహిత్య పఠనంను, చరిత్ర అధ్యయనం ను సార్థకం చేయవచ్చును. మానవుని హృదయాన్ని స్పందింపజేసే సుగుణం సాహిత్యం లోనే కలదు. చారిత్రక గ్రంధాలు ఆయాకాలాల సమాజ పరిస్థితులను ప్రతిబింబిస్తాయి. ఉదాహరణకు తులసీదాస్ 'రామ చరితమానస్', చాంద్ బర్దాయ్ 'పృధ్వీ రాజ్ రాసో'.

చారిత్రక నవల యదార్థం, కల్పనల విచిత్ర సంయోగం, కావున ఆయాకాలాల పరిస్థితులను, నైతిక సూత్రాలను, వక్రీకరించకూడదు. చరిత్ర అందించిన స్పూర్తితోనే మానవుని కాలంతో ముడివేసే సమకాలీన పరిస్థితులు, సంఘటనల నేపథ్యంలోనే కాళిదాసు, బాణభట్టు, విధ్యానాథుడు, షేక్ స్పియర్, మొదలయిన నవలలే అయినా, నాటకాలే అయినా, జీవిత గాథలే అయినా సాహిత్య ప్రక్రియ సంబంధించిన రచనలగా రూపుదిద్దికొన్నాయి. ఈ రచనలు సాహితీ చరిత్రలో పరిణామాలను సాధించబడిన ఘనవిజయాలను ప్రతిబింబించడంతో పాటూ మానవుడు ఇతర రంగాలలో సాధించిన విజయాలకు దర్పణం పడుతున్నాయి.

రాంకే మాటల్లో 'చరిత్ర విజ్ఞానాభివృద్దికి దోహదం చేసే సాహితీ శాఖ కాదు'. అని పేర్కొనబడిన గిబ్బన్ అను చరిత్రకారుడు రచించిన 'రోమన్ సామ్రాజ్య క్షీణత' అనే గ్రంధం వలన సాహితీ జగత్తు లోనే విశిష్ట స్థానం సంపాదించాడు. ప్రాచీన కాలం నుంచి

నేటిదాకా కల్హణుడు హెరెడోటస్, థూసిడైడిస్, ఆల్బెరూనీ, నేలటూరి వెంకట రమణయ్య మొదలగు చరిత్ర కారులు స్వీయ సాహితీ ప్రతిభతో, భావ వ్యక్తీకరణ శక్తితో, నిర్దిష్ట శైలిలో తమ చారిత్రక రచనలకు వన్నెతెచ్చారు.

## 15.4 సమీక్ష:

చరిత్ర అధ్యయనంలో కలిగే ఇతర ప్రయోజనాలు విషయం ఎలా వున్నా, అది ఇచ్చే ఆహ్లాదం కోసమైన చరిత్ర రచనను కొనసాగించాలని కొందరి అభిప్రాయం. చారిత్రక పరిజ్ఞానం మన చుట్టూ వున్న ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి, అభినందినంచడానికే కాక ఆనందించడానికి కూడా తోడ్పడుతుంది. కళారూపకంగా విషయాన్ని వివరించడం చరిత్ర లక్షణం. పర్యవసానంగా చరిత్ర అనేక సాహితీ ప్రక్రియలకు ఆలంబనం అయింది. ఈ సాహిత్యం లో పద్య భాగము, గద్య భాగము, నాటకము, ముఖ్యమయినవి. పాండిత్యం, భావవ్యక్తీకరణ సామర్థ్యం కలిగిన పండితుడే తన స్వీయ అంచనా ప్రకారం గతాన్ని చక్కగా చిత్రించగలడు. తన ఆలోచనలకు అందమైన ఆచ్చాదన ఇవ్వగలడు. ఇవన్నీ సాహిత్య ప్రక్రియాలోనే సాధ్యమవుతాయి.

## 15.5 వ్యాసరూప ప్రశ్నలు:

1. చరిత్రకు, సాహిత్యం కు ఉన్న సన్నిహిత సంబంధాన్ని వ్రాయుము?
2. చరిత్ర రచనలో లేదా కూర్పు లో సాహిత్య ప్రాధాన్యతను వివరించుము?

## 15.6 ఉపయుక్త గ్రంథాలు:


1. Leitch et al., The Norton Anthology of Theory and Criticism
2. Ross., The Emergence of Literature
3. దుర్గా ప్రసాద్, జె., చరిత్ర రచనా శాస్త్రం, తెలుగు అకాడమీ, హైదరాబాదు, 1987.

## యూనిట్ - 5

## పాఠం - 16

# చరిత్ర రచనా శాస్త్ర సిద్ధాంతములు

### పాఠ్య నిర్మాణ క్రమం:


16.1 ఉపోద్ఘాతము
16.2 చరిత్ర రచనా సిద్ధాంతములు
16.2.1 మతపరమైన సిద్ధాంతాలు
(ఎ) క్రైస్తవ సిద్ధాంతము
(బి) ఇస్లాం సిద్ధాంతము
(సి) హిందూ సిద్ధాంతము
16.2.2 శాస్త్రీయ సిద్ధాంతము
16.2.3 కాల్పనిక సిద్ధాంతము
16.2.4 కార్యాకరణ సిద్ధాంతము
16.2.5 సామాజిక సిద్ధాంతము
16.2.6 తులనాత్మక సిద్ధాంతము
16.2.7 నిర్మాణాత్మక సిద్ధాంతము
16.2.8 పర్యావరణ సిద్ధాంతము
16.2.9 హెగెల్ సిద్ధాంతము
16.2.10 నవీన సిద్ధాంతము
16.3 ముగింపు
16.4 నమూనా ప్రశ్నలు
16.5 ఉపయుక్త గ్రంథాలు


### 16.1 ఉపోద్ఘాతము:

ఆంగ్ల భాషలోని 'హిస్టరి' అనే పదము గ్రీకు భాషలోని 'ఇస్తోరియా' నుండి పుట్టినది. దీనికి అర్థము 'వెదుకుట'. కాలక్రమేణా అన్వేషణ ఫలితంగా వ్రాయబడ్డ రికార్డుగా ప్రచారంలోనికి వచ్చింది. ఇస్తోరియా అన్నమాట లాటిన్ 'హిస్టోరియా'గా ఇండో-యూరోపియన్ భాషల్లోనికి వచ్చింది. చరిత్ర రచనకు మొదట పూనుకొన్నవారు గ్రీకులు. క్రీ.పూ. 408 మధ్య కాలానికి చెందిన డయోనిషియన్ చరిత్రను 'ఉదారణల నుండి గ్రహించిన తత్వశాస్త్రము' అని పేర్కొన్నాడు. క్రీ.పూ. 4వ శ. చెందిన అరిస్టాటిల్ 'మార్పు చెందని గతానికి చెందిన వర్ణన'గా, థూసిడైడిస్ 'చరిత్రను జ్ఞాపకం ఉంచుకోదగిన విషయాల గాథ'గా వివరించారు. 18వ శ. ఎడ్మండ్ బర్క్ 'చరిత్ర యుక్తాయుక్త విచక్షణ కలిగించే అధ్యాపకుడువ అన్న భావనతో నిర్వచించాడు. ఎవరెస్టు బెర్న్‌హాం 'మానసిక - భౌతిక కార్యాకరణ నేపథ్యంలో సంఘ జీవులుగా మానవుల వైయుక్తకమైన, విలక్షణమైన సామూహిక చైతన్యాన్ని, దేశ కాల పరిస్థితుల ఆధారంగా మానవ పరిణామాన్ని నిర్ణయించే వాస్తవాలను పరిశోధించి, అందించే విజ్ఞాన శాస్త్రం చరిత్ర అని నిర్వచించాడు. కార్ మాటలలో 'చరిత్రకారునికి, చారిత్రక యథార్థాలకు మధ్య అవిచ్ఛిన్నంగా సాగే కార్యవిధానం, వర్తమానానికి, గతానికి మధ్య జరిగే అనంతమైన పరిభాషణ' అని నిర్వచించాడు.

ఈ నిర్వచనాలన్నీ ఆనాటి కాల, దేశ, ఆలోచన సరళి, దృక్పథాలను బట్టి వివిధ రకాలుగా ప్రచారంలోకి వచ్చాయి. ఉదా॥ హెరిడోటస్, థూసి, డైడిస్‌లు సమకాలీన రాజకీయ విషయాలకు ప్రాధాన్యతనివ్వగా, వైబ్‌నిట్జ్ మత, నైతిక విషయాలకు, కార్లైల్ వ్యక్తి ప్రాధాన్యతకు, ఆక్టన్ స్వేచ్ఛకు, రాంకీ నిష్పాక్షికమైన వాస్తవాలు, శాస్త్రీయ దృక్పథం అన్వేషించి, విశ్లేషించి, అన్వయించి శాస్త్రంగా వివరించారు. అందువల్ల చరిత్ర రచనలో వివిధ సిద్ధాంతాలు వచ్చాయి.

## 16.2 చరిత్ర రచనా సిద్ధాంతాలు:

**16.2.1 మతపరమైన సిద్ధాంతాలు:** చరిత్ర రచన క్రీ.శ. 5 - 13వ శ. మధ్య అతీతశక్తుల ప్రభావమునకు గురి అయినది. క్రైస్తవ మత ప్రభావము, ఇస్లాం మత ప్రభావము ఏర్పడినది.

**(ఎ) క్రైస్తవ మత సిద్ధాంతము:** క్రీ.శ. 310లో కాన్‌స్టాంటైన్ చక్రవర్తి క్రైస్తవ మతమును అధికారికంగా అంగీకరించటంతో ఐరోపా క్రైసెండం (మత రాజ్యం)గా మారిపోయింది. దీని ఫలితంగా 'మంచిగానో, చెడుగానో కనిపించే ప్రతిదీ భగవంతుని ప్రణాళిక అనే పొడవైన గొలుసులో ఒక కొక్కెము' అన్న క్రైస్తవుల మతస్థుల భావన చరిత్ర రచనా సంవిధానమునకు మూలమైనది.' అందువల్లనే చరిత్ర పరిజ్ఞానం మత అవసరాలకు పరిమితం చేయబడింది. భగవంతునిచే సృష్టింపబడిన మానవుని చేతిలో ఏమీ లేదని, మానవుడు అతీత శక్తుల ముందు నిస్సహాయుడు అన్న భావము కలిగి ఉన్నారు. ఈ క్రైస్తవ రచయితలు చరిత్ర ఆధారాలను పవిత్రం, అపవిత్రం అని రెండు భాగాలుగా విభజించారు. దీని ఫలితంగా దైవిక, అలౌకిక సాధనాల ద్వారా జరిగే అద్భుతాలకు ప్రాధాన్యమిచ్చే మత చరిత్ర పై తమ దృష్టిని కేంద్రీకరించారు. క్రైస్తవ ధర్మ ప్రభావంతో రచనలు చేసిన వారిలో ప్రసిద్ధుడు సెయింట్ అగస్టీన్.

సెయింట్ అగస్టీన్ క్రైస్తవ చర్చి చరిత్రలో గొప్ప దార్శనికుడుగా ప్రసిద్ధి పొందినవాడు. ఇతని రచనలలో ప్రధానమైనవి 'The City of God', 'Confessions' ప్రప&ంచ అత్యుత్తమ సాహిత్య గ్రంథాలు. ఇతడు చరిత్రలో భగవంతునికి ముఖ్య స్థానము ఇచ్చి, భగవంతుడే మానవ కార్యకలాపాలను నిర్దేశిస్తాడు. చరిత్ర శాశ్వత, అశాశ్వత విషయాలను అధ్యయనం చేయాలన్నాడు. ఈ విధమైన మత ప్రభావ కాలమైన మధ్య యుగం నాటి విశ్వాసాలు, పరిస్థితుల ప్రభావంగా చరిత్ర రచనా శాస్త్రం మత ప్రభావానికి గురియైనది.

**(బి) ఇస్లాం మత సిద్ధాంతము:** గ్రీకు - రోమన్ చరిత్ర రచనా సాంప్రదాయానికి ఆధునిక యుగ చరిత్ర సాంప్రదాయానికి మధ్య అరబ్బులు వారధిగా పని చేశారు. క్రైస్తవులు చరిత్ర రచనా సాంప్రదాయానికి 'చర్చి'ని కేంద్రంగా భావించగా, ఇస్లాం మతస్థులు 'దైవ ప్రేరణ' చరిత్ర రచనకు మూలంగా భావించారు. వీరు చరిత్రకు, పవిత్రేతర చరిత్రకు మధ్య ఎలాంటి తేడాను చూపలేదు.

ఇస్లాం మతస్థులు చరిత్ర రచనను మహమ్మద్ ప్రవక్త ఇస్లాం మతాన్ని స్థాపించటంతో ఆరంభించారు. ఖలీఫాలు తమ వంశ పారంపరింపు హక్కు బుజువు చేసుకోవటానికి, మహమ్మద్ ప్రవక్తతో తమ సంబంధ బాంధవ్యాలను తెలపాలని వాటిని గ్రంథస్థం చేయాలనే దృక్పథంతో చరిత్ర రచనలు చేశారు.

ఐబక్ వైషక్ క్రీ.శ. 8వ శ.లో మహమ్మద్ గురించి మొదటి జీవిత చరిత్రను వ్రాశాడు. క్రీ.శ. 838-923ల మధ్య ఉన్న ఆల్‌బతారి మొదటి సమగ్ర 'సార్వత్రిక' చరిత్రను వ్రాశాడు. ఘజనీసుల్తానుల ఆస్థన రచయిత ఆల్‌బెరూని చరిత్ర రచనకు బలమైన పునాది వేశాడు. ముస్లిం చరిత్రకారులందరిలో ప్రసిద్ధిడు ఐబన్ ఖల్దూన్. ఇతను రచించిన Kitab-al-Isar అనే గ్రంథంలో ముఖ్యమైనది 'ముకద్దిమా' (అవతారం) ప్రసిద్ధిమైనది. ఈ గ్రంథంలో చారిత్రక యథార్థాల స్వభావం, వాటి పరస్పర సంబంధాలు, సామాజిక కట్టుబాట్లు మొదలైనవి వ్రాశాడు.

**(సి) హిందూ మత సిద్ధాంతము:** ప్రాచీన భారతీయ చరిత్ర రచనా సాంప్రదాయాన్ని తెలియపరిచే ముఖ్య ఆధారం సంస్కృత వాఙ్మయం ఈ సంస్కృత సాహిత్యంలో 'చరిత్ర' అర్థము వచ్చేటట్లు ఉపయోగించబడిన పదము 'ఇతిహాసం'. ప్రాచీన సంస్కృత సాహిత్యమైన ఋగ్వేదము, బ్రాహ్మణకాలు, ఉపని,త్తులు, రామాయణ, మహాభారతములు చరిత్ర గ్రంథాలుగా భావించారు. ప్రాచీన కాలంలో ధర్మార్థ కామ మోక్షములను వివరించగా కథా సంయుక్తంగా చెప్పటమే ఇతిహాసంగా తెలియ చేశారు. ఈ విధముగా ప్రాచీన భారతీయుల దృక్పథంలో ఇతిహాసమే చరిత్ర. పురాణం చరిత్రకు మరోవైపు. ఇతిహాస, పురాణ సాంప్రదాయంలో మూడు కీలకమైన అంశాలు ఉన్నాయి. అవి: (1) కట్టు కథ (Mytu), (2) వంశావళి (Geneology), (3) చారిత్రక వివరణము (Historical Narrative). రామిల్లాథాపర్ అభిప్రాయం ప్రకారం బారతీయ చరిత్ర రచనా సాంప్రదాయంలో రాజకీయ చరిత్ర కీలకమైన అంశం కాదు. గుప్తుల తరువాత రాజకీయ చరిత్రకు ప్రాముఖ్యత పెరిగింది. తరువాతి కాలంలో ప్రతి రాజ్యం వంశావళిని, చారిత్రక వ్యక్తుల జీవిత చరిత్రలు రచించడం అనే నూతన ప్రక్రియ ప్రారంభమైనది. క్రీ.శ. 600-1200 మధ్య కాలంలో బాణుని హర్ష చరిత్ర, బిల్హణుని విక్రమాంక దేవచరిత్ర, కల్హణుని రాజ తరంగిణి మొదలగు చారిత్రక గ్రంథాలు వ్రాయబడ్డాయి.

భారతీయులకు చారిత్రక దృష్టి, దృక్పథము లేదని పాశ్చాత్య చరిత్రకారులు విమర్శించారు. దీనిని ప్రముఖ చరిత్రకారిణి ఖండిస్తూ, ప్రతి సమాజానికి గతం గురించిన భావన తప్పక ఉంటుందని, చారిత్రక దృక్పథం ఒక భఆవన అనేది అప్రత్యేక సమాజానికి పనికి వచ్చే అవసరాలు తీర్చడానికి ఉపయోగపడే కాలక్రమణిక చట్రంలో బిగించబడిన గత సంఘటనల చైతన్యమే చరిత్ర అని నిర్వచించారు. ప్రాచీన భారతీయుల చరిత్ర రచనా దృష్టి సమగ్రమైనదని అంగీకరించవచ్చు. వీరు వంశావళులు, చారిత్రక వివరణలు, సామాజిక విశ్వాసాలు మొదలగున్నవి చర్చించారు. ఆ తరువాత భారతీయ చరిత్ర రచనా దృక్పథంలో అరబ్బుల బ్రిటీష్ వారి రచనలు చోటు చేసుకున్నాయి.

**16.2.2 శాస్త్రీయ సిద్ధాంతము:** చరిత్రను సూత్రబద్ధమైన విజ్ఞాన శాస్త్రంగా రూపొందించాలని, యదార్థము కంటే వాస్తవికత ప్రధానమని జరిగింది జరిగినట్లు విషయగతంగా విశ్వసనీయంగా చరిత్ర గతాన్ని వివరించేదిగా ఉండాలని, తత్త్వ శాస్త్రానికి భిన్నమైనది చరిత్ర అన్నది వీరి ప్రగాఢ విశ్వాసం. ఈ దృక్పథంను వెలిబుచ్చిన చరిత్రకారులలో ప్రథముడు లియోపాల్ట్ వాన్ రాంకీ. ఈ శాస్త్రీయ దృక్పథంలో వీరు మూడు విషయాలకు ప్రాధాన్యత ఇస్తారు. (1) వాస్తవాల సేకరణ (Collection of Data), (2) విశ్లేషణ (Analysis), (3) అన్వయయము (Interprectation).

**16.2.3 కాల్పనిక సిద్ధాంతము:** 19వ శ. కాల్పనిక వాదముగా కొనసాగి హేతువు, నివేచన స్థానంలో ఊహ ఆక్రమించుకొన్నది. కాల్పనిక వాదం అనుభూతి దామునకు దారి తీసింది. ఈ వాదన ప్రధాన అంశాలు వ్యక్తి స్వేచ్ఛ, సంకల్ప ప్రాధాన్యత, అంతర్ జ్ఞానం. చరిత్ర రచనా సంవిధానములో ఈ వాదములో ప్రభావితులైన వారు కార్లైల్, ఫ్రూడ్, మెకాలే, కారల్‌మార్క్స్, మిచిలెట్, బ్రాంకాస్ట్ మొదలైనవారు. కార్లైల్ మహాపురుషులే చరిత్ర రథసారథులన్నాడు. కారల్ మార్క్ చరిత్ర అంతా వర్గ పోరాట చరిత్రయని, వర్గరహిత సమసమాజ స్థాపన తన ధ్యేయమని చరిత్ర గతిని విశ్లేషించాడు. మిచిలెట్, బాంక్రాఫ్టలు ఫ్రాన్స్ చరిత్రకారులు. అమెరికన్ చరిత్ర రచనా సాంప్రదాయమునకు శ్రీకారం చుట్టినవాడు బాంక్రాఫ్ట్.

**16.2.4 కార్యాకరణ సిద్ధాంతము:** ఏ చారిత్రక సంఘటన అయినా కారణం లేక కారణాలు లేకుండా జరగదు. ప్రతి కారణమునకో ప్రతిగా ఫలితం ఉంటుంది. గతంలో ఎవరో ఈ కారణాల గురించి ఆలోచించలేదు. వారు కేవలం జరిగిన సంఘటనలు మాత్రమే చర్చించేవారు. యుద్ధము ఎప్పుడు? ఎక్కడ జరిగింది? ఎంత మంది సైనికులు చనిపోయారు? మొదలైన విషయాలే ఉండేవి. తరువాతి కాలంలో ఈ సంఘటనలు ఎందుకు జరిగాయి? అనే భావన కలిగినప్పటి నుండి చరిత్ర గమనం మారిపోయినది. ఈ కార్యాకరణ సంబంధం పై అనేక సిద్ధాంతాలు వచ్చాయి.

**(ఏ) దైవిక ప్రణాళిక:** దీని ప్రకారంగా ఈ సిద్ధాంతకర్తలు చరిత్రను 'విశ్వాసము' అనే శక్తి నడిపిస్తుందని నమ్మలేరు. ప్రాచీన నాగరికతల్ని ఈజిప్టు, బాబిలోనియా, గ్రీకు మొదలైనవి ఈ సిద్ధాంతాన్ని విశ్వసిస్తాయి. ఇంతేకాక ప్రపంచ ప్రముఖ మతాలన్నీ హిందూ మతం, ఇస్లాం మతము, క్రైస్తవ మతము మరియు చైనా మతము అన్ని ఈ సిద్ధాంతాన్ని అనుసరిస్తూ గొప్ప రాజులు, వ్యక్తులు, నాయకులు, పూజారులు, ధనవంతులు చరిత్రను నడిపిస్తారు. ప్రతిదీ దేవుని అనుజ్ఞ వల్లనే జరుగుతుంది. మానవుని కార్యక్రమాలలో దేవుని ప్రత్యక్ష సంబంధం ఉంటుంది అని వాదిస్తారు. ప్రతి సంఘటనకు కారణాలుంటాయని చాము చర్చించలేని సమయంలో అది దేవుడి వల్ల జరిగి ఉంటుందని వివరిస్తాయి. ఈ సిద్ధాంతాన్ని పశ్చిమ లేదా తూర్పు దేశాలలో పూజారి వర్గం బాగా ప్రచారం చేసింది. కారణం ప్రజలకు దేవుని పై ఉన్న నమ్మకం.

**(బి) హేతువాదము:** క్రీ.శ. 16, 17వ శతాబ్దాలలో సమాజంలో, ప్రజలలో అవగాహన పెరిగి, ఆలోచనలు పదునై హేతువాదము బలపడింది. అనేక మంది మేధావులు, చరిత్రకారులు, పండితులు అంతకుముందు అన్ని సంఘటనలు దేవుని వల్లనే జరుగుతాయని అనే దైవిక సిద్ధాంతాన్ని ఖండించారు. మానవుని అభివృద్ధికి దేవుని ప్రమేయమునకు సంబంధం లేదని మానవుని అభివృద్ధికి హేతువాద ఆలోచనే ముఖ్యమని అభిప్రాయపడినాయి. జాన్‌లాక్ పరస్పర ప్రేమ వలననే సమాజం, తత్ఫలితంగా దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఇదే ఒక దేశానికి మూల సిద్ధాంతమని, చరిత్ర గమనం అంతే మానవుడు ఖచ్చితమైన స్వచ్ఛతకు చేరుకోవటమే అని అభిప్రాయపడినారు.

**(సి) జాతీయవాదము:** ఈ వాదము క్రీ.శ. 19వ శతాబ్దంలో ప్రచారము అయినది. చరిత్ర గమనంలో 'జాతీయవాదన భావన' Naturalism అనే కారణం ప్రముఖమైనది. చారిత్రకంగా జరిగిన యుద్ధాలన్నీ దేశాభిమానం పై, జాతీయ అభిమానము నుండి జరిగాయని నమ్మలేరు.

**(డి) శాస్త్రీయ సిద్ధాంతము:** 19వ శ.లో జర్మన్ చరిత్రకారుడైన రాంకీ అభివృద్ధిపరచిన సిద్ధాంతామే శాస్త్రీయ సిద్ధాంతము. ఇతని సిద్ధాంతపరంగా చరిత్రలో కార్యాకరణ అనే భావన లేకుండగానే సంఘటనలను వివరించవచ్చు. వీటికన్నా చరిత్ర గమనంలో పరిశీలించవలసినవి ముందు జరిగిన సంఘటనలు మరియు తరువాత జరిగిన ప్రతిఫలాలు, ప్రతి వాటికి ఆధారాలు, విశ్లేషణ, అన్వయం అవసరమని వీరి భావన.

**(ఇ) భావోద్వేగములు:** వీరి అభిప్రాయం ప్రకారం మానవుల భావోద్వేగములే చరిత్ర గమనాన్ని నిర్దేశిస్తాయి. ఒక కాలంలో, ఒక సందర్భంలో జరిగే లేక సంభవించే ప్రజల భావోద్వేగములు చరిత్ర కచనను నిర్దేశిస్తాయి. జరిగే సంఘటనలన్నింటిలో గొప్ప గొప్ప నాయకులు ప్రజల భావోద్వేగాలను పెంచుతారు. ప్రజలు పాల్గొని సంఘటనలను నెరవేరుస్తారు. ముఖ్యంగా ప్రాచీన కాలంలో పురోహితులు సమాజంలోని భావోద్వేగాలకు కారణమైతే, తరువాతి కాలంలో రాజకీయ నాయకులు కారణమౌతున్నారు. ఉదాహరణకు ఫ్రెంచి విప్లవ సంఘటనలను లాక్, వోల్టేర్, రూసోలు భారత స్వాతంత్ర్య సంగ్రామంలో మహాత్మాగాంధీలు ప్రజల భావోద్వేగాలతో ఆయా దేశాలు స్వాతంత్ర్య సిద్ధికి కారకులైనారు. హెగెల్, కామ్టే, సైమిక్ ఈ సిద్ధాంతాన్ని బాగా ప్రచారంలోకి తెచ్చారు.

**(ఎఫ్) చారిత్రక విభాగము:** ఈ సిద్ధాంతం జర్మనీ దేశంలో ప్రారంభమైనది. విలయం ఢిత ఈ విభాగ ప్రముఖ సిద్ధాంత కర్త. వీరి ప్రకారం చరిత్ర అనేది ఒక నిరంతర ప్రక్రియ. ఈ నిరంతర ప్రక్రియలో చరిత్రకారుడు ప్రపంచం మొత్తం మీద జరుగుతున్న సంఘటనలు వాటికి కారణాలు కనుగొనడం ప్రధాన కర్తవ్యంగా భావించాలి. చరిత్ర నిరంతరము విలువలను వెలికితీసే విధంగా ముందుకు వెళ్ళాలి. చరిత్రకారుడు ఆ విలువల పై తనకున్న అనుభవంతో, జ్ఞానంతో వివరించాలి. ప్రతి సంఘటన ఎందుకు జరిగింది? అనే విషయాలను ప్రజల ముందు ఉంచాలి.

**(జి) ఫ్లూరలిస్టిక్ భాగము:** ఈ సిద్ధాంత కర్తలు చరిత్ర గమనంలో జరిగే సంఘటనలు కేవలం కొంతమంది వ్యక్తుల లేక కొన్ని సంస్థల ప్రమేయం, చొరవతో జరిగినవి కావు. కాబట్టి చరిత్రలో కేవలం సంఘటనలను కాలపట్టికగా చూడకూడదు. వీటితోపాటు సామాజిక, ఆర్థిక, రాజకీయ, మత, సాంస్కృతిక విషయాలన్నీ పరిగణనలోకి తీసుకొని చరిత్ర రచనలు చేయాలి. వీరి ప్రకారంగా ప్రతి సంఘటనకు అనేక వి,యాలు కారణాలుగా ఉంటాయి.

**16.2.5 సామాజిక సిద్ధాంతము:** మనిషి మరియు సమాజము అవినాభావ సంబంధం కలిగి ఉంటారు. ఒకరిని విడిచి మరొకరి మనుగడ చూడలేము. మనిషి మరియు సమాజాన్ని చారిత్రక ఆధారాల ప్రకారంవ చదవాలి. టాయన్ బీ చెప్పినట్లు "చరిత్ర అంతా సామాజిక అణువులతో తయారైనది". వ్యక్తులు మరియు దేశాలు సామాజిక సంస్థల నిర్మాణ పాత్ర వహించలేవు. చరిత్ర మనుషులకు సంబంధించినది అయితే మనిషి సమాజానికి సంబంధించిన వ్యక్తి అవుతాడు. అందువల్ల సమాజానికి - చరిత్రకు అవినాభావ సంబంధం ఉంటుంది. చరిత్రకారుడు కేవలం గత కాలానికి చెందిన వాస్తవాలను వర్ణించటమే కాదు, సామాజిక అభివృద్ధిని గమనిస్తాడు. "రెన్నియర్ అనే చరిత్రకారుడు" సామాజిక చరిత్ర, ఆర్థిక చరిత్రకు భూమిక వహిస్తే, రాజకీయ చరిత్రను కొలవగలము. సామాజిక మార్పులు, రాజకీయ మార్పులకు దారి తీస్తాయి. జి.యం. ట్రవలియన్ అనే చరిత్రకారుడు పేర్కొనట్లు "సామాజిక అంశాలు లేని ఆర్థిక అంశాలు ఎడారితో సమానము మరియు రాజకీయ చరిత్ర శూన్యము". మాక్స్ వెబర్ ప్రకారంగా "మానవుని అభివృద్ధితోపాటు, సమాజ అభివృద్ధిని చదవాలి. దీనినే వక్టన్, టాయన్‌బీలు బలపరిచినారు.

**16.2.6 తులనాత్మక సిద్ధాంతము:** ప్రారంభ దశలో చరిత్ర అనగా కథను వివరించుటగా ఉండేది. కాలక్రమేణా అదొక స్వతంత్ర విషయంగా మారినది. దీనితో తులనాత్మక, విశ్లేషణ, పరిశోధన అనే అంశాలు ప్రచారంలోనికి వచ్చాయి. అందువల్ల చరిత్ర స్వభావము పూర్తిగా మారిపోయినది. ఏవైనా రెండు అంశాలు ఒకే రకంగా ఉండినపుడు వాటిని తులనాత్మక పద్ధతిలో అధ్యయనం చేయవచ్చు. ఉదాహరణకు రష్యా విప్లవము, ఫ్రెంచి విప్లవమును తులనాత్మక పద్ధతిలో చదివినప్పుడు ఒకే రకమైన కారణాలు, ఫలితాలు చూడవచ్చు. అదే విధముగా ఒక దేశపు సైనిక పాలన, పరిపాలన మొదలగు వాటిని కూడా తులనాత్మక పద్ధతిలో అధ్యయనం చేయవచ్చు. ఒకేరకమైన సంఘటనలు, విజయాలు, పరిస్థితులు మరియు పద్ధతులను తులనాత్మక పద్ధతిలో అధ్యయనం చేయుటం వల్ల వాస్తవికతను రాబట్టవచ్చు. ప్రస్తుత కాలంలో చరిత్రకారులు చాలా మంది చరిత్రను తులనాత్మక పద్ధతిలో అధ్యయనం చేస్తున్నారు.

**16.2.7 నిర్మాణాత్మక సిద్ధాంతము:** ఈ నిర్మాణాత్మక సిద్ధాంత కర్త ఇబన్ ఖలుద్దీన్ అనే ప్రముఖ అరబ్ చరిత్రకారుడు అతని మనో విశ్లేషణ ప్రకారంగా ప్రతిరాభ్యము ఉన్నత, అధమ స్థితులను పొందుతాయి. ఇతని ప్రకారంగా చరిత్ర అంతా మానవ సమాజము, ప్రపంచ నాగరికత, సామాజిక మార్పులు, యుద్ధాలు, విప్లవాలు మరియు వాటి ఫలితాలు వల్ల రాజ్యాలు ఉన్నత స్థితికి వెళ్ళటం, పతనమగుట జరుగుతుంది. ఇతని ప్రకారంగా జరగవలసినది నిర్దేశింపబడి ఉంటుంది. ఖలుద్దీన్ ప్రకారంగా ఏ విధంగా మానవ జీవితంలో బాల్యము, యవ్వనము, ముసలితనము, మరణం ఎలాగా తథ్యమో అదే విధంగా రాజ్యాలు పుట్టుట, ఉచ్ఛస్థితికి చేరుకొనుట, దిగజారుట, పతనమగుట జరుగును. ఇతని నిర్మాణాత్మక చరిర్త రచన సిద్ధాంతపరంగా నాలుగు దశలు ఉంటాయి.

**ప్రథమ దశ** - ఈ దశలో రాజ్యాల స్థాపన, యుద్ధాలు జరుగుతాయి.

**రెండవ దశ** - ఈ దశలో రాజ్య విస్తరణ మరియు ఓడిపోయిన రాజ్యాల పట్ల జాగ్రత్తలు ఉంటాయి.

**మూడవ దశ** - ఈ దశలో తన రాజ్య విస్తరణతో సంతృప్తి చెంది, తన పరిపాలన దోషాల నివృత్తి, భోగభాగ్యాల పట్ల మక్కువ పెరుగుతుంది. దీనితో రాజ్యంలో ఆదాయ వనరులు క్షీణించి పతనానికి దారి తీస్తుంది.

**నాల్గవ దశ** - ఈ దశలో పతనం వేగంగా జరుగుతుంది.

**16.2.8 పర్యావరణ సిద్ధాంతము:** చరిత్ర కచనలో కేవలం చారిత్రక ఆధఆరాలేకాక వాటితోపాటు వాతావరణ అంశాలు, భూమి, ప్రకృతి వనరులు మొదలగున్నవి కీలకపాత్ర వహిస్తాయి. వాస్తవానికి చరిత్రను సరిగ్గా అర్థం చేసుకోవలెనన్న భూగోళ శాస్త్రాన్ని, ప్రకృతిని సరిగ్గా అర్థం చేసుకోవాలి. ఉదాహరణలు రాజ్యాలు బలంగా ఏర్పడటం, బలహీనంగా ఏర్పడటం కేవలం ఆయా రాజుల శక్తి సామర్థ్యాలే కాక వాతావరణ అంశాలు ప్రధాన పాత్ర వహిస్తాయి. ఉదాహరణకు మగధ సామ్రాజ్యంగా ఎదగటానికి కారణం అనేక కారణాలతోపాటు ఆ రాజ్య భౌగోళిక పరిస్థితులు, గంగా-యమున అంతర్వేదిలో ఉండటం, సారవంతమైన భూమి, సరియైన వర్షపాతం, ఇనుప నిక్షేపాలు లభ్యత మొదలగు ప్రకృతి అంశాలు తోడ్పడటం వల్ల మిగిలిన 15 జనపద రాజ్యాలను దాటి మగధ సామ్రాజ్యంగా మారినది. ప్రపంచంలో అమెరికా అగ్రరాజ్యంగా చాలా తక్కువ వ్యవధిలో ఎదగటానికి ప్రధాన కారణం అమెరికాలోని విశాలమైన భూములు, సుదీర్ఘ సముద్ర తీరము, అడవులు, నదులు, జలపాతాలు, ఖనిజ నిక్షేపాలు మొదలగున్నవి.

**16.2.9 హెగెల్ సిద్ధాంతము:** హెగెల్ క్రీ.శ. 1770 - 1831 మధ్య కాలంలో జీవించిన జర్మన్ తత్త్వ శాస్త్రవేత్త. హెగెల్ చారిత్రక ప్రక్రియను తర్కంతో గుర్తించాడు. అయితే పెంగెల్ దృష్టిలో తర్కం అనునది ఒక నిర్దిష్టమైన చారిత్రక గమనం, ఆ చారిత్రక గమనం ద్వారానే అసందిగ్ధ భావన అయిన హేతువు అమూర్తమైన ఆలోచన నుండి మానవ సంస్థల రూపంలో వ్యక్తమైన వాస్తవికతను సృష్టించేందుకు దానంతటదే పరివర్తన చెందుతుంది. హెగెల్ దృష్టిలో చరిత్రతత్వం చిదాల్మతత్వంలో భాగం. చిదాత్మ కనిపించని స్థాయి నుండి పూర్తి వికాసం పొఇదడానికి చరిత్ర సహాయపడుతుంది. ప్రపంచ చరిత్ర అనేది హేతుబద్ధంగా వ్యక్తమౌతుందని హెగెల్ వివరించాడు. హెగెల్‌కు వాస్తవికత అంటే చిదాత్మ. ఇతని దృష్టిలో చరిత్రకారునికి అత్యంత ముఖ్యమైన అంశము హేతువు. అది పని చేసే తీరును కనుక్కోవటం.

హెగెల్ ప్రకారం చరిత్రకారుడు ఆకర్షణీయమైన రీతిలో సంఘటనలను చెప్పటమేకాక చారిత్రక ప్రక్రియ వెనుక ఉన్న హేతువును కూడా వివరించాలి. హేతువు ద్వారా అన్ని విషయములు తెలుసుకోవచ్చని ఇతని అభిప్రాయం. ప్రపంచ చరిత్ర ఒక వివేచనాత్మక ప్రక్రియ. ఇతని అభిప్రాయం ప్రకారం యదార్థమైనది, దీనికి వ్యతిరేకమైనది. ఈ రెండింటిని సమన్వయపరిస్తే వాస్తవికతను నిర్ధారించవచ్చు. ఈ సమన్వయం పై రెండింటిలోను మంచిని తీసుకొని పొందుపరుస్తుంది. ఇందువల్ల కొత్తవాద, ప్రతివాదాలు బయలుదేరుతాయి. ఈ విధంగా భావంలో పరిపూర్ణత చెందేవరకు మార్పులు జరుగుతుంటాయని హెగెల్ విశదీకరించాడు.

**16.2.10 నవీన సిద్ధాంతము (Post Modernis Theory):** చరిత్ర స్థిరమైనది కాదు. అది ఎల్లప్పుడు మారుతూ ఉంటుంది. కాలమాన పరిస్థితులను బట్టి మార్పులు చోటు చేసుకుంటాయి. ప్రారంభదశలో సంకుచిత భావాల వల్ల జాతీయ భావము, కులం, మతము, ప్రాంతము మొదలైన వాటికి ప్రాధాన్యత ఇవ్వబడినది. కాని తరువాత నూతన ఆలోచనలు, వివిధ ప్రేరేపిత అంశాల ల్ల చరిత్రకు సమాజ శ్రేయస్సు, మానవత్వము అనే భావాలు తోడై చరిత్ర పరిధి మారినది. ప్రస్తుత చరిత్రకారులు విశ్వమానవ సౌభ్రాతృత్వము, ప్రపంచ మానవ శ్రేయస్సు మొదలగు అంశాలపట్ల శ్రద్ధ చూపుతున్నారు. నవీన చరిత్ర కచన మూడు అంశాల మీద జరుగుతున్నది. అవి: శాస్త్రీయత, వాస్తవికత మరియు మానవత్వము.

నవీన కాలములో చరిత్ర స్వభావము విషయపరంగా మాత్రమే కాకుండా శాస్త్రీయ దృక్పథంగా మారినది. ఆధునిక చరిత్రకారులైన టాయన్‌బీ, స్పాంగులర్, వేల్స్ మొదలైనవారు పై స్వబావాలతో రచనలు చేశారు. ప్రజాస్వామ్య సమాజము, శాస్త్రీయ దృక్పథము అనేవి సమాజంలో మంచి ఫలితాలను ఇస్తాయి. అందువల్ల నవీన చరిత్రకారునికి క్లిష్ట సమస్యలతోపాటు బాధ్యతలు కూడా పెరిగాయి. నవీన చరిత్రకారుడు తప్పకుండా, విమర్శనాత్మకంగా, విశ్లేషణాత్మకంగా చరిత్ర రచనలు చేస్తూ తన స్వంత అభిప్రాయాలను వెల్లడించాలి. అనగా చరిత్రలో విషయ వివరణ, సరియైనదిగా చూసుకోవటం చరిత్ర రచనకారుని బాధ్యత.

గతంలో మాదిరిగా చరిత్రకారుడు కేవలం వర్ణనలతో పరిమితం కాకూడదు. దీనికి బదులుగా చరిత్రలో సామాన్య ప్రజలు సాధించిన విజయాల గురించి వివరించాలి. ఈ విధంగా చరిత్ర యొక్క ప్రయోజనం మరియు గౌరవము మొదలైనవి శాస్త్రీయ దృక్పథమును అనుసరించటం వల్ల సాధ్యమౌతుంది. కాబట్టి నవీన చరిత్ర రచన స్వభావము, కాలం, సామాజిక పరిస్థితులు మొదలైనవి మార్పులకు గురి అవుతూ కాలం మారే కొద్దే మార్పు చెందుతూ ఉంటుంది.

## 16.3 ముగింపు:

చరిత్రపరమైన ఆసక్తి మానవుడు విచక్షణా జ్ఞానంతో సంఘజీవిగా మారినప్పటి నుండి ప్రారంభమైనది. ప్రారంభంలో రాజ్యాలు, రాజ్య వంశాలు వృద్ధి క్షీణతలకు పరిమితమైన చరిత్ర కాలక్రమంలో సమాజం, సామాజిక వ్యవస్థల పరిణామం, పరిపాలన, యుద్ధాలు, ఒడంబడికలు, మత, సాంస్కృతిక, ఆర్థిక అంశాలు, పరిణామాలు వివరించేదిగా రూపొందింది. మానవాళి సంస్కృతి, నాగరికతలను ప్రతిబింబించే ప్రతి విషయమూ చరిత్రలో అంతర్భాగమైనది. కాలంతోపాటే చరిత్ర విషయ పరిధి మరింత విస్తృతమయింది. వంశ చరిత్ర స్థాయి నుండి మానవ నాగరికతా పరిణామం విశదీకరించే సాంఘీక శాస్త్రం స్థాయికి చరిత్ర ఎదిగింది.

వివిధ కాలాల్లో, వివిధ చరిత్రకారులు చరిత్రను కార్యాకారణ సంబంధంగానో, ఆర్థిక విషయాల దృష్టి వలనో, మహా పురుషుల పరంగానో, విజ్ఞాన శాస్త్రపరంగానో వ్యాఖ్యానించారు. ముఖ్యంగా 19వ శ.లో చరిత్ర గతిని వివరించడంతో శాస్త్రీయ ధోరణులు చోటు చేసుకోవడంతో విజ్ఞాన శాస్త్ర స్థాయికి ఎదిగిన చరిత్ర ఏం జరిగినది? ఎందుకు జరిగినది? ఎలా జరిగినది? మొదలగు వాటిని వివరించటం దాని లక్షణంగా, లక్ష్యంగా మారింది. రాజకీయాల ప్రాధాన్యం తగ్గి, ఆర్థిక, సామాజిక అంశాల ప్రభఆవం వైపు దృష్టి మళ్ళింది. ఉత్పత్తి సంబంధాలు, ఆర్థిక స్థితిగతులు చరిత్ర గమనాన్ని నిర్దేశిస్తాయని కారల్ మార్క్స్ పేర్కొని, విప్లవాత్మక విశ్లేషణకు తెరతీశారు. అనంతరం సమాజ, మనో విజ్ఞాన శాస్త్రాల అభివృద్ధితో చరిత్రకారుల ఆలోచనలు, పరిశీలనా విధానాలు మారినాయి. ఈ నూతన ధోరణుల ఫలితంగా చరిత్ర విషయపరిధి అనూహ్యంగా విస్తరించింది. విశ్వజనీన సర్వమానవ చరిత్ర ఈ నాటి చరి&త్రకారుని ధర్మం. ఒకప్పుడు సాహిత్యంలోనో, తత్త్వ శాస్త్రంలో భాగంగా భావింపబడ్డ చరిత్రకు నేడు స్వతంత్ర ప్రతిపత్తి కలిగింది. దీనితో విశ్వజనీన సర్వ మానవ చరిత్రలో సామాన్య ప్రజల పాత్రను విశ్లేషించి, వ్యాఖ్యానించడం నేడు చరిత్రకారునికి ఆదర్శమయింది.

## 16.4 నమూనా ప్రశ్నలు:

**(ఎ) ఈ క్రింది వ్యాసరూప ప్రశ్నలకు సమాధానాలు వ్రాయండి.**

1. మతపరమైన చారిత్రక పద్ధతులను గురించి వ్రాయుము.
2. కార్యాకారణ సిద్ధాంత ప్రాముఖ్యతను చర్చించి, వాటి సిద్ధాంతాలను వివరించుము.

**(బి) ఈ క్రింది లఘు ప్రశ్నలకు సమాధానము వ్రాయండి.**

1. శాస్త్రీయ సిద్ధాంతము
2. కాల్పనిక సిద్ధాంతము
3. పర్యావరణ సిద్ధాంతము
4. తులనాత్మక సిద్ధాంతము
5. హెగెల్ సిద్ధాంతము

## 16.5 ఉపయుక్త గ్రంథాలు:


1. Carr E.H. - What is History? (Maxmullar, 1961.)
2. Collingwood, R.G. - The Idea of History (OUP, 1966.)
3. Gopal S & Thaper Romilla - Problems of Historical Waiting in India, 1963.
4. Majundar R.C. - Historigraphy of modren India
5. Sheik Ali B - History : Its Theory and Method, 1978.


డా॥ కృష్ణప్రసాద్ బాబు జె.

పాఠం - 17

# చక్రీయ సిద్ధాంతము
# (Cyclical Theory)

## పాఠ్య నిర్మాణ క్రమం:


17.1 ఉపోద్ఘాతము

17.2 చక్రీయ సిద్ధాంతము - అర్థము

17.3 చక్రీయ సిద్ధాంతము - భావన

17.4 చక్రీయ సిద్ధాంతం - భిన్న వాదనలు

17.4.1 A.L. క్రోయోబార్

17.4.2 O స్పెంగ్లర్

17.4.3 పరెటో

17.4.4 ప్రతిమ్ సోరోకిన్

17.4.5 టాయన్ బీ

17.5 చక్రీయ సిద్ధాంతము - సామాజిక మార్పు

17.5.1 చక్రీయ సిద్ధాంత మేధావులు

17.5.2 చక్రీయ సిద్ధాంత పరిణామము

17.5.3 టాలన్‌బీ చక్రీయ పరిణామము

17.5.4 స్పెంగ్లర్ చక్రీయ పరిణామము

17.6 చక్రీయ సిద్ధాంత మేధావుల ఆలోచనలు

17.7 ముగింపు

17.8 నమూనా ప్రశ్నలు

17.9 ఉపయుక్త గ్రంథాలు


## 17.1 పరిచయం:

కాలగమనంలో వచ్చిన నూతన పరిణామాల ఫలితంగా మానవ దృక్పథంలో తలెత్తిన కొత్త భావాలు, విలువలు వచ్చాయి. గతంలో చరిత్రను క్రమబద్ధంగా వరుసగా పేర్చబడ్డ సంఘటనల జాబితాగా భావించారు. ఈ అభిప్రాయం ప్రకారం

చరిత్రలో ఏమి జరిగిందో వాస్తవాల ఆధారంగా వర్ణించటం మాత్రము జరిగింది. దీనికి భిన్నముగా ఇప్పుడు చరిత్రకారుడు చరిత్ర రచనకు పూనుకున్నప్పుడు చారిత్రక ఆధారాలలోపేర్కొన్న వాటిని పూర్తిగా విశ్వసించి, వాటిని తిరిగి వ్రాయక, వాటిని విమర్శనాత్మకంగా, శాస్త్రీయ ధృక్పథంతో పరిశీలించి, సంఘటనల వివరాలను పోల్చిచూచి, సత్యానికి దగ్గరగా ఉన్న చారిత్రక సంఘటనల వివరణతో చరిత్రను రచిస్తున్నాడు. అందువల్ల గతాన్ని గుడ్డిగా అభిమానించటమో లేదా గతాన్ని మూర్ఖంగా వ్యతిరేకించటమో కాక చరిత్రను నిరంతర్ సాగే సాంఘిక ప్రవాహంగా గుర్తించి, గతమును వర్తమానం సహాయంతోను, వర్తమానాన్ని గతం సహాయంతోను పూర్తిగా అర్థం చేసుకొనుట చరిత్రకారుని కర్తవ్యంగా మారింది. ఈనాటి చరిత్రకారుడు చారిత్రక యథార్థాలను నిర్ణయించి, వ్యాఖ్యానించి మదింపు చేసి, విలువకట్టి, ప్రాధాన్యతను గుర్తించి, జన సామాన్యానికి అర్థమయ్యేరీతిలో గతంలో ఏమి జరిగిందో, ఎందుకు జరిగిందో, ఎలా జరిగిందో శాస్త్రీయ ధృక్పథంతో వివరించటం తన కర్తవ్యంగా పెట్టుకున్నారు. కనుకనే చారిత్రక యదార్థాలను నిర్ణయించటంలో, ప్రోగు చేయుటలో ఒక శాస్త్రవేత్తకు, వాటి వివరణలో ఒక సాహితీవేత్త వలె ప్రవర్తిస్తున్నాడు.

చరిత్ర స్వభావమును అర్థం చేసుకోవటంలో మరొక విషయమేమిటంటే 'విషయం' చరిత్రకారులందరికీ ఒకటే అయినప్పటికీ గతమునకు సంబంధించిన సంఘటనకు చారిత్రక యదార్థాలుగా గుర్తించేది చరిత్రకారుడే కనుక చారిత్రక యదార్థాల నిర్ణయంలో చరిత్రకారుని దృక్పథం ఎంతో ప్రభావితం చేస్తుంది. అందువల్లే E.H. కార్ గతానికి సంబంధించి గ్రంథ రూపంలో చేర్చబడ్డ చారిత్రక యదార్థాలన్నీ ఆయా చరిత్రకారుల ఆలోచనా ధోరణిని, దృక్పథాన్ని, నమ్మకాలను ప్రతిబింబిస్తాయి అని అన్నారు. ఫలితంగా చారిత్రక విషయాల విశ్లేషణలో విమర్శ కన్నా ఆత్మాశ్రయుత (Subjectivity) కొంతవరకు చోటు చేసుకున్నది. కనుకనే చరిత్ర రచనా రంగంలో జాతీయ, సామ్యవాద, విషయాత్మకత, మతోన్మాద, శాస్త్రీయ దృక్పథాలు కనిపిస్తున్నాయి. అంతేకాక నూతన శాస్త్రాల సహాయంతో చారిత్రక వివరణకు పూనుకొన్నప్పటికీ, చరిత్రకారుడు తాను జీవిస్తున్న సమాజ ఆశయాలకు, ఆలోచనలకు, కాలానికి దూరంగా ఉండలేక గతాన్ని పరిశీలించేటప్పుడు వీటి వల్ల ప్రబావితమౌతాయి. చరిత్ర స్వభావమును వివరిస్తూ చరిత్రకారులు కొన్ని ప్రతిపాదనలు చేశారు.

1. ఋజువు చేయబడ్డ చారిత్రక యదార్థాల సంగమమే చరిత్ర.
2. చరిత్ర పునరావృతమౌతుంది.
3. వర్తమానానికి, గతానికి మధ్య జరిగే నిరంతరణ సంభాషణ
5. భవిష్యత్తు పరిణామాలను ముందుగా సూచించే గతం గురించిన విశ్లేషణ.
6. చరిత్రలో విలువలకు సంబంధించిన తీర్పుకు చోటు ఉంది.
7. చరిత్ర ప్రగతి శీలకమైనది.

## 17.2 చక్రీయ సిద్ధాంతము - అర్థము:

చరిత్ర చక్రము వలె పునరావృత స్వభావము కలదని కొందరు చరిత్రకారులు ప్రతిపాదించగా, మరికొందరు కాదని అభిప్రాయపడ్డారు. ఈ రెండు అభిప్రాయాల్లో పాక్షిక సత్యమే కలదు. అంతేకాక ఈ భావము ఎంతో అపకారము కలుగ చేస్తుంది. ఎందుకనగా భవి్యత్తు గతకాలం వలె ఉంటుందన్న నమ్మకం మానవుల యొక్క సామూహిక, సృజనాత్మక, క్రియాశక్తులను కోల్పోవునట్లు చేస్తుంది. అంతేగాక మానవ జీవితం పురోగామియే కాని తిరోగామి కాదు.

చరిత్ర పునరావృతమౌతుంది అన్న భావనలో 'చరిత్ర మొత్తం సమకాలీనమే' అన్న ప్రతిపాదనను క్రోచి ప్రచారం చేయగా కాలింగ్ ఫడ్ ఏకీభవించాడు. చక్రీయ సిద్ధాంతంలో 'సుదీర్ఘ కాలం' ముఖ్యమైన అంశము. ఈ సిద్ధాంతాన్ని

విశ్వసించేవారు నాగరికతలు వివిధ దశలను దాటుకుంటూ యుగాల వెంట నడుస్తాయి అని వాదిస్తారు. ఏ అంశాలు వికాచి నుండి ప్రారంభమై ఒక వాహన చర్కం వలె తిరిగి యదార్థానికి వస్తాయో అప్పుడు అవి ఖచ్చితత్వాన్ని, సంపూర్ణతను సాధిస్తాయి. ఈ చక్రీయ సిద్ధాంతము సామాజిక శాస్త్రాలలో తులనాత్మక చారిత్రక పద్ధతిని అభివృద్ధి చేసింది. ఈ పద్ధతి, ప్రాచీన చైనా చరిత్రలో, బాబిలోనియా చరిత్ర అధ్యయనంలో, ఈజిప్టు చరిత్ర అధ్యయనంలో కనిపిస్తుంది. ఇంతేకాక ప్రాచీన తత్త్వవేత్తలు, చరిత్రకారులలో కూడా ఈ భావన కనిపిస్తుంది.

## 17.3 చక్రీయ సిద్ధాంతము - భావన:

మానవ సమాజానికి సంబంధించిన ప్రాపంచిక విషయాలు అన్ని కాలాల్లోను ఒకేలా ఉంటాయి. కాని ప్రతిసారీ మార్గాలే వేరు అన్న భావనలో చరిత్ర పునరావృతమౌతుంది. ఈ ప్రాపంచిక విషయాలలో కనిపించే భిన్నత్వం పైకి కనిపించేది నిజమైంది కాదు. అంతేకాక ప్రపంచమంతటా మానవ మేధస్సును ప్రభావితం చేసే శక్తులు, కార్యకలాపాల గమనమును నిర్దేశించే శక్తులు ఒకే రకమైనవి. దీన్నిబట్టి సంఘటనలకు కార్యాకారణ సంబంధములకు మధ్య ఉన్న సంబంధం ఒక గొలుసులో లింకు వంటిదని చెప్పవచ్చు. చారిత్రక సంఘటనలు ఒకే రీతిగా, ఒక చోట జరగకపోయినప్పటికీ, సూక్ష్మ దృష్టితో పరిశీలిస్తే ఆ సంఘటనల వెనుకల ఏకత్వము, ఒక నమూనా కనిపిస్తుందన్న భావన చరిత్ర పునరావృతమౌతుందన్న ఆలోచనకు దారి తీసింది. ప్రకృతిలో ప్రతి సంవత్సరం ఋతువులు వరుసక్రమంలో పునరావృతమగుట చేత, ఈ అనుభవముచే ప్రభావితులైన ప్రాచీనులు చరిత్రలో సంభవించే మార్పులు, రూపాలు, ప్రక్రియలు పునరావృతమౌతాయని అభిప్రాయపడ్డారు. టది దృష్టిలో ఉంచుకునే చరిత్రలో కూడా రాజకీయపరంగా, నిరంకుశ పాలన, ప్రజాస్వామ్యం ఒకదాని తరువాత ఒకటి పునరావృతమౌతాయని నమ్మారు. గ్రీకులు, రోమనులు, హిందువులు మానవ వికాస మార్గం ఒక నిలువు గీత కాదని, ఒక వృత్తం వంటిదని అదృష్ట, దురదృష్టాలు, విజయాలు, అపజయాలు, వెలుగు, చీకటి ఒకదాని వెంట మరొకటి వెంటాడుతుంటాయని నమ్మి చరిత్ర విషయ వివరనను చారిత్రక ఆవృతాల ద్వారా తెలియపరచారు.

చరిత్ర పునరావృతమౌతుందన్న నమ్మకం కలిగిన చరిత్రకారులలో గ్రీకు దేశమునకు చెందిన థూసి డైడిస్‌ను మొదటివానిగా భావించవచ్చు. ఇతడే మొదటివాడని ఖచ్చితంగా చెప్పలేము. కాని మధ్య యుగంలో క్రైస్తవ మత ప్రభఆవం వల్ల మరుగునపడ్డ ఈ భావన మళ్ళీ 16వ శ.లో సాంస్కృతిక పునర్జీవన అనంతరం తిరిగి ప్రపంచంలోనికి వచ్చింది. నాగరికతల సామ్రాజ్యాల పుట్టుక, పెరుగుదల, ఉచ్ఛస్థితి, క్షీణత, పతనము సాదృశ్యాలను తీసుకుని చరిత్ర పునరావృతమౌతుందన్నారు. మొత్తం విశ్వమే సృష్టి, స్థితి, లయల వలయాన్ని చుట్టుముట్టి ఉన్నాయన్న భావనను విశ్వసించిన ఇటలీ తత్త్వవేత్త వీకో, జర్మన్ తత్త్వవేత్త నీచే, ఫ్రెంచి రచయిత బాసువా, జర్మనీకి చెందిన హెర్టర్‌లు చరిత్ర పునరావృతమౌతుందన్నారు. స్పెన్సర్, టాయన్‌బీలు మానవులు పుట్టి, పెరిగి, వృద్ధి చెంది, క్షీణించి, నాశనమైనట్లే నాగరికతా, సంస్కృతులలో కూడా జరుగుతుందన్న దృక్పథంతో చరిత్రను అధ్యయనం చేసి చారిత్రక చక్రీయ వలయమన్నారు. వీరు దీనిని సహజ పరిణామంగా భావించారు. అయితే నాగరికత, సంస్కృతులు మానవ జీవితం చక్రీయ క్రమంలో పునరావృతమౌతాయని ఋజువు చేయుటకు వాస్తవాలు చారిత్రక గమనంలో కనిపించవు. గత సంఘటనలను స్థూలంగా పరిశీలిస్తే నాగరికతలు పుట్టుట, క్షీణించుట, యుద్ధాలు, తిరుగుబాట్లు, విప్లవాలు జరగటం, మళ్ళీ యుద్ధాలు, తిరుగుబాట్లు, విప్లవాలు జరగటం కనిపించటం చేత చరిత్ర చక్రీయమన్న భావన పెరిగింది. కాని సూక్ష్మ దృష్టితో పరిశీలిస్తే మానవ జీవిత పరిణామక్రమంలో ఏ యుద్ధానికదే, ఏ విప్లవానికదే, ఏ సంఘటనలకదే ప్రత్యేకత, ప్రాధాన్యత కలిగి ఉన్నాయి.

## 17.4 చక్రీయ సిద్ధాంతం - భిన్న వాదనలు:

చక్రీయ సిద్ధాంతం ప్రారంభంలో పురాణాలు, మత ప్రాతిపదికన చూడబడింది. చరిత్రను ఈ దృష్టితో చూస్తూ జరిగే అంశాలను సృష్టిలో జరిగే మార్పులుగా భావించారు. ఈ ప్రపంచంలో ఒక నిర్ణీత చక్రీయ పద్ధతి ఉందని దీనివల్లనే ఋతువులు,

ఖగోళ నిర్మాణం, ప్రకృతి పద్ధతులు ఏర్పడ్డాయని భావించారు. ఉదాహరనకు ప్రపంచ కాల గమనమును అర్థం చేసుకోవటానికి ఒక విశ్వరూప కాలండర్ కనుగొనటం, విశ్వరూపకాల చక్రము యుగాల విభజన, వాటి ప్రారంభం, గమన్, అంతం కావటం మొదలైనవి చారిత్రక సత్యాలుగా భావించారు. కాలక్రమేణా చక్రీయ సిద్ధాంతంలో వంశీవళుల చరిత్ర ఉదాహరణకు ఈజిప్టు చరిత్రలో 30 రాజవంశాలు ప్రాచీన, మధ్యయుగ, ఆధునిక కాల వంశాల రాజకీయ చరిత్ర, పరిపాలన మొదలగు అంశాలు చారిత్రక సత్యాలుగా మారినాయి. ఈ చక్రీయ చారిత్రక సిద్ధాంతం తరువాతి కాలంలో ఇబన్ ఖలుద్దీన్ (14వ దశ - 18వ దశ) అరబ్బు తత్త్వవేత్త ప్రపంచ చరిత్రను నాలుగు యుగాలుగా విభజించారు. ప్రతి యుగంలోని సహజ సూత్రాలను మరియు సాంస్కృతిక అభివృద్ధిని గుర్తించి వాటి పతనమును వివరిస్తూ ఏ రాజవంశాల కాలంలో ఏమి జరిగిందో వివరించారు.

ఈ చక్రీయ సిద్ధాంతాలు క్రీ.శ. 17, 18 శ.లలో ఐరోపా ఖండంలో ఒక గొప్ప సామాజిక తాత్త్విక అంశంగా రూపొందింది. మధ్య యుగానంతరము ఐరోపా సమాజములో ఒక ఉన్నత సాంస్కృతిక పునర్జీవనం చక్రీయ చారిత్రక సిద్ధాంతంగా భావించారు. ఈ నూతన భావనల ప్రకారంగా చరిత్రలో పురోగాభివృద్ధి జరుగుతూ ఉంటుందని దీనికి విశ్వ సహజ నియమాలు, విశ్వక్రమము ఉంటాయని వాటి ప్రకారము జరుగుతుంది. కాని ప్రాచీన మధ్య యుగాలలో చెప్పినట్లు దైవిక శక్తులు, అతీంద్రియ శక్తుల వల్ల కాదని అభిప్రాయపడినారు. చరిత్రలో ఏ సంఘటన కూడా ఉన్నట్లుండి జరిగింది కాదని, వ్యక్తుల వల్ల మార్పులు సంభవించవని భావించారు. వీరిలో ప్రముఖులు వీకో, వీరి ప్రకారంగా అన్ని దిశలు చక్రీయ చారిత్రక సిద్ధాంత ప్రకారంగానే అభివృద్ధి జరిగిందని వివరించారు.

ఐబక్ ఖలుద్దీన్ వీకోల ప్రభావం తరువాతి కాలంలోని తాత్త్విక చింతన పై ప్రభావము చూపినది. చక్రీయ సామాజిక అభివృద్ధి గురించి తత్త్వవేత్తలు ముఖ్యంగా సామ్యవాదులు, ఊహావాదాలు అనుసరించారు. వీరిలో ప్రముఖుడు సి. ఫారియర్. ఇతని ప్రకారంగా మానవుని అభివృద్ధి చక్రీయ సిద్ధాంతం ప్రకారంగా 4 దశలలో జరుగుతుంది. (ఎ) ఆదిమ దశ, (బి) క్రూర దశ (సి) అనాగరిక దశ (డి) నాగరిక దశ. చక్రీయ చారిత్రక సిద్ధాంతములో ఒక రకంగా విప్లవాత్మకమైన మార్పు రావటానికి కారణం భౌతిక వాదుల ఆలోచనా ధోరణి. చరిత్రలో సంఘటనలు వాటికవే పునరావృతమౌతాయని ఒక ప్రపంచ చరిత్ర అంతా ఎల్లప్పుడు అభివృద్ధికి సంకేతంగా ఉంటుందనే అభిప్రాయాన్ని త్రోసిపుచ్చాయి. ఉదా॥ ఇ. మైయల్.

**17.4.1** A.L. **క్రోయోబార్:** ఇల్దు (1876 - 1960) కాలానికి చెందిన ప్రముఖ మానవాకృతి శాస్త్రవేత్త. ఇతని ప్రకారంగా ప్రపంచంలో ఒక సమాజము దాని పుట్టుక, అభివృద్ధి, క్షీణదశ మరియు పతనము తప్పదని, అన్ని రాజ్యాలు ఈ క్రమంలోనే నడుస్తాయని భావించారు. ఉదాహరణకు రోమన్ సామ్రాజ్య అభివృద్ధి జరిగింది. దాని పతనానికీ అదే విధంగా బ్రిటీషు సామ్రాజ్యము అభివృద్ధి చెంది, కొంతకాలం ప్రపంత వ్యాప్తి చెంది చివరకు క్షీణించి పతనమైనది వాదించాడు. అదే విధంగా సమాజంలోని సాంస్కృతిక అలవాట్లు కూడా తరుచూ మారుతూ అభివృద్ధి చెందుతూ కనుమరుగై పోతాయని భావించాడు. ఉదాహరణకు ఐరోపాలోని స్త్రీల వస్త్ర వేషధారణలో వచ్చిన మార్పులు, ఒక పొడవాలట గౌను, సన్నటి నడుము, చేతులు వక్షోజాలు కొద్దిగా కనిపించేటట్లు వస్త్రధారణలోని మార్పులు చక్రీయ సిద్ధాంతంలోని భాగాలే. అయితే ఎంత మార్పులు వచ్చినప్పటికీ కొన్ని ప్రాథమికసూత్రాలు సహజంగా ఉంటాయి. ఏ సమాజం శాశ్వతంగా ఉండదు.

**17.4.2** O **స్పెంగ్లర్:** ప్రతి సమాజము ముందుగా నిర్ణయించబడిన చక్రీయ సిద్ధాంతం ప్రకారంగానే నడుస్తుందని దీనిలో ప్రారంభం, అభివృద్ధి, ఉన్నత దశ, క్షీణించే దశ, పతనము అనే దశలుంటాయని అభిప్రాయపడ్డాడు. సామాజిక మార్పులోని నూతన చక్రీయ సిద్ధాంతాలను బాగా అధ్యయనం చేశారు. ప్రపంచంలోని ప్రసిద్ధ ఈజిప్టు నాగరికత, గ్రీకు నాగరికత, కోం నాగరికతలను అధ్యయనం చేసిన తరువాత అన్ని నాగరికతలు పుట్టక, అభివృద్ధి, ఉన్నత స్థితి, క్షీణించటం, పతనమగుట అనే దశలలో సంభవించాయని పేర్కొన్నాడు.

**17.4.3 పరెటో:** ఇతడు 1963లో 'A Treatise on General Sociology' అనే గ్రంథాన్ని రచించాడు. ఇతని సిద్ధాంతం కొన్ని పరిమితులకు లోబడి ఉంది. కోంలోని కులీన వర్గాల చక్రీయ సిద్ధాంతం గురించి తెలుపుతుంది. సమాజం సమతుల్యతతో ఉండాలని ఇతని ప్రగాఢ విశ్వాసం.

**17.4.4 ప్రతిమ్ సోరోకిన్:** 1938లో 'Social cultural dynamics' అనే గ్రంథాన్ని రచించాడు. ఇతడు సమాజాలను 'సాంస్కృతిక నేపథ్యంగా' పలు రకాలుగా విభజించాడు. అవి - తాత్త్వికవాద (ఆధ్యాత్మికపరంగా), భావవాద (భౌతికపరంగా) లేక ఆదర్శవాద (రెండు పదార్థాల మిశ్రమ ఫలితం). ఇతని అభిప్రాయం ప్రకారంగా సామాజిక మార్పులు చక్రీయ పద్ధతిలో ఉంటుంది. ఉదాహరణకు గడియారంలోని పెండెంలో వలె నాగరికత ఒక మార్గంలో వెళ్ళి మరలా అదే మార్గంలో తిరిగి వస్తుంది. కాబట్టి నాగరికతలు రెండు హద్దుల మధ్య 'భావన'.

**17.4.5 టాయన్ బీ:** టాయన్ బీ అభిప్రాయంలో నాగరికతలు జాతులు లేక పర్యావరణ కారకాల వల్ల జన్మించవు, కాని వదిమ సమాజములో నుండి ప్రారంభమౌతాయి. సమాధానము మరియు సవాళ్ళు అనే సంఘర్షణల మధ్య నాగరికత పరిణామము జరిగుతుంది. ప్రతి సమాజము సవాళ్ళను ఎదుర్కొంటూ అభివృద్ధిలోనికి వస్తాయి. ఈ విధంగా నాగరికతలు అనేక స్థాయిలను దాటుకుంటూ ముందుకెళ్తాయి. పుట్టుక, అభివృద్ధి, సమస్యలనేవి ఎదురునే కాలం, విశ్వ స్థాయి, పతనము.

## 17.5 చక్రీయ సిద్ధాంతము - సామాజిక మార్పు:

**17.5.1 చక్రీయ సిద్ధాంత మేధావులు:** చక్రీయ సిద్ధాంతమును కొంతమంది స్పెంగ్లర్, వెల్‌ఫ్రెడ్, పరెటో, ఆర్నెల్ట్ టాయన్‌బీ మొదలగు వారు వ్యక్తపరచినారు.

**17.5.2** ఈ సిద్ధాంతం ప్రకారంగా సమాజము ముందే నిర్ణయించబడిన ప్రకారంగా పుట్టుక, అభివృద్ధి, ఉన్నత స్థితి మరియు పతనం పద్ధతిలో ఉంటుంది.

**17.5.3 టాయన్‌బీ** ప్రకారంగా సమాజములు మరియు నాగరికతలు మార్పు అభివృద్ధి, పతనము అనే చక్రీయ పద్ధతిలో జరుగుతుంది. ఇవి ఏ విధంగా ఉంటాయంటే వ్యక్తుల పుట్టుక, అభివృద్ధి, వృద్ధాప్యము మరియు మరణించుట మాదిరిగా జరుగుతాయి.

**17.5.4 స్పెంగ్లర్** ప్రకారంగా ప్రతి సమాజము ముందే నిర్ణయింపబడిన జీవితం వలె చక్రీయంగా ఉంటుంది. దీనిలో పుట్టుక, అభివృద్ధి, ఉచ్ఛస్థితి మరియు పతనము. సమాజము ఈ దశలను దాటుకుంటూ పతనమై తిరిగి యథా స్థానానికి చేరుకుంటుంది.

## 17.6 చక్రీయ మేధావుల ఆలోచనలు:

అనేక ప్రాచీన సంస్కృతులు చరిత్ర, కాలముల గురించి పురాణగాథలు కలిగి ఉన్నాయి. వీరు చరిత్ర సరళరేఖ వలె ఉంటుందని భావించలేదు. వీరి ప్రకారంగా చరిత్ర స్వర్ణ యుగము మరియు చీకటి యుగముల ప్రకారంగా చక్రీయ పద్ధతిలో ఉంటుందని విశ్వసించారు. దీనినే ప్లేటో గొప్ప సంవత్సరముగా వర్ణించగా, ఇతర గ్రీకులు దీనిని యుగంగా వర్ణించిరి. గ్లోరిగ్-డి-సాంటిలానా 30 నాగరికతల అభివృద్ధి పతనములకు సంబంధించి 200 పురాణ గాథలను తన గ్రంథములో "Hamlets Mill : An Essay on Mytu and The frame of Time" పొందుపరచినాడు. ప్రాచీన సిద్ధాంతమగు శాశ్వత తిరుగు ప్రయాణము ప్రాచీన ఈజిప్టులో భారతీయ మతాలలో, గ్రీకు పైథాగర్లలో మరియు స్టొయి జల మొదలగు వాటిలో వ్యక్తమౌతుంది. హెసోయిడ్ మానవుడు ఐదు యుగాలలో అభివృద్ధి చెందాడు. స్వర్ణ యుగము, రజిత యుగము, కాంస్య యుగము, వీరోచిత యుగము మరియు ఇనుప యుగము.

ఇతర మేధావులు పై లోహ యుగ విభజనను ఒక వైపు సమర్థిస్తూ మరొక వైపు భారతదేశ పురాణ ఇతిహాసం ప్రకారంగా మానవులు నాలుగు యుగాల కాలం ప్రకారంగా పరిణామం చెందాడని తెలిపారు. హిందూ పద్ధతి ప్రకారంగా సత్య యుగము, త్రేతా యుగము, ద్వాపర యుగము, కలి యుగముగా ఉంటుందని తెలిపారు. గ్రీకులు ఈ యుగ భావనను మరయక ప్రకారంగా సిద్ధాంతీకరిఇచిరి. మానవుడు నాలుగు పరిణామ దశలను రెండు భాగాలుగా విభజించిరి ప్రజాస్వామ్యము, రాజరికములు, ఆరోగ్యకరమైన అభివృద్ధికి గుర్తులు కాగా, కూలీన పాలన మరియు నియంతృత్వములు ప్రమాదకరమైన గుర్తులుగా ప్రతిపాదించారు. చైనా అరేబియా ప్రాంతాలలో కూర్ ఈ చక్రీయ సిద్ధాంతములు చోటు చేసుకున్నాయి. అరబ్బు చక్రీయ సిద్ధాంతాన్ని ఇబన్ ఖలుద్దీన్ బాగా విస్తృతపరచాడు.

## 17.7 ముగింపు:

పైన వివరించబడిన వివిధ మేధావుల ఆలోచనల సిద్ధాంతాల ప్రకారంగా ఈ విధంగా ముగింపుకు రావచ్చు. అదేమనగా ఒక జలపాతములో రెండు సార్లు మునగలేము కారణము పాత నీటిని తరిమివేస్తూ కొత్త నీరు ప్రవహిస్తూనే ఉంటుంది. అదే విధంగా మానవ జీవితములో మార్పు సహజంగా జరుగుతుంటుంది. సమాజం నిలకడ లేని జలాశయము కాదు. పాత నీరు ప్రవహించి, కొత్త నీరు ఏ విధంగా వస్తూ ఉంటుందో, అదే విధంగా పాత రీతులు, సాంప్రదాయాలు, ఆలోచనలు పోయి కొత్త సాంప్రదాయాలు, ఆలోచనలు, రీతులు పట్టుకొని వచ్చి మానవ జడీవితమును ప్రభావితం చేసి, నూతన పరిణఆమాలు వివరించే సంఘటనలకు దారి కల్పిస్తాయి. కనుకనే కాలింగ్‌వుడ్ చక్రీయ గమన్ అంటి చక్రంలాగా తమ చుట్టూ తాము తిరగడం కాదని, అది సద్విల గమనం అని అన్నారు. అంతేకాక చారిత్రక పరిజ్ఞానం ఉన్న ప్రజల్లో చరిత్ర చాలా అరుదుగా పునరావృతమౌతుంది. కారణం గతంలో ఒక చారిత్రక సంఘటన ఎలా ముగిసిందో తరువాత తరాల వారికి తెలిసినపుడు వారి ప్రవర్తన ఈ పరిజ్ఞానం వల్ల ప్రభావితమౌతుంది అని కార్ అభిప్రాయం.

## 17.8 నమూనా ప్రశ్నలు:

**(ఎ) వ్యాసరూప ప్రశ్నలు**

1. చక్రీయ సిద్ధాంతం, దానిలోని భఆవనలను వివరించుము.
2. చక్రీయ సిద్ధాంతం, సామాజిక మార్పుల సంబంధమును వివరించుము.
3. చక్రీయ సిద్ధాంతము, మేధావుల ఆలోచనలు తెలుపుము.

**(బి) లఘు ప్రశ్నలు**

1. చక్రీయ సిద్ధాంతము - అర్థము
2. చక్రీయ సిద్ధాంతము - భావన

## 17.9 ఉపయుక్త గ్రంథాలు:


1. Carr E.H. - What is History?
2. Sheik Ali B - History : Its Theory and Method.
3. Collingwood, R.G. - The Idea of History
4. Subramanyam N. - Histrriography
5. Thompson J. W. - A History of Historical Wreting.


డా॥ కృష్ణప్రసాద్ బాబు జె.

పాఠం - 18

# చారిత్రక భౌతిక వాదము

## పాఠ్య నిర్మాణ క్రమం:

18.1 ఉపోద్ఘాతము

18.2 చారిత్రక సిద్ధాంతాలు - మార్క్స్ సిద్ధాంతము

18.3 చారిత్రక భౌతికవాద నేపథ్యము

18.4 మార్క్స్ సిద్ధాంత ప్రధాన అంశాలు

18.4.1 హెగెల్ గతి తర్కం

18.4.2 ఫోయర్ బాఖ్ భౌతిక వాదం

18.4.3 అదనపు మిగులు విలువ సిద్ధాంతం

18.4.4 పెట్టుబడిదారి విశ్లేషణ

18.4.5 వర్గపోరాటం

18.4.6 కమ్యూనిజం

18.5 చారిత్రక బౌతిక వాదము

18.6 ముగింపు

18.7 మాదిరి ప్రశ్నలు

18.8 ఉపయుక్త గ్రంథాలు

## 18.1 ఉపోద్ఘాతము:

E.H. కార్ ఒక్కాణించినట్లు 'చరిత్ర నిరంతర ప్రక్రియ' అన్నటువంటి చరిత్ర యొక్క గమనము ఏమిటి? దానిని నిర్దేశించే శక్తులు ఏవి? చరిత్ర పరిణామం, దానిని ఏ విధంగా అర్థం చేసుకోవాలి? దాని అంతరార్థమేమిటి? అన్న ప్రశ్నలకువివిధ దృక్కోణాల నుండి పరిశీలించిన తత్త్వవేత్తలు, చరిత్రకారులు తమ కాల, మత, జాతి ఆలోచనా ధోరణులను ప్రభావితం చేసిన జ్ఞాన వికాసం, భావాత్మక వాదం, ప్రత్యక్ష జ్ఞానవాదం, చారిత్రక గతితర్కం, చారిత్రక వాదం దృష్ట్యా చరిత్ర స్వభావమును చరిత్ర తత్త్వమును, లక్ష్యమును వివరించారు. అటువంటి వ్యాఖ్యానాలలో వితరణలలో ఒకటి కారల్‌మార్క్స్ ప్రతిపాదించిన చారిత్రక భౌతిక వాదం (Historical Materialism).

## 18.2 చారిత్రక సిద్ధాంతాలు - మార్క్స్ సిద్ధాంతము:

చరిత్ర రచనా శాస్త్ర పరిణామక్రమం గ్రీకు, రోమన్ సాంప్రదాయంతో ప్రారంభమైన దశలో సత్యాన్వేషణ, నిశితంగా ప్రశ్నించి యదార్థాలను రాబట్టాలనే లక్ష్యంతో వంశావళులను చదవటం మొదలైనది. తరువాతి క్రమంలో వచ్చినా క్రైస్తవ

సాం(ప్రదాయవాదులు, అరబ్బులు మత విషయాలే చరి(త్రగా భావించటం కాల్పనిక వాదులు వ్యక్తి స్వేచ్ఛ, సంకల్ప (ప్రాధాన్యత మొదలగు అంశాలని భావించగా, (ప్రత్యక్ష జన సాం(ప్రదాయ వాదులు (ప్రత్యక్ష విషయాలనే విశ్వసించాలని, గిబ్బన్ వంటి ఆంగ్ల చరి(త్రకారుడు చారి(త్రక మార్పులకు అతీత శక్తులు కావని, మానవ స్వభావమే కారణమని భావించారు. ఆధునిక శా(స్త్రీయ చరి(త్రకారునిగా పరిగనించిన రాంకీ 'చరి(త్ర రచనకు శా(స్త్రీయ దృక్పథమే (ప్రాతిపదిక అని (ప్రకటించారు. టాయన్ బీ ఆధునిక మానవుడు తాను సంపాదించుకున్న జ్ఞానం సహాయంతో వినాశనమును అదుపు చేయగల సామర్థ్యము కలిగి యున్నాడని ఆశాభావమును వెలిబుచ్చారు.

వీరందరికి భిన్నంగా మార్క్స్ భౌతిక అంశాలే ముందుగా (ప్రతిస్పందిస్తాయని, నిర్దేశిస్తాయని వాటి (ప్రభావం ఆలోచనల మీద పడి వీటి స్పందన, (ప్రతి స్పందనల వల్ల మానవజాతి చరి(త్ర పరిణామం కొనసాగుతుందని (ప్రతిపాదించాడు.

**మానవ నాగరికతా పరిణామము**

| అనాగిరక కమ్యూనిజం | వ్యవసాయ దశ | భూస్వామ్య దశ | పెట్టుబడిదారీ దశ | సామ్యవాద దశ | కమ్యూనిజం దశ |
|---|---|---|---|---|---|
| మానవులంతా<br>సమానులే | యజమానులు<br>↓<br>బానిసలు<br>దోపిడి వాదం | భూస్వాములు<br>↓<br>సేద్యపు బానిసలు<br>సేద్యములో దోపిడి | పెట్టుబడిదారి వర్గం<br>↓<br>(శామిక వర్గం | (ప్రభుత్వం<br>↓<br>(ప్రజలు | అందరూ<br>సమానమే |

ఈ విధముగా మానవ సమాజము పరిణామము చెందే (క్రమంలో (ప్రారంభంలో అందరూ కష్టపడి ఎవరి జీవనము వారు కొనసాగిస్తూ ఉంటూ 'విలువ', 'భవిష్యత్తు కొరకు' అనే ఆలోచన లేకుండా జీవిస్తూ సామనత్వంతో ఉండినారు. ఎప్పుడైతే మానవుడు వ్యవసాయం కనిపెట్టాడో ఆ రోజు నుండి దాచుకోవటం'భవిష్యత్తు కొరకు' అనే ఆలోచన వచ్చిందో దోపిడి (ప్రారంభమైంది. అలాగే భాగస్వామ్య, పెట్టుబడిదారీ వ్యవస్థలలో (ప్రజలు దోపిడి చేయువర్గం, దోపిడి చేయబడే వర్గంగా వారి వర్గపోరాటం (ప్రారంభమైంది. అయితే ఒక స్వాగతింప అంశమేమనగా(క్రమంగా దోపిడీకి గురి అవుతున్న వర్గం విప్లవాలు, తిరుగుబాట్లు చేస్తూ ఉత్పాదక పనిముట్లను వాటి పై హక్కులను పోరాడి సాధించుకుంటూ వారి జీవన పరిస్థితులను అభివృద్ధిపరుచుకుంటూ వచ్చారు. ఉదా॥ రోమ్‌లో జరిగిన బానిసల విప్లవం, (ఫెంచి విప్లవములో జరిగిన సెర్ఫ్‌ల ఉద్యమము, రష్యాలో జరిగిన కార్మిక ఉద్యమము. ఈ విధంగా ఉత్పత్తి, ఉత్పత్తి శక్తుల (క్రమంలో ...... చరి(త్రగా మార్క్స్ తన సిద్ధాంతమును (ప్రకటించాడు.

## 18.3 చారి(త్రక భౌతిక వాద నేపథ్యము:

మార్క్స్ (ప్రపంచ చరి(త్రను భిన్న కోణంలో పరిశీలించాడు. మార్క్స్ అభి(ప్రాయం (ప్రకారం సమాజము దాని మార్పును నిర్దేశించేది మతము, అధికారము, ఆలోచనలు కాదు ఉత్పత్తి శక్తులు మా(త్రమే (Productive Factors). దీనిలో (ప్రధానంగా ఉత్పత్తి కారకాలైన భూమి, (ప్రకృతి సంపద, పనిముట్లు, (శామిక శక్తి మొదలైన వాటిపై అధికారము కలిగి ఉండటం, ఎవరైతే వీటిపై సమున్నత అధికారము సంపాదిస్తారో వారు సమాజమును నిర్దేశిస్తారు. అదే చరి(త్రగా (ప్రకటింపబడుతుంది. కాబట్టి మానవ చరి(త్ర ఉత్పత్తి సంబంధాలు, ఆర్థిక పరిస్థితులే నిర్దేశిస్తాయి. దీనినే చారి(త్రక భౌతికవాదముగా భావించారు.

## 18.4 మార్క్సు సిద్ధాంత ప్రధాన అంశాలు:

కారల్ మార్క్సు, అతని మిత్రుడైన ఫ్రెడరిక్ ఏంగెల్స్‌లు హెగెల్ గతితార్కక భావవాదానికి, నూతనమైన, విప్లవాత్మకమైన, వినత్నమైన అర్థాన్ని ఇచ్చారు. మానవ చరిత్రను, దీనిలోని పరిణామ దశలను, కార్యాకారణ (Theory of Causality) సంబంధం ద్వారా వివరించవచ్చని మార్క్సు పేర్కొన్నారు.

**మార్క్సిజంలోని ప్రధాన అంశాలు:**

1. హెగెల్ గతి తర్కం
2. సాయర్ ఖాబ్ భౌతిక వాదం
3. శ్రమ విలువ అదనపు విలువ సిద్ధాంతం
4. పెట్టుబడిదారీ విశ్లేషణ
5. వర్గ పోరాటం
6. కమ్యూనిజం

**18.4.1 హెగెల్ గతి తర్కం:** ప్రతి అంశంలోను రెండు పరస్పర విరుద్ధ అంశాలుంటాయి. అవి ఒకే సమయంలో ఐక్యంగా ఉంటాయి, ఘర్షించుకుంటాయి. ఈ ఐక్యతా, ఘర్షణ క్రమం ద్వారానే ప్రతి అంశం అభివృద్ధి చెందుతుంది. ఈ అభివృద్ధిలో చోటు చేసుకునే పరిణాత్మక మార్పులు ఒక దశ తరువాత నూతన స్థాయికి చేరుకుంటాయి. అంటే గుణాత్మక మార్పులకు దారి తీస్తాయి. పరిమాణాత్మక దశ నుండి గుణాత్మక దశకు మార్పులు జరిగే క్రమంలో పాత అంశాలు కొన్ని నశించిపోతాయి. కొన్ని కొనసాగుతాయి. కొత్తవి అదనంగా చేరుతాయి. అంటే పాత, కొత్తల సంశ్లేషణ (Synthesis)గా మార్పులు సంభవిస్తాయి. ఈ మూడు దశలుగా ప్రతి మార్పు జరుగుతుంది. దీనినే హెగెల్ గతి తార్కం అని అన్నాడు. హెగెల్ ఆలోచనా క్రమాన్ని వివరించటానికి ప్రయత్నించాడు. ఆలోచనే అన్నింటికి మూలమనే ఆయన తాత్విక దృక్పథము ఇందుకు కారణం. ఈ పరిణామ క్రమంలో భౌతిక అంశాలకు ఉన్నది ద్వితీయ స్థానమే. పరిణఆమ క్రమ అంతిమ లక్ష్యం అఖండ భావాన్ని చేరుకోవడమే. అన్నింటికి మూలము భావమని, దానిదే ప్రథమ స్థానం అని హెగెల్ భావించాడు. అందువల్ల అతని వాదాన్ని భావ వాదము (Idealisom) అని వ్యవహరిస్తారు. అదే విధంగా భావ పరిణామం గతితార్కంగా సాగుతుంది. కనుక దానిని గతి తార్కి వాద భావమని పిలుస్తారు.

**18.4.2 ఫాయర్ బాఖ్ భౌతిక వాదం:** హెగెల్ భావవాద పాక్షికతను గుర్తించి విమర్శించిన వ్యక్తి ఫాయర్ బాఖ్. విశ్వపరిణామంలో భౌతిక అంశం శాశ్వతమైనదని దాని పరిణామంలో భాగంగానే భావం లేక చైతన్యం ఆవిర్భవిస్తుంది. భౌతిక అంశమే ప్రాధాన్యమని చెప్పే బాఖ్ తాత్విక దృక్పథాన్ని భౌతికవాదంగా పేర్కొంటారు. అయితే ఫాయర్ బాఖ్ సమాజ పరిణామం దగ్గరికొచ్చే సరికి భావవాదాన్ని అనుసరించారు. అందువల్ల ఇతని తాత్త్విక వైఖరిలో వైవిద్యం చోటు చేసుకుంది. హెగెల్ గతితార్కిక భావవాదంలోని పాక్షికతను, పాయర్ బాఖ్ భౌతికవాదంలోని పాక్షికతను గుర్తించి వారి పరిమితులను అధిగమించడం ద్వారా నూతన తాత్త్విర దృక్పథాన్ని ప్రతిపాదించారు కారల్‌మార్క్సు.

**18.4.3 శ్రమ విలువ, అదనపు విలువ సిద్ధాంతం:** తన తాత్త్విక అవగాహన ప్రకారం సమాజ పరిణామాన్ని వివరించటానికి మార్క్సు చేసిన ప్రయత్న ఫలితమే చారిత్రక భౌతికవాదము. సామాజిక జీవితానికి భౌతిక ఉత్పత్తి ప్రధాన భూమిక,

భౌతిక ఉత్పత్తిలో రెండు అంశాలుంటాయి. (1) ఉత్పత్తి శక్తులు, (2) ఉత్పత్తి సంబంధాలు. ఉత్పత్తి శక్తులు మూడు బాగాలు (1) ఉత్పత్తి లక్ష్యాలు, ఉదా॥ భూమి. (2) ఉత్పత్తి పనిముట్లు, ఉదా॥ నాగలి, ఎద్దులు. (3) మానవ శ్రమ, తన అవసరాలను తీర్చుకోవడానికి పనిముట్లను ఉత్పత్తి లక్ష్యాల పై ఉపయోగించి మానవులు శ్రమిస్తాడు. ఈ క్రమంలో పాల్గొనే మనుషుల మధ్య ఏర్పడే సంబంధాలను ఉత్పత్తి సంబంధాలంటారు. నిర్ణీత ఉత్పత్తి శక్తులు, తదనుగుణమైన ఉత్పత్తి సంబంధాలను కలిపి ఉత్పత్తి విధానంగా పరిగణిస్తారు. ఒక నిర్దుష్ట సామాజిక స్థితిలో ఉండే ఉత్పత్తి శక్తులతో ఉత్పత్తి సంబంధాలు పొసగి ఉంటాయి. ఇది ఒక నిర్దుష్ట ఉత్పత్తి. ఇలాంటి నిర్దుష్ట ఉత్పత్తి విధానాలు సమాజ పరిణామంలో ఇప్పటికి ఐదు కనిపిస్తాయని మార్క్స్ తెలిపారు. (1) ఆదిమ కమ్యూనిజం, (2) బానిస ఉత్పత్తి విధానం, (3) భూస్వామ్య ఉత్పత్తి విధానం, (4) ఆసియా తరహా ఉత్పత్తి విధానం, (5) పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం.

ఒక్కొక్క నిర్దుష్ట ఉత్పత్తి విధాన నేపథ్యంలో మానవులు చేసే కృషి ఫలితంగా ఒక ప్రక్క భౌతిక సంపద ఏర్పడుతుంది. మరొక ప్రక్క ఆత్మీక సంపద ఏర్పడుతుంది. భౌతిక సంవాద మానవుల భౌతిక అవసరాలు తీర్చగా, ఆత్మీక సంపద వారి మానసిక అవసరాలను తీర్చుతుంది. ఆయా నిర్దుష్ట సమాజాలలో మానవుడు చేసే భౌతిక ఉత్పత్తి సమాజానికి పునాది అవుతుంది. ఆ ఉత్పత్తికి అనుగుణంగానే వారు సాధించే ఆత్మీక సంపద ఉపరితలమౌతుంది. పునాది, ఉపరితలాల మధ్య ఉండే సంబంధం ఫలితంగా సమాజ పరిణామం జరుగుతుంది. ఈ పరిణామంలో వివిధ అంశాలలో ప్రకృతి, ఘర్షణలు ఏర్పడతాయి. ఈ ఐక్యతా, ఘర్షణల ఫలితంగా నిర్మాణాత్మక అంశాలు ఏ విధంగా గుణాత్మకంగా మారుతాయో గమనించవచ్చు. ఆ క్రమంలో పాత, క్రొత్త మధ్య జరిగే సంశ్లేషణలను గమనించవచ్చు. ఈ విధంగా చరిత్ర గమనం ఏ విధంగా గతితార్కికమౌతుందో అర్థం చేసుకోవచ్చు.

చరిత్రపట్ల మార్క్స్ అభివృద్ధి చేసిన ఈ భౌతిక అవగాహన ఆధారంగా సమాజాన్ని పరిశీలిస్తే సంపదను శ్రమ మూలమని అర్థమౌతుంది. శ్రమ విలువ ఆధారంగా సంపదను కొలువవలసి వస్తుంది. శ్రమ విలువను అంచనా వేయడంలో రెండు అంశాలను పరిగణనలోనికి తీసుకోవాలి. (1) శ్రమ చేసే వ్యక్తి అవసరాలకు సరిపడ శ్రమ చేయడం, (2) శ్రమ జీవి అవసరాలకు మించి చేసే శ్రమ విలువ. అవసరాలకు మించి శ్రమజీవి చేసే శ్రమ వలన అదనపు విలువ తయారౌతుంది. అదే ఆధునిక పెట్టుబడిదారీ సమాజంలో దోపిడీకి, సంపద కేంద్రీకరణకు దారి తీస్తుందని మార్క్స్ భావన.

**18.4.4 పెట్టుబడిదారీ వ్యవస్థ విశ్లేషణ:** సమాజ పరిణామంలో పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందిన ఒక నిర్దిష్ట ఉత్పత్తి విధానం. ఇది ముడిసరుకు కేంద్రంగా అభివృద్ధి చెందుతుంది. సరుకు కేంద్రంగా సాగే పెట్టుబడిదారీ వ్యవస్థలో ఏ విధంగా శ్రామికుడు తాను ఉత్పత్తి చేసే వస్తువు నుండి దూరమై లేని తనాన్ని అనుభవించేది మార్క్స్ తన విశ్లేషణతో నిరూపించాడు. ఆ మీదట తమ హక్కులను సాధించుకునే ప్రయత్నంలో శ్రామికులు సంఘటితమయ్యే పరిస్థితులు ఏ విధంగా ఏర్పడతాయో కూడా మార్క్స్ వివరించాడు. ఉత్పత్తి స్థానాల పై యాజమాన్యం కలిగిన పెట్టుబడిదారీ వర్గం ఏ విధంగా ఉత్పత్త పై పట్టు బిగించి, శ్రామికులను దోచుకుంటూ తమ పెత్తనాన్ని కొనసాగించటానికి ప్రయత్నిస్తుందో పెట్టుబడి గ్రంథంలో మార్క్స్ విశ్లేషించారు. ఉత్పత్తిక్రమంలో శ్రామికులు, పెట్టుబడిదారీ వర్గం మధ్య తలెత్తిన వర్గపోరాటానికి పరిష్కారం విప్లవమేనని మార్క్స్ ప్రతిపాదించాడు.

**18.4.5 వర్గ పోరాటం:** ప్రారంభంలో ఉన్న సమిష్టి ఉత్పత్తి విధానం స్థానంలో సహజ పరిణామ క్రమంలో వ్యక్తగత యాజమాన్యం చోటు చేసుకుంది. దీనితో ఉత్పత్తి సాధనాల పై కొందరి వ్యక్తిస్వామ్యం నెలకొంది. ఇది వ్యక్తిగత ఆస్తి ఏర్పాటుకు దారి తీసింది. అలాగని మరికొంత మంది ఉత్పత్తి సాధనాల పై యాజమాన్యపు హక్కులను కోల్పోయారు. కాని వాటిని

ఉపయోగించి పని చేయవలసిన పరిస్థితిలోనికి నెట్టబడ్డారు. వీరే శ్రామికులు. ఈ విధంగా సమాజం వర్గాలుగా ఏర్పడి వ్యక్తిగత ఆస్థి ఏర్పడ్డాయి. వివిధ నిర్దుష్ట ఉత్పత్తి విధానాలలో యాజమాన్యం వహించే వారు వేర్వేరుగా ఉంటారు. బానిస సమాజం మొదటి వర్గ సమాజం. ఇందులో బానిస, యజమానులు అనే రెండు ప్రధాన వర్గాలు. అలాగనే భూస్వామ్య సమాజంలో భూస్వామ్య వర్గం, సేద్యపు బానిసలు ప్రధాన వర్గాలు. పెట్టుబడిదారీ సమాజంలో పెట్టుబడిదారులు, శ్రామికులు అనే రెండు ప్రధాన వర్గాలుంటాయి.

నిర్దిష్టంగా చూసినపుడు వివిధ సమాజాలలో ఒకే సమయంలో వివిధ సామాజిక దశలను ప్రతిబింబించే భిన్న వర్గాలు కనిపిస్తాయి. ఉదా॥ భారత దేశంలో వివిధ ప్రాంతాలలో భూస్వామ్య సమాజంలోని వర్గాలు కనిపిస్తాయి. అదే సమయంలో పెట్టుబడిదారీ సమాజంలోని వర్గాలను చూడవచ్చు. అలాగనే అది వారికి కమ్యూనిస్టు సమాజంలోని సామాజిక చిహ్నాలు దర్శనమిస్తాయి. కాని ఆయా సమాజాలలో నిర్దుష్టకాలంలో ఏఏ వర్గాలు ప్రధాన పాత్ర వహిస్తాయో, దానినిబట్టి ఆ సమాజంలో ఏ నిర్దుష్ట ఉత్పత్తి విధానం ఉందో పేర్కొంటాం. అలాగనే ఏ వర్గాలు ప్రధాన పాత్ర వహిస్తాయో చెబుతాం.

వర్గాలు ప్రైవేటు ఆస్థి ఏర్పాటుతో వర్గ పోరాటం నేడు భిన్న రూపాలలో మరింత తీవ్రతతో కొనసాగుతుంది. వర్గపోరాటం అభివృద్ది చెందిన దశను నేటి పెట్టుబడిదారీ సమాజంలో చూడవచ్చు. బానిస సమాజంలో మొదలైన వర్గ పోరాటం భూస్వామ్య సమాజం ద్వారా సాగి నేడు భిన్నమైన రూపంలో పెట్టుబడిదారీ సమాజంలో కనిపిస్తుంది. ఈ మూడు సామాజిక దశలలో వర్గ దోపిడి ఉమ్మడిగా కనిపిస్తుంది. ఈ వర్గ దోపిడి పెట్టుబడిదారీ విధానంలో మరింత తీవ్ర రూపాన్ని, సున్నితమైన రూపాన్ని సంతరించుకున్నది. ఆ మేరకు వర్గపోరాటాల రూపాల తీవ్రత, స్వభావం కూడా మారుతూ కనిపిస్తాయి. మార్క్స్ ప్రకారం పెట్టుబడిదారీ సమాజము చివరి వర్గ సమాజం. దీనిలో సాగే వర్గపోరు అంతమ వర్గ సమాజాన్ని కూలదోసి వర్గ రహిత, దోపిడీ లేని రాజ్యానికి పునాది వేస్తుందని మార్క్స్ భావన. దోపిడీ రహిత, కమ్యూనిస్టు సమాజానికి సాగే ప్రస్తావన దశలో శ్రామిక వర్గం రాజ్యాన్ని నడుపుతుంది. శ్రామిక వర్గ నియంతృత్వంగా మారుతుందని మార్క్స్ అభిప్రాయం. శ్రామిక వర్గ నియంతృత్వంగా మారుతుందని మార్క్స్ అభిప్రాయ్. శ్రామిక వర్గ నియంతృత్వ దశ తరువాత కమ్యూనిస్టు సహజ నిర్మాణం జరుగుతుంది. ఆ క్రమంలో ఇంతకుముందు దోపిడీ స్థానంగా ఉంటూ వచ్చిన రాజ్యం వదలిపోతుందని మార్క్స్ సూత్రీకరించారు.

**18.4.6 కమ్యూనిజం:** దోపిడీకి, అణచివేతకు అవకాశం లేని, అధికారానికి చోటు లేని వర్గ రహిత, రాజ్య రహిత, సంపూర్ణ స్వేచ్ఛ సమాజాన్ని ఆవిష్కరించడమే కమ్యూనిజమని మార్క్స్ భావించాడు. వ్యక్తి స్వేచ్ఛ యావత్తు సహజ స్వేచ్ఛకు కొలమానం అన్నాడు. శక్తిమేరకు పని చేయడం, కావలసిన మేరకు అనుభవించడం ఇక్కడ సామాజిక సూత్రం. నిజమైన అర్థంలో వ్యక్తి సర్వతోముఖాభివృద్ధికి అవసరమైన భౌతిక, ఆత్మీక పరిస్థితులు ఇక్కడి ఆవిష్కృతమౌతాయని మార్క్స్ ప్రతిపాదించాడు.

## 18.5 చారిత్రక భౌతిక వాదము:

చారిత్రకభౌతిక వాద సిద్ధాంతం అంటే గతి తార్కిక భౌతిక వాదమును సమాజ అభివృద్ధికి అన్వయించి సామాజిక పరిణఆమమును వివరించుట. గతి తార్కిక పద్ధతిని ప్రతిపాదించినవాడు జర్మన్ తత్త్వవేత్త హెగెల్. గతితర్కం అంటే ద్వంద్వ తర్కం. ద్వంద్వ తర్కమునకు అర్థం వ్యతిరేకాల సంయోజన సిద్ధాంతం. ఈ మాటకు ప్రాచీన గ్రీకు భాషలో వాద (Thesis), ప్రతివాద (Anti Thesis) అని అర్థము. ఈ తార్కిక పద్ధతి ఒక నిరంతర ప్రక్రియ. హెగెల్ చిదాత్మ పురోగమనమే మానవ జాతి చరిత్ర అని, గతితర్కం ద్వారా దానిని తెలుసుకోవచ్చన్నాడు. హెగెల్ ప్రతిపాదించిన గతి తార్కిక వాదమునకు

భావమునకు ఒక విప్లవాత్మక అర్థం ఇచ్చి మార్క్స్ మానవ చరిత్రను, విస్తృతమైన మానవ చరిత్రలోని వివిధ పరిణామ దశలను కార్యాకరణ సంబంధం ద్వారానే వివరించగలమని, విశ్లేషించగలమని ప్రతిపాదించారు.

కారల్ మార్క్స్ ప్రతిపాదించిన భౌతిక వాద సిద్ధాంతం ప్రకారం ఉత్పత్తి విధానం, ఉత్పత్తి సంబంధాలు, ఆర్థిక స్థితిగతులు మాత్రమే చరిత్ర పరిణామాన్ని నిర్దేశిస్తాయి. అంతేకాక మానవజాతి చరిత్రలో జరిగిన మార్పులన్నీ భౌతిక పరిస్థితుల ప్రభావం వల్లనే అని, దానినే చారిత్రక భౌతికవాదము Historical Materialism అని వివరించాడు. చరిత్ర మొత్తంలో ఉత్పత్తి స్థానాల ఆధీనంలో ఉంచుకున్న వర్గం ఎప్పుడూ పాలక వర్గమేనని, రెండవది పాలికుల వర్గమని విభజించాడు. ఈ రెండు వర్గాల మధ్య సంఘర్షణ తప్పని సరి అని ఎందుకనగా పాలకవర్గం ఎప్పుడూ పాలితులను దోచుకుంటూ ఉంటుందని పర్యవసానంగా సామాజిక పరిణామం సారాంశం మొత్తం వర్గ పోరాటమన్నారు. ఈ వర్గ పోరాలమే మానవజాతి చరిత్రగతిని మారుస్తున్న మార్పుగల బలమైన స్థానమని మార్క్స్ అభిప్రాయపడ్డాడు. పాలకవర్గం ఏ కాలంలోనైనా పాలితులను పీడించుకునేందుకు, దోపిడీ చేసేందుకు అనువైన రాజకీయ వ్యవస్థను సాంఘీక, మత ఆదర్శాలతో కూడిన సంస్కృతిని పెంపొందింప చేస్తుందని ఇది సర్వకాలాలకు ప్రపంచం మొత్తం మీద సమాజాలకు వర్తిస్తుందని ప్రతిపాదించిన సిద్ధాంతం చారిత్రక భౌతిక వాదం. మార్క్స్ లక్ష్యం సామ్యవాద వ్యవస్థను శ్రామిక నియంతృత్వం ద్వారా సాధించుట అనగా వర్గ పోరాటం లేని పీడన, దోపిడీ లేని సమసమాజం ఏర్పాటు చేయడం.

## 18.6 ముగింపు:

కార్ల్‌మార్క్స్ సామ్యవాద సిద్ధాంతాన్ని శాస్త్రీయ పద్ధతిలో ప్రతిపాదించి ప్రపంచంలోని శ్రమ జీవులంతా విప్లవం తీసుకు రావాలనే నినాదం ప్రభోధించి కోట్లాది ప్రజలకు మహా ప్రవక్తగా 'లౌకిక జీసెస్'గా ఆరాధ్యుడైనాడు. నేటి సమాజం పై మార్క్స్ ప్రభావాన్ని ఎవ్వరూ కాదనలేరు. మయత్తం ప్రపంచంలోని సామాజిక శాస్త్రాల మీద, సంఘ సంస్కర్తల మీద, విప్లవకారుల మీద అతని ప్రభావం ఎంతగానో ప్రసరించింది. నేటి చరిత్రకారులలో మార్క్సిస్టు పద్ధతిలో విశ్లేషణ చేసేవారు ఎక్కువేకాని వీరందరూ మార్క్సిస్టు సిద్ధాంతాల చరిత్రకారునికి అనేక ప్రశ్నలు వేసి, సమాధానం రాబట్టేందుకు దోహదం చేస్తుంది. అందువల్లనే మార్క్సిస్టు విధానంలో శాస్త్రీయ క్రమ పద్ధతిలో పరిశోధన చేసే చరిత్రకారుల రచనలు నేడు ప్రజలను ఎక్కువగా ప్రభావితం చేస్తాయి. రొమిల్లా థాపర్, ఆర్. ఎస్. శర్మ, బిపిన్ చంద్రల చరిత్ర గ్రంథాలను బహిష్కరించాలని మతతత్వావాదులు గగ్గోలు పెట్టినపుడు లౌకిక శాస్త్రీయ చారిత్రక దృష్టి కలిగిన వారందరూ ఆ ధోరణిని ఖండించారు.

మార్క్సిస్టు సమర్థించిన వారు ప్రధానంగా చరిత్ర పూర్తిగా ఆర్థిక పరిస్థితుల మీదనే ఆధారపడదని, మానవుని పురోగాభివృద్ధికి ఇతర కారణాలు తోడ్పడతాయని, అదే విధంగా వర్గ సమాజం మార్క్స్ ఊహాజనితమని అటువంటి సమాజం ఏర్పడటం అసాధ్యమని విమర్శించారు.

## 18.7 నమూనా ప్రశ్నలు:

**ఎ) ఈ క్రింది ప్రశ్నలకు సమాధానము వ్రాయుము.**

1. చరిత్ర కచనలో మార్క్సిస్టు సిద్ధాంత ప్రభావమును వివరించుము.

2. చరిత్ర రచనలోచారిత్రక భౌతిక వాద పాత్రను వివరించుము.

3. మార్క్స్ దృష్టిలో చరిత్ర యొక్క స్వభావమును వివరించుము.

**బి) ఈ క్రింది సంక్షిప్త ప్రశ్నలకు సమాధానములు వ్రాయుము.**

1. వర్గ పోరాటం
2. పెట్టుబడిదారీ విధానం
3. గతితార్కికం
4. కమ్యూనిజం

## 18.8 ఉపయుక్త గ్రంథాలు:


1. Carr E.H. - What is History?
2. Sheik Ali B - History : Its Theory and Method.
3. Collingwood, R.G. - The Idea of History
4. Subramanyam N. - Histrriography
5. Thompson J. W. - A History of Historical Wreting.


డా॥ కృష్ణప్రసాద్ బాబు జె.

**304HI21**

# MODEL QUESTION PAPER
## III Semester M.A. History
## Paper – IV: Historical Method

Time: 3 Hours | Maximum Marks: 70

Answer any Five questions
(All questions carry equal marks)

1. Examine the nature and scope of History.
   చరిత్ర స్వభావాన్ని మరియు పరిధిని వివరింపుము.
   (OR)
   Narrate the importance of Study about History.
   చరిత్ర అధ్యయనం వలన లభించే ఫలితములను వివరించుము.

2. Explain the relation between historian and his facts.
   చరిత్రకారునికి మరియు చారిత్రిక సత్యాలకు మధ్య గల సంబంధమును వివరించుము.
   (OR)
   History is Science no-less and no-more (Bury).
   చరిత్ర ఒక శాస్త్రము అంతకన్నా తక్కువ కాదు మరియు ఎక్కువ కాదు - (బ్యూరి) చర్చించుము.

3. Explain the importance of Heuristics in historical research.
   చారిత్రక పరిశోధనలో "హ్యూరిస్టిక్స్" లేక విషయ శేకరణ ప్రాముఖ్యతను వివరించుము.
   (OR)
   Write a note on errors of History.
   చరిత్ర రచనలో సంభవించే దోషాలను వివరించుము.

4. Explain the history relation with geography and Sociology.
   చరిత్రకు, భౌగోళిక శాస్త్రానికి మరియు సామాజిక శాస్త్రానికి గల మధ్య సంభందమును వివరిచుము.
   (OR)
   Explain the History association with philosophy and literature.
   చరిత్రకు మరియు తత్వశాస్త్రానికి, సాహిత్యానికి గల సంభందమును వివరించుము.

5. Explain the importance of cyclical theory in progress of history.
   చరిత్ర గమనంలో కాలచక్ర సిద్ధాంతము యొక్క ప్రాముఖ్యతను వివరించుము.
   (OR)
   Critically examine the concept of class - struggle of Karl Marx.
   కారల్ మార్క్స్ యొక్క వర్గ పోరాట భావనను విమర్శనాత్మకంగా పరిశీలింపుము.